
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 63

SUNDAY Special | ఆదివారం 25-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీ ఘనవిజయం

ఐపీఎల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. పంజాబ్ 206 పరుగులు చేయగా... ఢిల్లీ 208 పరుగులు సాధించి సీజన్‌ను ముగించింది.

- వివరాలు 14లో ▶



టెస్టు కెప్టెన్‌గా గిల్

భారత క్రికెట్ జట్టుకు టెస్టు ఫార్మాట్‌లో కొత్త సారథిగా శుబ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. ఇంగ్లండ్‌తో సిరీస్ కోసం 18 మంది సభ్యుల జట్టుకు పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు.

- వివరాలు 14లో ▶



కోవిడ్ కొత్త వేరియంట్లు..

కోవిడ్ మళ్లీ భారత్‌లో వ్యాప్తిచెందుతోంది. ఈసారి ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లను తొలిసారిగా గుర్తించారు.

- వివరాలు 6లో ▶



ఆర్మీ వర్సెస్ యూనుస్

బీఎన్‌పీతో ముహమ్మద్ యూనుస్ సారథ్యం లోని మధ్యంతర ప్రభుత్వానికి నెలకొన్న విభేదాలు ముదురు పాకాన పడుతున్నాయి.

- వివరాలు 6లో ▶



'సామ్‌సంగ్'కు హెచ్చరికలు

అమెరికాలో ఉత్పత్తి చేయకపోతే 25 శాతం టారిఫ్ విధిస్తామని సామ్‌సంగ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో ▶



కొలీజియంలోకి జస్టిస్ నాగరత్న

త్వరలో తొలి మహిళా సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ నాగరత్న నేడు కొలీజియం లో లాంఛనంగా సభ్యురాలు కాబోతున్నారు.

- వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

కోవిడ్‌పై ఆందోళన వద్దు



కోవిడ్ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ భరోసా ఇచ్చారు. కోవిడ్ కేసులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ శాఖ సర్వసన్నద్ధంగా ఉందన్నారు.

- వివరాలు 15లో ▶

పాలిసెట్‌లో 88% ఉత్తీర్ణత



రాష్ట్ర పాలిసెట్‌లో 83,364 (88.54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. టాప్ ర్యాంకుల్లో ఎక్కువ మంది బాలికలే ఉండటం విశేషం. ర్యాంకు కార్డులను ఎస్‌బీటీఈటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన తెలిపారు.

- వివరాలు 3లో ▶

ఈసారీ యూరియా కొరత తప్పదా?



వానకాలం సాగుకు రంగం సిద్ధమవుతోంది. వరితోపాటు పత్తి, ఇతర ఉద్యానవన పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు మరోసారి యూరియా కోసం ఆందోళన చెందుతున్నారు.

- వివరాలు 5లో ▶

ముందస్తుగా 3 నెలల సన్నబియ్యం



భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో పేదలకు మూడు నెలల ముందే రేషన్ అందించాలన్న కేంద్రం ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించింది.

- వివరాలు 2లో ▶



మనమంతా టీమిండియా

కేంద్ర-రాష్ట్రాలు కలిసికట్టుగా సాగాలి: మోదీ

- అప్పుడు ఏ లక్ష్యమూ అసాధ్యం కాదు
- నీతి ఆయోగ్ భేటీలో సీఎంలకు పిలుపు
- రాష్ట్రానికో ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం 6లో

ప్రపంచ స్థాయి ఇన్వెస్టర్లంతా భారత్‌వైపే చూస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. బ్రిటన్, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాలతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఈ చరిత్రాత్మక అవకాశాన్ని రాష్ట్రాలన్నీ ఒడిసిపట్టుకోవాలని, పెట్టుబడులను ఇతోధికంగా ఆకర్షించాలని పిలుపునిచ్చారు. కేంద్రం, రాష్ట్రాలు టీమిండియాగా కలిసికట్టుగా సాగితే సాధించలేని లక్ష్యమంటూ ఉండదన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని తొలిసారిగా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శనివారం సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ పాలక మండలి పదో భేటీ ఇందుకు వేదికైంది. గ్రామం మొదలు రాష్ట్ర స్థాయి దాకా ప్రగతి వేగాన్ని పెంచి వికసిత భారత్ లక్ష్యాన్ని 2047కు ముందే సాధిద్దామంటూ పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌ను సీఎంలంతా ముక్తకంఠంతో సమర్థించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని కోరారు.



నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి

కలిసి వికసిద్దాం

తెలంగాణ రైజింగ్ -2047తో ప్రగతిపథం

- ట్రిలియన్ డాలర్ల రాష్ట్రాల జాబితాలో తెలంగాణను తొలిస్థానంలో నిలుపుతాం
- మహిళ, యువత సాధికారతే లక్ష్యంగా ముందుకు
- వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్రం సహకరించాలి
- నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీలో సీఎం రేవంత్

సాక్షి, న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రానిదే కీలకపాత్ర అని, అందుకోసం సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ లక్ష్యం దిశగా అడుగులు వేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నడవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం స్వయం సమృద్ధి చెందడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన తోడ్పాటు అందించగలదని చెప్పారు. శనివారం ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్

మిగతా 2వ పేజీలో ▶

మెట్రో విస్తరణకు నిధులివ్వండి 2లో



తిరువనంతపురం కోవలం బీచ్ వద్ద పర్యాటకుల సందడి

కేరళ చేరిన నైరుతి

అంచనా కంటే మూడు రోజుల ముందే రాక


ప్రస్తుతం చురుకుగా కదులుతున్న రుతుపవనాలు

3 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశం! ● నేడు, రేపు కొన్నిచోట్ల వర్షాలు

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. శనివారం ఉదయం కేరళ భూభాగంలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు అత్యంత చురుకుగా ఉన్నాయని, లక్షదీవులతో పాటు కేరళ రాష్ట్రంలోకి పూర్తిగా ప్రవేశించేందుకు అత్యంత తక్కువ సమయం పడుతుందని వివరించింది. మరోవైపు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను కూడా రుతుపవనాలు తాకాయి. నైరుతి రుతుపవనాలు ముందుగా కేరళ రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత దేశమంతటా విస్తరిస్తాయి. ఈ సీజన్‌లో రుతుపవనాలు వాతావరణ శాఖ అంచనాల కంటే మూడురోజులు ముందుగానే భారత ప్రధాన భూభాగాన్ని తాకటం విశేషం. గతేడాది నైరుతి రుతుపవనాలు మే 30న కేరళను తాకగా... ఈసారి ఆరు రోజుల ముందే ప్రవేశించాయి. రానున్న రెండురోజుల్లో రుతుపవనాలు మధ్య అరేబియన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, గోవాలో పూర్తి భూభాగం, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలతోపాటు సబ్ హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈసారి వర్షాకాలంలో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా

మిగతా 2వ పేజీలో ▶

గూగుల్ ఇలాకాలో... 'జెమినీ' తోడుగా!



ప్రస్తుతం అన్ని దిగ్గజ సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ) అసిస్టెంట్‌లను ఆశ్రయిస్తున్నాయి. వీటిలో ప్రధానమైంది గూగుల్ గూట్లో నుంచి పుట్టిన జెమినీ. వాయిస్ అసిస్టెంట్‌తో ఎప్పటి నుంచో పిలిస్తే పలికే సేవలను అందించిన గూగుల్ ఇప్పుడు అన్నింటికీ 'జెమినీ.. జెమినీ' అనేలా అప్‌డేట్ అవుతోంది. స్మార్ట్‌ఫోన్‌ని దాటేసి.. ఇప్పుడు అన్ని ప్లాట్‌ఫామ్‌ల్లోకి జెమినీ సేవలను లాంచ్ చేస్తోంది.

- వివరాలు 2లో

బ్రాండ్ బాజా విరాట్



ప్రఖ్యాత బ్రాండింగ్ వాల్యుయేషన్ సంస్థ 'క్రోల్' ప్రకారం విరాట్ ప్రస్తుత బ్రాండింగ్ విలువ అక్షరాలా రూ.1,900 కోట్లు. 2016 నుంచి 2023 వరకు చూస్తే ఎనిమిదేళ్లలో.. రెండుసార్లు మినహా ప్రతి ఏటా అతను బ్రాండింగ్ విలువ పరంగా భారత సెలబ్రిటీల్లో అగ్రస్థానంలోనే ఉన్నాడు. బాలీవుడ్ స్టార్లు షారుక్ ఖాన్, రణ్‌వీర్ సింగ్ కంటే కూడా కోహ్లి విలువే ఎక్కువగా ఉండటం విశేషం.

- వివరాలు 5లో

రకరకాల వరి... ఆరోగ్యసిరి



మన ముందుతరాల వారు ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు.. వైవిధ్యభరితమైన ఔషధ, పోషక గుణాలున్న ఎన్నెన్నో అపురూపమైన పురాతన వరి వంగడాలను మనకు సుసంపన్న ఆహార సంస్కృతితో పాటు అందించారు. అవన్నీ పోషకాల గనులు. ఆధునిక జీవనశైలి వల్ల మనల్ని వేధిస్తున్న రుగ్మతలు, అనారోగ్యాల నుంచి కూడా మనకు విముక్తి కలిగించగల మన దేశీ వరి వంగడాల గురించి..

- వివరాలు 12లో



మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా శనివారం జరిగిన టాప్ మోడల్ పోటీలో గెలిచిన సుందరీమణులు. చిత్రంలో వరుసగా మిస్ మార్టినిక్ ఔరెలీ జోచిమ్ (అమెరికాలు, కరీబియన్ దీవులు), మిస్ నమీబియా సెల్మా కమన్యా (ఆఫ్రికా ఖండం), మిస్ ఐర్లాండ్ జాస్మిన్ గెర్హాడ్ (యూరప్), మిస్ ఇండియా నందినీ గుప్తా (ఆసియా-ఓషియానియా)

- వివరాలు 16లో

బ్యూటీ విత్ పర్పస్ అనేది డొల్ల

యువతకు స్ఫూర్తిగా నిలవాలనుకున్నా.. పరిస్థితులు అలా లేవు... అందుకే వైదొలిగా

- స్పాన్సర్ల పక్కన ఆటాడే కోతుల్లా కూర్చోబెట్టారు
- అతిథులకు కృతజ్ఞతలు తెలుపుతూ వినోదంపంచమన్నారు
- మిస్ వరల్డ్ నిర్వాహకులపై మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ సంచలన ఆరోపణ
- ఖండించిన మిస్ వరల్డ్ సీఈఓ.. ఆరోపణలు నిరాధారమని స్పష్టీకరణ



- వివరాలు 16లో

తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్... శని కాంగ్రెస్

ఆ దెయ్యాన్ని వదిలించాలన్నదే బీఆర్ఎస్ ప్రయత్నం: కేటీఆర్



- 'హెరాల్డ్' కేసులో రేవంత్ పేరుందన్న వార్తను కొన్ని పత్రికలు రాయనే లేదు
- రేవంత్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ గవర్నర్‌ను కలుస్తాం
- మాది ప్రజాస్వామిక పార్టీ.. రాత పూర్వకంగా ఎవరైనా లేఖ ఇవ్వొచ్చు
- అంతర్గత విషయాలు పార్టీలో మాట్లాడాలి.. ఇది అందరికీ వర్తిస్తుంది

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్‌రెడ్డి అని, రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ దెయ్యాన్ని, శనిని వదిలించాలన్నదే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. 'కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ' ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ ఈమేరకు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'అంతర్గత విషయాలను ప్రస్తావించేందుకు పార్టీ వేదికలు

మిగతా 12వ పేజీలో ▶

పదేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేశారు



బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి మండిపాటు

- వాళ్లే ఇప్పుడు అన్యాయమంటూ గాయి చేస్తున్నారు... వైరాలో జాబ్ మేళా.. 4,448 మందికి ఉద్యోగాలు

దివ్యాంగ యువకుడికి నియామక పత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

వైరా: గత పదేళ్లు అధికారంలో ఉన్నవారు రాష్ట్రాన్ని లూటీ చేశారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. వాళ్లే ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో నిద్రపోతూ అన్యాయం జరుగుతోందని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా వైరాలో శనివారం ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పదేళ్లలో గ్రూప్-1 పోస్టులు భర్తీచేయకపోవటంతో నిరుద్యోగ యువత వారి తల్లిదండ్రులకు భారంగా మిగిలారని, మరికొందరు ఆవేదనతో రోడ్లపై తిరిగారని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి 56 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాని యువతకు స్వయం ఉపాధి కోసం రూ.9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ద్వారా తోడ్పాటు

మిగతా 12వ పేజీలో ▶

విచారణ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై మంత్రి ఉత్తమ్



- వారే రీడిజైన్ చేశారు.. వారి హయాం లోనే కూలింది... అప్పుడు నోరుమెదపని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారు

హుజూర్‌నగర్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రీడిజైన్ చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయాంలోనే కూలిపోయిందన్నారు. అప్పట్లోనే కూలిపోయినా నోరు మెదపని ఆ నాయకులు విచారణ కమిషన్ నోటీసు లిచ్చే సరికి రకరకాలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని తన నివాసంలో ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో తుమ్మిడి హెట్టి వద్ద డిజైన్ చేసిన

మిగతా 12వ పేజీలో ▶

గూగుల్ ఇలాకాలో.. 'జెమినీ' తోడుగా!



ఏ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ అయినా ఒకప్పుడు మనం టెక్స్ట్ / క్లిక్ ద్వారా కమాండ్ ఇవ్వకుంటే ఉలుకూ, పలుకూ లేకుండా పడి ఉండేవి. కానీ, గ్యాడ్జెట్‌లు మన చుట్టూనే చేరి గుట్టుగా పని చేసుకుపోతున్నాయి. మనం సైగ చేస్తే చాలు.. కమాండ్‌ని స్వీకరిస్తున్నాయి. చూస్తే చాలు.. అలర్ట్ అవుతున్నాయి. పిలిస్తే పలుకుతున్నాయి. ఇదంతా ఎలా కృత్రిమ మేధ (ఏఐ) మాయ. అందుకే అన్ని దిగ్గజ సంస్థలు ఏఐ అసిస్టెంట్‌లను ఆశ్రయిస్తున్నాయి. వీటిలో ప్రధానమైంది గూగుల్ గూట్లో నుంచి పుట్టిన జెమినీ. వాయిస్ అసిస్టెంట్‌తో ఎప్పటి నుంచో పిలిస్తే పలికే సేవలను అందించిన గూగుల్ ఇప్పుడు అన్నింటికీ 'జెమినీ.. జెమినీ' అనేలా అప్‌డేట్ అవుతోంది. స్మార్ట్‌ఫోన్‌ని దాటేసి.. ఇప్పుడు అన్ని ప్లాట్‌ఫామ్‌ల్లోకి జెమినీ సేవలను లాంచ్ చేస్తోంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

గూగుల్ వాయిస్ అసిస్టెంట్‌కి ఇక వీడ్కోలు
ఎలా పిలిచినా పలికే గూగుల్ జెమినీకి స్వాగతం
ఆండ్రాయిడ్‌తో సంయుక్తంగా అందుబాటులోకి
స్మార్ట్‌ఫోన్‌లు దాటి వాచ్‌లు, కార్లు, టీవీల్లోకి ప్రవేశం
భవిష్యత్తులో అబ్బురపరిచే జెమినీ కళ్లజోళ్లు

ఆండ్రాయిడ్‌తో జట్టుకట్టి ముందుకొస్తున్న జెమినీ ఏఐతో ఇక గూగుల్ యూజర్లకు పండుగే. వాచ్‌లు మీ పల్స్, హార్ట్ బీట్స్ వినడమే కాదు.. మీ మనసెరిగి పని చేస్తాయి. కార్లు మీ జర్నీ ముచ్చట్లను వింటూ మరింత ఆహ్లాదకరమైన ఇన్‌పుట్స్‌ను ఇస్తాయి. ఇందుకు కారణం.. స్మార్ట్ వాచ్‌లు మొదలుకొని కారు, టీవీ, హెడ్‌సెట్, కళ్లజోళ్లు.. ఇలా అన్నింటిలోనూ గూగుల్ కంపెనీ 'జెమినీ ఏఐ'ని ప్రవేశపెట్టడమే.

మణికట్టుపై మాయాజాలం!

అరచేతిలో ఫోనే కాదు... మణికట్టుపై స్మార్ట్ వాచ్‌లు కూడా చాలానే చేస్తున్నాయి. వర్కవుట్ చేస్తున్నప్పుడు లేదా వంట చేస్తున్నప్పుడు.. మీ చేతిలో ఫోన్ ఉండకపోయినా.. చేతికి వాచ్ ఉంటే చాలు. పనులను చక్కబెట్టేయొచ్చు. ఎందుకంటే.. ఇకపై ఇలాంటి వాచ్‌లపై జెమినీ ఏఐ పని చేస్తుంది. మీరు మీ వాచ్‌తో మాట్లాడొచ్చు. కమాండ్స్ ఇవ్వొచ్చు. మీరు ఏదైనా జిమ్‌లో పర్సనల్ లాకర్ వాడుతుంటే దాని నంబర్‌ను గుర్తుపెట్టుకోమని వాచ్‌కి చెప్పొచ్చు. ఫ్రెండ్ పంపిన ఏదైనా మెయిల్ గురించి అడిగితే వెంటనే వెతికి తెస్తుంది. చిన్న స్క్రీన్ మీద టైప్ చేయాల్సిన అవసరం లేకుండా మాట్లాడితే చాలు.. టైపింగ్ అయిపోతుంది.

డ్రైవింగ్‌లో తోడుగా..

హై ఎండ్ కార్లలో ఎప్పటి నుంచో నిక్షిప్తమై ఉన్న ఆండ్రాయిడ్ ఆటో గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. దాంట్లో ఇప్పుడు గూగుల్ అసిస్టెంట్‌కి బదులు జెమినీ ఏఐ వస్తోంది. సాధారణంగా మాటలతోనే మీ అవసరాన్ని జెమినీ అర్థం చేసుకుంటుంది. మీ మాటలను వింటూనే మార్గమధ్యంలో ఉన్న పెట్రోల్ బంక్‌ల గురించి చెబుతుంది. అంతేకాదు.. మీరేదైనా ఫుడ్ ఐటమ్స్ గురించి మాట్లాడుకుంటే అందుకు బెస్ట్ రేటింగ్స్‌తో ఉన్న హోటల్స్‌ను సూచిస్తుంది. అంతేకాదు.. డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు ఏవైనా బల్క్ మెసేజ్‌లు వస్తే.. అన్నింటినీ సమ్మరైజ్ చేసి సంక్షిప్తంగా సమాచారంగా చెబుతుంది. మీరేదైనా వాక్యాలను చెప్తే వాటిని కావాల్సిన భాషలోకి అనువదించి వినిపిస్తుంది. వెళ్లే దారిలో అందుబాటులో ఉన్న పార్కింగ్ వివరాలను చెబుతుంది. వెళ్లే రూట్ మ్యాప్ సెట్ చేసి పెడితే చాలు.. ఎక్కడెక్కడ ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి.. రోడ్ బ్లాక్స్ ఏమైనా ఉన్నాయా.. ఇవన్నీ రియల్ టైమ్‌లోనే అలర్ట్ చేస్తూ చూపిస్తుంది.

టీవీలోనూ 'జెమినీ' జోష్

ఓటీటీలు, వివిధ రకాల కంటెంట్ యాప్‌లు ఇంట్లోని టీవీని.. ఫ్యామిలీ మొత్తానికి ఎంటర్‌టైన్‌మెంట్ అడ్డాగా మార్చేశాయి. అందుకే ఎప్పటి నుంచో గూగుల్ చూపు స్మార్ట్ టీవీలపై పడింది. ఇకపై గూగుల్ టీవీల్లో కూడా జెమినీ సపోర్ట్ రానుంది. దీంతో టీవీలను రిమోట్‌తోనే కాదు.. మాట్లాడుతూ కంటెంట్‌ను సెలెక్ట్ చేయొచ్చు. మీ పిల్లలకు సరిపోయే కంటెంట్‌ను సెట్ చేసి ఏఐకి చెప్తే చాలు.. పిల్లలపై ఓ కన్నేసి ఉంచుతుంది. వారెలాంటి హద్దులు దాటకుండా కట్టుదిట్టమైన నిఘా పెడుతుంది. ఒకవేళ పెట్టిన లిమిట్స్ క్రాస్ చేస్తే వెంటనే మిమ్మల్ని అలర్ట్ చేస్తుంది. హాలిడేస్‌లో ఇంట్లో టీవీని పిల్లలకు ట్యూటర్‌గా మార్చేయొచ్చు. జెమినీకి పిల్లలకు సంబంధించిన క్లాస్, సిలబస్ వంటి వివరాలను అందిస్తే చాలు.. ఎడ్యుకేషన్ కంటెంట్‌ను జెమినీ రికమెండ్ చేసి ఇస్తుంది. పిల్లలు అడిగే ప్రశ్నలకు జెమినీ సమాధానం కూడా చెబుతుంది. ఇంకా గూగుల్ వీడియో భాండాగారం యూట్యూబ్ నుంచి కూడా కంటెంట్‌ను సేకరించి చూపిస్తుంది.

హెడ్‌సెట్స్‌లోనూ నిక్షిప్తం

ఏవైనా పర్సనల్‌గా వినాలనుకుంటే.. హెడ్‌సెట్ కోసం వెతికే వాళ్లం. వాటిని ఎక్కువసేపు చెవులకు పెట్టుకోవాలన్నా ఇబ్బందే. ఇప్పుడు హెడ్‌సెట్స్ చెవులకు తగిలించుకునే బడ్స్‌గా మారిపోయాయి. జెమినీ ఏఐ రాకతో వీటి తీరు ఇంకా మారిపోయింది. సోనీ, శామ్‌సంగ్‌తో కలిసి గూగుల్ జెమినీ ఏఐతో నెక్స్ట్ జనరేషన్ ఇయర్ బడ్స్‌ను సిద్ధం చేస్తోంది. కాగా, 'ఏఐ పవర్డ్ ఆపరేటింగ్ సిస్టం'తో ఎక్స్ఆర్ హెడ్‌సెట్‌లను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్తున్నాయి.

ఉదాహరణకు మీరేదైనా కొత్త టూరిస్ట్ ప్రాంతానికి వెళ్లాలనుకుంటే.. ఆ ప్రాంతాన్ని ముందే ఎక్స్‌టెండెడ్ రియాలిటీలో చూసేయొచ్చు. రూట్ మ్యాప్స్, కేఫ్‌లు, స్థానిక ప్రాంతాలను చూస్తూ ఓ అవగాహనకు రావచ్చు. అంటే.. ఇక గూగుల్ మ్యాప్స్ పాత తరం ట్రెండ్‌గా మారిపోతాయి అన్నమాట. సో.. మీరు వింటున్నా, చూస్తున్నా, డ్రైవ్ చేస్తున్నా లేదా చేతులు ఖాళీగా లేకున్నా - జెమినీ ఎప్పుడూ మీకు ఉపయోగపడే మిత్రుడిగా మారబోతోంది. అంతేకాదు, భవిష్యత్తులో మన అవసరాన్ని ముందుగానే అర్థం చేసుకునే సహాయకుడు కూడా.

కళ్లజోళ్ల మాయాజాలం

దృష్టి సమస్యలు వస్తేనే కళ్లజోడు పెట్టుకుంటాం. లేదంటే.. కాసేపు స్టైల్ కొట్టేందుకు వాడుతుంటాం. కానీ, భవిష్యత్తులో అలా కాదు. మీకు ఏ సమస్యా లేకపోయినా మీరు బయటికి వెళ్తే తప్పనిసరిగా కళ్లజోడు ధరించాల్సిన పరిస్థితి వస్తుంది. ఎందుకంటే.. కళ్లజోళ్లు స్మార్ట్ అవుతున్నాయి. ఏఐ సపోర్ట్‌తో మల్టీటాస్కింగ్ చేస్తున్నాయి. అందుకే గూగుల్ కూడా తన జెమినీ ఏఐతో స్మార్ట్ గ్లాసెస్‌ను అందించేందుకు సిద్ధం అవుతోంది. ప్రముఖ కంపెనీలతో స్టైలిష్ లుక్‌తో వీటిని తీర్చిదిద్దుతోంది. భవిష్యత్తులో ఈ కళ్లజోడును ధరించాక స్మార్ట్‌గా పనులను చక్కబెట్టొచ్చు. చూస్తున్న ప్రతి అంశాన్ని రికార్డు చేయొచ్చు. వాటి వివరాలను సేకరించొచ్చు. వాటిని వెంటనే మెసేజ్ రూపంలో పంపొచ్చు. ఆయా వివరాల గురించి ఎవరితోనైనా మాట్లాడాలనుకుంటే కళ్లజోడుకు చెప్తే చాలు. కాల్ కలిపేస్తుంది. ఎలాంటి ఇయర్‌ఫోన్స్ లేదా బడ్స్ లేకుండా గ్లాసెస్ నుంచే ఫోన్ మాట్లాడొచ్చు. అంతేకాదు.. మీరేదైనా డేటాను చూస్తే.. దాన్ని మీకు కావాల్సిన లాంగ్వేజ్‌లో మార్చేసుకోవచ్చు. మీరేం మాట్లాడకపోయినా గ్లాసెస్ చూసే ప్రతి విజువల్, ఆడియోను నిత్యం విశ్లేషిస్తూ డేటాను రికార్డు చేస్తుంది. మీరెప్పుడైనా సంబంధిత సమాచారాన్ని కోరితే వెంటనే యాక్సెస్ చేసి చెబుతుంది. బోర్ అనిపిస్తే కళ్లజోడే హెడ్‌సెట్‌లా మారిపోతుంది.

క్లుప్తంగా...

ఆర్టీసీలో ఇక ఔట్‌సోర్సింగ్ కండక్టర్లు



సాక్షి, హైదరాబాద్: ఇటీవలే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో డ్రైవర్ల నియామకాన్ని చేపట్టిన ఆర్టీసీ.. ఇప్పుడు కండక్టర్లను కూడా అదే విధానంలో నియమించుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందుకు తాజాగా మార్గదర్శకాలను ఖరారు చేసింది. 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వయసుండి, పదో తరగతి లేదా తత్సమాన విద్యార్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించబోతోంది. మానవ వనరుల సరఫరా సంస్థల ద్వారా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కండక్టర్లుగా ఎంపికైన వారికి నెలవారీ చెల్లించే కన్సాలిడేటెట్ జీతం మొత్తం రూ.17,969గా నిర్ణయించారు. ఏజెన్సీ రూ.2 లక్షల మొత్తాన్ని సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. విధి నిర్వహణలో సంస్థకు నష్టం జరిగితే.. దాన్ని ఈ మొత్తం నుంచి రికవరీ చేయనున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. వీరికి వర్క్‌మెన్స్ కాంపన్సేషన్ యాక్ట్ వర్తించదని తేల్చి చెప్పింది. పీఎఫ్, ఈఎస్ఐ లాంటి చట్టబద్ధమైన వెసులుబాట్లు కూడా ఉండవని స్పష్టం చేసింది.

మురళీనాయక్ కుటుంబానికి రూ. 1.5 లక్షలు

ప్రభుత్వ ఉపాధ్యాయుల విరాళాలు

సాక్షి, యాదాద్రి: ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన సిపాయి మురళీ నాయక్ కుటుంబానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు రూ.1.5 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నారు. హైదరాబాద్‌లోని మేజర్ ఓబెరాయ్‌కు ఆదివారం ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు 'సూపర్ టీచర్స్'వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ వంచ కొండల్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. అమరుడైన సిపాయి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు.. యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలిసి 'సూపర్ టీచర్స్'అనే వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. దీంతో స్పందించిన ఉపాధ్యాయులు తమకు తోచిన ఆర్థిక సహాయం అందించారు. దూరాభారం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాకు వెళ్లి జవాన్ కుటుంబ సభ్యులకు చెక్ అందించలేక.. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో మేజర్‌కు అందజేయనున్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో 'బ్రిడ్జ్' కేంద్రం

రూ.100 కోట్ల వ్యయం



సాక్షి, హైదరాబాద్: దుర్గం చెరువు తీరాన, కేబుల్ వంతెన సమీపంలో రెండు ఎకరాల స్థలంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 'బ్రిడ్జ్'అనే పేరుతో అంతర్జాతీయ పరిశోధన కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ మేరకు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదించారు. దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో ఈ పరిశోధనా కేంద్రాన్ని ఎస్సీ అభివృద్ధి నిధుల పథకం కింద కేటాయించడానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషించారని చక్రపాణి తెలిపారు. ఇక్కడ అంబేడ్కర్ ఆలోచనలపై లోతైన అధ్యయనం చేయడంతోపాటు పేద, వెనుకబడిన వర్గాల యువతకు సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు శిక్షణ కూడా ఇస్తారు.

మెట్రో విస్తరణకు నిధులివ్వండి

తెలంగాణ ప్రాజెక్టులకు సహకరించండి
ఆర్ఆర్ఆర్ నిర్మాణం ఏకకాలంలో చేపట్టండి
బందరు పోర్టు నుంచి హైదరాబాద్‌కు గ్రీన్‌ఫీల్డ్ హైవే కావాలి
సెమీకండక్టర్, రక్షణరంగ ప్రాజెక్టులకు మద్దతివ్వండి
ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి


శనివారం ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ, ప్రాంతీయ రింగ్‌రోడ్డు, రింగ్ రైలు తదితర ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేందుకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లిన అంశాలు

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2

మెట్రో రైలు ఫేజ్-1లో 69 కిలోమీటర్ల నిడివితో మూడు కారిడార్లు ఉన్నాయి. నగరంలోని ఇతర ప్రాంతాలకు మెట్రోను తక్షణం విస్తరించాల్సిన అవసరం ఉంది. ఫేజ్-2 కోసం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించాం. ఇందులో 76.4 కిలోమీటర్ల నిడివితో 5 కారిడార్లు ఉంటాయి. కేంద్రం, రాష్ట్రం కలిసి చేపట్టాల్సిన ఈ జాయింట్ వెంచర్ మొత్తం ఖర్చు రూ.24,269 కోట్లు. ఇందులో కేంద్రం వాటా 18 శాతం (రూ.4,230 కోట్లు). రాష్ట్ర వాటా 30 శాతం (రూ.7,313 కోట్లు). రుణం 48 శాతం (రూ.11,693 కోట్లు). 2024 అక్టోబర్‌లో చెన్నై మెట్రో ఫేజ్-2కు రూ.63,246 కోట్లు, 2021 ఏప్రిల్‌లో బెంగళూరు మెట్రో ఫేజ్-2 కు రూ.14,788 కోట్లు, 2024 ఆగస్టులో బెంగళూరు మెట్రో ఫేజ్-3కి రూ.15,611 కోట్లు కేంద్రం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్రం కొన్ని వివరణలు కోరగా, వాటికి సమాధానాలిచ్చాం. ఈ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలి.

ప్రాంతీయ రింగ్ రోడ్డు

హైదరాబాద్ చుట్టూ రెండు జాతీయ రహదారులతో కలిపి ప్రాంతీయ రింగు రోడ్డును (ఆర్ఆర్ఆర్)ను తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డి - నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - భువనగిరి - చౌటుప్పల్ మధ్య 161వ నంబర్ జాతీయ రహదారి ఉండగా.. దక్షిణ భాగం చౌటుప్పల్ - ఆమన్‌గల్ - షాద్‌నగర్ - సంగారెడ్డి మధ్య ఎన్‌హెచ్ 65 ఉంది. ఉత్తర భాగం కోసం భూసేకరణ ప్రక్రియ 2022లో ప్రారంభమైంది. 90 శాతం భూముల ప్రపోజల్స్ ఎన్‌హెచ్ఏఐకి పంపించాం. ఎన్‌హెచ్ఏఐ టెండర్లు కూడా పిలిచింది. అయితే, ఈ భాగానికి అవసరమైన ఆర్థిక, కేబినెట్ ఆమోదం ఇవ్వాలి. దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతోపాటే చేపట్టాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పూర్తయిన తర్వాత దక్షిణ భాగం నిర్మాణం చేపడితే భూ సేకరణ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల రెండు భాగాలను కలిపి ఒకేసారి పూర్తి చేయాలి. ఉత్తరభాగంలాగే దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

రింగ్ రైల్వే ప్రాజెక్టు.. గ్రీన్‌ఫీల్డ్ హైవే

రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా 370 కి.మీ. పరిధిలో రైల్వే లైన్ ప్రతిపాదించాం. ఇది రాష్ట్రాభివృద్ధికి కొత్త దిశలో మార్గం చూపుతుంది. బందరు పోర్టు నుంచి హైదరాబాద్ డ్రైపోర్ట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరు చేయండి. దేశం మొత్తం ఔషధాలలో తెలంగాణే 35 శాతం ఉత్పత్తి చేస్తోంది. బందరు పోర్ట్ - డ్రైపోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవే సరుకు రవాణా ఖర్చు తగ్గించడంతో పాటు ఎగుమతులకు దన్నుగా నిలుస్తుంది. ఈ మార్గం తయారీ రంగానికి ప్రోత్సాహకంగా ఉండడంతో పాటు నూతన ఉద్యోగాలను సృష్టిస్తుంది.

సెమీకండక్టర్ రంగానికి మద్దతివ్వండి

ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)కు తెలంగాణ పూర్తి మద్దతు ఇస్తోంది. హైదరాబాద్‌లో ఏఎండీ, క్వాల్‌కాం, ఎన్‌విడియా వంటి ఆర్అండ్‌డీ కేంద్రాలు ఉన్నాయి. పరిశ్రమలకు స్థలాలు, నైపుణ్యం గల మానవ వనరులు, మౌలిక సదుపాయాలు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ ఐఎస్ఎం ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. అది పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కలిగించి ఉద్యోగాలు సృష్టిస్తుంది. 2030 నాటికి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో 500 బిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి తోడ్పడుతుంది.

రక్షణరంగ ప్రాజెక్టులకు తోడ్పాటునివ్వండి

హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో, ఎంఎస్ఎంఈల్లో ఉన్న రక్షణరంగ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వండి. హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ, డిఫెన్స్ పీఎస్‌యూలు ఉన్నత స్థాయిలో పని చేస్తున్నాయి. వాటి పరిధిలో వెయ్యికి పైగా ఎంఎస్ఎంఈలు, స్థానిక, అంతర్జాతీయ డిఫెన్స్ సంస్థలకు విడి భాగాలు తయారు చేస్తున్నాయి. లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, జీఈ, సాఫ్రాన్, హనీవెల్ వంటి సంస్థలు హైదరాబాద్‌పై ఆసక్తి చూపుతున్నాయి. రక్షణ రంగంలోని జీవీలు, ఆఫ్‌సెట్‌లకు కేంద్ర ఆర్డర్లు తక్షణ అవసరం. వీటికి ఆమోదం తెలిపేందుకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉండాలి.

హైదరాబాద్ - బెంగళూరు డిఫెన్స్ కారిడార్

రక్షణ రంగానికి సంబంధించి ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రోత్సాహం ఉంది కానీ హైదరాబాద్‌కు లేదు. ఆయా రాష్ట్రాలతో సమానంగా తెలంగాణకు కేంద్రం మద్దతు ఇవ్వాలి. రక్షణ రంగ పరికరాల తయారీలో ముందున్న హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎక్స్‌పో నిర్వహించాలి.

మరో 800 ఎలక్ట్రిక్ బస్సులివ్వండి

కేంద్రమంత్రి కుమారస్వామికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో సీఎం శనివారం భేటీ అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌కు రెండువేల ఈవీ బస్సులు కేటాయించారని, ప్రస్తుత నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద అదనంగా 800 బస్సులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు బస్సు నిర్వహణ చూసేలా హైబ్రిడ్ జీసీసీ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ డీజిల్ బస్సుకు చేపట్టిన రెట్రోఫిట్టెడ్ సఫలమైందని, ఆ బస్సు నగరంలో రాకపోకలు సాగిస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు రెట్రోఫిట్‌మెంట్ అవకాశం కల్పించాలని సీఎం కోరారు.


కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కలిసి వికసిద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన 'తెలంగాణ రైజింగ్- 2047'పై ఒక విజన్ డాక్యుమెంట్‌ను సమర్పించారు. మార్పు సాధించాలంటే కేంద్ర సహకారం, భాగస్వామ్యం అవసరమని అన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పనిచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

నాలుగు మూల స్తంభాలు

'తెలంగాణ రైజింగ్-2047'విజన్‌లోని నాలుగు కీలక అంశాలను సమావేశంలో సీఎం వివరించారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచస్థాయి మౌలికవసతులు, పారదర్శకమైన సుపరిపాలన అనే నాలుగు లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. 2047 నాటికి ఇండస్ట్రీ, ఇన్‌ఫ్రా విషయంలో అంతర్జాతీయ నగరాల సరసన తెలంగాణను నిలబెట్టే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ -2047 విజన్‌ను ఎంచుకున్నట్లు చెప్పారు. ఈ లక్ష్య సాధనలో తొలి అడుగుగా గత ఏడాదిన్నరలో అమెరికా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, దావోస్ (స్విట్జర్లాండ్)లో పర్యటించి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని వివరించారు. తెలంగాణను 2047 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల స్థూల రాష్ట్ర ఉత్పత్తితో (జీఎస్‌డీపీ) దేశంలో మొదటి స్థానంలో నిలపటమే లక్ష్యమని సీఎం చెప్పారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో తెలంగాణ నంబర్ వన్ స్థానం సాధించిందని వెల్లడించారు.

మహిళా సాధికారత

తెలంగాణ రైజింగ్-2047లో మహిళా సాధికారత కీలకమని సీఎం తెలిపారు. 'మహిళా శక్తి జాతికే శక్తి'అనే సూక్తి ఆధారంగా 'ఇందిరా మహిళా శక్తి మిషన్'ను ప్రారంభించినట్లు చెప్పారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.21,632 కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్లు వివరించారు. మహిళల ఆధ్వర్యంలో 32 జిల్లాల్లో 2 మెగావాట్ల చొప్పున 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు వారి ద్వారా 600 బస్సులను టీజీఎస్ఆర్టీసీకి లీజుకి ఇవ్వడంతోపాటు మహిళా స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ పంపుల డీలర్‌షిప్‌లు ఇస్తున్నట్లు వివరించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.500లకే ఎల్పీజీ సిలిండర్లు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, పోలీస్ పాఠశాలలు, పరిశ్రమలతో అనుసంధానమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

అన్నదాతకు సాయం.. ఆహారంపై పెట్టుబడి

దేశానికి వెన్నెముక అయిన రైతన్నను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులను అప్పుల ఊబి నుంచి బయట పడేసేందుకు ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణం మాఫీచేసినట్లు చెప్పారు. ప్రస్తుతం వరి ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని, గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచామని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతుల కోసం చేసే వ్యయాన్ని సంక్షేమ కోణంలో కాకుండా ఆహార సంపద సృష్టికి పెడుతున్న పెట్టుబడిగా చూడాలని సూచించారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకు సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల (సీపెక్) సర్వే నిర్వహించామని, 2024 ఫిబ్రవరి 4న జరిగిన సీపెక్ తీర్మాన దినాన్ని 'సామాజిక న్యాయ దినం'గా ప్రకటించామని తెలిపారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీని భారతదేశపు మొట్టమొదటి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రసంగం ప్రారంభంలో పుల్వామా ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలిపారు. దేశంలో శాంతిని, ఐక్యతను నిలుపుకోవాలన్న సంకల్పానికి తెలంగాణ కట్టుబడి ఉందన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్ర వాదానికి వ్యతిరేకంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చూపిన నాయకత్వ లక్షణాలను, లక్ష్యంపై స్పష్టతను దేశం కొనసాగించాలన్నారు.

కేరళ చేరిన నైరుతి

▶ మొదటి పేజీ తరువాయి

కురుస్తాయని, సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది.

మూడురోజుల్లో రాష్ట్రంలోకి..

రానున్న మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణంగా కేరళను తాకిన తర్వాత సగటున నాలుగు నుంచి ఆరు రోజుల మధ్య తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండడంతో మూడు రోజులలోపే రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలోకి ప్రవేశించిన తర్వాత రాష్ట్రమంతటా రుతుపవనాలు విస్తరించేందుకు మరో మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. గత జూన్ 3న రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశించగా... ఈసారి మే నెలలోనే ప్రవేశించడం విశేషం.

27న బంగాళాఖాతంలో అల్పపీడనం

నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండడం రైతాంగంలో ఉత్సాహాన్ని నింపుతోంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల సీజన్‌లో కురిసే వర్షాలు బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం, వాయుగుండం, తుఫాన్‌లపైనే ఆధారపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆరోజుకల్లా తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో ఈ అల్పపీడనం ప్రభావం రాష్ట్రంపై ఉంటుందని, చాలాచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

గత ఆరేళ్లలో 'నైరుతి' కేరళను తాకిన తేదీలు

సంవత్సరం	ప్రవేశం	అంచనా
2020	జూన్-1	జూన్-5
2021	జూన్-3	మే-31
2022	మే-29	మే-27
2023	జూన్-8	జూన్-4
2024	మే-30	మే-31
2025	మే-24	మే-27

రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కొంకణ్ - గోవా తీర ప్రాంతం సమీపంలో కొనసాగిన స్పష్టమైన అల్పపీడన ప్రాంతం శనివారం ఉదయం బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం అదే ప్రాంతంలో రత్నగిరికి ఆగ్నేయంగా 40 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉంది. క్రమంగా తూర్పు దిశలో కదిలి శనివారం రాత్రికల్లా దక్షిణ కొంకణ్ తీరంలో రత్నగిరి, దాపోలి మధ్యలో వాయుగుండంగా తీరం దాటే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో దక్షిణ ప్రాంత జిల్లాల్లో తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ముందస్తుగా 3 నెలల సన్నబియ్యం

జూన్ 1 నుంచి రేషన్‌కార్డుదారులకు అందించనున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వానాకాలంలో భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో పేదలకు మూడు నెలల ముందే రేషన్ అందించాలన్న కేంద్రం ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం జూన్ ఒకటి నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. జూన్, జూలై, ఆగస్టుకు అవసరమైన సన్న బియ్యాన్ని రేషన్ దుకాణాల్లో అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రం సూచనల మేరకు జూన్ ఒకటి నుంచి 30లోగా మూడు నెలల రేషన్ పంపిణీ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా ఇచ్చినట్లుగానే ఆహార భద్రతా కార్డుదారులకు ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని అందిస్తామన్నారు. అంత్యోదయ ఆహార భద్రతా కార్డుదారులకు 35 కిలోల బియ్యం, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. అంత్యోదయ కార్డుదారులకు కిలో పంచదార రూ. 13.50 చొప్పున, గోధుమలు కిలో రూ. 7 చొప్పున జీహెచ్ఎంసీలో ఐదేసి కేజీలు, కార్పొరేషన్లలో రెండేసి కేజీలు పంపిణీ చేస్తామన్నారు. రేషన్ పంపిణీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అధికారులు ప్రచారం చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

2.5 లక్షల మంది పుష్కరస్నానం

కాళేశ్వరానికి పోటెత్తిన భక్తజనం
నేడు పుష్కరాలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ


భక్తులతో నిండిపోయిన కాళేశ్వరంలోని ఆర్టీసీ ప్రాంగణం

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాలు సోమవారం రాత్రితో ముగియనుండటంతో భక్తజనం భారీగా తరలివస్తున్నారు. శనివారం సుమారు 2.5 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలకు పోటెత్తారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా వాహనాల్లో తరలిరావడంతో సుమారు 7 కి.మీ. మేర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ మధ్యాహ్నం వేళ భక్తులతో పూర్తిగా నిండిపోయింది. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఇంటెలిజెన్స్ ఎస్పీ భాస్కర్, సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా పుష్కర స్నానాలు చేసి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో పూజలు చేశారు. మరోవైపు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆదివారం సరస్వతి పుష్కరాల్లో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకొని పుష్కర స్నానం ఆచరించనున్నారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

తెలంగాణలో నిరంతరాయ విద్యుత్ సరఫరా

- బెంగళూరులో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ రంగంలో రాష్ట్ర పురోగతి, ప్రణాళికలను వివరిస్తూ, ఇంధన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచడం, సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిలో వేగంగా ముందుకెళ్తున్నామని, దీనిపై కేంద్రం, రాష్ట్రాలు కలిసి ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. బెంగళూరులో శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన కేంద్ర విద్యుత్ మంత్రుల ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో భట్టి మాట్లాడారు.

నెట్‌వర్క్ బలోపేతం

రాష్ట్రంలోని అంతర్గత విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం ద్వారా పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ వనరులను సమన్వయం చేస్తూ చర్యలు చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. '2034–35 వరకు దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు, ఆర్థిక స్థితిని మెరుగుపరిచేలా సరైన ప్రణాళికలు రూపొందించాలి. ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు తెలంగాణ చూపిస్తున్న క్రియాశీలక దృష్టికోణాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపరిచే ప్రణాళికలపైనా భట్టి మాట్లాడారు. రాష్ట్రాలు, కేంద్రం కలిసి పనిచేయడం ద్వారా జాతీయ ఇంధన లక్ష్యాలను సాధించవచ్చన్న విషయం ఈ సదస్సులో స్పష్టమైంది. సమావేశంలో కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్ లాల్, కేంద్ర ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యస్సో నాయక్, కర్ణాటక, తమిళనాడు విద్యుత్ మంత్రులు కేజే జార్జ్, శివశంకర్ పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ, గిరిజనుల అభివృద్ధి.. రెండూ ముఖ్యమే: కొండా సురేఖ

ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రులు కొండా, సీతక్క సమావేశం



సాక్షి, హైదరాబాద్: అటవీ సంరక్షణ, గిరిజనుల అభివృద్ధి.. రెండూ అవసరమేనని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల అభివృద్ధికి ఫారెస్టు డిపార్ట్‌మెంట్, డీఎఫ్‌వోలు సహకరించాలని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మౌలిక సదుపాయాల కల్పన సంబంధిత పనులు, అటవీ శాఖ అనుమతులకు ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించేందుకు మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో శనివారం సచివాలయంలో ఆదిలాబాద్ జిల్లా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ చిన్న చిన్న అంశాలతో గిరిజనులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. గిరిజనుల బతుకులు మారాలంటే ఆయా ప్రాంతాల అభివృద్ధి జరగాలన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ అటవీ చట్టాల పేరు మీద ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. సరైన రోడ్లు లేకపోవడం వల్ల ఆపత్కాలంలో కొన్ని ప్రాంతాలకు అంబులెన్సులు కూడా వెళ్లలేక పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీలు, స్కూల్ భవనాలు, ఇండ్లు కట్టుకోవడానికి కూడా ఫారెస్టు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కోవా లక్ష్మి, డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండే విఠల్ చెప్పగా.. ఆయా ప్రాంతాల్లోని డీఎఫ్‌ఓలకు ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి కొండా ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు లోబడి ఉన్నవాటిని పరిష్కరించాలని సూచించారు. అయితే వన్యప్రాణి సంరక్షణ, అటవీ భూమి పరిరక్షణ కూడా ముఖ్యమని అన్నారు.

విద్యార్థుల నుంచి ఫీజుల వసూలుకు అనుమతివ్వండి

- ప్రభుత్వానికి ప్రైవేటు ఫార్మసీ కాలేజీల విజ్ఞప్తి
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక ఇబ్బందిపడుతున్నాం

సాక్షి, హైదరాబాద్: ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశం పొందే విద్యార్థుల నుంచి నేరుగా ట్యూషన్ ఫీజు వసూలు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని తెలంగాణ ఫార్మసీ కాలేజీల యాజమాన్య సంఘం కోరింది. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వడం లేదని, దీంతో సిబ్బందికి వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామ్‌దాస్, ప్రధాన కార్యదర్శి పుల్లా రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు ఎం.నర్సింహారెడ్డి, జాయింట్ సెక్రటరీ కడియాల సతీశ్, ఈసీ సభ్యులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఫార్మసీ కాలేజీలకు ప్రభుత్వం రూ.550 కోట్ల మేర బకాయి పడిందని, ఇవి చెల్లించకపోవడం వల్ల కాలేజీలు దయనీయ పరిస్థితిలో ఉన్నాయని వారు తెలిపారు. వేతనాలు అందక ప్రతిభగల అధ్యాపకులు ఈ రంగాన్ని విడిచి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఫార్మసీ కాలేజీల్లో 70 వేల మంది చదుతున్నారని, వారి భవిష్యత్‌ను దెబ్బతీయొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది నుంచి ట్యూషన్ ఫీజును విద్యార్థులు నేరుగా కాలేజీలకే చెల్లించాలని వారు కోరారు.

ప్రైవేటు కాలేజీల్లో పీజీలకు స్టైపెండ్ ఇవ్వాలి

- జూనియర్ డాక్టర్ల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న జూనియర్ డాక్టర్లందరికీ స్టైపెండ్ ఇవ్వాలని ప్రభుత్వం చెపుతున్నా, కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని జూనియర్ డాక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా), తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీఎస్ఆర్‌డీఏ) ఆధ్వర్యంలో శనివారం జూనియర్ డాక్టర్లు విధుల్లోనే నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఇంటర్న్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు స్టైపెండ్‌ను నిరాకరిస్తున్నాయని ఆరోపించారు. ఇది ఎన్ఎంసీ నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించడమేనని ధ్వజమెత్తారు. ఇటీవలే ఈ సమస్యను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య విద్య డైరెక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ రాష్ట్ర వైద్య మండలికి తెలియజేశామని జూనియర్ డాక్టర్లు తెలిపారు.

విదేశీ విద్యానిధి బకాయిలు విడుదల చేయాలి

- బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్య కార్యదర్శికి వినతి

సాక్షి, హైదరాబాద్: బ్రాహ్మణ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న విదేశీ విద్యానిధి పథకం కింద బకాయిలను వెంటనే విడుదల చేయాలని కారుపోతుల రేవంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్య కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ పథకం కింద వందలాది పేద బ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అర్హులుగా ఎంపికవడంతో విదేశాల్లో చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ పథకం కింద నిధులు అందుతాయని ఆశగా ఎదురు చూసిన విద్యార్థులకు నిరాశే మిగిలిందన్నారు. అప్పులు చేసి ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2023 జనవరిలో దాదాపు 300 మంది విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు పత్రాలను జారీ చేసినప్పటికీ.. నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలో ఫీజులు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులను విడుదల చేసి పేద బ్రాహ్మణ విద్యార్థులను ఆదుకోవాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు.

జాతీయ ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలి

- ఈబీసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఈబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు, అగ్ర కులాల నిరుపేద సంఘాల జేఏసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈబీసీల అభ్యున్నతికి మంత్రిత్వశాఖ, ఈబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈబీసీలకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని రవీందర్‌రెడ్డి తెలిపారు.

పాలిసెట్‌లో 88.5% ఉత్తీర్ణత

టాప్ ర్యాంకుల్లో బాలికలదే పైచేయి ● ఫలితాలు విడుదల చేసిన దేవసేన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పాలిసెట్‌లో 83,364 (88.54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విభాగంలో 81.88%, ఎంబైపీసీ విభాగంలో 84.33% అర్హత సాధించారు. టాప్ ర్యాంకుల్లో ఎక్కువ మంది బాలికలే ఉండటం విశేషం. 120 మార్కుల పేపర్‌లో నలుగురు విద్యార్థులు పూర్తి మార్కులు 120 సాధించటం గమనార్హం. పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా పాలిసెట్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష ఫలితాలను సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన శనివారం విడుదల చేశారు. పరీక్షకు మొత్తం 1,06,716 మంది దరఖాస్తు చేయగా, 98,858 మంది పరీక్ష రాశారు. వీరిలో 83,364 మంది అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో మొత్తం 80,949 మంది అర్హత సాధించగా, వారిలో బాలురు 41,923 మంది, బాలికలు 39,026 మంది ఉన్నారు. ఎంబైపీసీ విభాగంలో బాలురు 42,836, బాలికలు 40,528 మంది కలిపి మొత్తంగా 83,364 మంది అర్హత సాధించారు. మొత్తం 120 మార్కులకు నిర్వహించిన పరీక్షలో అర్హత మార్కులు 36. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు ఒక్క మార్కు వచ్చినా అర్హతగా పరిగణిస్తారు. పాలిసెట్ ర్యాంకు కార్డులను ఎస్‌బీటీఈటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని దేవసేన తెలిపారు. ప్రవేశ ప్రకటన వెలువడిన తర్వాత విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలని ఆమె సూచించారు.



ఫలితాలు విడుదల చేస్తున్న కమిషనర్ దేవసేన

ఆదిలాబాద్ విద్యార్థికి 5వ ర్యాంకు



నేరడిగొండ: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్–2025 ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం సవర్గామ్ గ్రామానికి చెందిన జాదవ్ రిషి ఆరాధ్య రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి జె.తానాజీ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

లక్ష్యంతో చదివా



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచి పాలిసెట్‌లో ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో చదివాను. ఎస్సెస్సీలో 574 మార్కులు సాధించాను. ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులు నాకు ఎక్కువ ఇష్టం. భవిష్యత్‌లో ఐఐటీలో మంచి సీటు సాధించి, ఇంజనీర్ కావాలన్న లక్ష్యంతో చదువుతున్నాను. ర్యాంకు సాధించేందుకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు.

– ఉంద్యాల కౌశిక్‌నారాయణ, 1వ ర్యాంకర్

సివిల్స్ సాధించడమే లక్ష్యం



కోదాడ: భవిష్యత్తులో సివిల్స్ సాధించడమే నా లక్ష్యం. ఐఐటీలో ఇంజనీరింగ్ చదువుతా. తరువాత సివిల్స్‌పై దృష్టి సారిస్తా. టీజీఎస్ఆర్‌జేసీలో కూడా నాలుగో ర్యాంకు సాధించాను. పాఠశాల యాజమాన్యం, నా తండ్రి జానీపాషా ప్రోత్సాహంతో ఈ ర్యాంకులు సాధించాను.

– ఎస్.కె. ఇఫ్రా తస్నీమ్, 3వ ర్యాంకర్

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం



సూర్యాపేట టౌన్: పాలిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకు రావడం సంతోషాన్నిచ్చింది. నాన్న మధుసూదన్‌రావు, అమ్మ సునీత ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించగలిగాను. టీచర్లు కూడా ప్రోత్సహించి మంచి విద్యనందించారు. ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యంగా చదువుతున్నాను. అలాగే భవిష్యత్తులో సివిల్స్ కూడా సాధించాలనేది నా కోరిక.

–గోరుగంటి శ్రీజ, 1వ ర్యాంకర్

పాలిసెట్ టాపర్లు వీరే...

పేరు	జిల్లా	మార్కులు
గోరుగంటి శ్రీజ	సూర్యాపేట	120
తుమాటి లాస్యశ్రీ	ఖమ్మం	120
ఉంద్యాల కౌశిక్ నారాయణ	మహబూబ్‌నగర్	120
వీసవరం దీక్షక	సంగారెడ్డి	120
షేక్ ఇఫ్రా తస్నీమ్	సూర్యాపేట	119

బీసీ గురుకుల జూనియర్ కాలేజీ ప్రవేశ ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు శనివారం విడుదల చేశారు. ఈ వివరాలను mjptbcwreis.telangana.gov.in, mjpabcwreis.cgg.gov.in వెబ్‌సైట్లలో పరిశీలించుకోవచ్చన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించామని వెల్లడించారు. 2025–26 విద్యా సంవత్సరంలో మొత్తం 130 బాలుర కాలేజీల్లో 11,360 సీట్లు, 127 బాలికల కాలేజీల్లో 10,720 సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా 61,119 మంది దరఖాస్తు చేసుకోగా, 22,080 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు.



ఆయన హెచ్చవలసియున్నది.
నేను తగ్గవలసి యున్నది.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.1.48 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అశ్విని ఉ.9.21 వరకు తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.5.38 నుండి 7.08 వరకు, తదుపరి సా.6.17 నుండి 7.46 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.38 నుండి 5.30 వరకు, **అమృత ఘడియలు:** రా.3.10 నుండి 4.40 వరకు, రోహిణి కార్తి ప్రారంభం.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం : 6.24
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రామఫోసా (దక్షిణాఫ్రికా అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

డోనాల్డ్ ట్రంప్ ఆతిథ్యం బాగుంది! ఓవల్ ఆఫీస్‌లోకి నేను అడుగు పెట్టగానే, సాదరంగా ఆయన నాకు పలికిన అపూర్వ ఆహ్వానం... ఆ గదిలోని లైట్స్ అన్నీ డిమ్ చేయించటం!!

రెస్టారెంట్‌లలో, ఇలాగే డిమ్ లైట్‌ల కాంతిలో రాచమర్యాదలు ఉంటాయి. ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్ నాకోసం ఏర్పాటు చేయించిన డిష్‌లూ లేవు. చేసిన మర్యాదలూ లేవు. ఆయన ఆతిథ్యం నాకు బాగుండటానికి ఆ 'లేకపోవటం' తప్ప, వేరే కారణాల్లేవు.

మర్యాద తెలియని మనిషి నుంచి మర్యాదను పొందటం అవమానం. అది నాకు జరగలేదు. తింటున్నప్పుడైనా ఏం మాట్లాడకూడదో తెలియని మనిషితో కలిసి తినటానికి కూర్చోవలసి రావటం మర్యాదను పోగొట్టుకోవటం. అదీ నాకు జరగలేదు. కనుక ట్రంప్ నాకు చక్కని ఆతిథ్యం ఇచ్చినట్లే!

లైట్స్ డిమ్ చేయించాక, స్క్రీన్ మీద ఒక చిన్న క్లిప్ వేయించి, "చూడండి, మిస్టర్ రామఫోసా... అక్కడ మీ వాళ్లు మా వాళ్లను ఎంత దారుణంగా ట్రీట్ చేస్తున్నారో" అన్నారు ట్రంప్. ఆ మాటతోనే మా మీటింగ్ మొదలైంది. ఆ మాటతోనే మా మీటింగ్ మొదలు కాకుండానూ అయింది.



స్క్రీన్ మీద ట్రంప్ వేయించిన ఆ క్లిప్ నిజమైనది కాదు. నిజమని ట్రంప్ అనుకుంటున్నా... దాని గురించి మాట్లాడే సందర్భం అది కాదు. ట్రేడ్ డీల్ కోసం పిలిపించుకున్నప్పుడు ట్రేడ్ డీల్ గురించే మాట్లాడాలి.

ఓవల్ ఆఫీస్‌ను స్కూల్ హెడ్ మాస్టర్ రూమ్‌గా మార్చేశారు ట్రంప్. రూమ్‌కి పిలిపించి, "రష్యా అడిగింది ఇచ్చేయ్" అని ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్‌స్కీని గద్దిస్తారు!

"గాజా నుండి మీ దేశానికి వచ్చే శరణార్థుల్ని అడ్డుకోవద్దు..." అని జోర్డాన్ రాజు అబ్దుల్లా హుస్సేన్‌కు చెబుతారు!

"ఉక్రెయిన్‌కి సహాయం ఆపేయాలని ఐరోపాకంతటికీ మీరే చెప్పాలి..." అని ఫ్రెంచ్ ప్రెసిడెంట్ మెక్రాన్‌ను బలవంత పెడతారు!

"కెనడాను సైనికంగా రక్షించటానికి అయ్యే ఖర్చులో ఎక్కువ భాగాన్ని అమెరికానే భరిస్తోంది కనుక, కెనడాను అమెరికాలో ఎందుకు విలీనం చేయకూడదు?" అని కెనడా ప్రధాని మార్క్ కార్నీని ప్రశ్నిస్తారు.

"జెలెన్‌స్కీకి అంత స్ట్రాంగ్ సపోర్ట్ ఇచ్చి ఉండాల్సింది కాదు కదా..." అని ఇటలీ ప్రధాని మిస్ మెలనీతో అంటారు.

ఇప్పుడు నన్ను పిలిపించుకుని, "దక్షిణాఫ్రికాలో శ్వేత జాతీయులపై జరుగుతున్న ఊచకోతకు వివరణ ఇవ్వండి" అంటున్నారు.

జెలెన్‌స్కీలా కోపగించుకొని మీటింగ్ మధ్యలోనే లేచి వెళ్లిపోవటం నా వయసుకి బాగుండదు కనుక, మండే అగ్నిగోళం నెల్సన్ మండేలాను మనసులోకి తెచ్చిపెట్టుకుని ప్రశాంతంగా కూర్చున్నాను.

అమెరికా గురించి మండేలా గొప్పగా చెబుతుండేవారు. 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్' పార్టీకి మండేలా ప్రెసిడెంట్‌గా, నేను పార్టీ సెక్రెటరీ జనరల్‌గా ఉన్నప్పుడు మండేలా తరచూ అమెరికన్ డెమోక్రసీ మీద, అమెరికన్ లీడర్‌షిప్ మీద ప్రశంసాపూర్వకమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండేవారు.

27 ఏళ్ల కారాగార వాసం నుండి విడుదలయ్యాక, మండేలా తొలిసారి సందర్శించిన దేశాల్లో అమెరికా కూడా ఉంది. పన్నెండు రోజుల టూర్‌లో ఆయన ఎనిమిది అమెరికన్ సిటీలలో పర్యటించారు. అనేకమంది నాయకులను కలుసుకున్నారు. ప్రెసిడెంట్ జార్జిబుష్‌తో ఇదే ఓవల్ ఆఫీస్‌లో సమావేశం అయ్యారు. ఇదే ఆఫీస్‌లో నేను, జో బైడెన్ కూడా కలిసి కూర్చున్నాం.

ట్రంప్... బైడెన్‌లా లేరు. జార్జి బుష్‌లా లేరు. ఏ అమెరికన్ ప్రెసిడెంట్‌లానూ లేరు. అందరికన్నా భిన్నంగా ఉన్నారు!

ఆయన ఎలా ఉన్నా, ఎలా లేకున్నా.. మండేలా అన్నట్లు అమెరికా గొప్ప దేశమే! కానీ కొన్నిసార్లు బ్రైట్‌నెస్ తగ్గి బాగా డిమ్ అయిపోతుంటుంది!

ఏడాది పాలన పొట్ట విప్పి చూడ..!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



చంద్రబాబు అనే నాలుగు అక్షరాలకు అర్థమూ, తాత్పర్యమూ, నిర్వచనమూ అన్నీ కూడా అభివృద్ధేనని యెల్లో మీడియా మనకు ఎప్పటి నుంచో నేర్పిస్తున్నది. ముప్పయ్యేళ్ల లోపు వయసున్న తరానికైతే దొండాకు పసరు నాడే ఈ వసను కూడా కలిపి తాగించారు. అటువంటి రెండు కాళ్ల మీద నడిచే అభివృద్ధి నాలుగోసారి కుర్చీ ఎక్కి సంవత్సరకాలం పూర్తవుతున్నది. ఈ ఏడాది కాలంలో విరగబూసిన అభివృద్ధిని కళ్లారా వీక్షించాలన్న కోరిక ఎవరికి మాత్రం ఉండదు? ఆ వీక్షణ కోసం కొన్ని 'వ్యూ పాయింట్స్' కూడా మనకు అందుబాటులో ఉన్నాయి.

హిందూపూర్ రైల్వే స్టేషన్ కూడా ఒక వ్యూ పాయింట్. హిందూపూరంటే చంద్రబాబు పార్టీకి కంచుకోట కదా! ఎన్టీ రామారావు పార్టీ పెట్టినప్పటి నుంచి ఒక్కసారి కూడా ఓటమి చవిచూడలేదట! పైగా ముఖ్యమంత్రికి స్వయానా బావమరిది ప్లస్ వియ్యంకుడు ప్లస్ మాస్ మసాలా హీరో – బాక్సాఫీస్ బొనాంజా బాలయ్యబాబు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం. ఇంత బిల్డప్ ఉన్నచోట అభివృద్ధి దద్దరిల్లకుండా ఉంటుందా? ఉదయం నాలుగున్నర నుంచి రెండు గంటలసేపు ఆ స్టేషన్‌లో నిలబడితే రైలు కూత వాయిస్‌లో అభివృద్ధి సౌండ్ వినిపిస్తుంది.

బెంగళూరు నగరంలోని ఇళ్లలో పాచి పనులు చేసేందుకు, వీధుల్లో మూటలు మోసేందుకూ, ఇంకా ఇతర పనుల కోసం దాదాపు మూడు వేలమంది దాకా రోజూ అక్కడ ప్యాసింజర్ బండ్లెక్కి వెళుతున్నారు. ఇలా ప్రతిరోజూ వెళ్లి పనిచేసుకుని రావడం కొత్తేమీ కాదు. కాకపోతే ఏడాది కిందట వీరి సంఖ్య ఆరేడు వందలు దాటేది కాదు. ఈ ఏడాదిలో క్రమంగా మూడు వేల మార్కుకు చేరుకున్నది. ఈ పెరుగుదలను ఏడాది పాలన అభివృద్ధి ఖాతాలోనే కదా వేయాల్సింది. రోజువారీ చాకిరీ ముగిసిన తర్వాత మళ్లీ రైలు బండెక్కి రాత్రి పది గంటలు దాటిన తర్వాత ఇంటికి చేరుకుంటారు. మళ్లీ పొద్దున మూడు గంటలకే లేచి ఇంటి పనులు పూర్తి చేసుకుంటేనే... స్టేషన్‌లో బతుకు బండిని అందుకోగలుగుతారు.

మహానగరానికి సమీపంలో ఉన్నందువలన హిందూపూర్ వలసల్లో డైలీ షటిల్ పద్ధతి కనిపిస్తున్నది. ఆ సమీపంలోనే ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలోనైతే మూడో వంతు జనాభా మాత్రమే మిగిలిపోయిన గ్రామాలు కూడా ఉన్నాయి. అలా మిగిలిపోయిన వాళ్లలో వృద్ధులూ, పిల్లలే ఎక్కువ. భవన నిర్మాణ రంగంలో పనిచేయడానికి నెల్లూరు నగరంలో స్థిరపడ్డ కార్మికుల్లో ఇరవై వేలమంది ఈ మధ్యకాలంలోనే పట్టణం వదిలి వెళ్లిపోయారు. ఆంధ్రప్రదేశ్ వలసలపై గ్రామ సచివాలయాల సర్వేను ఆధారం చేసుకొని ఇటీవల 'ప్రజాశక్తి' పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం ఈ మధ్యకాలంలో ఎన్నడూ లేనంతగా వలసలు పెరిగాయి. గణనీయ సంఖ్యలో జనం వలస బాట పట్టారు.

వలసలన్నీ అభివృద్ధికి వ్యతిరేకమైనవి కావు. మెరుగైన జీవితం కోసం, నైపుణ్యతకు తగిన ఉపాధి కోసం, ఉన్నతోద్యోగాల కోసం నిరంతరం వలసలు జరుగుతూనే ఉంటాయి. అటువంటి వలసలను ప్రగతిశీలమైనవిగానే పరిగణిస్తారు. కానీ ఈ సంవత్సరం ఈ తరహా వలసల సంఖ్య చాలా తక్కువనీ, బతుకుదెరువు వలసలే ఎక్కువనీ సర్వే సారాంశమట! వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, రైతన్నలకు చేసిన హామీలను ఎగవేయడం, కరువు పరిస్థితులు, ఉపాధి హామీ కూలీలకు ఇవ్వాల్సిన బిల్లులు ఆపేయడం, నిర్మాణరంగం పూర్తిగా కుదేలవడం వంటి కారణాలు పెద్ద ఎత్తున వలసలకు కారణమయ్యాయి.

తొలి ఏడాది అభివృద్ధికి సంబంధించి పెరిగిన వలసలు ఒక కొలమానమైతే, అధికారిక లెక్కలు వెల్లడించే డాక్యుమెంట్లు మరో బలమైన సాక్ష్యంగా ఉంటాయి. ఇదిగో ఈ సాక్ష్యాలను ముందుపెట్టుకొనే వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర యథార్థ పరిస్థితులను మీడియా సమావేశం ద్వారా మొన్న జనం ముందు ఉంచారు. ఈ సమావేశంలో తన పార్టీ వాళ్లు తయారుచేసిన నివేదికల ఆధారంగా ఆయన మాట్లాడలేదు. ప్రభుత్వం తయారుచేసిన బడ్జెట్ పత్రాల్లోని లెక్కల్ని ఆధారంగా చేసుకునే మాట్లాడారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రిపోర్టుల్లోని విషయాలపైనే మాట్లాడారు. 'కాగ్'కు తన ప్రమాణాలను పాటించడం తప్ప ఎటువంటి పక్షపాత ధోరణీ ఉండదనేది తెలిసిందే. తప్పొప్పులను తూర్పారపట్టడమే దాని పని. ఈ లెక్కల ఆధారంగానే కూటమి సర్కార్ మాటల్లోని కపటత్వాన్నీ, వారి ప్రచారాల్లోని డొల్లతనాన్నీ ఆయన చీల్చి చెండాడారు. ప్రభుత్వంపై ఆయన చేసిన దాడి ఎంత సాధికారికంగా, ఎంత శక్తిమంతంగా జనంలోకి వెళ్లిందంటే... మూడు రోజులు గడిచినా సర్కార్ వైపు నుంచి ఏ ఒక్కరూ ప్రతిపక్ష నేతకు సమాధానమిచ్చేందుకు ముందుకు రాలేకపోయారు. కొన్ని పిల్లి అరుపులు వినిపించడం, కొన్ని కుప్పిగంతులు కనిపించడం తప్ప!

మూలధన వ్యయం పెరుగుదలను ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి గుర్తుగా పరిగణిస్తారు. ఆర్థిక వ్యవస్థపై నమ్మకానికీ, ఉద్యోగాల కల్పనకూ, జీడీపీ ఉద్దీపనకూ ఈ మూలధన వ్యయం దోహదపడుతుంది. మరి, అభివృద్ధికి పర్యాయపదంగా యెల్లో మీడియా పలవరించే చంద్రబాబు తొలి ఏడాదిలో ఈ మూలధన వ్యయం ఏ మేరకు పెరిగింది? పెరగలేదు సరికదా, అంతకుముందు సంవత్సరంతో పోల్చితే 17.80 శాతం తగ్గిందని 'కాగ్' నివేదికలోని అంశాన్ని జగన్ జనం ముందు పెట్టారు. జగన్ ప్రభుత్వపు చివరి సంవత్సరంలో మూలధన వ్యయం రూ. 23,330 కోట్లయితే చంద్రబాబు తొలి సంవత్సరం అది రూ. 19,177 కోట్లు మాత్రమేనని 'కాగ్' కుండబద్దలు కొట్టింది.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం ఏటికేడు పెరుగుతుంటేనే అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు! కానీ గత సంవత్సరంతో పోలిస్తే చంద్రబాబు తొలి సంవత్సరంలో ఈ ఆదాయం 7.39 శాతం తగ్గింది. జగన్‌మోహన్‌రెడ్డి జనం ముందుంచిన ప్రభుత్వ గణాంకాల్లో అత్యంత ఆసక్తికరమైనది ఎక్సైజ్ ఆదాయం. ఎందుకంటే అంతకుముందు కంటే మద్యం షాపుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి మద్యం షాపుకు అనుబంధంగా ఓ పర్మిట్ రూమ్ తయారైంది. ఇక బెల్ట్‌షాపుల సంఖ్య నలభై వేలు దాటింది. ఒక్కో బెల్ట్‌షాపు అనధికార పాటల్లో పది లక్షల నుంచి పదిహేను లక్షల వరకు పలికిందని వార్తలొచ్చాయి. బెల్ట్‌షాపుల కేటాయింపులోనే నాలుగు వేల నుంచి ఐదు వేల కోట్ల మేరకు అనధికారిక డీల్ కనబడుతుంటే... ప్రభుత్వానికి పెరిగిన ఎక్సైజ్ ఆదాయం కేవలం రూ. 3,800 కోట్లు మాత్రమే!

ఇక ఈ 40 వేల పైచిలుకు బెల్ట్ షాపుల్లో అమ్మిన సరుకెంత? వచ్చిన ఆదాయమెంత? 4,400 మద్యం దుకాణాల్లో, వాటికి అనుబంధంగా కొత్తగా వెలసిన పర్మిట్ రూమ్‌ల సౌకర్యంతో పెరిగిన అమ్మకాలెన్ని? వచ్చిన ఆదాయమెంత? మద్యం దుకాణాలు, పర్మిట్ రూమ్‌లు, బెల్ట్‌షాపులు, బార్లు రౌండ్ ది క్లాక్ చేస్తున్న వ్యాపారం వల్ల పెరిగిన ఆదాయమెంత? ఇదంతా ఎవరి జేబుల్లోకి వెళుతున్నది? లేని స్కామ్‌పై నెలల తరబడి చేసిన దుష్ప్రచారం తర్వాత ఇప్పుడు ఎవరూ మాట్లాడొద్దని చంద్రబాబు చల్లగా ఆదేశాలివ్వడం వెనుక రహస్యమేమిటి? ఆధారాలు తుడిచేశారని 'ఈనాడు', దర్యాప్తు ఇప్పుడప్పుడే పూర్తి కాదని 'ఆంధ్రజ్యోతి' రాయడం వెనుక మర్మమేమిటి? ఇప్పుడు నడిపిస్తున్న విశృంఖల అవినీతి బయటికొస్తుందేమోనని భయపడుతున్నారా? కేవలం 24 శాతం పెరుగుదలనే నమోదు చేసిన ఎక్సైజ్ ఆదాయం తీగ అవినీతి డొంకను కదిలించింది.

సంపద సృష్టికర్తగా స్వీయ కీర్తనలు చేసుకొని, యెల్లో మీడియా కితాబులందుకునే చంద్రబాబు తొలి ఏడాది పాలనలో రాష్ట్ర సొంత వనరుల ద్వారా పెరిగిన ఆదాయం కేవలం 3.08 శాతం మాత్రమే! అదే కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆదాయం 13.76 శాతం పెరిగింది. పక్కనున్న తెలంగాణ రాష్ట్ర ఆదాయం 12 శాతం పెరిగింది. అప్పుల్లో మాత్రం 30 శాతం అదనంగా చంద్రబాబు ప్రభుత్వం హైజంప్ చేసింది. ఇది బడ్జెటరీ అప్పుల సంగతే! అమరావతి అప్పులు, ఇతరత్రా అప్పులు వేరే ఉన్నాయి. అయిదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం చేసిన అప్పుల్లో 41 శాతాన్ని చంద్రబాబు సర్కార్ తొలి సంవత్సరంలోనే చేసేసిందని జగన్‌మోహన్‌రెడ్డి ఆధారసహితంగా జనం ముందు పెట్టారు.

ఒకపక్క అప్పులు పెరుగుతున్నాయి. అవినీతి మహమ్మారి మాదిరిగా విస్తరిస్తున్నది. అభివృద్ధి మృగ్యమైందని సాక్ష్యాలు చెబుతున్నాయి. మరి సంపద సృష్టికీ, అభివృద్ధికీ బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే అయ్యవారు ఏం చేస్తున్నారయ్యా అంటే ఆయన తైనాతీలు, భజంత్రీలు అమరావతి వంక చూపెడుతున్నారు. అసలా అమరావతి నిర్మాణమే అతి పెద్ద స్కామ్‌గా గణాంకాల సహితంగా జగన్ నిరూపించారు. గతంలో పిలిచిన టెండర్లను, అసాధారణ రీతిలో పెంచి పిలవడం వెనుక, టెండర్లు దక్కించుకున్న వారికి మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇప్పించడం వెనుకనున్న మర్మం కమీషన్లు దండుకోవడం కాదా అని ప్రశ్నించారు. సచివాలయం, హెచ్‌ఓడీ భవనాలను 53 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించడంలోని ఔచిత్యాన్నీ, చదరపు అడుగు నిర్మాణ వ్యయాన్ని రూ. 8,931గా నిర్ణయించడంలో లోగుట్టునూ కూడా ఆయన ప్రశ్నించారు.

అమరావతి నిర్మాణం పేరుతో ప్రభుత్వం వేస్తున్న ప్రతి అడుగూ అనుమానాస్పదంగానే ఉన్నది. ఎన్నికలకు ముందు రాజధానికి ప్రభుత్వం పైసా ఖర్చు చేయనవసరం లేదని చెప్పారు. భూముల అమ్మకం ద్వారానే నిర్మాణం పూర్తి చేయొచ్చనీ, ఆ రకంగా అది సెల్ఫ్ ఫైనాన్స్ నగరమనీ ప్రచారం చేసిన సంగతి ఎవరూ మరచిపోలేదు. ఇప్పుడేమో తొలిదశ 50 వేల ఎకరాలకే రూ.80 వేల కోట్లు కావాలని చంద్రబాబు చెబుతున్నారు. అందులో 30 వేల కోట్లు ఇప్పటికే అప్పుగా తెచ్చారు. మరో 45 వేల ఎకరాలతో రెండో దశ భూసమీకరణ కూడా జరుగుతుందట! ఈ లెక్కన రాజధాని నగరానికి రెండు లక్షల కోట్ల దాకా ఖర్చు పెట్టవలసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఆ నిర్మాణం పూర్తయ్యే సరికి తడిసి మోపెడవుతుందని జగన్‌మోహన్‌రెడ్డి కూడా హెచ్చరించారు.

భూముల అమ్మకాలు జరిపినా అప్పులు తీర్చలేరని, చివరికి రాష్ట్ర ప్రజలపై అమరావతి ఒక గుదిబండ కాబోతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చౌకగా వసతి సౌకర్యాలు, అపారంగా ఉపాధి అవకాశాలను సృష్టించగలిగితేనే ఆ నగరం నెమ్మదిగా ఒక రూపు తీసుకుంటుంది. రోమ్ నగరం ఒక్కరోజులో నిర్మితం కాలేదన్న సామెతకు ఒక అర్థం ఉన్నది.


ఒక భారీ సంకల్పం నెరవేరాలంటే కావాల్సినంత సమయం, సహనం, నిరంతర ప్రయత్నం, అంకితభావం ఉండాలి. అమరావతి ప్రాంతం ఇప్పటికే సామాన్యులకు అందుబాటులో లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఈ ప్రాంతంలో జగన్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయిస్తే రాజధాని సమతుల్యత దెబ్బతింటుందని చంద్రబాబు బృందం కోర్టుకెక్కిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇటువంటి చోట ఎంత ప్రయాసపడ్డా వచ్చే పదేళ్లలో మరో మహానగరం కాదు, ఇంకో మంగళగిరి కూడా ఆవిర్భవించదు! ఏడాది కాలంలో ప్రజా సంక్షేమం పూర్తిగా పడకేసింది. అభివృద్ధి అలికిడే లేదు. అవినీతి విశ్వరూపం దాల్చింది. రాజకీయాల్లో ఒక అరాచక బర్బర సంస్కృతిని ప్రవేశపెట్టారు. ప్రత్యర్థులను వేటాడుతూ భయానక పాలనకు తెరతీశారు. ఈ రకంగా ప్రత్యర్థుల నోళ్లు నొక్కాలని ప్రయత్నిస్తున్నారు. శిరస్సుల మీద అప్పుల కిరీటాన్ని ధరించి, మెడలో అవినీతి మాల వేసుకొని, చేతులకు ప్రత్యర్థుల నెత్తురు పులుముకొని ఏడాది ఉత్సవాల పల్లకీలపై ఏలికలు ఊరేగబోతున్నారు.

vardhelli1959@gmail.com

సంపద సృష్టికర్తగా స్వీయ కీర్తనలు చేసుకొని, యెల్లో మీడియా కితాబులందుకునే చంద్రబాబు తొలి ఏడాది పాలనలో రాష్ట్ర సొంత వనరుల ద్వారా పెరిగిన ఆదాయం కేవలం 3.08 శాతం మాత్రమే! అదే కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆదాయం 13.76 శాతం పెరిగింది. పక్కనున్న తెలంగాణ రాష్ట్ర ఆదాయం 12 శాతం పెరిగింది. అప్పుల్లో మాత్రం 30 శాతం అదనంగా చంద్రబాబు ప్రభుత్వం హైజంప్ చేసింది. ఇది బడ్జెటరీ అప్పుల సంగతే! అమరావతి అప్పులు, ఇతరత్రా అప్పులు వేరే ఉన్నాయి. అయిదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం చేసిన అప్పుల్లో 41 శాతాన్ని చంద్రబాబు సర్కార్ తొలి సంవత్సరంలోనే చేసేసిందని జగన్ మోహన్‌రెడ్డి ఆధారసహితంగా జనం ముందు పెట్టారు. ఒకపక్క అప్పులు పెరుగుతున్నాయి. అవినీతి మహమ్మారి మాదిరిగా విస్తరిస్తున్నది. అభివృద్ధి మృగ్యమైందని సాక్ష్యాలు చెబుతున్నాయి. మరి సంపద సృష్టికీ, అభివృద్ధికీ బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే అయ్యవారు ఏం చేస్తున్నారయ్యా అంటే ఆయన తైనాతీలు, భజంత్రీలు అమరావతి వంక చూపెడుతున్నారు. అసలా అమరావతి నిర్మాణమే అతి పెద్ద స్కామ్‌గా గణాంకాల సహితంగా జగన్ నిరూపించారు. గతంలో పిలిచిన టెండర్లను, అసాధారణ రీతిలో పెంచి పిలవడం వెనుక, టెండర్లు దక్కించుకున్న వారికి మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇప్పించడం వెనుకనున్న మర్మం కమీషన్లు దండుకోవడం కాదా అని ప్రశ్నించారు.

కార్పొరేట్ల కోసమే ఈ నిర్మూలనా?

సందర్భం



పాణి

'ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని వందలాది గ్రామాలలో వేలాది రైతుల నుండి వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ రిఛారియా 22,000లకు పైగా వరి వంగడాలను, 1,800లకు పైగా ఆకుకూరలను సేకరించి వాటి జర్మ్ ప్లాస్మ్‌ను రాయ్‌పూర్‌లోని 'ఇందిరా గాంధీ జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం'లో 1950, 1960లలో భద్రపరిచారు. ఇందులో తక్కువ నీటితో పండేవి, తక్కువ గడ్డినిచ్చేవి, ఎక్కువ గడ్డినిచ్చేవి, సువాసనలు వెదజల్లేవి, పొడవైన– పొట్టి రకాలు, ఏ కాలంలోనైనా పండే అనేక వంగడాలు ఉన్నాయి. అయితే మన దేశ దళారీ పాలకుల కుమ్మక్కుతో ఈ వరి వంగడాల జర్మ్ ప్లాస్మ్‌ను అమెరికా తదితర దేశాల బహుళజాతి కంపెనీలు దొంగిలించుకుపోయాయి. మనీలాలోని 'ఇంటర్నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (ఐఆర్‌ఆర్‌ఐ)లలో అభివృద్ధి చేశామని చెప్తూ ఇలా దొంగిలించుకుపోయిన వంగడాలను వివిధ పేర్లతో (ఐఆర్–36, ఐఆర్–72 తదితర) బహుళజాతి కంపెనీలు భారత్ లాంటి అనేక దేశాల్లో అమ్ముకుని భారీగా లాభాలు గడిస్తున్నాయి. విత్తనాల కోసం భారతదేశ రైతులు ప్రతి సంవత్సరం బహుళజాతి కంపెనీలపై ఆధారపడేలా చేస్తున్నారు...' ఈ మాటలు విదేశీ జర్నలిస్టు అల్ఫ బ్రెనస్‌కు 2022లో ఇచ్చిన ఒక సుదీర్ఘ ఇంటర్వ్యూలో మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి బసవరాజువి. ఈ దేశ ప్రజల పరంపరాగత జ్ఞానం పట్ల, దేశీయత పట్ల, వనరుల పట్ల ఆయన వైఖరిని సూచించే మాటలు ఇవి.

దేశభక్తి అనే ఒక్క మాటతో ఈ రోజు అందరినీ శిలువ ఎక్కించి పరీక్షిస్తున్నారు. కానీ నిజంగానే దేశం పట్ల ప్రేమ ఉంటే ఎలా ఆలోచించాలో బసవరాజు చేసిన ఈ సూక్ష్మ పరిశీలన తెలియజేస్తోంది. జాతీయత పేరుతో మావోయిస్టు నిర్మూలనను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న తరుణంలో ఏది దేశభక్తి, ఏది ప్రజల మీది ప్రేమ అనే చర్చ జరగలవసి ఉన్నది.

మావోయిస్టుల ఆలోచనలు విదేశీయమని కొందరు చెబుతుంటారు. మావోయిస్టుల వల్ల ఈ దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, అభివృద్ధికి వాళ్లు ఆటంకంగా ఉన్నారని అంటున్నారు. కానీ కొద్దిగా ఈ దేశ రాజకీయార్థిక వ్యవహారాలను పరిశీలిస్తే ఎవరు ఎలాంటి అభివృద్ధి కోరుకుంటున్నదీ అర్థమవుతుంది. గతంలో కంటే తీవ్రంగా అభివృద్ధి అనే మాట ఇప్పుడు చలామణీలోకి వచ్చింది. కానీ ఇది ఎవరి అభివృద్ధి అనేది అతి ముఖ్యమైన ప్రశ్న.

ఏడాదిన్నరగా మావోయిస్టు నిర్మూలన పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న 'ఆపరేషన్ కగార్' కేవలం సైనిక చర్య కాదు. అభివృద్ధి నమూనా కేంద్రంగా సాగుతున్న రాజకీయార్థిక యుద్ధం. సరిహద్దుల కోసం పక్క దేశ ప్రజలపై యుద్ధం చేసే భారత ప్రభుత్వం అభివృద్ధి నమూనా విషయంలో జరుగుతున్న సంఘర్షణను అంతర్యుద్ధంగా మార్చేసింది. తన దేశ ప్రజల మీదే దండయాత్ర చేస్తోంది. యుద్ధాల్లో ఆయుధాలు, విమానాలు, డ్రోన్‌లు చేసే వికృత ధ్వనుల వెనుక రాజకీయార్థిక విధ్వంసాలు ఉంటాయి.

కగార్ పేరుతో అదే జరుగుతోంది. అందుకే మావోయిస్టు ప్రభావిత మధ్య భారత రాష్ట్రాల్లో హత్యాకాండ ఆపాలని దేశవ్యాప్తంగా



ఆందోళనలు చెలరేగుతున్నాయి. ఆదివాసుల జీవించే హక్కు, రాజ్యాంగం ఇచ్చిన రక్షణ చట్టాల చర్చగానే ఇది ముగిసి పోవడం లేదు. ఈ రక్తపాతం వెనుక ఉన్న పాలకుల అభివృద్ధి నమూనా ఉంది. ఈ ఏడాదిలోనే వందలాది మంది ఆదివాసుల హత్య వెనుక ఉన్న అభివృద్ధి–విధ్వంసాల సంఘర్షణకు మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాళ కేశవరావు హత్య ఒక పరాకాష్ఠ.

ఒకప్పుడు మావోయిస్టులు, వాళ్ల అభిమానులు మాత్రమే పాలకుల అభివృద్ధి నమూనాను మౌలికంగా విమర్శించేవాళ్లు. ప్రజలే కేంద్రంగా అభివృద్ధి నమూనా ఎట్లా ఉండాలో చెప్పేవాళ్లు. ఈ దేశ ప్రజల అవసరాలే కేంద్రంగా అభివృద్ధి నమూనా ఉండాలని విశ్లేషించేవాళ్లు. ఈ దేశ వనరులు ఇక్కడి ప్రజల కోసమే వినియోగించాలనేవాళ్లు. చిన్న చిన్న సవరణలు ఎన్ని చేసినా అది ప్రజలకు పనికి రాదని, చాలా మందికంటే భిన్నమైన వైఖరిని ప్రకటించేవాళ్లు. విప్లవం ద్వారా మౌలిక మార్పు వస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని అనేవాళ్లు.

ఇదే విమర్శ ఇప్పుడు దేశంలోనే ఒక ప్రధాన విమర్శగా ఎదిగింది. ఈ దేశం పిడికెడు మంది కార్పొరేట్లది కాదని, అసంఖ్యాక ప్రజలదనే అవగాహన అనేక రకాలుగా ప్రచారంలోకి వచ్చింది. కార్పొరేటీకరణ ఉద్ధృతంగానే సాగుతూ ఉండవచ్చు. కానీ దాని మీద విమర్శ పదునెక్కుతోంది. అనేక రూపాల్లో ప్రజా పోరాటాలు, నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దేశభక్తి, జాతీయత అనే భావనలను ఆ పక్క పాలకులు ప్రచారంలో పెట్టే కొద్దీ... ఈ పక్క నుంచి రోజువారీ జీవిత సంక్షోభంలోంచి ప్రజా ప్రయోజనాల చర్చ వేగవంతం అవుతున్నది.

మావోయిస్టు ఉద్యమం ఈ విషయాలను చర్చించడంతో సరిపెట్టుకోలేదు. వాళ్లకు బలం ఉన్న ప్రాంతాల్లో మిలిటెంట్ ఉద్యమాలను నిర్మిస్తోంది. మిగతా ప్రాంతాల్లో దేశవ్యాప్తంగా జరుగుతున్న వేర్వేరు ప్రజా పోరాటాలకు మద్దతు ఇస్తున్నది. వాటిలో తనకు వీలైన పద్ధతిలో పాలుపంచుకుంటోంది. ఈ దేశంలో మౌలిక స్థాయిలో జరగాల్సిన అభివృద్ధి నమూనా చర్చను ప్రజా ఆచరణలోకి మళ్లిస్తున్నది. ఇది ముఖ్యంగా కేంద్ర పాలకులకు ఆగ్రహం తెప్పించింది. పైకి మావోయిస్టు ఉద్యమం గురించి అప్పుడప్పుడు శాంతి భద్రతల సమస్యగా చెప్పినా... ఇది తాను ఎంచుకొన్న అభివృద్ధి నమూనాకు ఆటంకం అని గ్రహించింది. అడవుల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో ఉండే అశేష పీడిత ప్రజానీకానికీ, కార్మికులకూ, నానాటికీ పెరుగుతున్న మధ్య తరగతికీ ప్రస్తుత ప్రభుత్వం నడుపుతున్న అభివృద్ధి నమూనా ప్రమాదకరమనే చైతన్యం పెరగడంలో మావోయిస్టుల పాత్ర ఉన్నది.

కాబట్టి మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిగా నిర్మూలించకపోతే తాను ఎంచుకున్న కార్పొరేట్ అభివృద్ధి నమూనాను అమలు చేయడం సాధ్యం కాదని ప్రభుత్వానికి స్పష్టమైంది. కొన్ని తేడాలతో గత ప్రభుత్వాలది కూడా ఇదే వరుస. వాళ్లు చూసిన దారిని మరింత నిర్దాక్షిణ్యంగా, అమానవీయంగా నేటి ప్రభుత్వం కొనసాగిస్తున్నది. ఈ మేరకు వివిధ ప్రజా పోరాటాలు ఉద్ధృతమయ్యాయి. వ్యవస్థ మౌలిక మార్పులో కీలకమైన ఉత్పత్తి సంబంధాల చర్చను, కొత్త దోపిడీ రూపాల సమస్యను మావోయిస్టు ఉద్యమం కేంద్ర స్థానంలోకి తీసుకొని వచ్చింది. కార్పొరేట్ పెట్టుబడి, దాని వనరుల దాహం, శ్రమశక్తిని కొల్లగొడుతున్న పద్ధతుల మీద విమర్శను ప్రజల కామన్ సెన్స్‌లో భాగం చేసింది. కాబట్టి కార్పొరేట్ ఇండియాను సాధించడానికి మావోయిస్టు రహిత భారత్ ఒక షరతుగా మారిపోయింది.

వ్యక్తిగా నంబాళ కేశవరావు భౌతిక కాయం అరమోడ్పు కన్నులతో ఈ నేలలో కలిసిపోవచ్చు. కానీ ఆయన చూపు, మేధ, హృదయం, చైతన్యం మాత్రం పాలకుల అభివృద్ధి నమూనాను గురి చూస్తూనే ఉంటాయి.

వ్యాసకర్త 'విరసం' కార్యవర్గ సభ్యుడు

సేవా ప్రస్థానం

ఆకాశవాణి కేంద్రం అనంతపురంలో చిన్న ఉద్యోగి నాగేశ్వర రెడ్డి/ నాగేష్/ నాగప్ప ప్రస్థానం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. 30 ఏళ్ల ఉద్యోగంలో ఒక వంద మంది పిల్లలకు విద్యా సేవల కోసం ఆర్థిక సహకారం అందించి, వారు మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా చూశారు. అంతకంటే ఎక్కువగా కరోనా సమయంలో వందలాది మందికి సేవలు అందించి వారి ప్రాణాలు నిలబెట్టడంలో అహరహం శ్రమించారు.

'అనంత తరంగాల చావడి నాగప్ప'గా ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణలో తనదైన ముద్ర వేశారు. క్రమశిక్షణ, నిజాయితీలే ఊపిరిగా బాధ్యతలు నిర్వహించారు. ఆకాశవాణి, దూరదర్శన్ కార్యక్రమ సిబ్బంది పోరాట యోధుడిగా దేశమంతటా ఆయన తెలుసు. మరోవైపు సంస్థ ఆదాయ సముపార్జన లక్ష్యాల సాధనలో కూడా కొత్త ఒరవడితో అందరికీ మార్గదర్శిగా నిలిచారు. వీరి సేవలకు 2017లో 'రైతు నేస్తం' వారు పురస్కారం ఇచ్చారు. మధ్యలో ఒక మూడు సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ టూరిజం శాఖలో అనంతపురం, పుట్టపర్తి జిల్లాల పర్యాటక అధికారిగా పనిచేశారు. ఈ మూడు సంవత్సరాలలో రెండు జిల్లాల కలెక్టర్లు 7 సార్లు ఉత్తమ జిల్లా అధికారిగా సన్మానించారు.

ఇటువంటి అనేక విశేషాలను మననం చేసుకుంటూ వారి మిత్రులు 'మహోన్నత సేవామూర్తి నాగప్ప' పేరుతో తెలుగు, ఆంగ్ల భాషలలో చిరుపుస్తకం తీసుకు వచ్చారు. మే 25న (నేడు) అనంతపురంలో దీన్ని ఆవిష్కరిస్తున్నారు.

– వలేటి గోపీచంద్, విశ్రాంత ఆకాశవాణి అధికారి

పుష్కర కాలం కిందటి మాట. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన చివరి సిరీస్ ఆడుతున్నాడు. ఆ సిరీస్ తొలి టెస్టులో ఒక యువ ఆటగాడు.. 'ఎంఆర్ఎఫ్'స్టిక్కర్ అంటించి ఉన్న బ్యాట్‌తో తొలిసారి క్రీజ్‌లో వచ్చాడు. అప్పటివరకు భారత అభిమానుల దృష్టిలో 'ఎంఆర్ఎఫ్'బ్యాట్ అంటే సచిన్‌దే. ఇప్పుడు మరో యువ ప్లేయర్ బ్యాట్‌పై ఫ్యాన్స్ ఆ బ్రాండ్‌ను చూశారు. ఆ కుర్రాడు సచిన్ స్థాయి ఆటను ప్రదర్శించడంలో సఫలమయ్యాడు. అంతే కాదు.. ఆ తరవాత జరిగిన 'ఎంఆర్ఎఫ్'ఒప్పందం భవిష్యత్తులో వాణిజ్యపరంగా కూడా బ్రాండింగ్ ప్రపంచంలో ఒక సంచలనమైంది. ఆ యువ ఆటగాడే విరాట్ కోహ్లి. నాటితో మొదలుపెట్టి అసంఖ్యాక ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో రెండు ఫార్మాట్‌లనుంచి తప్పుకున్నా.. బ్రాండింగ్ విలువ ఏమాత్రం తగ్గకపోవడం కోహ్లి కింగేనని రుజువుచేస్తోంది.

\- సాక్షి క్రీడా విభాగం

స్పోర్ట్స్ వేర్, ఆన్‌లైన్ షాపింగ్, బ్యాంకింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, సాంప్రదాయ దుస్తులు, ఎడ్యుకేషన్ యాప్, స్నాక్స్, టూరిజం, బెవరేజెస్, న్యూట్రిషన్, ఆటోమొబైల్, భవన నిర్మాణ రంగం... ఇలా విభిన్నమైన రంగాల ఉత్పత్తులకు విరాట్ కోహ్లి ప్రచారం చేస్తూ కనిపిస్తాడు. బ్రాండ్ అంబాసిడర్‌గా ఒప్పందం కుదుర్చుకునే సమయంలో సహజంగానే ఉండే నిబంధనల ప్రకారం ఈ అన్ని ఉత్పత్తులకూ అతను పూర్తి స్థాయిలో ప్రకటనల్లో కనిపించడు. కొన్ని అంతర్జాతీయ బ్రాండ్‌లకు వాణిజ్య ప్రకటనల్లో నటించడంతో పాటు ఆయా ఉత్పత్తులకు సంబంధించి ప్రచార కార్యక్రమాల్లో సంవత్సరానికి కనీసం 2–3 చోట్ల వ్యక్తిగతంగా పాల్గొనాల్సి ఉంటుంది. మరికొన్నింటిలో సదరు ఉత్పత్తికి సంబంధించి ఒక సంక్షిప్త వ్యాఖ్య మాత్రమే జోడించే స్వల్ప ప్రకటనలో అతను కనిపిస్తాడు. మరికొన్నింటికి సదరు బ్రాండింగ్ మాత్రమే కనిపించే జెర్సీ ధరించి లేదా బ్యాట్ చేతపట్టి ఒక ఫొటో ఇస్తాడు. దాన్నే వారు వాడుకోవాలి. ఇలా స్థాయిని బట్టి కోహ్లి బ్రాండింగ్ రేటు ఉంటుంది. మార్కెట్ అంచనా ప్రకారం అతను ప్రస్తుతం రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు తీసుకుంటున్నాడు.



కోహ్లి బ్రాండింగ్ @ రూ.1,900 కోట్లు

టెస్టుల నుంచి తప్పుకున్నా 'కింగ్'కోహ్లీనే

దాదాపు 40 సంస్థలకు ప్రస్తుతం ప్రచారకర్త

బ్రాండ్ బాజా విరాట్

మరి కోహ్లి విలువ పడిపోతుందా?

కోహ్లి టెస్టులనుంచి రిటైర్ కావడం అతడి బ్రాండ్ మార్కెట్ మీద ఏమాత్రం ప్రభావం చూపదని మార్కెటింగ్ వ్యూహకర్త దినేశ్ అరోరా అంటున్నారు. 'బ్రాండింగ్ ప్రపంచంలో కోహ్లి ఒక సామ్రాజ్యం నెలకొల్పాడు. అది అంత తొందరగా కనుమరుగు కాదు. దానికి పలు కారణాలున్నాయి. కోహ్లి తన అత్యుత్తమ ఫార్మాట్ అయిన వన్డేల్లో కనిపిస్తాడు. ఐపీఎల్‌లో ఒప్పందం ప్రకారం ఎలాగూ కనీసం 2027 సీజన్ వరకు అవకాశం ఉంది. పైగా అతను మైదానంలో ఎక్కువగా కనపడకున్నా ఇప్పటికిప్పుడు ఫ్యాన్స్ మరిచిపోయే స్థాయి కాదు అతనిది. సచిన్, ధోని రిటైర్మెంట్ తర్వాత కూడా పలు ప్రకటనల్లో ఇంకా కనిపిస్తున్నారు. వారితో పోలిస్తే కోహ్లి బ్రాండింగ్ విలువ చాలా ఎక్కువ. కార్పొరేట్ సంస్థలు అతనిపై ముందుముందూ నమ్మకాన్ని కొనసాగిస్తాయి'అని ఆయన చెప్పారు.

ఇన్‌స్టగ్రామ్‌లో పోస్టుకు రూ.10 కోట్లు

ఇన్‌స్టగ్రామ్‌లో 27 కోట్ల ఫాలోవర్లు ఉన్న కోహ్లి తన ఒక్కో కమర్షియల్ పోస్టుకు దాదాపు రూ.10 కోట్లు తీసుకుంటాడని సమాచారం. అతను ఒక మాట చెబితే చాలు కోట్లాది మందికి చేరుతుంది కాబట్టి ఆ మొత్తం చెల్లించేందుకు ఎవరూ వెనుకాడరు.

విరాట్ ప్రచారకర్తగా ఉన్న సంస్థలు

ప్యూమా, మింత్రా, హెచ్‌ఎస్‌బీసీ, నాయిస్, మొబైల్ ప్రీమియర్ లీగ్, బ్లూ స్టార్, ఆడి ఇండియా, మాన్యవర్, టూత్‌సి, గ్రేట్ లెర్నింగ్, లక్సర్, హొలిని, వెల్‌మాన్, వివో, డ్యూరోఫ్లెక్స్, అమెరికన్ టూరిస్టర్, ఆవాస్ లివింగ్, ఎంఆర్ఎఫ్, ఎసిలార్, లివ్‌స్పేస్, హెర్బలైఫ్, హీరో మోటార్స్

కోహ్లి భాగస్వామిగా ఉన్నవీ.. సొంత కంపెనీలు

బ్లూ ట్రైబ్, రేజ్ కాఫీ, వన్8, హైపర్‌ఐస్, చిసెల్ ఫిట్‌నెస్, డిజిట్ ఇన్సూరెన్స్, రాంగ్ క్లాతింగ్, గ్యాలక్టస్ ఫన్‌వేర్, ఐఎస్ఎల్ టీమ్ గోవా ఎఫ్‌సీ, నూవా రెస్టారెంట్, స్పోర్ట్స్ కాన్వో, టీమ్ బ్లూ రైసింగ్, వన్8 కమ్యూన్ రెస్టారెంట్స్ చైన్, యూనివర్సల్ స్పోర్ట్స్ బిజినెస్

8 ఏళ్లకు రూ.100 కోట్లు!

విరాట్ కోహ్లి కెరీర్‌లో 2014 నుంచి 2019ని అత్యుత్తమ దశగా చెప్పొచ్చు. వరుస రికార్డుల ప్రదర్శనతో అతని స్థాయి ఎంతో పెరగడంతో పాటు వాణిజ్యపరంగా కూడా అతని విలువ శిఖరాగ్ర స్థాయికి చేరింది. అందుకే మొదటిసారి ఎంఆర్ఎఫ్ చేసుకున్న ఒప్పందంతో పోలిస్తే తర్వాత చాలా పెద్ద మొత్తం ఆఫర్ చేసింది. 2017లో ఎనిమిదేళ్ల కాలానికి రూ.100 కోట్లతో కాంట్రాక్ట్ కుదుర్చుకోవడం అప్పట్లో సంచలనం. మరోవైపు అదే సమయంలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ బ్రాండ్ 'ప్యూమా'తో బ్రాండింగ్ ఒప్పందం అతని కెరీర్‌లో మరో పెద్ద రికార్డు. 'ప్యూమా'కూడా ఎనిమిదేళ్లకు రూ.100 కోట్లతో జత కట్టడం విశేషం. 'ప్యూమా'తో కలిసి భాగస్వామ్యంతో కోహ్లి తన సొంత బ్రాండ్‌ను కూడా సృష్టించుకున్నాడు. తన జెర్సీ నంబర్ 18ని గుర్తుచేసేలా 'వన్ 8'పేరుతో మార్కెట్లోకి వచ్చిన దుస్తులకు మంచి గుర్తింపు లభించింది. ప్రస్తుతం కోహ్లి దాదాపు 30 ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తుండగా.. మరో 10 రకాల వ్యాపారాల్లో అతని భాగస్వామ్యం లేదా అతని పేరు ఉన్నాయి.

స్టార్టప్‌లలో పెట్టుబడులు



ముఖ్యంగా స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టడంలో కోహ్లీ మొదటి నుంచి ఆసక్తి కనబరిచేవాడు. స్పోర్ట్స్ కాన్వో, డిజిట్ ఇన్సూరెన్స్, రేజ్ కాఫీ, వన్8 వంటి స్పోర్ట్స్, ఫ్యాషన్, ఆహారం, పానీయాల విభాగాల్లో ఎన్నో స్టార్టప్‌లలో విరాట్ పెట్టుబడులు పెట్టాడు. ఐపీఎల్ టీమ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 17 సీజన్లలో ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు. కానీ ఆ టీమ్‌కు ఉండే విలువ మొత్తం ఒక్క కోహ్లి వల్లనే వచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. లీగ్ మొదలైన 2008 నుంచి ఇప్పటి వరకు జట్టు మారని ఒకే ఒక్క ఆటగాడిగా నిలిచిన కోహ్లిని చూపిస్తూనే టీమ్ బ్రాండింగ్ సాగుతుంది. ఇందులో తన వ్యక్తిగత ప్రకటనకర్తలను కూడా చేరుస్తూ అతను ఆ టీమ్ వాణిజ్య అంశాలను కూడా శాసిస్తున్నాడు.

బాలీవుడ్ స్టార్లను దాటి...

ప్రఖ్యాత బ్రాండింగ్ వాల్యుయేషన్ సంస్థ 'క్రోల్'ప్రకారం విరాట్ ప్రస్తుత బ్రాండింగ్ విలువ అక్షరాలా రూ.1900 కోట్లు. 2016 నుంచి 2023 వరకు చూస్తే ఎనిమిదేళ్లలో.. రెండు సార్లు మినహా ప్రతీ ఏటా అతను బ్రాండింగ్ విలువ పరంగా భారత సెలబ్రిటీల్లో అగ్రస్థానంలోనే ఉన్నాడు. గతేడాది కూడా బాలీవుడ్ స్టార్లు షారుఖ్ ఖాన్, రణ్‌వీర్ సింగ్‌లకంటే కూడా కోహ్లి విలువే ఎక్కువగా ఉండటం విశేషం. ఇప్పుడు అతను అంతర్జాతీయ క్రికెట్‌లో టి20లు, టెస్టుల నుంచి తప్పుకొన్నాడు. ఇకపై వన్డేలు మాత్రమే ఆడనున్నాడు. టీవీల్లో అతను కనిపించడం కాస్త తగ్గుతుంది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువకుడి బలి



విజయ్‌కుమార్

మర్పల్లి: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఒక యువకుడు బలయ్యాడు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కోటమర్పల్లి గ్రామానికి చెందిన బోయిని విజయ్‌కుమార్ (23) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.3 లక్షల వరకు నష్టపోయాడు. వీటిని తీర్చే మార్గం లేకపోవడంతో.. శనివారం మధ్యాహ్నం కొత్లాపూర్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపారు.

ఈసారీ యూరియా కొరత తప్పదా?

- ఈ వానాకాలంలో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం
- కేంద్రం కేటాయించింది 9.8 ఎల్ఎంటీలే..
- వెంటనే లక్ష మెట్రిక్ టన్నులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్రం
- ఎరువుల వాడకం తగ్గించాలన్న కేంద్రం.. ఆందోళనలో రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. రాష్ట్రంలో కూడా ఆ ప్రభావం కనిపిస్తోంది. వచ్చే నెల మొదటి వారం నుంచే వానాకాలం సాగుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అన్ని ఏర్పా ట్లు చేస్తోంది. వరితోపాటు పత్తి, ఇతర ఉద్యానవన పంట ల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు మరోసారి యూరియా కోసం పడిగాపులు పడే పరి స్థితి వస్తుందేమోననే ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో వానాకాలం పంటలకు ఎరువు బస్తాల కోసం సహకార సంఘం దుకాణాల ముందు రైతులు నిలబడిన దృశ్యాలు పునరావృతం అవుతాయోమే అన్న సందేహం తలెత్తుతోంది.

ఈ సీజన్‌లో వాడకం అధికం

రాష్ట్రంలో ఈ వానాకాలంలో 134 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో 5 ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, కందులు, సోయాబీన్ సాగు విస్తీర్ణమే 131. 80 లక్షల ఎకరాలు. వీటిలో వరి, పత్తి, మొక్కజొన్నకు యూరియా వాడకం ఎక్కువగానే ఉంటుంది. ఈసారి 12 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) యూరియా అవసరమని అధికారులు చెపుతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం కేవలం 9.8 ఎల్ఎంటీ యూరియానే రాష్ట్రానికి కేటాయించింది. గత యాసంగిలో కేటాయించిన 9.8 ఎల్ఎంటీల యూరియానే ఈ సీజన్‌కూ కేటాయించడం గమనార్హం. యాసంగిలో పత్తి, సోయాబీన్ వంటి పంటలు లేకపోయినా 9.8 ఎల్ఎంటీ యూరియా సరిపోని పరిస్థితి. కానీ వానాకాలంలోనూ అంతేస్థాయిలో యూరియా కేటాయించడంతో రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కే పరిస్థితి తప్పకపోవచ్చునని వ్యవసాయ రంగ నిపుణులు చెపుతున్నారు.

ఇప్పటి వరకు 1.72 ఎల్ఎంటీలే...

ఈ వానాకాలంలో కేంద్రం ఏప్రిల్ నుంచి దశల వారీగా యూరియాను రాష్ట్రానికి పంపించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏప్రిల్‌లో 1.70 ఎల్ఎంటీలు, మేలో 1.60 ఎల్ఎంటీల చొప్పున 3.30 ఎల్ఎంటీలు రావలసి ఉంది. అయితే కేంద్రం ఏప్రిల్‌లో 1.20 ఎల్ఎంటీలు, మేలో 0.52 ఎల్ఎంటీలు మాత్రమే ఇచ్చింది. అంటే ఇప్పటివరకు ఇచ్చిన కోటా కేవలం 1.72 ఎల్ఎంటీలే. గత ఏడాది వానాకాలం ప్రారంభానికి ముందే 4 ఎల్ఎంటీల యూరియాను నిల్వ చేసినప్పటికీ, ఇబ్బందులు తప్పలేదు. కానీ ఈసారి కేవలం 1.72 ఎల్ఎంటీలే కేంద్రం పంపడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల ఢిల్లీకి వెళ్లి ఎరువుల మంత్రిత్వ శాఖ కార్యాలయంలో అధికారులను కలిసి తక్షణం లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను విడుదల చేయాలని కోరారు.

ఎరువుల వాడకం తగ్గించండి..: డిమాండ్‌కు అనుగుణంగా యూరియా సరఫరా చేయాలని ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం కోరుతుండగా, రాష్ట్రాలు ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తోంది. అదే సమయంలో సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని కోరుతుంది. వానాకాలం వరి, మొక్కజొన్న వంటి పంటలకు యూరియా కీలకమని, తొలిదశలో సరిపడా యూరియా లేకపోతే మొదటి దశ నుంచే పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ముందుగానే ప్రణాళిక అవసరమని అంటున్నారు.

వానాకాలంలో పంటల ప్రణాళిక ఇలా (లక్షల ఎకరాల్లో)...	
వరి:	66.80
పత్తి:	50
మొక్కజొన్న:	6
కందులు:	5.50
సోయాబీన్:	4.5
మిగతా పంటలు:	2.2
మొత్తం సాగు విస్తీర్ణం: సుమారు	134

నువ్వులేక.. నేనుండలేను

- ప్రమాదంలో భార్య మృతి
- మనస్తాపంతో యాసిడ్ తాగి భర్త మృతి



సునీల్, జ్యోతి

బిచ్కుంద(జుక్కల్): రోడ్డు ప్రమాదంలో భార్య మరణాన్ని తట్టుకోలేకపోయిన ఒక భర్త తీవ్ర మనస్తాపంతో యాసిడ్ తాగి మరణించాడు. వివరాలివి. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన సునీల్‌కు, పెద్దతడ్గూర్ గ్రామానికి చెందిన జ్యోతితో గతేడాది పెళ్లి జరిగింది. ప్రస్తుతం జ్యోతి ఆరు నెలల గర్భవతి. శుక్రవారం భార్యాభర్తలు కలిసి బైక్‌పై వెళ్తుండగా.. బిచ్కుంద శివారులోని మైసమ్మ గుడి వద్ద అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో జ్యోతి (22) తలకు తీవ్రగాయాలై మృతి చెందింది. మృతదేహాన్ని అంబులెన్స్‌లో బిచ్కుందలోని ఇంటికి తీసుకొచ్చారు. శవాన్ని దించిన కొద్దిసేపటికే.. సునీల్ (26) తీవ్ర మనస్తాపంతో యాసిడ్ తాగాడు. బంధువులు అదే అంబులెన్స్‌లో సునీల్‌ను ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సునీల్ మృతి చెందాడు. భార్యాభర్తలు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, తమకు సంతానం కలగబోతోందని సంతోషపడేవారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

గేదెలను నది దాటిస్తూ వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గేదెలను నది దాటించి ఒడ్డుకు చేర్చే క్రమంలో ఒక వ్యక్తి.. భార్య, కొడుకులు చూస్తుండగానే నీట మునిగి మృతి చెందాడు. వివరాలివి. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్ గ్రామానికి చెందిన ఎనగండ్ల మొగులయ్య (47) తనకున్న ఆరు గేదెలను మేపేందుకు శుక్రవారం గ్రామ శివారుకు వెళ్లాడు. కాగా గేదెలు మేతమేస్తూ మంజీర నది దాటి అవతలి వైపు వెళ్లాయి. విషయం తెలిసి మొగులయ్య భార్య లక్ష్మి, కుమారులు రాజు, రాకేష్ వాగు వద్దకు చేరుకున్నారు. కాగా గేదెలను వాగు దాటించే క్రమంలో మొగులయ్య.. భార్య, కుమారుల కళ్ల ముందే నీటమునిగి మృతి చెందాడు. శనివారం నది నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట ఎస్ఐ మల్లారెడ్డి తెలిపారు.

ఐడీబీఐ మోసం కేసులో మరో నిందితుని అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి ఐడీబీఐ బ్యాంకు మోసం కేసులో మరో నిందితుడిని తెలంగాణ సీఐడీ బృందం శనివారం అరెస్ట్ చేసింది. కేసులో ఎ–5గా ఉన్న బూక్యా సురేశ్ (ప్రస్తుతం ముంబై సీబీడీ బేలాపూర్‌లో ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు)ను అరెస్టు చేసినట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు మాజీ మేనేజర్, బ్యాంకు ఏజెంట్ (బిజినెస్ కరస్పాండెంట్), వారి సహచరులు, రుణగ్రహీతలు కుమ్మక్కై, నకిలీ రెవెన్యూ పత్రాలను సమర్పించి సుమారు రూ.2.86 కోట్ల రుణాల పేరిట మోసగించారు. కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు తాజాగా ఐదో నిందితుడిని అరెస్టు చేశారు.

సైబర్ ముఠాలోని ఇద్దరి అరెస్ట్

- ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లో అరెస్టు చేసిన టీజీసీఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులైన యువతకు విదేశాల్లో ఉద్యోగాల పేరిట వల వేసి వారిని కంబోడియా, మయన్మార్, లావోస్ దేశాల్లోని సైబర్ ముఠాలకు బానిసలుగా అమ్మేస్తున్న ముఠాలోని ఇద్దరు కీలక నిందితులను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేశారు. ఇద్దరిని వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా ఇటీవల అరెస్టు చేసినట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కంబోడియా, మయన్మార్, లావోస్‌లోని అక్రమ సైబర్ ఫ్రాడ్ కాల్ సెంటర్ల నుంచి బాధితులై తిరిగి భారత్‌కు చేరుకున్న వారి ఫిర్యాదుల మేరకు తెలంగాణలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 23 కేసులు నమోదయ్యాయి. జీడిమెట్లకు చెందిన కోలనాటి నాగశివ అలియాస్ జేమ్స్ నిజామాబాద్‌లోని సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మూడు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కేసుల నమోదు తర్వాత అతడు పరారీలో ఉన్నాడు. అతడిపై టీజీసీఎస్‌బీ లుక్ ఔట్‌సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 19న లావోస్ నుంచి కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకున్న అతడిని పోలీసులు విమానాశ్రయంలో అడ్డుకున్నారు. అక్కడి అధికారుల సమాచారంతో నిజామాబాద్ సీసీపీఎస్ ఇన్‌స్పెక్టర్ బృందం అక్కడికి వెళ్లి అతడిని అరెస్టు చేసింది. రెండో నిందితుడు గుజరాత్‌కు చెందిన హితేశ్ అర్జున సొమ్య (29) సైతం తెలంగాణలోని సైబర్ స్లేవరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. హితేష్‌ను మయన్మార్ నుంచి కొంతమంది సైబర్ స్లేవరీ బాధితులతో కలిసి కేంద్ర హోం శాఖ భారత్‌కు తీసుకొచ్చింది. బాధితులను తెచ్చేందుకు ఢిల్లీకి వెళ్లిన టీజీసీఎస్‌బీ బృందానికి హితేశ్ కంటపడ్డాడు. అయితే హితేశ్ కరీంనగర్‌లోని మానకొండూరు పోలీస్ స్టేషన్‌లో, నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు కావడంతో హితేష్‌ను గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు.

సైబర్ మోసం కేసులో నలుగురి అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: డేటా తస్కరణ సైబర్ మోసంకేసులో తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు నలుగురిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన టీజీసీఎస్‌బీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ (హెడ్‌క్వార్టర్స్) సిబ్బంది సికింద్రాబాద్ లాలాపేట్‌కు చెందిన కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ పట్టి దుర్గా ప్రసాద్, వెంగళరావు నగర్‌కు చెందిన ఆటో కాడ్ డిజైనర్ జలేం చంద్రశేఖర్ ప్రసాద్, ఉప్పల్‌కు చెందిన బిల్లింగ్ ఇంజనీర్ పసల ప్రవీణ్ కుమార్, ఎర్రగడ్డకు చెందిన పెరవల్లి అనిల్ కుమార్‌ను అరెస్టు చేసింది. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శనివారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం... క్రాఫ్ట్‌మెన్ ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే కంపెనీలో గతంలో పనిచేసిన ఒక ఉద్యోగితోపాటు ప్రస్తుతం అందులోనే పనిచేస్తున్న మరో ఇద్దరు ఉద్యోగులు, మరో వ్యక్తి కలిసి కుట్ర చేసి కంపెనీ సమాచారాన్ని కొట్టేసి, దాని ఆధారంగా మరో కంపెనీ స్థాపించినట్టు అందిన ఫిర్యాదు మేరకు టీజీసీఎస్‌బీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. తగిన ఆధారాలు లభించడంతో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్, నాలుగు మొబైల్ ఫోన్లు, ఐదు సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

రిజర్వాయర్ మాకొద్దు!

- రోడ్డెక్కిన నిర్వాసితులు



ధర్నాకు దిగిన రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

బల్మూర్: భూములు కోల్పోయి రోడ్డున పడేస్తున్న ఉమామహేశ్వర రిజర్వాయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్‌లో శనివారం అధికారులు భూసేకరణ అవగాహన సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో రైతు పోరాట సమితి నాయకులు సీతారాం రెడ్డి, తిరుపతయ్య, శివశంకర్, గంట కృష్ణయ్యతో పాటు మరో 12 మంది రైతులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన అంబగిరి, అనంతవరం, బల్మూర్, మైలారం గ్రామాల రైతులు బల్మూర్‌లో పోలీస్‌స్టేషన్ ముట్టడికి ప్రయత్నించి.. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. వారిని వదిలే వరకు తాము కదిలే ప్రసక్తే లేదని భీష్మించుకుని కూర్చోవడంతో భారీగా పోలీసులను మోహరించారు. గ్రామసభకు హాజరైన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు రైతులు విన్నవించడంతో.. పోలీసులు అరెస్టు చేసిన వారిని గ్రామానికి తీసుకొచ్చి వదిలేయడంతో వారు శాంతించారు.


రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి మంచి స్పందన

- వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ అల్దాస్ జానయ్య తెలిపారు. మూడు వారాలుగా సాగుతున్న ఈ కార్యక్రమంపై శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 5వ తేదీన వికారాబాద్ జిల్లా ధరూర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఇప్పటి వరకు 600 గ్రామాల్లో జరిగిందని, సుమారు 37 వేల మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు ముఖాముఖిగా మాట్లాడినట్లు వివరించారు. ప్రభుత్వం రైతులకోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై రైతాంగంలో ఎటువంటి అసంతృప్తి లేదని జానయ్య స్పష్టం చేశారు. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాల కారణంగా రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోందని తెలిపారు. అలాగే ఇంకా కొన్ని అంశాలకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఇవ్వవలసిందిగా రైతులు కోరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు ను తగ్గించడం, అవసరం మేరకే రసాయనాలను వాడి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడులను పాటించి సుస్థిరాదాయాన్ని పొందడం, చెట్లను నాటి పర్యావరణాన్ని రక్షించడం వంటి అంశాలపై రైతాంగానికి అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

మార్కులు తక్కువొచ్చాయని..

- విద్యార్థిని ఆత్మహత్య



స్నేహిత

ముస్తాబాద్(సిరిసిల్ల): పాలిసెట్‌లో ర్యాంక్ రాలేదని మనస్తాపం చెందిన ఒక విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎస్ఐ గణేశ్ తెలిపిన వివరాలివి. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన గూడ స్నేహిత (16) పదో తరగతి ఉత్తీర్ణురాలైంది. శనివారం విడుదలైన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ (పాలిసెట్) ఫలితాల్లో ర్యాంక్ రాలేదని మనోవేదనకు గురైంది. శనివారం ఉదయం స్నేహిత తల్లిదండ్రులు.. బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి వెళ్లారు. తమ్ముడు, తాతతో కలిసి ఇంట్లోనే ఉన్న స్నేహిత.. సాయంత్రం గదిలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుంది. గమనించిన తాత, తమ్ముడు గది తలుపులు బద్దలుకొట్టి చూడగా.. అప్పటికే మృతి చెందింది. మృతురాలి తల్లి స్రవంతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కాన్స్ ఫిలిం ఫెస్టివల్‌పై కుట్ర!

దక్షిణ ఫ్రాన్స్‌లో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

- సబ్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం
- ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టినట్లు అనుమానాలు

పారిస్: ఫ్రాన్స్‌లో ప్రతిష్టాత్మక కాన్స్ ఫిలిం ఫెస్టివల్ జరుగుతున్న సమయంలోనే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం నిర్వాహకులను ఆందోళనకు గురిచేసింది. దక్షిణ ఫ్రాన్స్‌లోని అల్పిస్-మారిటైమ్స్ ప్రాంతంలో శనివారం ఉదయం 1.60 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఇదే ప్రాంతంలో కాన్స్ ఫిలిం ఫెస్టివల్ జరుగుతోంది. కరెంటు లేకపోవడంతో కొన్ని కార్యక్రమాలు రద్దు చేయాల్సి వచ్చింది. అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు వారి ప్రయత్నాలు ఫలించడంతో ఫిలిం ఫెస్టివల్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం ఫిలిం ఫెస్టివల్ ముగింపు వేడుకలు యథాతథంగా జరిగాయి. కరెంటు సరఫరా హఠాత్తుగా ఆగిపోవడానికి కారణం ఏమిటన్న దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం రాత్రి కాన్స్ సమీపంలోని ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దీనివల్ల విద్యుత్ గ్రిడ్‌లో సమస్యలు తలెత్తాయి. హై-ఓల్టేజీ కరెంటు లైన్ ఒకటి కూలిపోయిందని విద్యుత్ శాఖ సిబ్బంది చెప్పారు. దీనివల్ల అల్పిస్-మారిటైమ్స్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. అయితే, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరగడం వెనుక కుట్ర ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. కాన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు అంతరాయం కలిగించాలన్న ఉద్దేశంతోనే ఈ కుట్ర జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

రాహుల్ గాంధీపై నాన్ బెయిలబుల్ వారెంట్

చైబాసా: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి పరువు నష్టం కేసులో జార్ఖండ్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జూన్ 26వ తేదీన స్వయంగా న్యాయస్థానంలో హాజరు కావాలని ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ రాహుల్ లాయర్ చేసిన వినతిని తోసిపుచ్చింది. 2018లో కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో అప్పటి బీజేపీ చీఫ్ అమిత్ షాకు వ్యతిరేకంగా రాహుల్..'హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సైతం బీజేపీ అధ్యక్షుడవుతారు'అంటూ వ్యాఖ్యానించారు. దీంతో రాహుల్ గాంధీ బీజేపీ కార్యకర్తలందరి మనోభావాలను దెబ్బతీశారంటూ ఆ పార్టీ నేత ప్రతాప్ కటియార్ చైబాసాలోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. జార్ఖండ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఎంపీ/ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానానికి ఈ పిటిషన్ బదిలీ అయ్యింది. విచారణ చేపట్టిన మేజిస్ట్రేట్ రాహుల్ గాంధీకి పలుమార్లు సమన్లు పంపారు. వీటిని ఆయన పట్టించుకోకపోవడంతో బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. దీంతో, రాహుల్ స్టే కోసం జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను 2024 మార్చిలో న్యాయస్థానం కొట్టివేసింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ వేసిన పిటిషన్‌ను సైతం చైబాసా కోర్టు తిరస్కరించింది. తాజాగా, మరింత కఠినమైన నాన్ బెయిలబుల్ వారెంట్లు పంపింది.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

లతేహార్: జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు లతేహార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇచాబర్ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా తారసపడిన ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో చనిపోయిన వారిని జార్ఖండ్ జన ముక్తి పరిషత్(జేజేఎంపీ) చీఫ్ పప్పూ లోహ్రా, ఈ విభాగం సబ్ జోనల్ కమాండర్ ప్రభాత్ గంఝుగా గుర్తించారు. లోహ్రాపై రూ.10 లక్షల రివార్డు, ప్రభాత్‌పై రూ.5 లక్షల రివార్డు ఉంది ఎదురుకాల్పుల్లో గాయపడిన ఇదే గ్రూపు సభ్యుడు ఆశిష్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు పలాము డీఐజీ వైఎస్ రమేశ్ చెప్పారు. లోహ్రాపై హత్య, బలవంతపు వసూళ్లు, దాడులు తదితర నేరాలకు సంబంధించిన 98 కేసులుండగా, గంఝుపై 15 కేసులున్నాయన్నారు.

427 మంది రోహింగ్యాల జల సమాధి

బ్యాంకాక్: మయన్మార్ ముస్లిం మైనారిటీ వర్గం రోహింగ్యాలు ప్రయాణిస్తున్న పడవలు మునిగి 427 మంది మృతి చెందినట్లు ఐక్యరాజ్యసమితి శరణార్థి విభాగం (యూఎన్‌హెచ్‌సీఆర్) తెలిపింది. ఈ నెల 9, 10వ తేదీల్లో మయన్మార్ తీరానికి సమీపంలో ఈ దారుణ విషాదం చోటుచేసుకుందని పేర్కొంది. పడవల మునకకు కారణాలు, కచ్చితంగా ఎందరు జల సమాధి అయ్యారనే వివరాలను తెలుసుకునేందుకు కృషి కొనసాగుతోందని వివరించింది. ఈ నెల 9వ తేదీన పడవ మునిగి 267 మంది ప్రాణాలు కోల్పోగా అందులోని కేవలం 66 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని, 10వతేదీన మరో పడవ మునగ్గా 247 మంది రోహింగ్యాలు చనిపోగా, 21 మంది మాత్రమే ప్రాణాలు దక్కించుకున్నారని యూఎన్‌హెచ్‌సీఆర్ వివరించింది. సజీవులైన వారు బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్‌లో ఏర్పాటు చేసిన శరణార్థి శిబిరానికి, మయన్మార్‌లోని రఖైన్ ప్రాంతానికి తిరిగి వెళ్లిపోయారని పేర్కొంది.




ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో శనివారం ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి పదో సమావేశంలో పాల్గొన్న పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు

మనమంతా టీమిండియా

కేంద్ర రాష్ట్రాలు కలసికట్టుగా సాగాలి: మోదీ

- అప్పుడు ఏ లక్ష్యమూ అసాధ్యం కాదు
- నీతి ఆయోగ్ భేటీలో సీఎంలకు పిలుపు
- రాష్ట్రానికో ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం
- ప్రగతి వేగం పెంచుదామన్న ప్రధాని



నీతి ఆయోగ్ భేటీలో మోదీ

న్యూఢిల్లీ: కేంద్రం, రాష్ట్రాలను 'టీమిండియా'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. అవి కలసికట్టుగా పని చేస్తే ఏ అభివృద్ధి లక్ష్యమూ అసాధ్యం కాబోదని ధీమా వెలిబుచ్చారు. శనివారం ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి 10వ భేటీకి ఆయన సారథ్యం వహించారు. వికసిత భారత్–2047 థీమ్‌తో భేటీ సాగింది. 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ప్రతినిధులు భేటీలో పాల్గొన్నట్టు నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం వెల్లడించారు. పశ్చిమబెంగాల్, బిహార్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలు పాల్గొనలేదని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ముఖ్యమంత్రులతో మోదీ సమావేశమవడం ఇదే తొలిసారి. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం ఏర్పాటయ్యేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు. పహల్గాం ఉగ్ర దాడి లక్ష్యాల్లో జమ్మూకశ్మీర్‌లో పర్యాటకాన్ని దెబ్బ తీయడం కూడా ఉన్న నేపథ్యంలో ఈ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. ''ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటీ, ప్రతి నగరం, ప్రతి రాష్ట్రమూ ప్రగతి సాధించడమే మన లక్ష్యం కావాలి. అప్పుడు దేశమంతా దానంతటదే వృద్ధి చెందుతుంది. గడువు లోపలే వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఆ దిశగా అభివృద్ధి పనుల వేగం మరింత పెంచుదాం. 140 కోట్ల పైచిలుకు భారతీయుల ఆకాంక్షలను నెరవేరుద్దాం'' అని రాష్ట్రాలకు ప్రధాని పిలుపునిచ్చారు. భారత్‌లో పట్టణీకరణ శరవేగంగా సాగుతోందని గుర్తు చేశారు. కనుక నగరాలను సుస్థిరాభివృద్ధి, ఇన్నోవేషన్ల కలబోతగా, భవిష్యత్ అవసరాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ''మహిళా శక్తికి మరింత ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే మనమంతా ఆశించిన విధంగా దేశప్రగతి సాధ్యపడుతుంది. శ్రామిక శక్తిలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలి. అందుకు అనుగుణంగా చట్టాలు, విధానాలను రూపొందించుకోవాలి'' అని మోదీ చెప్పారు.

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం: సీఎంలు

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని తమిళనాడు, పంజాబ్ ముఖ్యమంత్రులు ఎం.కె.స్టాలిన్, భగవంత్ మాన్ డిమాండ్ చేశారు. ''రాష్ట్రాలకు 41 శాతం వాటా ఇస్తామని మాటిచ్చారు. కానీ 33.16 శాతమే ఇస్తున్నారు. తమిళనాడు దేశంలోకెల్లా అత్యంత పట్టణీకరణ చెందిన రాష్ట్రం. అమృత్ 2.0 పథకం కింద రాష్ట్రానికి ప్రత్యేక పట్టణీకరణ మిషన్‌ను మంజూరు చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నాం. నమామి గంగ తరహాలో తమిళనాడులోని కావేరీ, వైగై తదితర నదుల ప్రక్షాళనకు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయాలి'' అని స్టాలిన్ కోరారు. ఆ ప్రాజెక్టులకు పేర్లను ఇంగ్లిష్‌లోనే పెట్టాలన్నారు. పంజాబ్‌లో పాకిస్తాన్‌ను ఆనుకుని ఉండే ఆరు సరిహద్దు జిల్లాలకు ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీ అందించాలని కేంద్రానికి మాన్ విజ్ఞప్తి చేశారు. సరిహద్దు ప్రాంతాల రైతులకు ఇస్తున్న ఎకరాకు రూ.10 వేల పరిహారాన్ని రూ.30 వేలకు పెంచాలన్నారు. సిక్కిం, పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలను కలుపుతూ ప్రపంచస్థాయి జాతీయ రహదారి నిర్మించాల్సిన అవసరం చాలా ఉందని సిక్కిం సీఎం ప్రేంసింగ్ తమాంగ్ అన్నారు.

విధాన అడ్డంకులు తొలగించాలన్నారు: సీఈఓ

భేటీ వివరాలను నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం మీడియాకు వెల్లడించారు. ''వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై మరింతగా దృష్టి సారించాలని రాష్ట్రాలకు ప్రధాని సూచించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించాలని, తద్వారా ఇతోధికంగా ఉపాధి అవకాశాలను సృష్టించాలని, అందుకోసం విధానపరమైన అడ్డంకులను తొలగించుకోవాలని హితవు పలికారు'' అని చెప్పారు. భేటీలో పాల్గొన్న సీఎంలు, నేతలు ఆపరేషన్ సిందూర్‌ను ముక్తకంఠంతో సమర్థించారన్నారు.

జైరాంతో కాంగ్రెస్‌కే చేటు: బీజేపీ

నీతి ఆయోగ్ ఓ 'అయోగ్య' (అసమర్థ) సంస్థ అన్న కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్‌కే చేటు చేసే వివాదాలను సృష్టించడం ఆయన నైజమని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్‌ను జైరాం భూస్థాపితం చేయడం ఖాయమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ జోస్యం చెప్పారు.

నవ్వుల్ పువ్వుల్

ఆయోగ్ భేటీలో సరదా సన్నివేశాలు

ప్రధాని, ముఖ్యమంత్రుల నడుమ పలు సరదా సన్నివేశాలకు నీతి ఆయోగ్ భేటీ వేదికైంది. సమావేశం ముగిశాక రేవంత్‌రెడ్డి, స్టాలిన్ తదితరులతో మోదీ సరదా సంభాషణలు జరిపారు. నవ్వుతూ, వారిని నవ్విస్తూ కన్పించారు. భగవంత్ మాన్ (పంజాబ్), హేమంత్ సోరెన్ (జార్ఖండ్), కొన్రాడ్ సంగ్మా (నాగాలాండ్) తదితరులు మోదీతో చాలాసేపటిదాకా కరచాలనం చేస్తూ కన్పించారు. వారితో ప్రధాని సరదాగా మాట్లాడారు. ఈ సందర్భంగా నేతలంతా తేనీరు సేవిస్తూ ఉల్లాసంగా గడిపారు.

భారత్‌లో కొత్త కోవిడ్ వేరియంట్లు

ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7గా గుర్తింపు

న్యూఢిల్లీ/థానే/తిరువనంతపురం: చాలా నెలలు స్తబ్దుగా ఉండిపోయిన కోవిడ్ వైరస్ మళ్లీ నెమ్మదిగా భారత్‌లోని పట్టణ ప్రాంతాల్లో వ్యాప్తిచెందుతోంది. అయితే ఈసారి భారత్‌లో రెండు కొత్త కోవిడ్ వేరియంట్లు వెలుగు చూశాయి. ఒమిక్రాన్ బీఏ.2.86లో ఉప వేరియంట్ అయిన జేఎన్.1 వేరియంట్ సాధారణంగా భారత్‌లో వ్యాప్తి చెందుతుండగా ఈసారి దాని ఉపజాతులైన ఎన్‌బీ.1.8.1 వేరియంట్, ఎల్ఎఫ్.7 వేరియంట్‌లను భారత్‌లో తొలిసారిగా గుర్తించారు. ప్రస్తుతానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ రెండు వేరియంట్లను కేవలం 'పరిశీలన దశ'వేరియంట్లుగానే గుర్తిస్తోంది. ఆందోళనకర స్థాయి వేరియంట్లుగా భావించట్లేదు. తమిళనాడులో గత నెలలో ఎన్‌బీ.1.8.1 వేరియంట్‌ను, గుజరాత్‌లో ఇటీవల ఎల్ఎఫ్.7 వేరియంట్‌ను గుర్తించామని సార్స్-కోవ్-2 జన్యుక్రమాలను గుర్తించి, విశ్లేషించే ఇన్సాకాగ్ సంస్థ శనివారం ప్రకటించింది. ఇప్పటికే ఈ రెండు వేరియంట్లు చైనా సహా ఆసియాలోని పలు దేశాల్లో అధికంగా కోవిడ్ కేసుల పెరుగుదలకు కారణమవడం తెల్సిందే. దీంతో కోవిడ్ కేసులపై ప్రజల్లో కాస్త కలవరం మొదలైంది. కానీ భయపడాల్సిన పనిలేదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. ఈ రెండు వేరియంట్లు సోకిన రోగులు కేవలం నాలుగు రోజుల్లో కోలుకుంటారని వైద్యులు తెలిపారు. జ్వరం, జలుబు, గొంతు నొప్పి, తలనొప్పి, నీరసం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎన్‌బీ.1.8.1లో స్పైక్ ప్రోటీన్‌పరంగా భిన్నత్వాన్ని చూపే ఏ435ఎస్, వీ445 హెచ్, టీ478ఐల కారణంగా సంక్రమణ రేటు, వ్యాధి నిరోధక శక్తిని ఏమార్చే స్థాయి పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.

కేరళ, ఢిల్లీ, మహారాష్ట్రలో అధిక కేసులు

ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా ఢిల్లీలో గత మూడేళ్లలో ఎన్నడూలేని విధంగా 23 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలోనూ కొత్త కేసుల సంఖ్య పెరుగుతోంది. శనివారం థానే నగరంలో ఎనిమిది మందికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కల్వా ప్రాంతంలో తీవ్రమైన మధుమేహంతో బాధపడుతున్న 21 ఏళ్ల యువకుడు కోవిడ్‌తో కన్నుమూశారని థానే మున్సిపల్ కార్పొరేషన్ తెలిపింది. ఢిల్లీలో ఇటీవలి నెలల్లో ఎప్పుడూ లేనంతగా 23 కేసులు వెలుగుచూడటంతో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లు, యాంటీబయోటిక్స్, ఎయిర్ ప్రెషర్ మెషీన్లు, వ్యాక్సిన్లు, వెంటిలేటర్లు, ఐసోలేషన్ పడకలు తదితరాలపై సమీక్ష జరిపింది. ప్రస్తుతం కేరళలో 273, కర్ణాటకలో 35, ముంబైలో 95 కోవిడ్ కేసులున్నాయి.

పారిపోండ్రోయ్..!!

- భారత సైన్యం సత్తాకు జడిసి, పారిపోయిన పాక్ కమాండర్
- మీరూ పారిపోండంటూ తన బ్రిగేడ్ జవాన్లకు ఉచిత సలహా ఇచ్చిన వైనం
- తాజాగా బహిర్గతమైన పాక్ సైన్యాధికారి పలాయనపర్వం

ఇస్లామాబాద్: శత్రువు ఎదురొస్తే అతని ప్రాణం తీయడమో లేదంటే తన ప్రాణాలు పోయేదాకా పోరాడటమే వీరుని లక్షణం. పాకిస్తాన్ సైన్యాధికారికి ఇవేం లేనట్లు తాజాగా ఉదంతంతో స్పష్టమైంది. ఆపరేషన్ సిందూర్ వేళ సైనిక చర్యలో భాగంగా పాకిస్తాన్ సైనిక స్థావరంపై భారత్ దాడులు చేస్తుంటే దీటుగా స్పందించాల్సిందిపోయి పారిపోయిన పాక్ బ్రిగేడ్ కమాండర్ పలాయనపర్వం తాజాగా వెలుగులోకి వచ్చింది. భారత క్షిపణులు పాక్ సైనికుల వెన్నులో వణుకు పుట్టించిందన్న వార్త వాస్తవమని తాజా ఘటనతో నిరూపితమైంది. నాయకుడై ముందుండి నడిపించాల్సిందిపోయి తన కింద పనిచేసే జవాన్లకు పిరికిమందు నూరిపోసిన బ్రిగేడ్ కమాండర్ వివరాలు అక్కడి ఒక జూనియర్ ఆఫీసర్ చేసిన 'రేడియో సిగ్నల్' డీకోడ్ ద్వారా వెల్లడయ్యాయి.

అంతా సర్దుకున్నాక తాపీగా వస్తా

జూనియర్ అధికారి ఇతర అధికారులకు 'రేడియో సిగ్నళ్ల ద్వారా పంపిన సందేశాలను భారత సైన్యం విజయవంతంగా డీకోడ్ చేయగా అందులో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ వద్ద పాక్ ఆర్మీలోని 75వ ఇన్‌ఫ్యాంట్రీ బ్రిగేడ్ స్థావరం ఉంది. దానికి ఒక కమాండర్ నేతృత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌పై భారత్ సైనిక చర్య మొదలెట్టింది. ఈ 75వ బ్రిగేడ్ స్థావరం మీదా భారత్ దాడులు జరిపింది. వెంటనే భయంతో వణికిపోయిన కమాండర్ అక్కడి నుంచి ఉడాయించాడు. పత్తాలేకుండా పోయిన కమాండర్ గురించి అక్కడి జూనియర్ అధికారి ఆరాతీశాడు. కమాండర్ యుద్ధక్షేత్రంలో మాయమై మసీదులో తేలాడు. అక్కడ నమాజ్ చేసుకుంటూ తలదాచుకుంటున్నట్లు తెల్సింది. వెంటనే ఆర్మీబేస్‌కు రావాలని జూనియర్ అధికారి కోరగా.. ''నేనిప్పుడు రాను. భారత దాడి ఆగిపోయాక, పరిస్థితి అంతా సద్దుమణిగాక వస్తా. మీరు కూడా అక్కడ ఉండకండి. ప్రాణాలు కాపాడుకునేందుకు పారిపోండి. ఉద్రిక్తతలు తగ్గాక ఆర్మీ బేస్ కార్యాలయాన్ని తాపీగా తెరుద్దాం ''అని కరాఖండిగా చెప్పేశాడు. ఇది విన్న జూనియర్ ఆఫీసర్ హుతాశుడై సంబంధిత సమాచారాన్ని ఇతర అధికారులకు చేరవేశాడు. ఇతర అధికారులతో చెబుతున్న రేడియో చాటింగ్ వివరాలను భారత సైన్యం డీకోడ్ చేసింది.

సామ్‌సంగ్‌కు హెచ్చరికలు

- అమెరికాలోనే ఉత్పత్తి చేయాలని ట్రంప్ సూచన
- లేకపోతే 25 శాతం టారిఫ్ తప్పదని స్పష్టీకరణ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ ప్రఖ్యాత తయారీ సంస్థలను టారిఫ్‌ల పేరిట బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఆయా కంపెనీలు అమెరికాలోనే వస్తువులు, సరుకులు ఉత్పత్తి చేయాలని, లేకపోతే సుంకాల బాదుడుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఆయన యాపిల్ కంపెనీకి ఇప్పటికే హెచ్చరికలుజారీ చేశారు. దక్షిణ కొరియాకు చెందిన సామ్‌సంగ్ సంస్థకు సైతం ఇప్పుడు అదే పరిస్థితి ఎదురయ్యింది. అమెరికాలో ఉత్పత్తి చేయకపోతే 25 శాతం టారిఫ్ విధిస్తామని సామ్‌సంగ్‌కు ట్రంప్ తేల్చిచెప్పారు. ఆయన తాజాగా వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. అణు విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచడానికి ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేశారు. అమెరికాలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు విక్రయించుకొనే ఏ సంస్థ అయినా సరే వాటిని ఇక్కడే తయారు చేయాలని, లేనిపక్షంలో సుంకాలు చెల్లించడానికి సిద్ధంగా ఉండాలని స్పష్టంచేశారు. తయారీ ప్లాంట్లను అమెరికాలో నెలకొల్పితే ఎలాంటి టారిఫ్‌లు ఉండవని చెప్పారు. మరెక్కడో తయారు చేసి, ఇక్కడ విక్రయించుకొని, సొమ్ము చేసుకుంటామంటే అది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఐఫోన్లను అమెరికాలో ఉత్పత్తి చేయకపోతే యాపిల్ కంపెనీపై 25 శాతం టారిఫ్‌లు విధించడం తథ్యమని ట్రంప్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. యాపిల్ కంపెనీకి సంబంధించి 90 శాతం ఫోన్లు చైనాలోనే తయారవుతున్నాయి. అక్కడి ప్లాంట్లను భారత్‌కు తరలించేందుకు యాపిల్ సిద్ధమవుతోంది. ఇంతలోనే ట్రంప్ కన్నెర్ర చేశారు. మరోవైపు సామ్‌సంగ్‌కు చైనాలో తయారీ ప్లాంట్లు లేవు. చివరి ప్లాంట్ 2019లో మూతపడింది. సామ్‌సంగ్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు ఎక్కువగా భారత్, దక్షిణ కొరియా, వియత్నాం, బ్రెజిల్‌లోనే తయారవుతున్నాయి.

భారత్‌లోనే తయారు చేస్తారా? మీ ఇష్టం..

యాపిల్ కంపెనీకి ట్రంప్ మరోసారి అల్టిమేటం జారీ చేశారు. ''ఐఫోన్ల తయారీ ప్లాంట్లను చైనా నుంచి భారత్‌కు తరలించుకోవాలంటే తరలించుకోండి. మేము వద్దనడం లేదు. కానీ, ఐఫోన్లను అమెరికాలో విక్రయించుకోవాలంటే మాత్రం సుంకాలు చెల్లించాల్సిందే. సుంకాలు లేకుండా మీరు ఐఫోన్లు ఇక్కడ అమ్ముకోలేరు''అని పేర్కొన్నారు.

విమానాల కిటికీలు మూయండి!

- పశ్చిమ సరిహద్దు వెంబడి ఉన్న అన్ని డిఫెన్స్ ఎయిర్‌పోర్టుల్లో అమలుచేయండి
- ప్రైవేట్ విమానయాన సంస్థలను ఆదేశించిన డీజీసీఏ

న్యూఢిల్లీ: కొన్నిసార్లు తప్పనిసరి పరిస్థితుల్లో రక్షణశాఖ పరిధిలోని విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించే ప్రైవేట్ విమానాల, చార్టర్, ప్రైవేట్ జెట్ నిర్వహణ సంస్థలు కచ్చితంగా తమ విమానాల కిటికీలను మూసే ఉంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) శనివారం ఒక ప్రకటన విడుదలచేసింది. డిఫెన్స్ స్థావరాలు, విమానాశ్రయాల పూర్తి వివరాలు బహిర్గతం కావొద్దనే ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. కిటికీల నుంచి ఫొటోలు, వీడియోలు తీయకుండా నివారించే ఉద్దేశ్యంతో కిటికీలను మూసే ఉంచాలని, కిటికీల షేడ్స్ తొలగించకూడదని ప్రైవేట్ విమానయాన సంస్థలకు డీజీసీఏ పంపిన ఉత్తర్వులో స్పష్టంచేసింది. మొత్తంగా 32 ఎయిర్‌పోర్ట్‌లలో ఈ నిబంధనను అమలుచేయనున్నట్లు తెలుస్తోంది. లేహ్, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, ఆదంపూర్, చండీగఢ్, బఠిండా, జైసల్మేర్, నాల్, జోధ్‌పూర్, హిండన్, ఆగ్రా, కాన్పూర్, బరేలీ, మహారాజ్‌పూర్, గోరఖ్‌పూర్, భుజ్, లోహెగావ్, డాబోలిమ్(గోవా), విశాఖపట్నంలోని విమానాశ్రయాలు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సి ఉంది. ఆర్మీ, నేవీ విమానాల రాకపోకలతోపాటు సాధారణ ప్రయాణికుల విమానాల రాకపోకలు సాగించే ఎయిర్‌పోర్ట్‌లలో ముఖ్యంగా ఈ నిబంధనను అమలుచేయనున్నారు. అక్కడి నుంచి రాకపోకలు సాగించే ప్రైవేట్ విమానాలు, చార్టర్, ప్రైవేట్ జెట్‌లలో ప్రయాణించే వాళ్లు కిటికీల గుండా కెమెరా, స్మార్ట్‌ఫోన్‌లతో ఎయిర్‌బేస్‌ల ఫొటోలు, వీడియోలు తీసే ఆస్కారముందని గ్రహించి ప్రభుత్వం కొత్తగా పలు పశ్చిమ తీర ఎయిర్‌పోర్టుల్లో ఈ నిబంధనను అమల్లోకి తెస్తోంది. విమానం టేకాఫ్ అయ్యాక 10,000 అడుగుల ఎత్తుకు వెళ్లేదాకా విండో షేడ్స్ తొలగించకూడదు. 10,000 అడుగుల కంటే ఎత్తులో ప్రయాణిస్తున్నప్పుడు విమానం ల్యాండింగ్‌కు సిద్ధమైతే ఆ ఎత్తులో విండో షేడ్స్ తెరుచుకోవచ్చు. కానీ ల్యాండింగ్ కోసం 10,000 అడుగుల దిగువకు దిగిరాగానే మళ్లీ విండో షేడ్స్‌ను మూసేయాల్సిందే. ఎమర్జెన్సీ కిటికీలకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. విండోషేడ్స్ తెరిచి ఫొటోలు, వీడియోలు తీసే ప్రయాణికులు తగు పర్యావసనాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న విషయాన్ని వారికి తెలియజేయాలని విమానయాన సంస్థలకు డీజీసీఏ సూచించింది. సాధారణంగా ఏదైనా ప్రయాణికుల విమానం టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో అగ్ని ప్రమాదం లాంటివి ఏమైనా జరిగితే అత్యవసర పరిస్థితుల్లో తప్పించుకునేందుకు వీలుగా విండోషీట్స్‌ను తెరచే ఉంచుతారు.

ఆర్మీ వర్సెస్ యూనుస్

బంగ్లాలో మళ్లీ ముసలం

- ప్రజా మద్దతుతో కఠిన చర్యలు
- ఆర్మీ చీఫ్, బీఎన్‌పీకి ప్రభుత్వ హెచ్చరికలు



యూనుస్, ఆర్మీ చీఫ్ వకారుజ్జమాన్

ఢాకా: కొద్ది నెలలుగా అస్థిరతకు మారుపేరుగా మారిన బంగ్లాదేశ్‌లో మళ్లీ ముసలం పుట్టింది. ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ)తో ముహమ్మద్ యూనుస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వానికి నెలకొన్న విభేదాలు ముదురు పాకాన పడుతున్నాయి. వీలైనంత త్వరగా ఎన్నికలు జరపాలని ఆర్మీ చీఫ్, బీఎన్‌పీ చేస్తున్న ఒత్తిడిపై యూనుస్ వర్గం మండిపడుతోంది. బ్లాక్‌మెయిలింగ్ చర్యలను తక్షణం కట్టిపెట్టకపోతే ప్రజల మద్దతుతో కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందంటూ శనివారం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. పరాజిత శక్తులు, విదేశీ కుట్రలు ప్రభుత్వ పనితీరుకు పలు అడ్డంకులు సృష్టిస్తున్నాయంటూ ఆరోపణలకు దిగింది. సర్కారును కాపాడుకునేందుకు అవసరమైతే వీధి పోరాటాలకు కూడా యూనుస్ వర్గం సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు. ఎన్నికలు తదితర అంశాలపై చర్చించేందుకు యూనుస్ ఆదివారం పలు పార్టీలతో భేటీ కానున్నారు. 2026 జూన్‌కల్లా మధ్యంతర ఎన్నికలు నిర్వహిస్తామని యూనుస్ సర్కారు చెబుతుండగా వచ్చే డిసెంబర్‌లోగా జరిపి తీరాల్సిందేనని ఆర్మీ చీఫ్ పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశమంతా ఘర్షణలు చెలరేగుతున్నాయి. బీఎన్‌పీ ప్రేరేపిత ఆందోళనల నేపథ్యంలో ప్రధాని షేక్ హసీనా గత ఆగస్టులో దేశం వీడి భారత్‌లో ఆశ్రయం పొందడం తెలిసిందే. ఆర్మీ ఒత్తిళ్ల నేపథ్యంలో యూనుస్ తప్పుకుంటున్నట్టు తాజాగా వార్తలు రావడం, ఆయన వర్గం వాటిని ఖండించడం తెలిసిందే.

జర్మనీలో కత్తిపోట్లు.. 18 మందికి గాయాలు

బెర్లిన్: జర్మనీలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. దేశంలోనే రెండో అతిపెద్ద హాంబర్గ్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 18 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురు తీవ్రంగా గాయపడగా మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించి 39 ఏళ్ల మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పుడే వచ్చిన రైలు నుంచి ప్రయాణికులు దిగుతుండగా, కొందరు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఈమె కత్తితో స్వైర విహారం చేసిందని పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు జరుపుతున్నామని, ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదని భావిస్తున్నామన్నారు. ఘటన నేపథ్యంలో దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఆలస్యంగా నడిచాయని, కొన్నిటిని దారి మళ్లించారని అధికారులు తెలిపారు. జర్మనీలోని మ్యూనిక్ నగరంలో ఫిబ్రవరిలో జన సమూహంపైకి ఓ అఫ్గాన్ జాతీయుడు కారుతో దూసుకెళ్లగా 30 మంది గాయపడ్డారు.

కొలీజియంలోకి జస్టిస్ నాగరత్న



న్యూఢిల్లీ: మరో రెండేళ్ల తర్వాత సుప్రీంకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి రికార్డ్ సృష్టించబోతున్న జస్టిస్ బీవీ నాగరత్న నేడు సుప్రీంకోర్టు కొలీజియంలో లాంఛనంగా సభ్యురాలు కాబోతున్నారు. ఇంతకాలం కొలీజియంలో సభ్యునిగా ఉన్న సుప్రీంకోర్టు మరో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా శుక్రవారం పదవీవిమరణ చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఐదో సీనియర్ మోస్ట్ జడ్జి అయిన జస్టిస్ నాగరత్న మే 25వ తేదీ నుంచి అధికారికంగా సుప్రీంకోర్టు కొలీజియంలో కొనసాగనున్నారు. 2027 అక్టోబర్ 29వ తేదీదాకా ఆమె ఈ కొలీజియంలో కొనసాగుతారు. ఈలోపు అంటే 2027 సెప్టెంబర్ 23వ తేదీన అత్యంత సీనియర్ మోస్ట్ జడ్జి అర్హతతో ఆమె సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే అవకాశముంది. ఈమె 1989లో ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన మాజీ సీజేఐ జస్టిస్ ఇ. సీతారామయ్య వెంకటరామయ్య కుమార్తె. జస్టిస్ నాగరత్న చేరికతో కొలీజియం సభ్యుల సంఖ్య ఐదుకు పెరగనుంది. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి ఇందులో సభ్యులుగా ఉన్నారు. సోమవారం సీజేఐ కొలీజియంను సమావేశపరిచి సుప్రీంకోర్టులో, హైకోర్టులో ఖాళీలపై వివరాలు వెల్లడించనున్నట్లు సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. జస్టిస్ అభయ్ ఎస్.ఓకా రిటైర్ అయ్యాక సుప్రీంకోర్టులో మూడు జడ్జీ పోస్టులు ఖాళీ అయ్యాయి. 1993లో కొత్తగా మనుగడలోకి వచ్చిన సుప్రీంకోర్టు కొలీజియం వ్యవస్థ ద్వారానే సుప్రీంకోర్టు, 25 హైకోర్టులకు జడ్జీల ఎంపిక, బదిలీ, పదోన్నతి ప్రక్రియలు కొనసాగుతున్నాయి.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 25 । మే । 2025



జైళ్లశాఖ తీరు ప్రశంసనీయం
ఖైదీల సాధికారతకు తెలంగాణ జైళ్లశాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ ఎం.భగవత్ అన్నారు. -10లో



విహారం.. విలాసం..
సెలవుల్లో సరికొత్త యాత్రల ట్రెండ్‌కు స్వాగతం పలుకుతున్నారు నగరవాసులు. విభిన్న రకాల హాలిడే స్పాట్స్‌ను అన్వేషిస్తున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

వాన.. దంచికొట్టింది!


అమీర్‌పేట్‌లో భారీగా వరద నీరు


మూసాపేట్‌లో ట్రాఫిక్‌జాం

నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 7 గంటలకు షురువై 8 గంటల తర్వాత జోరందుకుంది. రాత్రి 9 గంటల వరకు సుమారు మూడు సెంటిమీటర్ల వర్షం పాతం నమోదైంది. వరద నీటితో ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సర్వీస్ రోడ్లలో సైతం వరద నీరు భారీగా నిలిచిపోయింది. మరో అయిదు రోజులు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.
- సాక్షి, సిటీబ్యూరో

ఏసీబీకి చిక్కిన జగద్గిరిగుట్ట ఎస్సై



జగద్గిరిగుట్ట: బ్యాండ్ మేళం వారి నుంచి మధ్యవర్తి ద్వారా డబ్బులు తీసుకుంటూ నగరంలోని జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బల్కంపేటకు చెందిన కిరణ్ తన సిబ్బందితో మూడు నెలల క్రితం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ శుభ కార్యానికి బ్యాండ్ వాయించారు. శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నారంటూ బ్యాండ్‌కు సంబంధించిన వాహనంతో పాటు సామగ్రిని జగద్గిరిగుట్ట ఎస్సై శంకర్ సీజ్ చేశారు. వాటిని తిరిగి ఇచ్చేందుకు ఇదే ప్రాంతానికి చెందిన నాగేందర్ అనే వ్యక్తితో మధ్యవర్తిత్వం నెరిపి రూ.15 వేలు డిమాండ్ చేశాడు. తాను అంత మొత్తం ఇవ్వలేనని ప్రాధేయపడినా ఎస్సై కనికరించలేదు. దీంతో కిరణ్ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎస్సై శంకర్ డిమాండ్ మేరకు శనివారం బాధితుడు రూ.15 వేల నగదును మధ్యవర్తి నాగేందర్‌కు అందజేస్తుండగా ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తన బృందంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయమై నాగేందర్‌ను ఆరా తీయగా.. ఎస్సై శంకర్ తనను మధ్యవర్తిగా వ్యవహరించి డబ్బులు తీసుకోవాలని చెప్పినట్లు అంగీకరించాడు. దీంతో ఏసీబీ అధికారులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సోదాలు నిర్వహించారు. అవినీతికి పాల్పడిన ఎస్సై శంకర్, అతనికి సహకరించిన నాగేందర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

హెచ్ఎండీఏ భూములకు త్వరలో ఫెన్సింగ్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ స్థలాలకు త్వరలో ఫెన్సింగ్ పనులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ జిల్లాల్లో సరైన రక్షణ లేకపోవడంతో హెచ్ఎండీఏ భూములు ఆక్రమణకు గురవుతున్న ఉదంతంపై 'రక్షణ లేక భక్షణ' శీర్షికన శనివవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పలు చోట్ల భూముల సర్వే పనులు వివిధ దశల్లో ఉన్నాయని, సర్వే పూర్తయిన వెంటనే ఫెన్సింగ్ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మియాపూర్‌లో ఫెన్సింగ్ పూర్తి చేశామన్నారు. మరోవైపు కంది, ఆరుట్ల, శంకరంపేట్, చిట్కుల్, ఇంద్రకరణ్ తదితర ప్రాంతాల్లో కొన్నిచోట్ల సర్వే పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. మరికొన్ని చోట్ల 50 నుంచి 60 శాతం వరకు పూర్తయ్యాయని, దశలవారీగా అన్ని చోట్ల ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. మియాపూర్, జవహర్‌నగర్‌లలో సెక్యూరిటీని బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

లక్డీకాపూల్: జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో అసెంబ్లీ ముందున్న గన్ పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి అమర వీరుల స్తూపాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆవిర్భావ వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట గోషామహల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య తదితరులు ఉన్నారు.

నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



నాంపల్లి: నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సస్పెన్షన్‌కు గురైన డాక్టర్ ఎస్.రవికుమార్ స్థానంలో డాక్టర్ విజయ్‌కుమార్‌ను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గత ఏడాది జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వరంగల్ నుంచి నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి వచ్చారు. ప్రస్తుతం నిలోఫర్‌లో పీడియాట్రిక్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తానన్నారు.

తత్కాల్ దందా!

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో దళారుల బెడద



- టికెట్లను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- సామాన్యుడికి దొరికేది వెయిటింగ్ లిస్టే
- ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహకారంతోనే తతంగం
- పట్టించుకోని విజిలెన్స్ అధికారులు

నాంపల్లి: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని నాంపల్లి రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కేంద్రంలో బ్రోకర్ల బెడద ఎక్కువైంది. సామాన్యుడు టికెట్ పొందాలంటే గగనమైపోయింది. ఇక్కడ రిజర్వేషన్ టికెట్లు పొందే ఏ క్యూలైన్‌లో చూసినా బ్రోకర్లే దర్శనమిస్తున్నారు. ప్రతి క్యూ లైన్‌లోని మొదటి ముగ్గురు వ్యక్తులు ఆర్‌పీఎఫ్ పోలీసులు నియమించుకున్న వ్యక్తులే ఉంటున్నారు. వీరి మధ్యలోకి ఎవరైనా వస్తే పోలీసులే దగ్గరుండి తరిమేస్తున్నారు. ఫలితంగా సాధారణ ప్రయాణికుడు తత్కాల్ టికెట్ కోసం రైల్వే స్టేషన్‌కు వస్తే క్యూలైన్ చివరలోనే నిలబడే పరిస్థితి వచ్చింది. క్యూలైన్‌లో నిలబడిన మొదటి ముగ్గురికే తత్కాల్ టికెట్లు దొరుకుతున్నాయి. నాలుగో వ్యక్తి వంతు వచ్చేసరికి వెయిటింగ్ లిస్టు వచ్చేస్తోంది. దళారులు (బ్రోకర్లు) సాధారణ టికెట్లే కాకుండా తత్కాల్ టికెట్లను కూడా కొల్లగొడుతున్నారు. వీరిని అరికట్టాల్సిన అధికారులే బ్రోకర్లను పెంచిపోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు బేఖాతరు..

- నాంపల్లి రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కేంద్రంలో 11 టికెట్ జారీ కౌంటర్లు ఉన్నాయి. వీటిలో రెండు మూడు మినహా అన్నీ పని చేస్తున్నాయి. రిజర్వేషన్ కేంద్రంలో తత్కాల్ సేవలు ప్రతి రోజూ ఏసీ బోగీలకు ఉదయం 10 గంటలకు, స్లీపర్ బోగీల్లో బెర్తులకు ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయి. తత్కాల్ టికెట్లు పొందడానికి చాలా మంది సాధారణ ప్రయాణికులు రాత్రంతా అక్కడే జాగారం చేస్తుంటారు. టికెట్ల కోసం వచ్చిన వారంతా వరుస ప్రకారం క్యూలో నిలబడాలి. కానీ ఈ నిబంధనలేవీ వర్తించడం లేదు. రాత్రంతా క్యూ లైనులో నిలబడిన ప్రయాణికులు, చుట్టపు చూపుగా ఉదయం వచ్చిన ప్రయాణికులను కలిపేస్తున్నారు.
- వాస్తవానికి వరుసలో నిలబడిన వారికి వరుస ప్రకారం రైల్వే సిబ్బందే తత్కాల్ ఫారాలు జారీ చేయాలి. కానీ ఇక్కడ అంతా ఇష్టారాజ్యం. రాత్రి నుంచి క్యూలో నిలబడిన వారిని గోడ చాటున నిల్చోబెట్టి, పోలీసులు, రైల్వే సిబ్బందికి సంబంధించిన వ్యక్తులను లోపలే ఉంచుతున్నారు. కౌంటర్లు కనిపించకుండా గోడ చాటున నిల్చోబెట్టిన ముగ్గురిని, ముందే రిజర్వేషన్ కేంద్రంలో నక్కిన వారిని ఇద్దరేసి చొప్పున లోనికి పంపుతున్నారు.
- ఎవరు రచ్చ చేసినా వెంటనే వారిని బయటకు వెళ్లగొట్టేందుకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది మఫ్టీలో ఇద్దరు, డ్రెస్ మీద నలుగురు ఉంటారు. ఇలా నెలలు కాదు, సంవత్సరాలుగా ఇక్కడ బ్రోకర్ల దందా నడుస్తోంది. రైల్వే ఉన్నతాధికారులు తత్కాల్ సేవల వినియోగంపై ఏ మాత్రం నిఘా ఉంచడం లేదు. విజిలెన్స్ అధికారులు ఎక్కడా కనిపించడం లేదు. అసలు ఏం జరుగుతోందో అనే విషయాన్ని కూడా ఆరా తీయడం లేదు. ఫలితంగా తత్కాల్ టికెట్లు బ్రోకర్లు కొల్లగొట్టి జేబులు నింపుకొంటున్నారు. వేసవిలో అత్యవసరంగా సొంతూళ్లకు వెళ్లాలనుకునే వారికి భంగపాటు తప్పడం లేదు.


కౌంటర్-10లో ముందు వరుసలో నిలబడిన దళారులు


కౌంటర్ -11లో ముందు వరుసలో నిల్చొని టికెట్లు తీసుకుంటున్న దళారులు

రైల్వేలో బదిలీల మాటేదీ..

సాధారంగా రైల్వేలో పనిచేసే ఉద్యోగుల బదిలీలు జరుగుతుంటాయి. ఎక్కువ కాలం పని చేసిన వారిని అక్కడి నుంచి బదిలీ చేస్తుంటారు. కానీ నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చాలా మంది టికెట్ జారీ చేసే సిబ్బంది, ఆర్‌పీఎఫ్ పోలీసులు బదిలీలు కావడంలేదు. కొన్నేళ్లుగా ఇక్కడ తిష్ట వేసిన వారిని బదిలీ చేయాల్సిన అవసరం ఉంది. బ్రోకర్ల బెడద తగ్గే అవకాశం ఉంది. రైల్వే స్టేషన్ టికెట్ కౌంటర్‌లో పని చేసే సిబ్బంది బయటి వ్యక్తులతో టిఫిన్స్, చాయ్, వాటర్ బాటిళ్లు తెప్పించుకుంటున్నారే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై నాంపల్లి ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా.. దళారులు ఉన్నారనే విషయం అవాస్తవం. నిబంధనల మేరకే ఇక్కడ టికెట్ కౌంటర్ల వద్దకు ప్రయాణికులను క్యూ లైనులోకి పంపుతారని పేర్కొన్నారు. ఆర్‌పీఎఫ్ పోలీసు స్టేషన్‌లో పని చేసే సహాయకులు క్యూలైన్‌లో ఉన్నారనే విషయం అవాస్తవమన్నారు.

పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: లక్ష్యం మేరకు ఆస్తిపన్ను (ప్రాపర్టీ టాక్స్), ట్రేడ్ లైసెన్సు ఫీజులు వసూలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం కోర్టు కంటెంప్ట్ కేసులపై టౌన్‌ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్ కలెక్టర్లు ఆస్తిపన్నుతో పాటు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా వసూలు చేయాల్సిందిగా చూడాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించి రోజు విడిచి రోజు సమీక్ష చేసుకొని లక్ష్యాలు సాధించాలన్నారు. కేవలం ఆర్థిక సంవత్సరం చివరలోనే కాకుండా ఎప్పటికప్పుడు లక్ష్యాల కనుగుణంగా ట్యాక్స్‌లు వసూళ్లు చేయాలన్నారు. సంబంధిత అడిషనల్ కమిషనర్లు కూడా సమీక్షలు జరపాలని సూచించారు. వివిధ జోన్లలో ఉన్న కంటెంప్ట్ కేసులకు తగిన సమాధానాలివ్వాలని సూచించారు. సమావేశంలో చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, సత్యనారాయణ, వేణుగోపాల్, భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ రామ్ నాయక్, అడిషనల్ సీసీపీ వెంకన్న, లీగల్ ఓఎస్డీ సుధీర్, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ ఏసీపీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వీ కర్ణన్

అంతన్నారు.. ఇంతన్నారు!

ఆర్టీఏలో ఏఐ నిఘా విస్తరణ మాటే మరిచారు

- మూడు నెలల క్రితం ఖైరతాబాద్‌లో ప్రారంభం
- ఇతర ప్రాంతాలకు దశలవారీ విస్తరణ హుళక్కే
- ఏజెంట్లు, దళారుల దగా పరామామూలే



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ నిఘా వ్యవస్థ నీరుగారుతోంది. మూడు నెలల క్రితం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఏఐ కెమెరా నిఘా అలంకారప్రాయంగా మారింది. పౌర సేవలను పారదర్శకం చేసే లక్ష్యంతో మధ్యవర్తులు, ఏజెంట్లు, దళారుల ప్రమేయాన్ని నిరోధించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీ కెమెరాలను ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఒకటికి నాలుగుసార్లు కెమెరా దృష్టికి వచ్చే వారిని గుర్తించి నియంత్రించాలని భావించారు.రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం ఈ సాంకేతికతను అభినందించారు. ప్రస్తుతం ఈ నిఘాపై నీలినీడలు కమ్ముకున్నాయి. మూడు నెలలు దాటినా ఖైరతాబాద్ మినహా ఇతర కార్యాలయాలకు నిఘా కెమెరాలు విస్తరించలేదు. దీంతో దళారుల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

ఒక్క క్లిక్‌తో పక్కా లెక్క..

నిఘా కెమెరాల్లో ప్రతి వ్యక్తిని పసిగట్టే సాంకేతిక వ్యవస్థ ఉంటుంది. ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన ఏఐ కెమెరాల్లో నమోదయ్యే ప్రతి వ్యక్తికి ఒక కోడ్‌ను కేటాయిస్తారు. దాని ద్వారా సదరు వ్యక్తి ఆ రోజు ఎన్నిసార్లు నిఘా కెమెరాకు చిక్కాడనేది నిర్ధారిస్తారు. ఎక్కువసార్లు ఆర్టీఏ కార్యాలయాల వద్ద కనిపించేవాళ్లను ఏజెంట్లుగా పరిగణించి కట్టడి చేయాలని భావించారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లో మొదట్లో కొంతమందిని గుర్తించి చర్యలు తీసుకున్నారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో అన్ని చోట్లకు విస్తరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. కానీ ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ఖైరతాబాద్‌లోని ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు విజయవంతంగా పని చేస్తున్నట్లు అప్పట్లోనే అధికారులు తెలిపారు. ఈ సాంకేతిక వ్యవస్థను దశలవారీగా రాష్ట్రంలోని అన్ని రవాణా కార్యాలయాలకు విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు. చెక్ పోస్టుల్లోనూ ఈ కెమెరాలను ఏర్పాటు చేసి రవాణా కమిషనర్ కార్యాలయం నుంచి పర్యవేక్షించాలని ప్రతిపాదించారు. కానీ ఈ ప్రతిపాదనలు ఆరంభ శూరత్వంగానే మిగిలాయి.

ఉద్దేశపూర్వకంగానే..

నగర శివార్లలోని పలు ఆర్టీఏ కేంద్రాల్లో నిఘా వ్యవస్థ కొరవడింది. చివరకు ఏజెంట్లు సమర్పించే వాహనదారుల చిరునామాలు, ఇతర డాక్యుమెంట్‌లలోనూ తప్పుడు ధ్రువీకరణలు ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంలేదు. ప్రాంతీయ రవాణా కార్యాలయాలకు సమీపంలోనే ఏజెంట్‌లు తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొని కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. లెర్నింగ్ లైసెన్సులు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు వంటి పౌరసేవలకు ఒక రేటు చొప్పున నిర్ణయించి అమలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. సీసీ కెమెరా నిఘా వ్యవస్థ ప్రతిపాదన ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యానికి గురవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ ఉన్నా ఆఫ్‌లైన్‌లోనే..

ఏజెంట్ల ఆగడాలను అరికట్టేందుకు ఇప్పటి వరకు సుమారు 17 రకాల పౌర సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చారు. వాహనదారులు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా ఇంటి నుంచే వాటిని పొందవచ్చు. కానీ.. తరచూ ఏర్పడే సాంకేతిక సమస్యలతో ప్రత్యక్ష పౌరసేవలు సైతం పారదర్శకంగా అమలు కావడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే వాహనదారులు ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారనే అభిప్రాయం ఉంది.

కోవిడ్‌పై యుద్ధానికి సిద్ధం

'గాంధీ'లో 60 పడకలతో మూడు వార్డులు

- 10 మంది వైద్య నిపుణులతో కోవిడ్ కమిటీ
- వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు
- కరోనాపై అప్రమత్తమైన వైద్యాధికారులు



గాంధీఆస్పత్రి: కరోనా.. మరోసారి వినిపిస్తున్న పేరు. దీని గురించి నెమ్మదిగా ప్రజలు మర్చిపోతున్న సమయంలో మళ్లీ ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా నగరంలో పాజిటివ్ కేసు నమోదు కావడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సిద్ధమవుతోంది. 60 పడకలతో మూడు కోవిడ్ వార్డులు, ఆయా రంగాల్లో నిష్ణాతులైన 10 మంది వైద్య నిపుణులతో కోవిడ్ కమిటీ ఏర్పాటు చేశారు. పాజిటివ్ కేసులు, అందిస్తున్న వైద్యసేవలు, మౌలిక వసతులు తదితర సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేందుకు వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగితే గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి నేతృత్వంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు.

15 పడకలతో అత్యవసర వార్డు..

గాంధీ ఎమర్జెన్సీ విభాగంలో ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యాలతో 15 పడకలతో అత్యవసర కోవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. ప్రాణాపాయ స్థితిలో కోవిడ్ పాజిటివ్‌తో పాటు వచ్చే బాధితులకు ఇక్కడ వైద్యసేవలు అందిస్తారు. ఇన్‌పేషెంట్ భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో 25, ఫస్ట్ ఫ్లోర్‌లో 20 పడకలతో మరో రెండు వార్డులు అందుబాటులోకి తెచ్చారు. కరోనా పాజిటివ్ బాధితుల కోసం మందులు, టెస్టులు చేసేందుకు అవసరమైన రీఏజెంట్స్ (ద్రావకాలు) సిద్ధం చేశారు. కోవిడ్ లక్షణాలతో అడ్మిట్ అయినవారికి ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహిస్తారు. కోవిడ్ పాజిటివ్ కేసుల వ్యాప్తి పెరిగితే కోవిడ్ వైరస్ వేరియంట్లు, సబ్‌వేరియంట్లను గుర్తించేందుకు గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ నిర్వహిస్తామని గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ తెలిపారు.

కోవిడ్ వైద్య నిపుణుల కమిటీ..

కోవిడ్ రాష్ట్ర నోడల్ కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో అందించే వైద్యసేవలపై పదిమంది నిష్ణాతులైన వైద్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, నోడల్ అధికారిగా జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్‌లు వ్యవహరిస్తారు. కమిటీ ప్రతినిధులుగా డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, పల్మనాలజీ, అనస్థీషియా, గైనకాలజీ, పిడియాట్రిక్, మైక్రోబయోలజీ హెచ్ఓడీలు కృష్ణమూర్తి, ఆవుల మురళీధర్, రాధ, వాసుదేవ్, పూజలతోపాటు డ్యూటీ ఆర్ఎంఓ, వైద్యులు, వైద్యవిద్యార్థులు ఉంటారు.

లక్షణాలు ఇవీ..

కరోనా వైరస్ వివిధ రకాలుగా రూపాంతరం చెందినప్పటికీ లక్షణాల్లో మాత్రం మార్పు రాలేదని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. దగ్గు, జలుబు, శ్వాసకోశ ఇబ్బందులు, గొంతునొప్పి, ఒళ్లు, కీళ్ల నొప్పులు, నీరసం, ముక్కు కారడం, రుచి, వాసన కోల్పోవడం వంటి లక్షణాలను కోవిడ్‌గా పరిగణించాలని వైద్యులు సూచించారు.

భయాందోళనకు గురికావొద్దు

కరోనా సాధారణ రుగ్మతగా మారింది. భయాందోళనకు గురి కావొద్దు. తెలంగాణలో కోవిడ్ వ్యాప్తి తక్కువగా ఉంది. వైరస్ నియంత్రణకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేశాం. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో వ్యాప్తిలో ఉన్న ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్-1 వైరస్ ప్రమాదకారి కాదు. అప్రమత్తంగా ఉండటం తప్పనిసరి.
– ప్రొఫెసర్ సునీల్‌కుమార్, గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్



ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

కోవిడ్ లక్షణాలు ఉంటే స్వీయసంరక్షణ పాటించాలి. తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. . జనసమ్మర్ధ ప్రాంతాలకు దూరంగా ఉండాలి. మాస్క్ ధరించాలి. చేతులు పరిశుభ్రం చేసుకోవాలి. వైద్యుల సూచన మేరకే యాంటిబయాటిక్ మందులు వినియోగించాలి.



గాంధీలో సిద్ధం చేసిన కోవిడ్ వార్డులు

బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి పల్లెకు నీరు

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి పల్లెకు తాగు, సాగు నీరును పుష్కలంగా అందించామని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ ఎస్‌వీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూలో తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు ప్రవీణ్ రెడ్డి అధ్యక్షత వహించగా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని వివరించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలతో రాష్ట్ర వ్యాప్తంగా నీటిని అందించిన ఘనంగా కేసీఆర్‌కు దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం అనేక అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మించి నట్టేట ముంచిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్, టీఎన్‌జీవో మాజీ అధ్యక్షులు దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరునామాలూ గల్లంతు!

● బోగస్ బర్త్ సర్టిఫికెట్ల బాగోతం ● చర్యలు లేనందునే ఆగని 'దందా'

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో జారీ అవుతున్న బర్త్, డెత్ సర్టిఫికెట్లలో అవకతవకలు, అక్రమాల గురించి ఎంతో కాలంగా వెల్లడవుతున్నప్పటికీ, తగిన కట్టడి చర్యలు లేనందున వాటికి అడ్డుకట్ట పడలేదని తెలుస్తోంది. తాజాగా టోలిచౌకిలోని మూతపడిన మెట్రో హాస్పిటల్ నుంచి 65 నకిలీ బర్త్, 8 నకిలీ డెత్‌సర్టిఫికెట్లను గుర్తించి రద్దు చేసినట్లు ప్రకటించిన జీహెచ్‌ఎంసీ.. రెండున్నరేళ్ల క్రితం దాదాపు 25వేల బర్త్ సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయని గుర్తించి, వాటన్నింటినీ రద్దు చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు పాస్‌పోర్ట్, ఇతరత్రా ప్రభుత్వ విభాగాలకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొంది. బాధ్యులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియదు. చర్యల లేమితోనే బోగస్ బాగోతానికి అడ్డుకట్ట పడలేదని తెలుస్తోంది. అప్పట్లో జారీ అయిన సర్టిఫికెట్లు నాన్ అవైలబిలిటీ (జననాలు ఆస్పత్రుల్లో జరగనివి) కింద దరఖాస్తు చేసుకున్నవి కాగా, తాజాగా గుర్తించినవి ఆస్పత్రులు తప్పుడు సమాచారం ఇవ్వడంతో జారీ అయినవి. ఆస్పత్రులపై అధికారులు దృష్టి సారించనందునే ఇవి జారీ అయినట్లు తెలుస్తోంది. ఇంకా ఎన్ని ఆస్పత్రుల్లో ఇలాంటి తతంగాలు జరిగాయో అంతు చిక్కని అంశంగా మారింది.

ప్రత్యేకంగా 'సిట్' ఏర్పాటు..

అప్పటి బోగస్ సర్టిఫికెట్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ అధికారులు వివిధ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కేసులు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాటి నిగ్గు తేల్చేందుకు పోలీసులు ప్రత్యేకంగా 'సిట్' ఏర్పాటు చేసినట్లు సమాచారం. తాజాగా నకిలీ బర్త్ సర్టిఫికెట్ల బాగోతం బయట పడటంతో గతంలో పాతబస్తీలోని ఒక మీ సేవ కేంద్రం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న దాదాపు 250 బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించి అవి ఒరిజినల్‌వా, లేక నకిలీవా తెలియజేయాల్సిందిగా జీహెచ్‌ఎంసీ అధికారులను తాజాగా కోరినట్లు తెలిసింది. ఒకవేళ నిజమైనవే అయితే సర్టిఫికెట్లు పొందేందుకు వారు జతచేసిన పత్రాలు, దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తదితరమైనవి తెలియజేయాల్సిందిగా కోరినట్లు సమాచారం.
- ఈ నేపథ్యంలో అప్లికేషన్ నెంబర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో పరిశీలించిన జీహెచ్‌ఎంసీ యంత్రాంగం ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడమే కాక దరఖాస్తు చేసుకున్న వారి చిరునామా కూడా లేకపోవడాన్ని గుర్తించినట్లు తెలిసింది.బర్త్ సర్టిఫికెట్లు అవసరమైన వారి నుంచి అధిక మొత్తాలు వసూలు చేసి వాటిని ఇప్పించేందుకు అలవాటు పడ్డ కొన్ని మీసేవా కేంద్రాల నిర్వాహకులు, తదితరులు కుమ్మక్కై నాన్ అవైలబిలిటీ కింద దరఖాస్తు చేయించి వాటిని జారీ చేశారనే అభిప్రాయాలున్నాయి. అప్పట్లో జారీ అయిన వాటికి సంబంధించి బాధ్యులపై ఇప్పటి దాకా తగిన చర్యలు లేనందునే వివిధ మార్గాల్లో నకిలీ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో అక్రమాలిలా ..

ఆస్పత్రుల్లో జరిగే జనన, మరణాల రిపోర్టుల ఆధారంగా సదరు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ఆస్పత్రుల్లో కాకుండా జరిగే జనన, మరణాలకు నాన్ అవైలబిలిటీగా పేర్కొంటూ ఆర్‌డీఓ జారీ చేసే ప్రొసీడింగ్స్‌ను బట్టి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఆర్‌డీఓ జారీ చేసే పత్రాల బదులు వివిధ రకాల నకిలీ పత్రాలు, తెల్లపేపర్లు సైతం అప్‌లోడ్ చేసినా బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ అయినట్లు గుర్తించారు.

ప్రజావసర స్థలాల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

లే అవుట్‌లలో పార్కులు..రహదారులు మారవు
● ప్లాట్ ఓనర్ల అనుమతితోనే లేఔట్ రివైజ్
● లేఔట్‌ల అంశంపై చర్చించిన హైడ్రా



సాక్షి, సిటీబ్యూరో: లేఔట్ ఏదైనా అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని లే ఔట్‌లపై హైడ్రా శనివారం నిర్వహించిన సదస్సు అభిప్రాయపడింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో శనివారం జరిగిన సదస్సులో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలకు చెందిన పలువురు నిపుణులు హాజరయ్యారు. 10 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్ అయితే ఆ లేఔట్లను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో మార్పులు చేయాల్సి ఉంటే.. అప్పటికే ప్లాట్లు కొన్నవారి అనుమతితో రివైజ్ చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే 10 శాతం పార్కులు, ప్రజావసరాలకు కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ, డీటీసీపీ, హెచ్‌ఎండీఏ ఇలా ఏ స్థాయిలో లే ఔట్ అనుమతులు పొందినా.. అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలపై ప్రభుత్వానికి హక్కులుంటాయనన్నారు.

రెవెన్యూ రికార్డుల్లో మార్చాలి...

దశాబ్దాల క్రితం గ్రామ పంచాయతీలు అనుమతి ఇచ్చిన లేఔట్ల విషయం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాల్సిన వసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది. సదరు భూమి లేఔట్‌గా మారిందనే విషయం రెవెన్యూ రికార్డులలో నమోదు కాకపోవడంతోనే.. తర్వాత తరం వారు పాసు పుస్తకాలు తెచ్చుకుని ఆయా స్థలాల మీదకు వెళ్లి వ్యవసాయ భూమి పేరిట ఆక్రమణలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి పొందిన పాత లేఔట్ల విషయంలో కొన్ని ప్లాట్లు రెగ్యులరైజ్ అయితే ఆ లేఔట్‌ను గుర్తించినట్టేనన్నారు. తర్వాత ఆ భూమిని వ్యవసాయ భూమిగా మార్చడం జరగదని, ఒక వేళ రద్దు చేస్తే అందులో ప్లాట్లు కొన్న వారి అనుమతితో మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. .

అక్రమ నిర్మాణాలను తొలగించాలి..

తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన వాటిపైన చర్యలు తీసుకోవచ్చునని సదస్సు అభిప్రాయ పడింది. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులపై సదస్సు కూలంకుషంగా చర్చించింది. చెరువు పరిధిలో నిర్మించిన కట్టడాల విషయంలో కూడా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేకుండా తొలగించవచ్చునని పేర్కొంది. రహదారులు, పార్కులలో నిర్మాణాలు చేపట్టినా ఇది వర్తిస్తుందని సూచించింది. అలాగే క్రమబద్ధీకరించిన ఇంటి స్థలాలు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే వాటిని రద్దు చేసే అధికారం కూడా ఉందని పేర్కొంది.

సూడో పోలీస్ అరెస్ట్



సాక్షి, సిటీబ్యూరో: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా అవతారం ఎత్తి, అమాయకులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, మోసం చేస్తున్న సూడో పోలీస్‌ను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. యూసుఫ్‌గూడకు చెందిన కోనకంచి కిరణ్ కుమార్ నకిలీ పోలీసు యూనిఫాం ధరించి స్థానికంగా ద్విచక్ర వాహనంపై పెట్రోలింగ్ చేస్తుండేవాడు. బైక్‌పై పోలీస్ అని రాసుకొని, సైరన్‌ను కూడా ఏర్పాటు చేసుకొని బహిరంగ ప్రదేశాలలో తిరుగుతూ ఉండేవాడు. ఇలా యువతను ఆకర్షించి, మధ్యవర్తిగా వ్యవహరించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించేవాడు. ఇతని మాయమాటలను బాధితులు జే సుభాష్, కుమార్, అశ్వినీలు నమ్మారు. మొత్తం ఐదుగురి నుంచి రూ.20 లక్షలు సొమ్ము వసూలు చేయడంతో పాటు వారి ఒరిజినల్ డాక్యుమెంట్లను తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, ముషీరాబాద్ పోలీసులు నిందితుడు కిరణ్‌కు పట్టుకున్నారు. ఇతని నుంచి రూ.5.45 లక్షల నగదుతో పాటు నకిలీ గుర్తింపు కార్డు, ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్లు ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

'డబుల్' ఇళ్ల పేరుతో రూ. లక్షల్లో వసూలు

బంజారాహిల్స్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇప్పిస్తానంటూ నాగరాజురెడ్డి అనే వ్యక్తి రూ. 4 లక్షలు వసూలు చేసి మోసం చేశాడంటూ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్లంబర్‌గా పనిచేస్తున్న శంకర్‌షన్‌దాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత 20 సంవత్సరాలుగా తాను ఇక్కడ ప్లంబర్ వర్క్ చేస్తున్నానని, చిత్తూరు జిల్లా జనపల్లి మండలం వి.కోట గ్రామానికి చెందిన నాగరాజు రెడ్డి గత ఏడాది ఏప్రిల్ 28వ తేదీన తనకు డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ ఇప్పిస్తానంటూ రూ. 4 లక్షలు తీసుకున్నాడన్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి ప్రొసీడింగ్స్ వచ్చాయని నమ్మించాడు. తన లాగే ఇదంతా నమ్మిన ప్రసాద్ ల్యాబ్స్ ఉద్యోగులు రూ. 16.82 లక్షలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం నాగరాజురెడ్డికి ఇచ్చారన్నారు. అయితే కొంతకాలంగా నిందితుడు తాము చేసే ఫోన్లకు స్పందించకపోగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నట్లు గమనించిన బాధితులు ఈ వ్యవహారంపై ఆరా తీశారు. తమకు ఇచ్చినవి నకిలీ పట్టాలని, నాగరాజురెడ్డికి జీహెచ్‌ఎంసీలో ఎలాంటి పరిచయాలు లేవని, ఇదంతా మోసమని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువ డాక్టర్ మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువ డాక్టర్ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ భానుప్రకాశ్ తెలిపిన మేరకు.. గద్వాల్ ప్రాంతానికి చెందిన డాక్టర్ కె.రాజశేఖర్ (29) కొత్తగా రాయల్ బుల్లెట్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. శనివారం తన ద్విచక్ర వాహనంపై నగరానికి బయలుదేరాడు. షాద్‌నగర్ రాయికల్ టోల్ ప్లాజాలో పని చేస్తున్న శేఖర్ (23) లిఫ్ట్ అడగడంతో ద్విచక్ర వాహనంపై ఇద్దరూ నగరానికి ప్రయాణమయ్యారు. ఆరాంఘర్ చౌరస్తా వద్ద పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై నుంచి ప్రయాణం అయ్యారు. ఈ ఎక్స్‌ప్రెస్ వేపై ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు. 318 పిల్లర్ వద్ద మలుపు ఉండటంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. డాక్టర్ మహేందర్ గౌడ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు శేఖర్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ప్రసవం కోసం వెళితే తల్లీ,బిడ్డ ప్రాణాలు తీశారు

ఆస్పత్రి ఎదుట కుటుంబసభ్యుల ధర్నా



ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న మృతి చెందిన సింధూజ బంధువులు

మూసాపేట: ప్రసవం కోసం ఓ ఆసుపత్రికి వెళ్లిన గర్భిణీ, కడుపులో బిడ్డ చనిపోవడంతో ఆసుపత్రి ఎదుట ఆమె బంధువులు ధర్నా నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా, హన్మకొండకు చెందిన తిరుపతి, సింధూజ (31) భార్యాభర్తలు. తిరుపతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బాచుపల్లి, మల్లంపేటలో నివాసం ఉంటున్నారు. 7 సంవత్సరాల క్రితం వీరికి వివాహం జరగగా కొన్ని సంవత్సరాలుగా కూకట్‌పల్లి, వివేకానందనగర్‌లోని అంకురా ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్‌కు ఆసుపత్రికి వస్తున్నారు. శనివారం ప్రసవం కోసం ఆసుపత్రికి కాగా చికిత్స పొందుతూ గుండెనొప్పితో సింధూజ చనిపోయింది. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని, ఇలా ఎంత మంది ప్రాణాలు పొట్టన పెట్టుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తమకు ఎటువంటి పిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చి మిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 45, పచ్చి కాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండకాయ 15, గుండు బీన్స్ 85, గింజచిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 60, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 9, పొట్లకాయ 18, అరిటికాయ 10, మునగ కాయ 4, మామిడికాయ 60, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 40. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో అత్యంత పేదరికంలో మగ్గుతూ జీవనం సాగిస్తున్న ముదిరాజ్‌ల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు బీసీ(డీ) గ్రూపు నుంచి బీసీ(ఏ)లోకి చేర్చాలని తెలంగాణ మన ముదిరాజ్ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుండాల మదన్ కుమార్‌ను నియమిస్తూ నియమక పత్రాన్ని అందజేశారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మద్దెల సంతోష్‌తో కలిసి శంకర్ ముదిరాజ్ మాట్లాడారు. ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుక బడి ఉన్నారని, వీరి సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. ముదిరాజ్ కులస్తులు సంఘటితమై హక్కులు, రాజ్యాధికార సాధన కోసం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

మరణించిన కళాకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం



కళాకారుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసిన వెన్నెల

హిమాయత్‌నగర్: తెలంగాణ సాంస్కృతిక సారథిలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన కళాకారులకు చైర్‌పర్సన్ డాక్టర్ జి.వి.వెన్నెల ఆర్థిక సాయం చెక్కులు అందించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు విరాళంగా అందించిన సొమ్మును సూర్యాపేట జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు చిప్పలపల్లి సుధాకర్, వేముల నరేష్, రంగారెడ్డి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు గడ్డం ఈశ్వర్‌లకు ఒక్కొక్కరికి రూ. 5,22,000లకు సంబంధించిన చెక్కులను వారి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

పర్స్ సహా బంగారు నగల మాయం

వెంగళరావునగర్: గదిలో ఉంచిన పర్స్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్‌కాలనీలో నివాసం ఉంటున్న పి.శైలజ ఈనెల 20వ తేదీ ఉదయం విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చింది. దాదాపు 5.35కు ఇంటికి వచ్చి పర్స్ గదిలో ఉంచి 8.40 ప్రాంతంలో చూసుకోగా పర్స్ కనిపించలేదు. అందులో దాదాపు రూ. 2.90 లక్షల విలువజేసే బంగారు గాజులు, చంద్రహారం, నల్లపూసల దండ, చైన్, రింగులు తదితర వస్తువులు దాచింది. ఉదయం ఇంట్లో తన భర్త, పెద్ద కుమారుడు, పని మనిషి మాత్రమే ఉన్నారు. పని మనిషి వెళ్లిన అరగంటకు చెక్ చేసుకోగా పర్స్ కనిపించలేదు. దాంతో బాధితురాలు తన పర్స్‌ను పనిమనిషి దొంగిలించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాన.. హైరానా...



నీట మునిగిన వీధులు

బంజారాహిల్స్: దంచికొట్టిన వానకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. శనివారం సాయంత్రం కురిసిన వానకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఇందిరానగర్, శ్రీకృష్ణానగర్, శ్రీనగర్ కాలనీ, ఖైరతాబాద్ ప్రాంతాలు జలమయం అయ్యాయి. శ్రీకృష్ణానగర్‌లో పెద్ద ఎత్తున వరద రావడంతో వీధులన్నీ చెరువులను తలపించాయి. ఇందిరానగర్‌లో కొన్ని దుకాణాల్లోకి వరద నీరు వచ్చి చేరాయి.



ఇందిరానగర్‌లో ఓ షాపులోకి చేరిన నీరు

ఒకేసారి రేషన్ పంపిణీకి ఏర్పాట్లు

మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీకి సన్నద్ధం | జూన్ 1వ తేదీ నుంచి కార్డుదారులకు పంపిణీ | నెలంతా తెరిచి ఉండాలని ఆదేశాలు | ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో డీలర్లకు సూచనలు

బంజారాహిల్స్: రానున్న వర్షాకాలంతో పాటు ప్రకృతి విపత్తుల దృష్ట్యా మూడు మాసాల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 పరిధిలోని 81 రేషన్ దుకాణాల పరిధిలో జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు నెలంతా రేషన్ దుకాణాలు తెరిచి ఉంచి కార్డుదారులకు 3 నెలల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం సర్కిల్–7 అధికారులు రేషన్ డీలర్లతో సమావేశమై తగిన సూచనలు జారీ చేశారు. కేంద్ర ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు అధికారులను, డీలర్లను సమాయత్తం చేసింది. జూన్, జులై, ఆగస్టు నెలల రేషన్ బియ్యాన్ని జూన్ 30 లోగా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించారు. రేషన్ దుకాణాలకు నెలంతా గోడౌన్ల నుంచి రేషన్ బియ్యం సరఫరా కానున్నాయి. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారుల నుంచి మంచి డిమాండ్ పెరిగింది. దీనికి అనుగుణంగానే ప్రతిఒక్కరూ రేషన్ తీసుకుంటుండటంతో స్టాక్‌ను కూడా అదే స్థాయిలో విడుదల చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉంచడానికి సరిపడా స్థలం లేకపోవడంతో నెలలో మూడుసార్లు గోడౌన్ల నుంచి బియ్యం బస్తాలను సరఫరా చేయాలని యోచిస్తున్నారు. అయితే ఒకేసారి బియ్యం బస్తాలు పంపిణీ చేయడం ద్వారా రేషన్ డీలర్లు మరెక్కడైనా నిల్వ చేసుకుంటారా? లేదా అనే అంశంపై కూడా తర్జన భర్జనలు జరుగుతున్నాయి.



రేషన్ షాపులో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-1 అధికారి శంకర్

- ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 కిందకు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, సనత్‌నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లు వస్తాయి.
- వీటిలో పరిధిలో మొత్తం 81 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 83,076 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ఈ కార్డులన్నింటిలో కలిపి 2,78,604 మంది వినియోగదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 17,93,434 కిలోల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

కొత్త కార్డులకూ సన్న బియ్యం...

ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన కొత్త రేషన్ కార్డులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే కార్డుల్లో కొత్తగా నమోదైన సభ్యులకు కూడా ఉచిత సన్నబియ్యం పంపిణీ అవుతుంది.

- రేషన్ షాపుల్లో తమ ఆధార్ నెంబర్‌ను చూపించడం ద్వారా డీలర్లు ఆ నెంబర్‌ను నొక్కగానే సదరు వ్యక్తికి కొత్త ఆహార భద్రతా కార్డు మంజూరైనదో లేదో అప్పటికప్పుడే తెలిసిపోతుంది.
- ఆధార్ కార్డు నెంబర్ నొక్కగానే వారికి కార్డు మంజూరైనట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తే వారందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. జూన్ 1వ తేదీ నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇవ్వనుండగా, కొత్త రేషన్ కార్డుదారులకు కూడా బియ్యం పంపిణీ ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు నడుం బిగించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వెంగళరావునగర్: దేశం నుంచి ఉగ్రవాదాన్ని సమూలంగా తొలగించడానికి ప్రతి భారతీయ పౌరుడు నడుం బిగించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో శనివారం రాత్రి తిరంగా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ సంకల్పం ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేసి దేశం శాంతిభద్రతలతో సస్యశ్యామలంగా ఉండాలనేదే అని చెప్పారు. అమాయక ప్రజలను అకారణంగా పొట్టనబెట్టుకుంటున్న ఉగ్రవాదులను ఎన్నటికీ క్షమించేది లేదన్నారు. పాకిస్తాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టిన మన రక్షణ వ్యవస్థ ఏంటో ప్రపంచానికి తెలిసిందని అన్నారు. తిరంగా యాత్రలో భాగంగా కృష్ణకాంత్ పార్కు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకెల దీపక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కిలారి మనోహర్, పార్టీ సీనియర్ నేతలు కుంభాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, బంగారు ప్రశాంత్, కొలన్ సత్యనారాయణ, బి.రూప, ప్రసన్నకుమారి, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



యాత్రలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గుంతలమయమైన జూబ్లీహిల్స్ రోడ్లు



జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-25 ఇలా...

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ సర్కిల్–18 జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. కాలనీలో గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంలో సంబంధిత ఇంజనీర్లు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ జీహెచ్‌ఎంసీ ఇంజనీర్ల అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యంతో ఎక్కడికక్కడ రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారుతుంది. రోడ్లు వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు కూడా చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక జీహెచ్‌ఎంసీ ఇంజనీర్ల తీరుపై పలుమార్లు కమిషనర్‌కు కూడా స్థానికులు ఫిర్యాదు చేశారు. డివిజన్ పరిధిలో సుమారు 30 చోట్ల రహదారులు గుంతలమయమయ్యాయని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆ వివరాలను కూడా కమిషనర్‌కు అందజేశారు. కమిషనర్ ఆదేశించినా ఇంజనీర్లలో చలనం ఉండడం లేదు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఇంజనీర్లతో డివిజన్ల అభివృద్ధి ముందుకుసాగకపోగా మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరన్న ధీమాతో నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏళ్ల తరబడి తిష్టవేసిన ఇంజనీర్లపై వేటు వేసి నీతి, నిజాయితీతో కూడిన సమర్థవంతులైన ఇంజనీర్లను నియమించి అభివృద్ధిని ముందుకుతీసుకువెళ్లాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి

హిమాయత్‌నగర్: గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ అధ్యక్షుడు జస్‌రాజ్ శ్రీశ్రీమల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘ్ సెక్రటరీ మహేష్ అగర్వాల్, ఉపాధ్యక్షులు జస్మత్ పటేల్, జాయింట్ సెక్రటరీ రిదేశ్ జాగిర్దార్ లతో కలిసి ఆయన మాట్లాడారు. బక్రీద్, ఇతర రోజులలో ఆవులు, దూడలు ఎద్దులను అక్రమంగా వధించడంపై రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గోవధ నిషేధ, జంతు సంరక్షణ చట్టం, 1977ను ఉల్లంఘిస్తూ, ముఖ్యంగా బక్రీద్ రోజున ఎప్పటిలాగే ఆవులు, దూడలు, ఎద్దులను చట్టవిరుద్ధంగా వధించడంలో పాల్గొనే ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. హైదరాబాద్ నగర కమిషనరేట్ చుట్టూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని శ్రీశ్రీమాల్ సూచించారు. జంతువులను రవాణా చేసేటప్పుడు, లారీలో 6 కంటే ఎక్కువ జంతువులను అనుమతించకూడదని చట్టంలో స్పష్టంగా ఉందని వివరించారు. గోవధను నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆవులు, దూడలు, ఎద్దులను వధించకుండా కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తుల అరెస్టు

బంజారాహిల్స్: గుట్టుచప్పుడు కాకుండా పోలీసుల కళ్లు గప్పి నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న నలుగురు వ్యక్తులను బంజారాహిల్స్ పోలీసులు పక్కా ప్లాన్‌తో అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని జహీరానగర్‌ను ఆనుకుని ఉన్న గ్రౌండ్‌లో స్థానికంగా ఉండే వెల్డర్ మహ్మద్ సాద్, టెక్నీషియన్ అబ్దుల్లా ఒమెర్, శివరాంపల్లి జాగీర్‌కు చెందిన షేక్ షారూక్, బంజారాహిల్స్ పంచవటి కాలనీకి చెందిన మహేందర్ రాజేందర్‌సింగ్ అలియాస్ రాజన్ గంజాయి తాగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. బంజారాహిల్స్ ఎస్‌ఐ యాసీన్ అలీ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి వీరందరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రెండు సంవత్సరాల నుంచి తాము ధూల్‌పేట మహంగార్‌బస్తీ చుట్టుపక్కల ప్రాంతంలో వివిధ వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి తాగుతున్నట్లుగా నిందితులు పోలీసుల విచారణ వెల్లడించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలాలో పూడికతీత

హిమాయత్‌నగర్: అశోక్‌నగర్ మీదుగా చిక్కడపల్లి నుంచి వెళ్తున్న మురుగు నీటి కాలువలో రూ. 14 లక్షల వ్యయంతో చేపట్టనున్న పూడికతీత పనులను హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... బస్తీ వాసులకు వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏఈ పవన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రియరాజ్, పూర్ణచందర్, మహేష్, సర్ఫరాజ్, శ్రీనాథ్, జైస్వాల్, బాషా, సందీప్, హితేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగి చేతివాటం

బంజారాహిల్స్: తమ సంస్థలో పనిచేసే ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి లక్షలాది రూపాయలు దండుకుని మోసం చేశాడని బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని విశ్వ సముద్ర ఇంజనీరింగ్ లిమిటెడ్ కార్పొరేట్ ఆఫీసు జీఎం భవానీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న దొంతుల్వార్ రామకృష్ణపై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలివీ... రామకృష్ణ 2022 నుంచి తమ సంస్థలో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సంస్థ అంతర్గత ఆడిట్‌లో రూ. 9.13 లక్షలు మోసం జరిగినట్లుగా గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మోసానికి రామకృష్ణ కారకుడని, వివిధ సంస్థలకు సంబంధించిన రశీదులను కూడా పోలీసులకు అందజేశాడు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై బీరు బాటిల్‌తో దాడి

బంజారాహిల్స్: ఒంటరిగా ఉన్న యువకుడిని బెదిరించి బీరు బాటిల్‌తో దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కొని పరారైన నిందితుల కోసం బంజారాహిల్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. వివరాలివీ... టోలిచౌకి హకీంపేటకు చెందిన షేక్ శెషావలీ (25) శుక్రవారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని నీలోఫర్ హోటల్ వెనుక చర్చి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మూత్ర విసర్జనకు వెళ్లాడు. అదే సమయంలో గుర్తుతెలియని ఇద్దరు యువకులు ఆయన వద్దకు వచ్చి ఇంత రాత్రిపూట ఇక్కడ ఏమి చేస్తున్నావంటూ ప్రశ్నించారు. మీ సెల్‌ఫోన్ ఏదంటూ అడిగి బలవంతంగా తీసుకున్నారు. గూగుల్ పే డబ్బు ఎంత ఉందని ప్రశ్నించారు. అక్కడే ఉన్న బీరు బాటిల్‌తో బాధితుడి తలపై కొట్టి సెల్‌ఫోన్‌తో అక్కడి నుంచి ఉడాయించారు. బాధితుడు షేక్ శెషావలీ అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న యువకుడి అరెస్ట్

వెంగళరావునగర్: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఎస్‌ఐ అవినాష్‌బాబు తన సిబ్బందితో శుక్రవారం అర్ధరాత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ క్రమంలో మధురానగర్‌కాలనీలో ఫిరోజ్‌ఖాన్ అనే యువకుడు క్రికెట్ బెట్టింగ్ వేస్తున్నాడు. దాంతో పోలీసులు అతనిని అదుపులోనికి తీసుకుని సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

శ్రీనగర్‌కాలనీ: యువత ఎక్కువగా ప్రమాదాలబారిన పడుతున్నారని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. శనివారం అమీర్‌పేటలోని పిరమిల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు–నివారణ, 'ప్రమాదాలు ఉచితం–అవయవాలు' కాదు అనే అంశంపై అవగాహన కల్పించారు. రాంగ్ రూట్స్, రాష్‌డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లతో అధిక ప్రమాదాలు ఎలా జరుగుతాయో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, జోనల్ రిస్క్ మేనేజర్ రవికుమార్, సేల్స్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ రాంబాబు, బేగంపేట, టీటీఐ అధికారులు పాల్గొన్నారు.

త్వరలో అన్ని బస్తీల్లో హైమాస్ట్ లైట్లు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లోని అన్ని బస్తీల్లో హైమాస్ట్ వీధి దీపాలను త్వరలో ర్పాటు చేయిస్తామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి వెల్లడించారు. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానం, మహాత్మానగర్, వినాయకనగర్ తదితర బస్తీల్లో జీహెచ్‌ఎంసీ విధి దీపాల విభాగం అధికారులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వీధి దీపాల ఏర్పాటు ఇతర సమస్యలపై తాను ఇటీవల శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌ను కలిసి విన్నవించామన్నారు. ఆయన ఆనుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందులో భాగంగానే బస్తీల్లో పర్యటించి వీధి దీపాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిచారన్నారు. మొదటి ప్రాధాన్యతగా ఎస్పీఆర్‌హిల్స్ బస్తీల్లో వీధి దీపాలను ఏర్పాటు చేస్తారని కార్పొరేటర్ తెలిపారు. ఎన్ని దీపాలు... ఎక్కడెక్కడ అవసరం అనే అంశాలను బస్తీవాసుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వీధి దీపాల ఈఈ రఘుపతి రెడ్డి, ఇన్‌చార్జ్ రాజేష్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



క్వారీ మైదానంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, ఈఈలు

జీటీఎస్ టెంపుల్ పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటు



పూజలు చేస్తున్న నూతన కమిటీ నేతలు

వెంగళరావునగర్: దేవాలయానికి సంబంధిన విషయాల్లో ఎలాంటి కమిటీలు ఏర్పడినా ఐక్యంగా, అరమరికలు లేకుండా తమ పనులు తాము చేసుకుంటూ ముందుకు పోవాలని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ కన్వీనర్ వి.నవీన్‌యాదవ్ తెలిపారు. వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్ కాలనీలో ఉన్న జీటీఎస్ టెంపుల్‌కు పునర్నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీతో శనివారం ఈఓతోపాటు నవీన్‌యాదవ్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... ఎంతో చరిత్ర ఉన్న జీటీఎస్ టెంపుల్‌ను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. కమిటీ మెంబర్లుగా నియమితులైన మంజులా యాదవ్, రేణుక, వి.వి.ఎన్.చౌదరి, కృష్ణస్వామి, శ్రీను, సత్యనారాయణ, రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీటీఎస్ టెంపుల్‌కు పునర్నిర్మాణ కమిటీ మెంబర్లుగా తమను నియమించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తమను మెంబర్లుగా నియమించడానికి సహకరించిన సీనియర్ కాంగ్రెస్ నేతలు మహమ్మద్ అజహరుద్దీన్, వి.నవీన్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ నేతలు సత్యం యాదవ్, అనిల్ ముదిరాజ్, శివాచారి, ఖాసీం, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుమ్మడిదల సుధాకర్ పాల్గొన్నారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

నిమ్స్‌లో ఘనంగా పీసీసీ అధ్యక్షుడి పుట్టిన రోజు వేడుకలు

లక్డీకాపూల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా నిమ్స్ లో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీపీఎస్‌సీ మాజీ సభ్యుడు జీఎస్ సీతారామరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు వెయ్యి మందికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొక్క చెన్నారెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సంజయ్ ముదిరాజ్, హౌసింగ్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, పీసీసీ సెక్రటరీ ప్రసన్న కుమార్, వనపర్తి టౌన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.కిరణ్ కుమార్, సామాజిక సేవా కార్యకర్త కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న సీతారామరాజు తదితరులు

బంగారు ఆభరణాల చోరీ

వెంగళరావునగర్: గదిలో షేరింగ్ ఇచ్చినందుకు తన తోటి రూంమేట్ నగదు, నగలు మరో మహిళ కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... నల్లగొండ ప్రాంతానికి చెందిన సి.హెచ్.అరుంధతి నగరానికి వచ్చి సాగర్ రింగ్ రోడ్డులో ఉంటున్న తన చెల్లి వద్ద ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. వారం తర్వాత స్థానిక ఎల్లారెడ్డిగూడలో రూం కిరాయికి తీసుకుంది. నెల తర్వాత తాను పనిచేసే హోటల్‌లో జాబ్‌చేసే సౌభాగ్య అనే మహిళ కూడా అదే గదిలో షేరింగ్‌కు వచ్చింది. లాకర్స్ లేకపోవడంతో అరుంధతి పర్స్ గదిలోనే దుస్తుల్లో ఉంచేది. అరుంధతి ఈ నెల 14వ తేదీ డ్యూటీకి వెళ్లగానే సౌభాగ్య తన స్నేహితుడిని గదిలోకి పిలిచి గడిపింది. 22వ తేదీనాడు తన పర్స్‌ను చెక్ చేసుకోగా అందులో తన నగదు, గోల్డ్ వస్తువులు మాయం అయ్యాయి. దాంతో అరుంధతి ఏడుస్తూ ఉండగా రూంలో ఉంటున్నందున తనను అనుమానిస్తావా అంటూ సౌభాగ్య కేకలు వేసింది. గదిలో ఇద్దరు మాత్రమే ఉంటున్నామని, ఎవరు తీస్తారని అరుంధతి అడిగినా సమాధానం లేదు. బాధితురాలు అరుంధతి తన వస్తువులు కనిపించకుండా పోవడానికి రూంమేట్ సౌభాగ్య, ఆమె స్నేహితుడే కారణం అయి ఉంటారని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిట్ట ఎగిరిపోయింది.. జింక పారిపోయింది!



వారం రోజుల క్రితం సెక్రటేరియెట్‌కు ప్రపంచ అందగత్తెలు వస్తున్న సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్‌లో అందగత్తెలను ఆకట్టుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు పాల పిట్ట, కృష్ణ జింక బొమ్మలతో ఐ లవ్ తెలంగాణ పేరుతో ఆర్చిని ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని ఆకతాయి కుర్రాళ్లు రాష్ట్ర పక్షి పాల పిట్టను, కృష్ణ జింకు ఎత్తుకెళ్లారు. దీంతో ఆ ఆర్చి ఇలా బోసిపోయి కనిపిస్తున్నది.
– బంజారాహిల్స్

వరదనీటిని తోడిన ట్రాఫిక్ పోలీసులు



కేబీఆర్ పార్కు వరద నీటిని తోడేస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు, డీఆర్‌ఎఫ్



వాహనాలను నియంత్రిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: కుండపోత వర్షానికి బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ వరదనీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. శనివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన భారీ వర్షం రెండు గంటల పాటు ఏకధాటిగా కురవడంతో రహదారులన్నీ వరదనీటితో నిండిపోయాయి. దీంతో ట్రాఫిక్ ముందుకుసాగడం కష్టతరమైంది. కేబీఆర్ పార్కును ఆనుకుని కొత్తగా నిర్మిస్తున్న మల్టీ లెవల్ పార్కింగ్ పక్కనే భారీగా వరదనీరు నిలిచిపోయి దీని ప్రభావం అటు జూబ్లీహిల్స్ వైపు, ఇటు పంజగుట్ట వైపు, అటు మాసబ్‌ట్యాంక్ వైపు చూపింది. జీహెచ్‌ఎంసీ మాన్సూన్ టీం అందుబాటులో లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులెవరూ ఇటువైపు తొంగి చూడలేదు. దీంతో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, ఎస్‌ఐ గోవర్ధన్‌రెడ్డి ఇద్దరూ కలిసి సమీపంలో ఉన్న డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రిక్వెస్ట్ చేసి వరదనీరు నిలిచిన ప్రాంతానికి తీసుకువచ్చారు. ఇక్కడ ఉన్న మోటారు పనిచేయకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, డీఆర్‌ఎఫ్ సిబ్బంది కలిసి మోటార్‌కు మరమ్మతు చేయించి నీళ్లను తోడించారు. నీళ్లను తోడే మోటారు పనిచేయడంతో కొంతమేర నీటిని రోడ్డు అవతలి వైపుకు పంపించగలిగారు. రాత్రి 9 గంటల వరకు పోలీసులు ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించాలి. వరద పూర్తిగా వెళ్లేదాకా విధుల్లో ఉన్నారు. ఇంత జరిగినా జీహెచ్‌ఎంసీ మాన్సూన్ టీం అక్కడికి చేరుకోలేదు. పంజగుట్ట, ఖైరతాబాద్, విరించి ఆస్పత్రి చౌరస్తా, అగ్రసేన్ చౌరస్తా, తెలంగాణ భవన్ ప్రాంతాలన్నీ ఒకవైపు వరదనీరు... ఇంకోవైపు స్తంభించిన ట్రాఫిక్‌తో రాత్రి 10 గంటల వరకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

నగరంలో నేడు

- మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఏడు పదుల వెన్నెల ప్రముఖ కవి నందిని సిధారెడ్డి ఆత్మీయ అభినందన కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు మాసాబ్‌ట్యాంక్‌లోని హోటల్ పార్క్ కాంటినెంటల్‌లో జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు ఇండోమచ్ పేరిట బీ2బీ ఇండస్ట్రీయల్ మెషనరీ, ఇంజినీరింగ్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని నవోటెల్ హోటల్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 8 గంటలకు హై లైఫ్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ కొనసాగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఫిలింనగర్‌లోని ఫిల్మ్ చాంబర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పెరికె ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తారు.
- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 4.30 గంటలకు చేతివృత్తుల ఆధునికీకరణ - ప్రత్యామ్నాయం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

అంతర్జాతీయ పరిశోధనా కేంద్రానికి రూ.100 కోట్లు

అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి శనివారం వెల్లడించారు. ఉపకులపతి విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, డీన్లు, అన్ని ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిశోధనా కేంద్రం ఆవశ్యకతను వెల్లడించారు. తమ ప్రతిపాదనలను ఆమోదించి నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఇతర మంత్రులకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజూ హాస్టళ్లలో తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు శనివారం కూడా పలు హాస్టళ్లలో తనిఖీలు చేపట్టాయి. శ్రీనగర్‌కాలనీ, దిల్‌సుఖ్‌నగర్ లలితానగర్, కేపీహెచ్‌బీ, మూసాపేట ప్రాంతాల్లో 60 హాస్టళ్లను తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా, అస్తవ్యస్తంగా ఉన్న 38 హాస్టళ్ల నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఏడు హాస్టళ్ల కిచెన్‌లను మూసివేశారు. జీహెచ్‌ఎంసీ యాక్ట్ మేరకు నిర్వహణ సరిగ్గాలేని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన పలు హాస్టళ్లకు రూ.2.46 లక్షల పెనాల్టీ విధించారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సన్మానం



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గంలో చెరువును కాపాడినందుకు హైడ్రాను ప్రశాంతిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం శనివారం అభినందించింది. అప్పటికే కొంత ఆక్రమణలకు గురై ప్రస్తుతం 29 గుంటలు మిగిలిన కుమ్మరి కుంటను కాపాడటంలో హైడ్రా చొరవ చూపింది. తాము వినతి పత్రం అందించిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువును పరిరక్షించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. 30 ఏళ్లుగా ఈ కుంటను కాపాడుకోవడానికి చాలా కష్టాలు పడ్డామని, ఐదేళ్లుగా రాత్రీ పగలు కాపలా కాయాల్సి వచ్చిందన్నారు. హైడ్రా సత్వరం స్పందించి 3,600 చ.గ.అడుగులు (సుమారు రూ.100 కోట్ల విలువ గల) ప్రభుత్వ భూమి కబ్జాదారుల నుంచి కాపాడిందన్నారు. చెరువుకు ప్రాణం పోయడమే కాదు.. ప్రశాంత్ హిల్స్ కాలనీ, సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న 5 వేల మంది ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ప్రసాదించారన్నారు.

మూగబోయిన 'గాంధీ' టెలిఫోన్

రూ.5 లక్షల బకాయిలు.. డిస్‌కనెక్ట్

- వార్డులకు నిలిచిన ఇంటర్‌కమ్ సేవలు
- రోగుల సమాచారం తెలియక ఆందోళన
- ఎమర్జెన్సీ వార్డులో వైద్యసేవలకు విఘాతం



గాంధీఆస్పత్రి: ఈ నంబరు తాత్కాలికంగా నిలిపివేయబడినది.. దిస్ నంబర్ టెంపరర్లీ డిస్‌కనెక్టెడ్.. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ల్యాండ్‌లైన్ టెలిఫోన్ (నంబర్: 040-27505566) మూగబోయింది. ఏడాది నుంచి సుమారు రూ.5 లక్షల బిల్లులు చెల్లించకపోవడంతో బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ తన టెలిఫోన్ సర్వీస్‌ను డిస్‌కనెక్ట్ చేసింది. మెయిన్ నంబరుకు అనుసంధానంగా ఆస్పత్రిలోని ఆయా వార్డులు, అత్యవసర విభాగాలు, ఆపరేషన్ థియేటర్లలోని సుమారు 400 టెలిఫోన్లకు చెందిన ఈపీఏబీఎక్స్ ఇంటర్‌కమ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో వైద్యసేవలకు విఘాతం కలగడంతోపాటు ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలు తెలుసుకునే అవకాశం లేకపోవడంతో సంబంధిత కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యసేవలకు అంతరాయం..

గాంధీ ఆస్పత్రి ల్యాండ్‌లైన్ టెలిఫోన్ సేవలు నిలిచిపోవడంతో వైద్య సేవలకు అంతరాయం కలుగుతోంది. ఈ నంబరుకు అనుసంధానంగా ఆస్పత్రిలోని 36 విభాగాలకు చెందిన వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర విభాగాలు, బ్లడ్‌బ్యాంకు, డైట్, ఎస్టాబ్లిష్‌మెంట్, ఆర్‌ఎంఓ, పరిపాలన విభాగం, సెక్యూరిటీ, పారిశుద్ధ్యం, ఫార్మసీ, ఓపీ తదితర విభాగాల్లో సుమారు 400 టెలిఫోన్లు ఇంటర్‌కమ్ ద్వారా పనిచేస్తుంటాయి. ఇవి నిలిచిపోవడంతో వైద్య సేవలకు విఘాతం కలుగుతోందని కొంతమంది వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోవిడ్‌లో దేశవ్యాప్త గుర్తింపు

ముషీరాబాద్ జైలు స్థలంలో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి నూతన భవన సముదాయం నిర్మించిన తర్వాత ఆస్పత్రి పాలన యంత్రాంగం కోరిక మేరకు 040-27505566 నంబరుతో టెలిఫోన్‌ను బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి సుమారు రెండు దశాబ్దాలుగా అదే నంబరు రాష్ట్ర ప్రజలకు సుపరిచితం. కరోనా సమయంలో రోగుల సమాచారం తెలుసుకునేందుకు ఈ నంబరు ఎంతో ఉపయోగపడింది.

బిల్లు రూ.5.76 లక్షలు.. బడ్జెట్ రూ.80వేలు..

గాంధీ ఆస్పత్రి టెలిఫోన్ బిల్లు నెలకు రూ.48 వేల చొప్పున ఏడాదికి రూ.5.76 లక్షలు చెల్లించాల్సి ఉండగా ఆస్పత్రి బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ.80 వేలు మాత్రమే కేటాయించారు. టెలిఫోన్ ఆవశ్యకతను గుర్తించిన గత సూపరింటెండెంట్‌లు ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ(హెచ్‌డీఎస్) నుంచి టెలిఫోన్ బిల్లు చెల్లించేవారు. ఏడాది నుంచి బిల్లు బకాయిలు చెల్లించకపోవడంతో సదరు సంస్థ టెలిఫోన్ సర్వీస్‌ను నిలిపివేసింది. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆస్పత్రి అధికారులు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

యోగక్షేమాలు తెలియక..

పలు రాష్ట్రాలతో పాటు తెలంగాణ జిల్లాలు, నగరం నలుమూలలకు చెందిన వేలాది మంది రోగులు గాంధీ ఇన్‌పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదల వద్ద సెల్‌ఫోన్ ఉండే అవకాశాలు తక్కువ. ఆయా వార్డుల్లో సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్యలు ఉంటాయి. ఈ క్రమంలో గాంధీ ఆస్పత్రి ఎంక్వయిరీ నంబరుకు ఫోన్ చేసి ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలు తెలుసుకుంటారు. ఇప్పుడు ఆ అవకాశం లేకపోవడంతో చికిత్స పొందుతున్న వారి యోగక్షేమాలు తెలియక తల్లడిల్లుతున్నారు. ప్రమాదాలకు గురై చావు బతుకుల్లో గాంధీ అత్యవసర విభాగానికి వచ్చేవారి సమాచారం వారి కుటుంబీలకు చేరవేయడంలో జాప్యం జరుగుతోంది.

జైళ్లశాఖ పనితీరు ప్రశంసనీయం

- అడిషనల్ డీజీపీ మహేష్ ఎం.భగవత్
- చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రంలో తేనెటీగల పెంపకం కేంద్రం



చర్లపల్లి ఓపెన్ జైల్‌లో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభిస్తున్న జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యమిశ్రా

కుషాయిగూడ: ఖైదీల సాధికారతకు తెలంగాణ జైళ్లశాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ ఎం.భగవత్ అన్నారు. ఖైదీలకు స్థిరమైన జీవనోపాధికి తెలంగాణ జైళ్లశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని శనివారం చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజెన్స్ డాక్టర్ సౌమ్యమిశ్రా ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారి సునీత ఎం.భగవత్, హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ బి.బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖైదీల సంక్షేమం కోసం చేపడుతున్న సంస్కరణలతో పాటు సామాజికంగా ప్రయోజనం కలిగేలా నైపుణ్యతతో కూడిన ఉపాధి మార్గాలు చూపుతున్న తీరు ఆదర్శనీయమన్నారు. తేనెటీగల పెంపకమనేది కేవలం తేనె ఉత్పత్తి చేయడం కోసం మాత్రమే కాదని, ఇది పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను పెంచడంలోనూ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అంతే కాకుండా తేనెను సంప్రదాయ, ఆధునిక వైద్యంలోనూ వినియోగిస్తారన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజెన్స్ డాక్టర్ సౌమ్యమిశ్రా ఐపీఎస్ మాట్లాడుతూ ఖైదీల జీవన నైపుణ్యాన్ని పెంపొందించాలనే సంకల్పంతోనే తేనెటీగల పెంపకం కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. తేనెటీగల నిర్వహణ, కాలనీ నిర్వహణ, తేనెటీగల వెలికితీత, మైనపు ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి అంశాల్లో ఖైదీలకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి సునీత ఎం.భగవత్, తెలంగాణ హార్టికల్చర్ జాయింట్ సెక్రటరీ బి.బాబు, తెలంగాణ బీ హబ్ సొసైటీ అధ్యక్షులు ఇందిరారెడ్డి, జైళ్లశాఖ డీఐజీలు డి.శ్రీనివాస్, ఎం.సంపత్ చర్లపల్లి జైల్ పర్యవేక్షణాధికారి ఎన్.శివకుమార్, చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం పర్యవేక్షణాధికారి జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి

తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్ట్



డిస్కౌంట్ కూపన్స్ బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న ఐపీఎస్ అధికారి అభిలాష్‌బిస్ట్ తదితరులు

పంజగుట్ట: మహిళలు వ్యాపారంలో రాణిస్తూనే సేవా కార్యక్రమాల్లోనూ విస్తృతంగా పాల్గొనాలని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్ట్ అన్నారు. సోమాజిగూడలోని జల్పన్ హోటల్‌లో హైదరాబాద్ వన్ రౌండ్ టేబుల్ 212, హైదరాబాద్ వన్ లేడీస్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు నిధుల సేకరణలో భాగంగా డిస్కౌంట్ కూపన్ బుక్‌లెట్స్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ బుక్‌లెట్‌లో దేశంలోని మహిళా వ్యాపారస్తులు నిర్వహిస్తున్న అన్ని వ్యాపారాలపై డిస్కౌంట్ కూపన్స్‌ఉంటాయని, ఒక్కో బుక్‌లెట్ రూ.2,500లతో కొనుగోలు చేస్తే రూ.2.5 లక్షల వరకు డిస్కౌంట్ కూపన్స్ లభిస్తాయని హైదరాబాద్ వన్ లేడీస్ సర్కిల్ హైదరాబాద్ చైర్‌పర్సన్ కరిష్మా జైన్ తెలిపారు. కూపన్స్ విక్రయించగా వచ్చిన నిధులతో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టేబుల్స్, మరుగుదొడ్లు నిర్మించడం, పిల్లలకు బుక్స్ పంపిణీ చేయడం తదితర సౌకర్యాలు కల్పిస్తామని ఆమె తెలిపారు.

మూడు రోజుల్లోనే పాకిస్తాన్‌కు గుణపాఠం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- ఆపరేషన్ సిందూర్‌ను హర్షిస్తూ తిరంగా ర్యాలీ



హెచ్‌బీకాలనీలో తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుషాయిగూడ: రాబోయే కాలంలో భారత సైన్యానికి, భారత ప్రధానికి సంపూర్ణ మద్దతుగా నిలిచి భారత మాతను రక్షించుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని శనివారం తిరంగా ర్యాలీ పేరుతో నిర్వహించిన సంఘీభావ ర్యాలీని ఆయన మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కాటిపల్లి జనార్దన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత మహిళల తిలకాన్ని తుడిచేసిన పాకిస్తాన్ ఉగ్రమూకలకు ఆపరేషన్ సిందూర్ పేరుతో బదులిచ్చి మూడు రోజుల్లో కకావికలం చేసి కాళ్లబేరానికి రప్పించిన తీరును హర్షిస్తూ ఈ సంఘీభావ ర్యాలీలను చేపట్టినట్లు తెలిపారు. మోదీ వెంట నిలిచి దేశాన్ని రక్షించుకోవాలన్నదే తిరంగా ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బీజేపీ మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర నాయకులు రవినాయక్, బ్రహ్మచారి, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్పొరేటర్లు చైతన్య, శ్రీవాణి, నాయకులు మర్రి మోహన్‌రెడ్డి, బాలచందర్, గోపాల్‌గౌడ్, వెంకటాచలం, చల్ల ప్రభాకర్, సంధ్యారెడ్డి, శాంతికిరణ్, నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు ఇస్తాం.. నిధులూ ఇస్తాం..



అధికారులతో సమీక్షలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేష్

- స్టోరేజీ సామర్థ్యాన్ని పెంచుకోండి
- కంటోన్మెంట్‌కు జలమండలి ఎండీ, ఎమ్మెల్యే సూచన
- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజల అవసరాలకు సరిపడా తాగునీటిని సరఫరా చేసేందుకు జలమండలి సిద్ధంగా ఉందని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. కంటోన్మెంట్ తాగునీటి సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో పాటు జలమండలి అధికారులు కంటోన్మెంట్ అధికారులతో కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కంటోన్మెంట్ తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. గతంలో కంటోన్మెంట్‌కు రోజుకు 59 లక్షల గ్యాలన్ల నీటిని సరఫరా చేసేవారమన్నారు. ప్రస్తుతం ఆ మోతాదును 69 లక్షల గ్యాలన్లకు పెంచినట్లు తెలిపారు. ఈ నీటి స్టోరీ సామర్థ్యంపై ఆయన బోర్డ్ అధికారులతో చర్చించారు. తాము సరఫరా చేసే నీటికి కనీసం మూడు రెట్లు స్టోరేజీ సామర్థ్యం ఉన్నట్లయితేనే సమర్థవంతంగా నీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు కంటోన్మెంట్‌లో స్టోరేజ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్లో అవసరమైన మేరకు కొత్తగా పంప్ హౌస్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అయితే ఇందుకు తగిన స్థలాలను కేటాయించాలని కోరారు. నాలుగు రోజుల క్రితం తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కంటోన్మెంట్‌లోని ప్రధాన సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యను ప్రస్తావించగా ముఖ్యమంత్రి నేరుగా జలమండలి ఎండీకి ఫోన్ చేసి కంటోన్మెంట్ బోర్డులో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. గత పాలకులు కంటోన్మెంట్, రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు అనే రీతిలో వ్యవహరిస్తూ, సమస్యను ఒకరిపై ఒకరు వేసుకుంటూ వచ్చారని ఆరోపించారు. భవిష్యత్ తరాల అవసరాల దృష్ట్యా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా తాను ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. కంటోన్మెంట్‌లో ప్రతి సమస్యను టీపీటీ బకాయిలతో ముడిపెట్టడం సరికాదని, కేంద్రం చెల్లించాల్సిన రూ.800 కోట్ల సర్వీస్ చార్జి బకాయిల్లో కనీసం రూ.100 కోట్లు రాబట్టి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కంటోన్మెంట్ సీఈవో పథకం నాయక్, జలమండలి సీజీఎం రాజేష్, జీఎంలు రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వినోద్, కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్, వాటర్ వర్క్స్ సూపరింటెండెంట్ రాజకుమార్, బోర్డు సభ్యురాలు నర్మదా తదితరులు పాల్గొన్నారు.

కోటలో కేంద్ర పురాతత్వ శాఖ అధికారుల పర్యటన



గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవార్ల బోనాల నిర్వహణకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర పురాతత్వ శాఖ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిఖిల్‌దాస్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ కోట కన్జర్వేషన్ అసిస్టెంట్ మల్లేశంతో కలిసి కోటలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బోనాల నిర్వహణకు అవసరమైయ్యే ఏర్పాట్లను పరిశీలించారు. కోటలో బోనాలు జరిగే తొమ్మిది పూజల్లో భక్తులకు, పర్యాటకులకు కోటలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. తమవంతు సహకారంగా దేవాదాయ శాఖ వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు ఏర్పాట్లలో కూడా సహకరిస్తామన్నారు. వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, శ్రీ విశ్వకర్మ సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారిలను కలిసి బోనాల నిర్వహణకు ఎప్పటిలాగే సహాయ సహకారాలు అందించాలని కోరారు.

చిత్రపురి అక్రమాలపై నేడు 'చలో ఇందిరాపార్క్'

మణికొండ: చిత్రపురి కాలనీ పేరుతో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని, దానికి పాల్పడిన హౌసింగ్ బోర్డు సొసైటీ కమిటీని రద్దు చేయడంతో పాటు పేద సినిమా కార్మికులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఆదివారం చలో ఇందిరాపార్క్ పేరుతో నిరాహార దీక్ష చేస్తున్నామని నవోదయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.శివశంకర్ పటేల్ తెలిపారు. కోర్టు ఉత్తర్వులను పాటించకుండా హౌసింగ్ కో ఆపరేటివ్ శాఖ అధికారులు చిత్రపురి అవినీతి కమిటీతో పేద సినీ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కమిటీని వెంటనే రద్దు చేసి అడహక్ కమిటీని నియమించి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపించాలనే డిమాండ్‌తో ఉద్యమం చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష ఉంటుందని, పెద్ద ఎత్తున సినీ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హెచ్‌సీయూకు హెచ్‌ఏఎల్ నుంచి నిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'డిజిటల్ ట్విన్ టెక్నాలజీ'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) రూ.5 కోట్ల నిధులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద గ్రాంటు రూపంలో అందించింది. హెచ్‌సీయూలో పరిశోధనలు, ఆవిష్కరణ సామర్థ్యాల పెంపునకు అవకాశం కలుగుతుంది. జాతీయ స్థాయిలో అధునాతన సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో హెచ్‌ఏఎల్ నిధులను అందించేందుకు ముందుకొచ్చింది.

ఈ నిధులతో చేపట్టే పనులు..

అత్యాధునిక డిజిటల్ ట్విన్ రీసెర్చ్ ల్యాబ్ ప్రాక్టికల్స్ ఆన్ స్కిల్ డెవలప్‌మెంట్ కోసం శిక్షణ ల్యాబ్ డిజిటల్ ట్విన్ టెక్నాలజీలలో విద్యార్థులు, పరిశోధకుల నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిరంతరం శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లను సులభతరం చేసేందుకు ఆడిటోరియం ఏర్పాటు చేస్తారు. ఏరోస్పేస్, హెల్త్‌కేర్ తయారీ, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలకు అత్యంత కీలకమైన డిజిటల్ ట్విన్ సిస్టమ్స్‌లో అత్యాధునిక పరిశోధన ఇంటర్ డిసిప్లినరీ సహకారం, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి ఈ కేంద్రం రూపొందించబడింది.

అంకితభావంతో పనిచేస్తే ఆతిథ్య రంగంలో రాణించవచ్చు



ప్రముఖ చెఫ్, ఐఎఫ్‌సీఏ అధ్యక్షుడు మంజిత్ సింగ్ గిల్‌ను సన్మానిస్తూ..

రాయదుర్గం: ప్రపంచంలో ఆతిథ్యరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ కలినరీ అసోసియేషన్స్ అధ్యక్షుడు, దిగ్గజ చెఫ్ మంజిత్‌సింగ్ గిల్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీ హబ్' ప్రాంగణంలో రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ తన 31వ రీజెన్సీ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆతిథ్యరంగంలో నాయకత్వం పెంపొందించడం, ఆ పరిశ్రమ వృద్ధికి అంకితభావంతో కృషి చేసిన వారిని సత్కరించడం అభినందనీయం అన్నారు. ఈ రంగం ఎంతో పోటీతో కూడుకున్నదని, వినియోగదారుల ఇష్టాన్ని గుర్తించి నిరంతరం కొత్తదనంతో పనులు చేసేవారికి తప్పక గుర్తింపు వస్తుందన్నారు. రీజెన్సీ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను చెఫ్ మంజిత్‌సింగ్ గిల్‌తో పాటు పలువురికి అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ పి.రమేష్‌కుమార్‌రెడ్డి, సంస్థ చైర్మన్ ఎండీ ఫతేకాలేక్, ఐఎఫ్‌సీఏ ప్రధాన కార్యదర్శి విజయభాస్కరన్, మారియట్ జీఎం ఎలీజర్ ప్రకాశ్, రాయల్ ఆర్చిడ్స్ హోటల్స్ ఉపాధ్యక్షుడు కుమార్ మానిష్, వివిధ హోటళ్ల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

8న విద్యార్థులకు ప్రతిభా పురస్కార్ అవార్డులు



ప్రతిభా పురస్కార్ అవార్డుల ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో వచ్చేనెల 8వ తేదీన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన లింగాయత్ కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్ తెలిపారు. అవార్డుల కార్యక్రమాన్ని బిర్లా సైన్స్ సెంటర్, భాస్కర ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి 3 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ ఆహ్వాన పత్రికను శనివారం కేంద్ర కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్, యువజన విభాగం అధ్యక్షుడు పెద్దపట్ల భరత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణస్థాయి నుంచి పట్టణాల్లో చదివిన విద్యార్థులకు ఈ పురస్కారాలు అందజేస్తామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 500లకుపైగా మార్కులు సాధించిన వారికి, ప్రైవేట్ పాఠశాల్లో చదివి 520 మార్కులకు పైగా సాధించిన వారికి పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ నెల 29వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

3 నెలల రేషన్ ఒకేసారి

జూన్‌లో సరుకుల డ్రాకు వెసులుబాటు ● ఏర్పాట్లు చేస్తున్న పౌర సరఫరాల శాఖ



సాక్షి, సిటీబ్యూరో: రానున్న వర్షాకాలంతో పాటు ప్రకృతి విపత్తుల దృష్ట్యా మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసేందుకు పౌర సరఫరాల యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ బియ్యం కోటాను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రేషన్ డీలర్లకు సమాచారం అందజేసింది. ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో జూన్ 30లోగా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించింది. జూన్ నెలలో వర్షాలు పడి వాగులు, వంకలు పొంగి పొరుతుంటాయి. దాంతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆహార ధాన్యాల రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మూడు నెలల కోటా విడుదలైంది.

డైలీ కీ రిజిస్టర్(డీకేఆర్)లో..

ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు డైలీ కీ రిజిస్టర్(డీకేఆర్)లో నెలవారీ కోటా బదులు ఒకేసారి మూడు నెలల కోటాను కేటాయిస్తూ పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సుమారు 17.57 లక్షల కార్డులు ఉండగా, అందులో సుమారు 62,26,523 యూనిట్లు ఉన్నాయి. దీంతో మూడు నెలలకు కలిపి సుమారు 11,02,32.403 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించింది. ఆహార భద్రత కార్డులు కలిగిన ఎఫ్ఎస్‌సీ కేటగిరిలో యూనిట్‌కు నెలకు ఆరు కిలోల బియ్యం చొప్పున 3 నెలలకు 18 కిలోలు, ఏఎఫ్ఎస్‌సీ కార్డులకు నెలకు 35 కిలోల చొప్పున 105 కిలోల బియ్యం, అన్నపూర్ణ కార్డులకు నెలకు 10 కిలోల చొప్పున 30 కిలోలు ఉచిత బియ్యం కోటాను కేటాయించింది. కార్డుపై నెలకు కిలో పంచదార చొప్పున మూడు కిలోలు, గోధుమలు నెలకు ఐదు కిలోల చొప్పున 15 కిలోలు చొప్పున కోటా కేటాయించారు. దీంతో లబ్ధిదారులకు జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల రేషన్ కోటాను డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించినట్లయ్యింది.

సన్న బియ్యానికి డిమాండ్

ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో లబ్ధికుటుంబాల నుంచి డిమాండ్ పెరిగింది. ఇదిలా ఉండగా రేషన్ దుకాణాల్లో సైతం మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉంచడానికి సరిపడా స్థలం ప్రశ్నార్థకంగా మారింది.

గ్రేటర్ పరిధిలో మూడు నెలల బియ్యం కోటా కేటాయింపు ఇలా..

జిల్లా	రేషన్ కార్డులు	యూనిట్లు	బియ్యం కోటా (మెట్రిక్ టన్నులు)
హైదరాబాద్	6,47,282	24,24,824	42,619.836
రంగారెడ్డి జిల్లా	5,72,792	19,36,346	34,679.374
మేడ్చల్-మల్కాజిగిరి	5,37,810	18,65,353	33,933,198

'హానర్'లో సుందరీమణుల సందడి



సాక్షి, సిటీబ్యూరో: మిస్ వరల్డ్–2025 పోటీలో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చిన సుందరీమణులను ప్రముఖ నిర్మాణ సంస్థ హానర్ హోమ్స్ ఆతిథ్యంతో సత్కరించింది. హానర్ హోమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా ఈ వేడుక నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ పోటీదారులకు ఆప్యాయత, సంప్రదాయ చక్కదనంతో స్వాగత సత్కారాలు అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మిస్ వరల్డ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు తీసుకురావడంలో తెలంగాణ ప్రభుత్వం చూపిన దార్శనిక నాయకత్వం, నిబద్ధతకు హానర్ హోమ్స్ కృతజ్ఞతలు తెలిపింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, గొప్ప సంప్రదాయాలను నిశితంగా పరిశీలించడానికి ప్రతినిధి బృందం కోసం హానర్ హోమ్స్ గైడెడ్ టూర్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో హానర్ హోమ్స్ కో–ఫౌండర్ అండ్ ఎండీలు ఎస్ రాజమౌళి, పీ వెంకటేశ్వర్లు, ఎం బాలు చౌదరి, వై స్వప్న కుమార్ పాల్గొన్నారు.

టోస్ట్‌మాస్టర్స్ 'జూబిలెన్స్' సదస్సు

- భాషా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి కేంద్రంగా
- ప్రపంచవ్యాప్తంగా 143 దేశాల్లో విస్తరించిన క్లబ్స్




సాక్షి, సిటీ బ్యూరో: హైదరాబాద్‌లోని ఈ ఎస్‌సీఐ కాలేజీలో ప్రతిష్టాత్మక టోస్ట్‌మాస్టర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 126వ వార్షిక సదస్సు 'జూబిలెన్స్' ప్రారంభమైంది. భాషా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి కేంద్రంగా నిలవనున్న ఈ సదస్సుకు రీజియన్ 8 ఇంటర్నేషనల్ డైరెక్టర్ టోస్ట్‌మాస్టర్ సుజిత్ సుకుమారన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా 2017 ప్రపంచ ప్రసంగ పోటీ విజేత మను వాసుదేవన్ స్ఫూర్తిదాయక సూచనలు హైలైట్‌గా నిలిచాయి. క్లబ్ గ్రోత్ డైరెక్టర్ టోస్ట్‌మాస్టర్స్ ఇంటర్నేషనల్ సాయినాథ్ గుప్తా మాట్లాడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌కు ఎంతో మంది గ్రామీణ యువత చదుకోడానికి, జాబ్ కోసం వస్తూ ఉంటారని, అలాంటి వారికి పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, లీడర్‌షిప్ స్కిల్స్ నేర్పించడంలో టోస్ట్‌మాస్టర్స్ క్లబ్ ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. సమీపంలోని టోస్ట్‌మాస్టర్ క్లబ్ లో ఎవరైనా ఫ్రీగా ప్రవేశం పొంది స్కిల్స్ సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 143 దేశాల్లో 17,000కి పైగా క్లబ్‌లతో విస్తరించి ఉందని, 18 సంవత్సరాల పైబడి ఉన్న ఎవరైనా సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా స్పీచ్ పోటీలతో పాటు ఇంటర్నేషనల్ స్పీచ్, హ్యూమరస్ స్పీచ్, తాత్కాలిక స్పీచ్ లాంటి ప్రసంగ విశ్లేషణ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, నాగపూర్ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు.



ఉత్సాహంగా బెల్లెజా సీజన్-2

బంజారాహిల్స్: అందం, ఆత్మవిశ్వాసం, ప్రతిభకు వేదికగా నిలిచే ప్రతిష్టాత్మక బెల్లెజా సీజన్–2 అధికారికంగా ప్రారంభమైంది. మహిళా సాధికారత, ఫ్యాషన్ ప్రోత్సహించడమే లక్ష్యంగా వీ2వీ ఈవెంట్స్ మీడియా వ్యవస్థాపకురాలు, సీఈఓ వందన దాసరి ఈ పోటీని నిర్వహించారు. దీనికి జాతీయ షో–కోచ్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ సుధా జైన్ సృజనాత్మక రూపకల్పన చేశారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ మహిళా వింగ్ అధ్యక్షురాలు పట్లోళ్ల రూపా రెడ్డి, ప్రముఖ డబ్బింగ్ /వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్, శాస్త్రీయ కర్ణాటక గాయని శ్రీవల్లి దేవసేన హాజరయ్యారు.



విహారం.. విలాసం..


సెలవుల వేళ.. సరికొత్త యాత్రల ట్రెండ్

- కూల్ ప్లేసెస్ మాత్రమే ఎంచుకునే ఆలోచనలకు బై
- మండుటెండల్లో సైతం రాజస్థాన్ ఎంపిక
- పీస్‌ఫుల్, రద్దీ నిల్ ఉండే ప్రాంతాల వైపు మనోళ్ల చూపు
- తాజా బుకింగ్స్ అనుసరించి సీజన్‌పై ఆపరేటర్ల విశ్లేషణ

ఒకప్పుడు ఎండను తప్పించుకోవడమే వేసవి విహారాల లక్ష్యంగా ప్రయాణాలు ప్లాన్ చేసేవారు. అయితే ఇప్పుడు దీంతో పాటే వైవిధ్యభరిత జ్ఞాపకాలను కూడా అందుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా విభిన్న రకాల హాలిడే స్పాట్స్‌ను అన్వేషిస్తున్నారు. వేసవి సీజన్ ముగింపునకు వస్తున్న నేపథ్యంలో.. ఈ సీజన్‌లో బుకింగ్స్ అనుసరించి ప్రముఖ ట్రావెల్ ఆపరేటర్లు చెబుతున్న లెక్కల ప్రకారం.. మారిన సిటిజనుల విహార యాత్రాభిరుచులు ఇలా ఉన్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

చాలా మంది సిటిజనులు ప్రశాంతతనే అత్యంత ప్రధాన గమ్యంగా మార్చుకుంటున్నారు. అందుకే అర్థవంతమైన ప్రయాణం కోసం ఆఫ్–సీజన్ గమ్యస్థానాలను ఎంచుకుంటున్నారు. అంతగా పర్యాటకుల రద్దీ కనబడని ప్రాంతాలను కోరుకుంటున్నారు. 'ఈశాన్య ప్రాంతాలకు, ముఖ్యంగా మేఘాలయకు బుకింగ్స్‌లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. అని ఒక ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలో పని చేస్తున్న ట్రావెల్ ఎక్స్‌పర్ట్ లక్ష్మి చెప్పారు. 'ఈశాన్య, హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్ ఈ తరహా టూర్స్‌కి ప్రసిద్ధి చెందినప్పటికీ రాజస్థాన్, వారణాసి వంటి ఆధ్యాత్మిక పట్టణాలు ఆఫ్–సీజన్‌లో అనూహ్య డిమాండ్‌ను చవిచూస్తున్నాయని మరొక ఆపరేటర్ సృజన చెప్పారు. ప్రకృతి అందాలకు నిలయమైన ఉత్తరాఖండ్‌లోని ఔలీ, మేఘాలయలోని షిల్లాంగ్‌కు ఈ ఏడాది డిమాండ్ అధికంగా ఉందని చెప్పారు. ఇప్పటికీ మానసిక ప్రశాంతత కోరుకునే వారిని లద్దాఖ్ పాక్షిక సాహస యాత్రికులను కేదార్‌నాథ్ ఆకర్షిస్తున్నాయి.






ట్రెక్కింగ్‌కు జై..

సమ్మర్‌లో వెనుకంజలో ఉండే ట్రెక్కింగ్ సరదా..ఇప్పుడు ఊపందుకుంటోంది. ముఖ్యంగా పూర్తిస్థాయిలో తమకు వెన్నుదన్నుగా ఉండే సంస్థలు నిర్వహించే ఆర్గనైజ్డ్ ట్రెక్కింగ్‌కు ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది. హంప్టా పాస్, భంగు సరస్సు చంద్రఖని ట్రెక్ ట్రయిల్స్‌కు బృందాలు బుక్ చేస్తున్నాయి. భద్రత, వసతి సౌకర్యాలతో పాటు అన్ని రకాల మద్దతు అందించే ఇండియాహైక్స్ మోక్స్‌టైన్ వంటి ఏజెన్సీల సారథ్యంలో నిర్వహించే ట్రెక్‌లకు బుకింగ్స్ బాగా పెరిగాయి.

మండే ఎడారిపై మనసు..

'ఇప్పుడు సిటిజనులు కేవలం చల్లని ప్రదేశాలను మాత్రమే సందర్శించాలని కోరుకోవడం లేదు. వాతావరణం అనుకూలించకున్నా రాజస్థాన్‌ను సైతం ఎంచుకుంటున్నారు. 'ఈ సమయంలో అసలైన డిసర్ట్ బ్యూటీని ఎంజాయ్ చేయాలని మాత్రమే కాదు ఈ సమయంలో అక్కడ హోటల్ ధరలు కూడా తక్కువగా ఉంటాయి' అని సిటీలో ఓ ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీని నడుపుతున్న అబ్దుల్ హుస్సేన్ అన్నారు. సిటిజనుల డిమాండ్ వల్ల మౌంట్ అబూకి బుకింగ్స్ ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం సీజన్ కానప్పటికీ వారణాసి కూడా డిమాండ్‌లోనే ఉంది.





అంతర్జాతీయం.. వ్యూహాత్మకం..

సిటీ నుంచి సమ్మర్‌లో చేసే అంతర్జాతీయ ప్రయాణం రెండు రకాలుగా మారిందని ఆపరేటర్లు చెబుతున్నారు. ఒకటి భారీ బడ్జెట్ కాగా రెండోది వ్యూహాత్మకం. విదేశాలకు వెళ్లాలి కానీ వ్యయప్రయాసలు తక్కువ ఉండాలి అనే ఆలోచన కలిగిన వారు వ్యూహాత్మకంగా ప్లాన్ చేస్తున్నారు. ఈ వేసవిలో ఖర్చుకు వెనుకాడని నగరవాసులు స్విట్జర్లాండ్, పారిస్, ఇటలీ, ఉత్తర ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్, కజకిస్తాన్, ఉరుమ్‌కియిన్ చైనా, ప్యాకేజీ టూర్‌లను బుక్ చేస్తున్నారు. వీసా సమస్యలు తక్కువగా ఉండడం.. ప్రత్యక్ష విమానాలు చౌకైన మార్పిడుల కారణంగా థాయిలాండ్, ఈజిప్ట్ కూడా సిటిజనుల ఆదరణ పొందుతున్నాయి. టర్కీ, కైరో–ఇస్తాంబుల్‌కు కూడా బుకింగ్స్ ఉన్నప్పటికీ తర్వాతి పరిణామాల నేపథ్యంలో టర్కీకి అత్యధిక క్యాన్సిలేషన్స్ వచ్చాయని బుకింగ్ ఏజెంట్ రియాజ్ అహ్మద్ అంటున్నారు.

మే మధ్య నుంచే ప్రారంభం..

'తక్కువ దూరంలో ఉండి, తరచూ వెళ్లే ప్రాంతాలనే కుటుంబ సమేతంగా వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే సోలో యాత్రికులు, కొన్ని ప్రత్యేక బృందాలు మాత్రం కొత్తరకం టూర్లకు సై అంటున్నారు. ఏప్రిల్ చివరి నుంచి మే మధ్యలో సమ్మర్ ప్రా గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. మే మొదటి రెండు వారాల్లో భారీ రద్దీని చవిచూశామని టూర్ ఆపరేటర్లు చెబుతున్నారు.




సుష్మితాసేన్

బ్యూటీ కేరాఫ్ సిటీ..

మిస్ యూనివర్స్, మిస్ వరల్డ్ రెండూ అందించిన హైదరాబాద్
రెండు టైటిల్స్ దక్కించుకున్న ఏకైక నగరంగా ఘనత


దయానా హేడెన్..

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇస్తున్న హైదరాబాద్ నగరం పాతికేళ్లకు ముందే ఈ పోటీల్లో తన ప్రస్థానాన్ని ఘనంగా చాటింది. దేశానికి విశ్వసుందరి, ప్రపంచ సుందరి రెండు కిరీటాలనూ అందించిన తొలి నగరంగా చరిత్ర సృష్టించింది.

హేడెన్ హైదరాబాదీయే..

నగరానికి చెందిన ఆంగ్లో–ఇండియన్ కుటుంబంలో 1973వ సంవత్సరం మే 13న జన్మించిన డయానా హేడెన్.. సికింద్రాబాద్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో తన పాఠశాల విద్యాభ్యాసం పూర్తిచేశారు. పాఠశాల విద్యార్థినిగా ఉన్నప్పుడే ఆమె తల్లిదండ్రులు విడిపోయారు. దీంతో ఆమె 13 సంవత్సరాల వయసులోనే తన భృతి కోసం పనిచేయడం ప్రారంభించాల్సి వచ్చింది. నగరంలో ఆమె మోడలింగ్ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పుడు ఎన్ కోర్ అనే ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో పనిచేశారు. అనంతరం గ్లామర్ రంగంలో అడుగుపెట్టి నగరం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ప్రపంచ సుందరి కిరీటాన్ని ఐశ్వర్యారాయ్ దక్కించుకున్న తర్వాత 3వ సారి దేశానికి అందించిన ఘనత డయానా హేడెన్ దక్కించుకున్నారు. అంతేకాదు హైదరాబాద్‌ను కూడా చరిత్రకు ఎక్కించారు. ఈ 1997 మిస్ వరల్డ్ పోటీ విజేత మెయిన్ టైటిల్‌తో పాటు మూడు సబ్–టైటిళ్లను కూడా గెలుచుకున్నారు. అలా గెలిచిన ఏకైక మిస్ వరల్డ్ టైటిల్ హోల్డర్‌గా నిలిచారు. ఆ తర్వాత సినిమా, టీవీ రంగంలో ఆమె స్థిరపడ్డారు.

విశ్వసుందరిని అందించిందీ మనమే..

మిస్ యూనివర్స్ కిరీటాన్ని దేశానికి అందించిన సుష్మితాసేన్ కూడా హైదరాబాదీనే. ఆమె 1975వ సంవత్సరంలో నవంబర్ 19న నగరంలోని బెంగాలీ బైద్య కుటుంబంలో జన్మించారు. భారత వైమానిక దళం మాజీ వింగ్ కమాండర్ షుబీర్ సేన్, ఆభరణాల డిజైనర్ అయిన సుబ్ర సేన్‌లు ఆమె తల్లిదండ్రులు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. అనంతరం 1994లో మిస్ యూనివర్స్ టైటిల్ గెలుచుకున్న మొదటి భారతీయ మహిళగా నిలిచి, బాలీవుడ్‌లో స్థిరపడి పలు హిందీ చిత్రాల్లో పనిచేశారు. నగరంలో తాను స్థాపించిన ఐయామ్ షి పోటీల సందర్భంగా పలుమార్లు ఆమె నగరాన్ని సందర్శించారు.

సీజనల్ షో..
'జో చాహే మ్యాంగో'..

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ థింగ్స్ టు డూ హైదరాబాద్ సంస్థతో కలిసి 'జో చాహే మ్యాంగో' ఉత్సవాన్ని ప్రారంభించింది. 'మామిడి సీజన్‌ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా మామిడి పండు ఆధారంగా తయారైన డెజర్ట్‌లు, చీజ్‌కేక్ తదితరాలతో పాటు మ్యాంగో కేక్ క్యాండిల్ వంటి వర్క్‌షాప్‌లు, వీనుల విందు చేసే లైవ్ మ్యూజిక్, ఫ్లీ మార్కెట్, టోట్ బ్యాగ్ పెయింటింగ్, ఫేస్ ఆర్ట్, టాటూలు అందుబాటులో ఉంటాయని మాల్ ప్రతినిధి తెలిపారు. ఈ ఈవెంట్ ఆదివారం వరకూ కొనసాగుతుందన్నారు.





రకరకాల వరి.. ఆరోగ్య సిరి

మన దైనందిన ఆహారంలో తినే బియ్యం రకాలను మార్చుకుంటే.. ప్రస్తుతం మన నిత్య జీవితంలోని అనారోగ్య సమస్యలు తగ్గుతాయని మీకు తెలుసా? మన ముందు తరాల వారు ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు.. వైవిధ్యభరితమైన ఔషధ, పోషక గుణాలున్న ఎన్నెన్నో అపురూపమైన పురాతన వరి వంగడాలను మనకు సుసంపన్న ఆహార సంస్కృతితో పాటు అందించారు. వాటిని రకరకాల కారణాల వల్ల మనం దూరం చేసుకున్నాం. లావుగా ఉన్నాయని.. వండుకోవటానికి, తినటానికి అనువుగా లేవని.. దిగుబడి తక్కువని.. ఇలా అనేక కారణాలతో గత కొద్ది దశాబ్దాలుగా ఇవి మన పళ్లాల్లోంచి మాయమైపోయాయి. కానీ ఈ బియ్యం పోషకాల గనులు. ఆధునిక జీవనశైలి వల్ల ఇప్పుడు మనల్ని వేధిస్తున్న అనేక రుగ్మతలు, అనారోగ్యాల నుంచి కూడా మనకు విముక్తి కలిగించగల సత్తా మన దేశీ వరి వంగడాలకు ఉంది! ఆ విశేషాలేమిటో తెలుసుకుందామా?

- సాక్షి, స్పెషల్ డెస్క్

వివిధ రకాలతో విభిన్న ప్రయోజనాలు
తరతరాలుగా వాడుతున్న బియ్యం
ఆధునికత మోజులో దూరం చేసుకున్నాం
సంపూర్ణ ఆరోగ్యానికి సరిపడా రకాలు

గుండె ఆరోగ్యం కోసం..

ఉత్తమ బియ్యం: ఎర్ర బియ్యం, ముడి బియ్యం, మట్ట బియ్యం (కేరళ ఎర్ర బియ్యం)

ఎందుకు?
- యాంటీ ఆక్సిడెంట్లు, మెగ్నీషియం, పీచు పదార్థం మెండు
- ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) తగ్గిస్తాయి.
- రక్తపోటును తగ్గిస్తుంది. రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి.

సూచన: మీ గుండె ఆరోగ్యాన్ని పది కాలాల పాటు పదిలంగా ఉంచుకోవాలంటే తెల్ల బియ్యాన్ని వదిలేసి రోజువారీ ఆహారంగా ఈ రకాల బియ్యాన్ని తీసుకోండి.

మధుమేహ నియంత్రణ కోసం

ఉత్తమ బియ్యం: నల్ల బియ్యం, ముడి బియ్యం, ఎర్ర బియ్యం, సోనా మసూరి (ఒంటి పట్టు)

ఎందుకు?
- తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్(జీఐ): ఈ రకాల బియ్యం తిన్న తర్వాత రక్తంలో షుగర్ వెంటనే పెరగదు. నెమ్మదిగా పెరుగుతుంది.
- పీచు అధికం: రక్తంలో షుగర్ స్థాయిని సమతుల్యంగా నిర్వహించుకోవటానికి ఉపయోగ పడతాయి.
- నల్ల బియ్యంలో ఆంథోస్యానిన్లు కూడా 'ఇన్సులిన్ సెన్సిటివిటీ' పెంపుదలకు దోహదపడతాయి.

సూచన: పూర్తిగా పాలిష్ చేసిన తెల్ల బియ్యం తినకండి. పప్పులు లేదా కూరగాయలతో కలిపి సమతులాహారం తీసుకోండి.

రక్తహీనత / ఐరన్ లోపం తగ్గించడానికి

ఉత్తమ బియ్యం: నల్ల బియ్యం, ఎర్ర బియ్యం, వెదురు బియ్యం, రక్తశాలి బియ్యం

ఎందుకు?
- ఐరన్, ఫోలేట్ అధిక మోతాదులో ఉంటాయి
- రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంపొందించేందుకు వెదురు బియ్యం, ఎర్ర బియ్యం తింటే మంచిదని చెబుతుంటారు

సూచన: ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలతో లేదా బెల్లంతో కలిపి ఈ రకాల అన్నం తింటే ఐరన్ ఒంటికి పడుతుంది.

ఎముక పుష్టి, కీళ్ల ఆరోగ్యం కోసం..

ఉత్తమ బియ్యం: మట్ట బియ్యం (కేరళ ఎర్ర బియ్యం), వెదురు బియ్యం

ఎందుకు?
- కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం ఈ రకాల బియ్యంలో పుష్కలంగా ఉంటాయి
- గిరిజనులు కీళ్ల వాతానికి విరుగుడుగా సంప్రదాయ వైద్యంలో భాగంగా వెదురు బియ్యాన్ని వాడుతుంటారు

సూచన: ఈ రకాల బియ్యంతో తయారు చేసిన గంజి తాగితే మెరుగైన ప్రయోజనాలు ఉంటాయి.

ఊబకాయం / బరువు నియంత్రణకు..

ఉత్తమ బియ్యం: ముడి బియ్యం, ఎర్ర బియ్యం

ఎందుకు?..: పీచు అధికం కావడం వల్ల కడుపు నిండినట్లు అనిపించేలా చేస్తాయి.
- జిగట(స్టార్చ్) తక్కువ కావడంతో తక్కువ కేలరీలు తీసుకునేలా చేస్తాయి.
- పొట్టలో మేలు చేసే సూక్ష్మ జీవరాశిని, జీవక్రియను పెంపొందిస్తాయి.

సూచన: బరువు బాగా తగ్గాలంటే దంపుడు బియ్యం + సలాడ్లు, మాంసకృత్తులను తీసుకోవాలి.

ఆరోగ్యకరమైన జీవక్రియ కోసం..

ఉత్తమ బియ్యం: ముడి బియ్యం, సోనా మసూరి, ఎర్ర బియ్యం

ఎందుకు?..: ఈ రకాల అన్నం మృదువుగా, జీర్ణం చేసుకోవటానికి అనువుగా ఉంటుంది
- జబ్బు తగ్గిన తర్వాత కోలుకోవటానికి లేదా ఉదరకోశ ఇబ్బందులున్న వారికి ఉపయోగకరం
- కడుపులో సూక్ష్మ జీవరాశుల సమతుల్యతను పెంపొందిస్తుంది.

సూచన: ఈ రకాల బియ్యంతో పెరుగన్నం లేదా కొద్దిగా కారంగా ఉండే కిచిడీ తింటే మంచిది.

మానసిక ఆరోగ్యం, సుఖనిద్ర కోసం..

ఉత్తమ బియ్యం: కాలాజీర బియ్యం, ఇంద్రాణి బియ్యం

ఎందుకు?
- మనసును స్థిమితపరచటానికి ఈ రకాల బియ్యాన్ని తినిపించే సంప్రదాయం ఉంది
- సెరటోనిన్, మెలటోనిన్ స్థాయిలను సహజ రీతిలో పెంపొందిస్తాయి

సూచన: రాత్రి భోజనంలో ఈ రకాల బియ్యాన్ని తింటే హాయిగా ఉండి, సుఖంగా నిద్ర పడుతుంది.

యాంటీ ఆక్సిడెంట్లు / వయోభారాన్ని తగ్గించేందుకు..

ఉత్తమ బియ్యం: నల్ల బియ్యం, ఎర్ర బియ్యం, అటవీ రకాల (వైల్డ్ వెరైటీస్) బియ్యం

ఎందుకు?
- ఆంథోస్యానిన్లు, పోలీఫెనాల్స్ పుష్కలంగా ఉంటాయి.
- ఫ్రీ రాడికల్స్‌ను, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను అరికడతాయి.
- చర్మం, దేహంలోని అనేక శరీర భాగాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.

సూచన: సౌందర్య వృద్ధికి, డీటాక్స్ కోసం డైట్లలో ఈ బియ్యం రకాలు ఎంతో ఉపయోగకరం.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం..

ఉత్తమ బియ్యం: ఉప్పుడు బియ్యం, గోవింద్‌భోగ్, కాలాజీరా బియ్యం

ఎందుకు?..: సులువుగా జీర్ణమవుతాయి
- సహజమైన ఫోలేట్, శక్తి, బి–విటమిన్లు పుష్కలం
- గర్భంలో బిడ్డ పెరుగుతున్న కాలంలో, ప్రసవానంతర కాలంలో అవసరమైన రోగ నిరోధకశక్తిని ఇస్తాయి.

సూచన: ప్రసవానికి మూడు నెలల ముందు నుంచి, ప్రసవానంతర కాలంలో ఈ బియ్యాలతో గంజి చేసుకొని తాగితే మేలు.

మాంసకృత్తుల కొరత తీర్చేందుకు..

ఉత్తమ బియ్యం: వెదురు బియ్యం, ముడి బియ్యం (పప్పులతో పాటు తీసుకోవాలి)

ఎందుకు?
- మిగతా రకాల బియ్యంతో పోల్చితే వీటిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి
- వెదురు బియ్యంతో పప్పులు కలిపి తింటే అధికంగా అమైనో ఆమ్లాలు అందుతాయి

సూచన: వరి అన్నం తినేటప్పుడు ఎప్పుడైనా పప్పులతో కలిపి తినాలి లేదా పులియబెట్టిన ఆహార పదార్థాలను కలిపి తింటే మాంసకృత్తుల జీవ లభ్యత (బయో అవైలబిలిటీ) పెరుగుతుంది.

అవసరానికి తగిన రకం బియ్యాన్ని ఎంపిక చేసుకోవటం ఎలా?

ఆరోగ్యాకాంక్ష	తగిన వరి రకాలు
బరువు తగ్గాలనుకుంటే	ముడి / ఎర్ర బియ్యం
తిరిగి శక్తిని పుంజుకోవాలంటే	బాస్మతి / గోవింద్‌భోగ్
షుగర్ నియంత్రణ	నల్ల బియ్యం
ఎముక పుష్టి	మట్ట / వెదురు బియ్యం
సౌందర్యం + యాంటీ ఆక్సిడెంట్లు	నల్ల / ఎర్ర బియ్యం
సులభంగా జీర్ణం కావాలంటే	కాలాజీర / ఇంద్రాణి

దేశీయ వరి వంగడాలకు సంబంధించిన ఈ విజ్ఞానం.. ఇప్పటిది కాదు, తరతరాల నుంచి వస్తోంది. వీటిపై పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్ చేసి, వీటిలోని పోషకాల గురించి ప్రజలకు ప్రభుత్వాలు, భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎమ్‌ఆర్), జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) వంటివి తెలియజేయాలి. సాగును, వినియోగాన్ని ప్రచారం చేస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

క్లుప్తంగా...

గోదావరి-బనకచర్లను అడ్డుకోండి

- గోదావరి, కృష్ణా బోర్డులు, సీడబ్ల్యూసీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు గోదావరి బోర్డుతోపాటు కేంద్ర జల సంఘం, కృష్ణా బోర్డు చైర్మన్‌లకు తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) అనిల్ కుమార్ లేఖ రాశారు. ఆ ప్రాజెక్టు వివరాలు కోరితే అవి ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నాయని.. జలసంఘం అనుమతి తీసుకున్నాక ప్రాజెక్టు సవివరణ నివేదిక సిద్ధం చేస్తామని ఏపీ ఈఎన్‌సీ ఏప్రిల్ 7 నాటి భేటీలో చెప్పారని అనిల్‌కుమార్ గుర్తుచేశారు. కానీ నీతి ఆయోగ్ సమావేశంలో ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై చర్చించి ముందుకెళ్లాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించినట్లు తమకు సమాచారం ఉందని ఆ లేఖలో వివరించారు. ప్రాజెక్టులో భాగంగా పల్నాడు జిల్లాలో నిర్మించతలపెట్టిన బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రభావిత గ్రామాల్లో సర్వే కూడా చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై సమాచారం కోరినా గోదావరి బోర్డు సభ్యుడు ఇవ్వలేదని విమర్శించారు.

పోలవరం డెడ్ స్టోరేజీ ఎత్తిపోతల వద్దు

- ప్రాజెక్టు అథారిటీకి తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు ఏపీ ప్రతిపాదించిన ఎత్తిపోతల పథకాన్ని ఆపాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), గోదావరి బోర్డుకు తెలంగాణ ఈఎన్‌సీ అనిల్ కుమార్ శనివారం లేఖ రాశారు. తెలంగాణలో ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నా నీటి లభ్యత లేదని ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని.. ఈ ఎత్తిపోతలతో గోదావరి డెల్టా సిస్టమ్ (జీడీఎస్) అవసరాలపైనా ప్రభావం పడుతుందని లేఖలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం 45.72 మీటర్లు ఉండగా.. 35 మీటర్ల నుంచి నీటిని తరలించడానికి వీలుగా ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారని ఆ లేఖలో అనిల్ కుమార్ పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులిచ్చిన 2009 నాటి 95వ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీకి వ్యతిరేకంగా ఈ ప్రతిపాదన ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు.

నేషనల్ హెరాల్డ్ కేసుపై సీఎం స్పందించాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ అరుణ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసుపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పందించాలని మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ పేరుండడం, ఈ విషయంలో ఆయన మాట్లాడకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. సీఎం రేవంత్ ఎంతమంది దగ్గర ఎన్ని లక్షలు వసూలు చేశారో లెక్క తేలాలన్నారు. నీతిమాటలు మాట్లాడే రాహుల్ గాంధీ ఈ కేసులో ఉన్నారని, ఇందులో రేవంత్ పాత్ర ఏమిటో కూడా తెలపాలన్నారు. ఇలాంటి కేసుల్లో రేవంత్ ఉండటం కొత్తేమీ కాదని, ఆయన ప్రతిభ అందరికీ తెలిసిందేనని అరుణ వ్యాఖ్యానించారు. బాధ్యత గల పదవిలో ఉన్నారు కాబట్టి.. రాష్ట్ర ప్రజలకు ఆయన సమాధానం చెప్పి తీరాలన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్‌లో పేరు ఉండడంతో.. ఇప్పటికే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వివరణ ఇచ్చారని గుర్తు చేశారు.

బీఆర్‌ఎస్ 3 ముక్కలు కావడం ఖాయం

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

- భవిష్యత్తు రాజకీయ ముఖచిత్రంలో ఆ పార్టీ ఉండదు
- ఇంట్లో పోరు తట్టుకోలేక కేటీఆర్ సతమతమవుతున్నారు
- పార్టీ పగ్గాల కోసం కవిత, కేటీఆర్ మధ్య తీవ్ర పోటీ ఉంది
- హరీశ్‌రావు అదను కోసం ఎదురు చూస్తున్నారు

సాక్షి, న్యూఢిల్లీ: కేసీఆర్ కుటుంబంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను గమనిస్తే.. భవిష్యత్తులో తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఉండదని, అది మూడు, నాలుగు ముక్కలవుతుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇంట్లో పోరు తట్టుకోలేక కేటీఆర్ సతమతమవుతున్నారని, పార్టీ పగ్గాల కోసం కవిత, కేటీఆర్ మధ్య తీవ్ర పోటీ నెలకొందని చెప్పారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు అదను కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్‌గౌడ్ శనివారం తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో విలేకరులతో మాట్లాడారు.

కేటీఆర్ ముందు ఇంట్లో కుంపటిని సరిచేసుకోవాలి

'ఇంట్లో కుంపటి తట్టుకోలేక.. సోదరి తనకే ఏకు మేకై, మరో పవర్ సెంటర్ కావడంతో మతి భ్రమించి కేటీఆర్ ఆ ఎపిసోడ్‌ని డైవర్ట్ చేయడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పసలేని ఆరోపణలు చేస్తున్నారు. తన ఇంట్లో రగులుతున్న కుంపటిని కేటీఆర్ ముందుగా సరిచేసుకోవాలి. కవిత.. కేసీఆర్‌కే లేఖ రాసి పది సంవత్సరాల తప్పిదాలను ఎత్తి చూపే స్థాయికి వచ్చిందంటే, కేసీఆర్ కుటుంబంలో రగులుతున్న మంట ఎంత పెద్దదో అర్థమవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మెజారిటీ ప్రజలు నమ్మిన నేపథ్యంలో వారి ఆకాంక్షల మేరకు విచారణ కమిషన్ వేశాం. కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇస్తే కేటీఆర్ బెంబేలెత్తారు. అవినీతి బాగోతం బయటపడుతుందన్న భయంతో ఆయన మాట్లాడుతున్నట్లు కనిపిస్తోంది.

బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం..

ఫార్ములా ఈ–కార్ రేసులో అవినీతి బట్టబయలైంది. అందులో కేటీఆర్ దొరికిపోయారు. హైదరాబాద్, దాని చుట్టపక్కల కొన్ని వేల ఎకరాల ప్రభుత్వ భూములను తక్కువ ధరకే తన సన్నిహితులు, బంధువులకు అప్పజెప్పిన వైనం ఇంకా తెలంగాణ ప్రజలు మర్చిపోలేదు. కవిత లేఖలో ఆమె ప్రస్తావించిన అంశాలను పరిశీలిస్తే.. బీజేపీకి, బీఆర్‌ఎస్‌కు పరిపూర్ణమైన లోపాయికారి ఒప్పందం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. బీఆర్‌ఎస్ గతంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించిన కారణంగానే కవిత లిక్కర్ కేసులో ఇరికినప్పుడు అమిత్ షా దగ్గరకు వెళ్లి బేరం కుదుర్చుకుని బెయిల్ వచ్చే విధంగా చేసుకున్న విషయాన్ని ప్రజలు మర్చిపోలేదు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య లోపాయికారి మైత్రి ఉంది కాబట్టే బెయిల్ సునాయాసమైంది. కేటీఆర్, హరీశ్‌రావులే కదా.. ఆ బేరసారాలు చేశారు. తమ అవినీతి బయటపడకుండా ఉండేందుకు మోదీ, అమిత్‌షా కాళ్లు ఎవరు పట్టుకున్నారో తెలంగాణ ప్రజలందరికీ తెలుసు.

కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌లో బందీ చేశారు..

హరీశ్‌రావు, కేటీఆర్ కలసి కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌లో బందీ చేశారని నేను దాదాపు మూడున్నర నాలుగు మాసాల క్రితం చెప్పాను. అదిప్పుడు వాస్తవం అని తెలుస్తోంది. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కవిత చెప్పారు. ఆ దెయ్యాలు ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. కేసీఆర్ మొదలు కొని.. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత సహా ఆ కుటుంబం అంతా విచ్చలవిడిగా అవినీతికి పాల్పడిన విషయాన్ని పదేళ్లుగా చూశాం. వారి మధ్య వైరం వచ్చిందంటే రాజకీయ పదవుల పోటీ ఒకటైతే.. పంపకాల్లో కూడా తేడా వచ్చిందనేది నా అనుమానం. అందుకే కవిత ఇవాళ బాహాటంగా తిరుగుబాటు జెండా ఎగురవేసినట్లు కనిపిస్తోంది.



కేసీఆర్‌కు పట్టిన దెయ్యం కూడా కేటీఆరేనని కవిత చెప్పకనే చెప్పారు. దీంతో ఇంట్లో జరుగుతున్న పోరు ప్రజలకు తెలియకుండా ఉండేందుకు కేటీఆర్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్లు కనిపిస్తోంది' అని మహేశ్‌గౌడ్ అన్నారు.

ఘనంగా మహేశ్‌గౌడ్ జన్మదిన వేడుకలు

సాక్షి, న్యూఢిల్లీ/ హైదరాబాద్: టీపీసీసీచీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఢిల్లీలో పలువురు కాంగ్రెస్ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్ తదితరులు మహేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి మిఠాయిలు తినిపించారు. అలాగే మహేశ్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాయి. హైదరాబాద్ గాంధీభవన్‌లో తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కల్లుగీత పారిశ్రామిక సంఘం చైర్మన్ నాగరాజు గౌడ్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

అప్పుడు అపవిత్రమైన ఈడీ ఇప్పుడు పవిత్రమైందా?

కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నన్ని రోజులు అపవిత్రంగా కనిపించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పుడు బీఆర్‌ఎస్ నాయకులకు పవిత్రంగా కనిపిస్తోందా? అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ఇప్పుడు కేటీఆర్ పొగుడుతున్న దర్యాప్తు సంస్థనే గతంలో తన చెల్లెలు కవితపై కేసు నమోదు చేసిందన్న సంగతి మర్చిపోయారా? అని శనివారం ఆయన ఒక ప్రకటనలో ఎద్దేవాచేశారు. ఆధారాల్లేకుండా అక్రమంగా కేసులు నమోదు చేసిన విధానాన్ని సమర్థిస్తున్నారో లేదో చెప్పాలని, ఇలా సమర్థించేందుకు బీజేపీతో కుదుర్చుకున్న ఒప్పందమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల అరవై ఏళ్ల ఆకాంక్షను నెరవేరుస్తూ సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే, పదేళ్లపాటు బీఆర్‌ఎస్ తెలంగాణను దెయ్యంలాపట్టి పీడించిందని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదని, అప్పటి చేదు జ్ఞాపకాలను తెలంగాణ ప్రజలు ఇప్పుడిప్పుడే మర్చిపోతున్నారని తెలిపారు. బీజేపీ సర్కార్ పెడుతున్న అక్రమ కేసులపై స్పందించాల్సిన అవసరం రాహుల్‌గాంధీకి లేదని స్పష్టంచేశారు. సమాఖ్యవ్యవస్థలో కేంద్రంతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందని, ఈ విషయం కేంద్రంతో తరచూ తగువులు పెట్టుకున్న బీఆర్‌ఎస్ నేతలకు ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాన మంత్రిని ముఖ్యమంత్రి కలవడంలో తప్పేముందని ప్రశ్నించారు. కాగా, రేవంత్ రెడ్డి నచ్చాల్సింది కేటీఆర్‌కు, ఆయన పార్టీ కేడర్‌కు కాదని, తెలంగాణ ప్రజలకని అన్నారు.

కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలెవరో చెప్పాలి: మంత్రి పొన్నం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడేకంటే ముందుగా కేటీఆర్ తన పార్టీలో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలపై దృష్టి పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కవిత చెప్పిన విధంగా కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలెవరో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ దీనికి జవాబు చెప్పిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఆరోపణలు చేస్తే తాము జవాబు చెప్తామని అన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మాట్లాడుతూ.. 'బీఆర్‌ఎస్‌కే కాదు, తెలంగాణ అభివృద్ధికి పట్టిన దెయ్యం కేటీఆర్' అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలే కేటీఆర్ పతనానికి మూలాలవుతాయని అన్నారు. కేటీఆర్ తీరు మార్చుకోకపోతే ఆయనకు పట్టిన దెయ్యాన్ని చీపుర్లతో వదిలిస్తామని హెచ్చరించారు.

తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్... శని కాంగ్రెస్

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటాయి. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంటుంది. ఆఫీసు బేరర్స్‌ను కలిసి చెప్పుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి కొన్ని విషయాలను అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటుంది. ఈ సూత్రం వాళ్లకు వీళ్లకు కాదు.. పార్టీలో ఉన్న కార్యకర్తలందరికీ వర్తిస్తుంది. ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన బీఆర్‌ఎస్‌లో అధ్యక్షుడు కేసీఆర్‌కు లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా సూచనలిస్తూ ఎవరైనా లేఖలు రాయొచ్చు. అయితే పార్టీలో ఏ హోదాలో ఉన్న వారైనా కొన్ని అంతర్గత విషయాలను అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటుంది' అని కేటీఆర్ అన్నారు. 'లోక్‌సభ ఎన్నికలకు ముందు మేము పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్ష పెట్టి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఎలా ముందుకు పోవాలని వేల మంది కార్యకర్తలతో గంటలకొద్దీ చర్చించాం. ఆ క్రమంలో చాలామంది నేరుగా మైక్‌లో మాట్లాడారు. మరికొందరు కేసీఆర్‌కు ఇవ్వమంటూ లేఖలు ఇచ్చారు. మా పార్టీలో బహిరంగ చర్చను ప్రోత్సహిస్తాం. ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన మా పార్టీ అధ్యక్షుడికి ఎవరైనా సూచనలు చేయొచ్చు, ఉత్తరాలు రాయొచ్చు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అన్ని పార్టీల్లో ఉన్నట్లు బీఆర్‌ఎస్‌లోనూ రేవంత్ కోవర్టులు ఉండొచ్చని, సరైన సమయంలో వారంతటే వారు బయటపడతారన్నారు.

ఓటుకు నోటు కేసులో 'బ్యాగ్‌మ్యాన్'

'యంగ్ ఇండియా నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్‌లో చేర్చడం రాష్ట్రానికి అవమానకరం. ఈ కేసులో రేవంత్ పేరు వచ్చిందన్న వార్తను కొన్ని పత్రికలు అసలు రాయనే లేదు. మీడియా ఎంత తాపత్రయపడ్డా.. ఎన్ని ప్రకటనలు తీసుకున్నా రేవంత్ ఒక లొట్ట పీసు ముఖ్యమంత్రి అని ప్రజలకు అర్థమైపోయింది. మీడియా ఎన్ని దాచినా సోషల్ మీడియాతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తూనే ఉంటాయి. ఓటుకు నోటు కేసులో బ్యాగ్‌మ్యాన్ అని పేరు తెచ్చుకున్న రేవంత్ వైఖరి మారలేదని ఈడీ చార్జిషీట్‌లో బయటపడింది. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారగా, ఢిల్లీ కాంగ్రెస్‌కు అవసరమైనప్పుడల్లా భారీ మొత్తంలో ఇస్తూ రేవంత్ తన పదవి కాపాడుకుంటున్నాడు. నైతికత ఉంటే రేవంత్ సీఎం పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలి లేదా కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఆయనను పదవి నుంచి తప్పించాలి. ప్రధాని మోదీ, అమిత్ షాతో ఒప్పందం కుదుర్చుకునేందుకే రేవంత్ ఢిల్లీ వెళ్లారు. 17 నెలల్లో 44 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ కేసుల నుంచి తప్పించాలని చీకట్లో అమిత్ షా కాళ్లు పట్టుకుంటున్నాడు. రేవంత్‌కు రాహుల్ గాంధీ అధికారిక బాస్ కాగా, మోదీ, అమిత్ షా అనధికార బాస్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఏడాదిన్నరగా బీఆర్‌ఎస్‌పై నిందలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీ బాస్‌లకు రూ.వేల కోట్ల చందాలు అనే రీతిలో రేవంత్ పాలన సాగుతోంది. రేవంత్ అవినీతిపై రాహుల్ మాట్లాడాలి. ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు ఉన్నా జపాన్ టూర్ పేరిట రేవంత్ స్పందించకుండా తప్పుకున్నాడు' అని కేటీఆర్ విమర్శించారు.

కాంగ్రెస్, బీజేపీ నడుమ అపురూప బంధం

'నేషనల్ హెరాల్డ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్ విషయంలో తెలంగాణ బీజేపీ నేతలు మౌన మునుల్లా మారిపోయారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు చేస్తున్న భూదందా అక్రమాలకు రేవంత్ వత్తాసు పలుకుతున్నందుకే మౌనమా' అని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.187 కోట్ల వాల్మీకి స్కామ్, ట్రిపుల్ ఆర్ ట్యాక్స్, హెచ్‌సీయూ భూముల్లో అక్రమాలు, పౌర సరఫరాల కుంభకోణం జరుగుతున్నా కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదు. రేవంత్‌కు రక్షణ కవచంలా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం స్పందించకుంటే నెల రోజుల తర్వాత మా కార్యాచరణ ప్రకటిస్తాం. ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్‌ను కోరతాం' అని చెప్పారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, రాజయ్య పాల్గొన్నారు.

తెలంగాణకు రేవంత్, ఉత్తమ్ తెల్ల ఏనుగులు

- ఒకరితో ఆదాయానికి, మరొకరితో నీటి వాటాకు గండి
- ఏడాదిన్నరగా కాళేశ్వరంపై కుట్రలే.. ఎకరాకు నీరివ్వలేదు
- తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్, ఎల్లంపల్లికి కాల్వలు ఏవి?
- బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును వైట్ ఎలిఫెంట్ (తెల్ల ఏనుగు) అని విమర్శిస్తూ.. మరోవైపు అవే ప్రాజెక్టులో అంతర్భాగమైన రిజర్వాయర్లను ప్రభుత్వం వాడుకుంటోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. చెప్పిన అబద్ధాలనే మళ్లీమళ్లీ చెప్తూ కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఏకైక ఎజెండాగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్, ఉత్తమ్ తెలంగాణ పాలిట నిజమైన తెల్ల ఏనుగులు అని ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం హరీశ్‌రావు సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రాష్ట్ర ఆదాయానికి, మంత్రి ఉత్తమ్ నీటి వాటాకు గండి కొడుతున్నారని విమర్శించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు మినహా ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని, ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని ఆరోపించారు.

ఏడాదిన్నర అయినా తట్టెడు మట్టి తీయలేదు

గతంలో ఉమ్మడి ఏపీ, మహారాష్ట్రతో పాటు కేంద్రంలోనూ ఏకకాలంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు సాధించలేదని హరీశ్‌రావు విమర్శించారు. 'తట్టెడు మట్టి తీయకుండా, ఒక్క ఇటుక పేర్చకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.2,328 కోట్లు స్వాహా చేశారు. ప్రాణహిత ప్రాజెక్టులో భూ సేకరణ, ఇతర పనుల కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,780 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మీరు ఆనాడు తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ కట్టి, ఎల్లంపల్లి వరకు గ్రావిటీ కెనాల్ తవ్వి ఉంటే ప్రాజెక్టు రీ డిజైనింగ్ చేయాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాదిన్నరగా తుమ్మిడిహెట్టి వద్ద తట్టెడు మట్టి తీయలేదు' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ విచారణ తర్వాత చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ చెప్తున్నారని, మంత్రి మనసులో ఉన్న కుట్రకు ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని హరీశ్‌రావు మండిపడ్డారు.

గోదావరి జలాలు ఎత్తుకుపోతుంటే ఏం చేస్తున్నారు?

తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ, గోదావరి జలాలను ఎత్తుకుపోయేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్రలు చేసున్నా.. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు ఏం చేస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేకుండా, ఏపీ నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు ఇస్తూ, మిగతా 50 శాతం నిధులకోసం ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిని మించి అప్పు చేసేందుకు అనుమతి ఇవ్వడం అన్యాయం, అనైతికం అని మండిపడ్డారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతూ, ఆంధ్రప్రదేశ్‌పై వరాల జల్లులు కురిపిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు.

పదేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేశారు

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వనున్నామని వెల్లడించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ద్వారా గిరిజనులకు పంపిణీ చేసిన 6.70 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చేలా రూ.12,600 కోట్లతో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించినట్లు వివరించారు. బీఆర్‌ఎస్ పాలనలో గిరిజనులు అటవీ భూముల్లో పంటలు సాగుచేయకుండా ఇబ్బంది పెట్టారని, మహిళలను కూడా చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటనలు ఉన్నాయని విమర్శించారు. కాగా, జాబ్‌మేళాలో 92 కంపెనీలు పాల్గొనగా, సుమారు 8 వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో 4,448 మందికి వివిధ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు

▶ మొదటి పేజీ తరువాయి

అంబేడ్కర్ చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో పూర్తయ్యేదని, అది పూర్తి అయితే కాంగ్రెస్‌కు ఎక్కడ మంచి పేరు వస్తదో అని రాజకీయ దురుద్దేశంతో బీఆర్‌ఎస్‌వారు కట్టలేదని దుయ్యబట్టారు. రూ.38 కోట్లతో అయ్యేదానిని అదే ఆయకట్టుకు రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారన్నారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ఒక చిన్న లిఫ్ట్ గ్రావిటీ ద్వారా వచ్చే నీళ్లను కాదని వాళ్లు తలపెట్టిన మూడు పెద్ద లిఫ్టులను కట్టడంతో ఏటా రూ.10 వేల కోట్లు కరెంటు బిల్లు వస్తోందన్నారు. ఆ పెద్ద మనిషి విమానంలో ప్రయాణిస్తూ ఇక్కడ ప్రాజెక్టు కట్టు, ఇక్కడ కాలవలు తీయ్ అని ప్రణాళికలు చేయడం వల్లనే మేడిగడ్డ కూలిపోయిందంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు.

పిల్లలూ...
మన దేశంలో రామాయణం
తెలియని వారూ వానకు తడవని వారూ ఉండరు.
సీతారాముల కథ రామాయణంగా
వేల సంవత్సరాలుగా జనంలో ఉంది.
రాముడు ఎందుకు దేవుడయ్యాడంటే
రావణాసురుడనే రాక్షసుణ్ణి ఓడించాడు కాబట్టి.
మీకు రామాయణం పై అవగాహన ఉండాలి.
చదవడం ద్వారానే కాకుండా సినిమాలు చూడటం ద్వారా కూడా
రామాయణం తెలుసుకోవచ్చు.
తెలుగులో ఎన్నో మంచి సినిమాలు రామాయణంపై వచ్చాయి. అవి...

వేసవి కాలం




రామాయణం చూద్దాం



రాముడిలో ఎన్నో గొప్ప లక్షణాలు ఉన్నాయి. ఆయన పితృవాక్య పరిపాలకుడు. అంటే తండ్రి చెప్పే మాట జవదాటడు. మన కన్నతండ్రిని గౌరవించే పద్ధతి అది. మీరు మీ నాన్న మాట వినకపోతే అది రాముడి మార్గం కాదు. అలాగే రాముడికి తన సోదరులంటే ఎంతో ఇష్టం. లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు... ఈ ముగ్గురిని ఎంతో అభిమానించాడు. భార్య సీతను ఎంతో గౌరవించాడు, ప్రేమించాడు. దుర్మార్గుడైన రావణాసురుడు ఆమెను ఎత్తుకొని పోతే సీత కోసం నిద్రాహారాలు మాని అన్వేషించాడు. అలాగే హనుమంతుడు వంటి బంటును ఎంతో ఆదరించాడు.

రాముడు వీరుడు. శూరుడు. ప్రజలను గొప్పగా పాలించి 'రామరాజ్యం చల్లని రాజ్యం' అనిపించుకున్నాడు. ఇంకా రామాయణం చదివినా, చూసినా ఎన్నో గొప్ప విషయాలు తెలుస్తాయి. మీరు ఆ సినిమాలు చూడండి... సెలవులు మరికొన్ని రోజులే ఉన్నాయి. అందుకే రోజుకు ఒక రామాయణం సినిమా చూడండి. మీకు భాష తెలియకపోయినా, పాత్రలు తెలియకపోయినా అమ్మనో, నాన్ననో, అమ్మమ్మనో అడగండి. ఈ సినిమాలన్నీ యూట్యూబ్‌లో ఉన్నాయి.



1. సీతారామ కల్యాణం:

ఇది 1961లో వచ్చిన సినిమా. ఇందులో 'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి' అనే గొప్ప పాట ఉంది. సీతా రాముల కల్యాణం, తర్వాత రావణాసురుడి ప్రవేశం అన్నీ మీరు చూడొచ్చు. ఆనాటి నటీనటులను తెలుసుకోవచ్చు. భాషను గమనించవచ్చు.

2. లవకుశ:

ఈ సినిమా తప్పక చూడాలి. తెలుగు వారందరూ ఈ సినిమా చూస్తారు. సీతారాములకు లవకుశులనే కుమారులు ఉన్నారని తెలుసు కదా. వారి గురించిన కథ ఇది. సీతమ్మ వాల్మీకి ఆశ్రమంలో ఉండి లవకుశులకు జన్మనివ్వగా వారు తమ తండ్రి అయిన రాముణ్ణి ఎలా చేరుకున్నారో ఈ సినిమాలో చూడొచ్చు. వాల్మీకిగా నటించిన నటుడి పేరు నాగయ్య గారు. ఆయన ఎంత చక్కగా నటిస్తారో, మాట్లాడతారో గమనించండి. అలాగే కుశ లవులుగా నటించిన బాల నటులను చూడండి. ఈ సినిమాలో ఎన్నో మంచి పాటలు ఉన్నాయి. వాటిని నేర్చుకొని పాడొచ్చు.

3. సంపూర్ణ రామాయణం:

పిల్లలూ... బాపు అనే దర్శకుడు 1972లో తీసిన సినిమా ఇది. రామాయణ గాథలు అనేకం ప్రచారంలో ఉన్నాయి. వాటి ఆధారంగా మన వారు సినిమాలు తీస్తుంటారు. అయితే ఈ సినిమా మాత్రం వాల్మీకి రామాయణాన్ని ప్రామాణికంగా తీసుకుని అందులోని ఆరు కాండలను చూపుతుంది. అంటే వాల్మీకి రామాయణంగా రాసింది ఏమిటో తెలియాలంటే ఈ సినిమా చూస్తే సరిపోతుందన్న మాట. తప్పక చూడండి.

4. శ్రీరామ పట్టాభిషేకం:

రామాయణ గాథను ముఖ్య కాండలతో చూపిన మరో సినిమా ఇది. ఇందులో అయోధ్య కాండ, కిష్కింధ కాండ, సుందర కాండ, యుద్ధ కాండలను సమగ్రంగా చూపించారు. వనవాసంలో ఉన్న సీతారాముల వద్దకు మాయలేడిని పంపి రాముడు దాని కోసం వెళ్లగా ఒంటరిగా ఉన్న సీతను రావణుడు అపహరించుకునే ఘట్టం ఈ సినిమాలో మీరు చూడొచ్చు.

5. రామాయణం:

రామాయణ సినిమాల్లో పెద్దవాళ్లు పాత్రల్ని ధరిస్తారు. కాని అందరూ పిల్లలే రామాయణ పాత్రలు ధరిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో వచ్చినదే 'రామాయణం'. ఇప్పుడు జూ.ఎన్టీఆర్‌గా మీ అందరికీ తెలిసిన తారక్ ఈ సినిమాలో రాముడిగా నటించాడు. గుణశేఖర్ దర్శకత్వం వహించగా ఎం.ఎస్.రెడ్డి నిర్మించారు. రామాయణం పూర్తి కథ ఈ సినిమాలో ఉంది. 1997లో ఈ సినిమా వచ్చింది.

6. శ్రీ రామరాజ్యం:

లవ-కుశుల కథపై వచ్చిన మరో సినిమా ఇది. ఇందులో వాల్మీకిగా అక్కినేని నాగేశ్వరరావు గారు నటించడం విశేషం. ఇది కూడా దర్శకుడు బాపు తీసినదే. ఇందులో 'జగదానంద కారకా' అనే మంచి పాట ఉంది.



ఇవే కాదు... ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' కూడా రామాయణం మీదే. ఇప్పుడు మళ్లీ రామాయణం మీద భారీ సినిమాలు నిర్మాణంలో ఉన్నాయి. రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా ఒక సినిమా నిర్మాణంలో ఉంది. సూర్యచంద్రులు ఉన్నంత కాలం రామాయణం పై పుస్తకాలు, సినిమాలు వస్తూనే ఉంటాయి. ఆ కథను మీరు ఎన్నిసార్లు తెలుసుకున్నా మరోసారి తెలుసుకుంటూనే ఉంటారు. అదీ దాని మహత్తు.

– కె.

ఆన్‌లైన్ షాపింగ్ మరింత సులభంగా...



వినియోగదారులకు మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి చాట్‌జీపీటీ సెర్చ్‌ఫంక్షనాలిటీని అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ' ప్రకటించింది. షాపింగ్ కోసం వినియోగదారులు ఆన్‌లైన్‌లోకి వెళ్లినప్పుడు ఈ యాడ్-ఫ్రీ సెర్చ్ రిజల్ట్ మనం కొనాలనుకునే వాటి ఫోటోలతో పాటు ధర, సమీక్షలాంటి వివరాలను అందిస్తుంది. సెర్చ్ రిజల్ట్స్‌లో ఆ ప్రాడక్ట్స్‌ను కొనుగోలు చేయగల వెబ్‌సైట్‌ల ప్రత్యక్ష లింకులు కూడా ఉంటాయి. ఈ షాపింగ్ సంబంధిత అప్‌గ్రేడ్‌లు చాట్‌జీపీటీ ప్లస్, ప్రో, ఫ్రీ యూజర్‌లు... వినియోగదారులందరికీ అందుబాటులో ఉంటాయి.

యూజర్‌లకు సంబంధించి ట్రెండింగ్ సెర్చ్ టాపిక్స్‌ను కూడా చాట్‌జీపీటీ సెర్చ్ చూపిస్తుంది.

వాట్సాప్ ద్వారా చాట్‌జీపీటీ సెర్చ్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు.

● స్టడీ



'స్టెమ్'లో జెమ్స్ లేరా?

యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషనల్ మానిటరింగ్ 'జెమ్' నివేదిక ప్రకారం స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్) ఫీల్డ్‌లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 'స్టెమ్' గ్రాడ్యుయేట్స్‌లో మహిళలు కేవలం 35 శాతం మాత్రమే ఉన్నారు. గత పది సంవత్సరాలుగా ఈ జెండర్ గ్యాప్‌ను తగ్గించడంలో ఎలాంటి పురోగతీ లేదు.

మ్యాథ్‌మేటిక్స్‌లాంటి సబ్జెక్ట్‌లో బాలురతో సమానంగా అమ్మాయిలు ప్రతిభ చూపుతున్నప్పటికీ, అంతకంటే ఎక్కువ ప్రతిభ ఉన్నప్పటికీ తమ మీద తమకు విశ్వాసం లేకపోవడం నుంచి మొదలు రకరకాల ఆటంకాలు 'స్టెమ్'లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ ఉండడానికి కారణం అవుతున్నాయి.

'జెమ్' డేటా ప్రకారం డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 26 శాతం మంది ప్రొఫెషనల్స్ మాత్రమే మహిళలు. 'క్లౌడ్ కంప్యూటింగ్'లాంటి స్పెషలైజ్‌డ్ ఫీల్డ్‌లలో ఈ సంఖ్య మరింత తక్కువగా ఉంది.

'స్టెమ్' ఎడ్యుకేషన్‌కి సంబంధించి 68 శాతం దేశాలు ప్రోత్సాహక విధానాలు రూపొందించినప్పటికీ వాటిలో సగం మాత్రమే మహిళలను ఎంకరేజ్ చేసే ప్రత్యేక విధానాలు ఉన్నాయి.

స్టెమ్ ఎడ్యుకేషన్‌లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి 'జెమ్' కొన్ని సూచనలు చేసింది.

ఉదా: లింగవివక్షతను గుర్తించి, అరికట్టడానికి అవసరమైన శిక్షణను టీచర్‌లు, స్కూల్ లీడర్‌లకు ఇవ్వాలి.
● మహిళల నాయకత్వంలో 'స్టెమ్' క్లబ్‌లను ఏర్పాటు చేయాలి ● క్లాస్‌రూమ్‌లో జెండర్-న్యూట్రల్ లాంగ్వేజ్‌ని ఉపయోగించేలా చూడాలి ● అమ్మాయిల ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా 'స్టెమ్' ఎక్స్‌పర్ట్‌లతో క్లాసులో ఉపన్యాసాలు ఇప్పించాలి.

● ఇంటిప్స్

బఠాణితొక్క కూడానూ..



పచ్చిబఠాణి మనకు ఎంత మేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణి పిక్కలు తీసి తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కకు చక్కని పోషకాలు అందిస్తాయి. అందుకే తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టులో కాసిని నీళ్లు పోసి ఈ నీటిని గార్డెన్‌లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మొక్కలకు మంచి బలవర్థక టానిక్‌లా పనిచేసి చక్కగా పెరిగేందుకు దోహద పడతాయి.

హెల్త్

పాల్పిటేషన్స్

● హృదయ

బీట్ మారిందా!



గుండెదడను వైద్యపరిభాషలో పాల్పిటేషన్ అంటారు. చాలామంది జీవితకాలంలో ఏదో ఒకసారి అనుభవించే సాధారణ లక్షణం ఇది. చాలా సందర్భాల్లో ఏదో ఒక మానసిక ఆందోళన లేదా ఉద్విగ్నత వంటి కారణాలతో కనిపించే అత్యంత మామూలు సమస్య ఇది. చాలా వరకు తీవ్రమైన సమస్య కాకపోయేందుకే అవకాశాలెక్కువ. కాకపోతే చాలా అరుదుగానే ఏదైనా తీవ్రమైన గుండె సమస్యకు సూచన అయ్యేందుకూ అవకాశాలు లేకపోలేదు.

పాల్పిటేషన్స్ అంటే...?

గుండె నిత్యం స్పందిస్తున్నప్పటికీ... అది కొట్టుకుంటున్న తీరు సాధారణంగా మన అనుభవంలోకి రాదు. కానీ కొన్నిసార్లు వేగంగా స్పందించే ఆ స్పందనలు వ్యక్తుల అనుభవంలోకి వస్తాయి. కొట్టుకుంటున్న వేగాన్ని బట్టి వాటిని ఇంగ్లిష్‌లో సాధారణంగా ఫ్లట్టరింగ్, పౌండింగ్ లేదా రేసింగ్‌గా చెబుతుంటారు. కొన్నిసార్లు వ్యక్తులు వేగంగా పరిగెత్తడం, తీవ్రమైన భావోద్వేగాలకు గురికావడం, ఉద్విగ్నతకూ, తీవ్రమైన ఆందోళనకూ గురికావడం, అలాగే తీవ్రమైన జ్వరం లేదా గర్భధారణ సమయంలో గుండెదడ (పాల్పిటేషన్స్) అనుభవంలోకి వచ్చేందుకు అవకాశాలెక్కువ. అలాగే కొన్ని సందర్భాల్లో ఎక్కువసార్లు కాఫీ తాగడం, కొన్ని సందర్భాల్లో పొగ తాగడం, మద్యం తీసుకోవడం లేదా నిద్రలేమి వంటి జీవనశైలి అలవాట్లు కూడా పాల్పిటేషన్స్‌కు దారితీయవచ్చు. సాధారణ జీవక్రియల్లో భాగంగానే ఇలా గుండెదడ రావచ్చు. అలాంటప్పుడు గుండెదడ పెద్దగా హానికరం కాదు.

మరి పట్టించుకోవాల్సిందెప్పుడంటే...


● గుండెదడ (పాల్పిటేషన్) అకస్మాత్తుగా స్పష్టమైన కారణం లేకుండా వచ్చినప్పుడు. ● తలతిరుగుతుండటం, ఛాతీ నొప్పి, శ్వాస ఆడకపోవడం, స్పృహ తప్పడం వంటివి జరిగినప్పుడు. ● గుండె లయ తప్పడం (అబ్‌నార్మల్ రిథమ్ లేదా అరిథ్మియా) వంటి లక్షణాలు కనిపించినప్పుడు...

పైన పేర్కొన్న లక్షణాలు కనిపించినప్పుడు దాన్ని కొంత సీరియస్‌గా పరిగణించాల్సి ఉంటుంది.

ఇక్కడ గుండె లయతప్పడంలో ఒక ప్రత్యేకమైన రకం గురించి చెప్పుకోవాలి. గుండె లయబద్ధంగా స్పందించడానికి వీలుగా సయనో ఏట్రియల్ నోడ్ అనే చోట ఎలక్ట్రిక్ సంకేతాలు వెలువడుతుంటాయి. వీటి కారణంగానే గుండె ఒకే రకమైన లయతో స్పందిస్తుంటుంది. ఒకవేళ అలా కాకుండా ఆ ఎలక్ట్రిక్ స్పందనలు అసాధారణంగా ఎక్కడపడితే అక్కడ (అంటే నిర్దిష్టమైన ట్రాక్‌లో కాకుండా ఒకదానిని మరొకటి బైపాస్ చేస్తూ) వెలువడుతున్నప్పుడు... గుండె తన నిర్దిష్టమైన లయతో... లయబద్ధంగా కాకుండా ఎలా పడితే అలా కొట్టుకుంటూ ఉండేందుకు అవకాశముంది. దాంతో గుండె రిథమ్ దెబ్బతినడం వల్ల అరిథ్మియా వచ్చే అవకాశముంది. అయితే ఇలా జరిగినప్పుడు అదృష్టవశాత్తు శస్త్రచికిత్స వంటి సంక్లిష్టమైన ప్రక్రియలు అవసరం లేకుండానే 'రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (ఆర్‌ఎఫ్‌ఏ)' అని పిలిచే రక్తనాళాల్లోకి పైపును పంపే క్యాథెటర్ ప్రొసిజర్స్‌తోనే 'ఎలక్ట్రో ఫిజియాలిస్ట్‌లు' అనే నిపుణులు ఈ సమస్యను చక్కదిద్దే అవకాశం ఉంది.


గుండెదడతో ఎవరెవరికి ముప్పు...?

స్థూల కాయం (ఒబెసిటీ), అధిక రక్తపోటు (హైబీపీ), డయాబెటిస్ లేదా గుండె జబ్బులున్నవారు గుండెదడ లక్షణాన్ని కాస్త సీరియస్‌గానే పరిగణించాలి. అందునా మరీ ముఖ్యంగా వెంట్రిక్యులార్ ట్యాకికార్డియా అనే 'అరిథ్మియా' (గుండె లయ తప్పడం) లేదా ఆర్టీరియల్ ఫిబ్రిలేషన్ వంటి సమస్యలు ఉన్నవారిలో గుండెదడ ఒక్కోసారి ప్రమాదకరమైన పరిస్థితికి తీసుకెళ్లి కార్డియాక్ అరెస్ట్ లేదా పక్షవాతం (స్ట్రోక్) వంటి ప్రాణహాని కలిగించేంత తీవ్రమైన ముప్పునకు కారణమయ్యే అవకాశాలుంటాయి. అందుకే ఇక్కడ పేర్కొన్న రిస్క్ ఫ్యాక్టర్స్ ఉన్నవారు గుండెదడ విషయంలో ఒకింత జాగ్రత్తగా ఉండటం అవసరం.



ఇక మరో రకమైన ముప్పు ఎవరిలో నంటే... కొందరి కుటుంబాల్లో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మరణించిన (సడన్ కార్డియాక్ డెత్) దాఖలాలు ఉన్న వైద్య చరిత్ర గలవారైతే... అలాంటి కుటుంబాల్లోని వ్యక్తులు గుండెదడను అంత తేలిగ్గా తీసుకోకూడదు.

ఇక కార్డియో మయోపతి (గుండె కండరానికి సంబంధించిన ఆరోగ్య సమస్య) లేదా వంశపారంపర్యంగా గుండె ఎలక్ట్రిక్ స్పందనల్లో తేడాలు కనిపించే ఛానెలోపతీస్) వంటి వారిలో గుండెదడ ముప్పుగా పరిణమించే అవకాశాలు ఉంటాయి. ఇలాంటివారు ఎలక్ట్రోఫిజియాలజిస్టుల ఆధ్వర్యంలో తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండటం మంచిది.



డా॥ ఏ. సురేశ్,
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ అండ్ ఎలక్ట్రో ఫిజియాలజిస్ట్
హైదరాబాద్

ఆధునిక కార్డియాక్ ఎలెక్ట్రోఫిజియాలజీ భూమిక...

కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ అనేది గుండె లయ (హార్ట్ రిథమ్) సమస్యలను గుర్తించడం, నిర్ధారణలతో పాటు ఆ సమస్యలకు తగిన చికిత్స అందించడానికి రూపొందించిన గుండె చికిత్స విభాగం. గుండె సమస్యల నిర్ధారణ కోసం ఈసీజీ, హోల్టర్ మానిటరింగ్, ఎలక్ట్రో ఫిజియోలాజికల్ స్టడీస్, అత్యాధునిక ఇమేజింగ్ వంటి ప్రక్రియల సహాయం తీసుకుంటారు. వాటి సాయంతో ఎలక్ట్రోఫిజియాలజిస్టులు ఈ తరహా సమస్యలను గుర్తిస్తారు.

ఇక అత్యధికంగా ముప్పు ఉన్న బాధితులకు ముందుగానే ప్రమాదాలను నివారించేందుకు దేహంలో అమర్చే ఇంప్లాంటబుల్ కార్డియో-వెర్టర్ డీఫిబ్రిలేటర్స్ (ఐసీడీ) వంటి ఉపకరణాలను అమరుస్తారు. ఈ ఉపకరణాలు గుండె లయతప్పినప్పుడల్లా చిన్న ఎలక్ట్రిక్ షాక్‌ను వెలువరించడం ద్వారా గుండె లయను మళ్లీ క్రమబద్ధీకరిస్తాయి. దాంతో గుండెపోటు వంటి ప్రాణాంతక పరిస్థితులు నివారితమవుతాయి.

చివరగా... సాధారణంగా గుండెదడ అన్నది అంత హానికరం కాదనే చెప్పవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ముప్పు ఉన్నవారిలో అవి కొంత ప్రమాద హెచ్చరికలు (వార్నింగ్ సిగ్నల్స్)గా పరిగణించవచ్చు. కాబట్టి ఆ హెచ్చరికల ఆధారంగా వైద్యులను సంప్రదించడం వల్ల ఒక రకంగా గుండెదడ మేలే చేస్తుందని కూడా చెప్పవచ్చు. ఇప్పుడు అందుబాటులో ఉన్న వైద్య ప్రక్రియలూ, ఆధునిక చికిత్సల వల్ల ప్రమాదాలను నివారించుకునేందుకు, చికిత్సతో నయం చేసుకునేందుకు వీలుంది కాబట్టి ఆందోళన అక్కర్లేదు. కాకపోతే తగిన జాగ్రత్త మాత్రం అవసరమంటూ గుండెదడ ఓ వార్నింగ్ బెల్‌లా పనిచేస్తుందని చెప్పవచ్చు.

నిజానికి గుండెదడ ఒక జబ్బు కాదు. కాకపోతే కొన్ని సాధారణ లేదా తీవ్రమైన గుండె సమస్యల తాలూకు ఓ లక్షణంగా భావించవచ్చు. ఒక్కోసారి గుండె దడదడలాడుతున్న విషయం బాధితులకు ఏ ఉపకరణం లేదా ఏ టెస్ట్ సహాయం లేకుండానే తెలిసిపోతుంటుంది. ఆందోళనతో కూడా ఇలా జరగడానికి అవకాశం ఉంది. అయితే అరుదుగా కొన్ని సందర్భాల్లో మాత్రం తీవ్రమైన గుండె జబ్బులకు అదో సూచన కావచ్చు. అందుకే గుండెదడ గురించి అవగాహన కలిగి ఉండటం అవసరం. అలాంటి అవగాహన కల్పించేందుకే ఈ కథనం.

మరి పట్టించుకోవాల్సిందెప్పుడంటే... గుండెదడ (పాల్పిటేషన్) అకస్మాత్తుగా స్పష్టమైన కారణం లేకుండా వచ్చినప్పుడు. తలతిరుగుతుండటం, ఛాతీ నొప్పి, శ్వాస ఆడకపోవడం, స్పృహ తప్పడం వంటివి జరిగినప్పుడు. గుండె లయ తప్పడం (అబ్‌నార్మల్ రిథమ్ లేదా అరిథ్మియా) వంటి లక్షణాలు కనిపించినప్పుడు...

● కాలేయం

ఫ్యాట్ పెరిగిందా..?

సాలీడులా రక్త నాళాలు



కొంత వయసు దాటాక పొట్ట కాస్త ముందుకొచ్చి కనిపిస్తుంది. దీనికి కారణం వయసు పెరుగుతున్న కొద్దీ దేహంతో పాటు మిగతా శరీర భాగాల్లో కొవ్వు కణాలు పేరుకుపోతూ ఉండటం. మధ్యవయసు దాటాక వయసుతో పాటు దేహంలో కొవ్వు కూడా ఇలా పెరుగుతూ, పేరుకుపోతూ ఉంటుంది.

ఇది కేవలం బయటకు కనిపించే పొట్ట భాగంలోనే కాదు... ఇలా కొవ్వు కాలేయంలోని నార్మల్ కణాల్లో కూడా పేరుకుపోతూ ఉండవచ్చు. ఇలా జరగడాన్ని ఫ్యాటీ లివర్‌గా పేర్కొంటారు. అప్పుడు కాలేయం తాలూకు సహజ ఆకృతి, దాని స్వాభావికమైన రంగులో మార్పురావచ్చు. క్రమంగా అది కాస్త గట్టిగాగానీ లేదా జిగురుజిగురుగా, పచ్చరంగుకు మారవచ్చు. ఆ కండిషన్‌నే సిర్రోసిస్ అంటారు. కొన్నిసార్లు దేహంలోకి చాలా ప్రమాదకరమైన విషాలు (టాక్సిన్స్) ప్రవేశించడం వల్ల గానీ, కొన్ని వ్యాధులు లేదా ఇన్ఫెక్షన్స్ వల్లగానీ లేదా తగినంత ఆహారం తీసుకోకుండా ప్రతి రోజూ మితిమీరిన ఆల్కహాల్ తాగుతుండటం వల్ల కూడా సిర్రోసిస్ రావచ్చు.


రక్తనాళాలు సాలీడు ఆకృతిలో ఎందుకు కనిపిస్తాయంటే...

ఇలా కాలేయంలో కొవ్వు పేరుకుంటూ, దాని సహజ ఆకృతి, రంగు దెబ్బతింటున్నప్పుడు చర్మంలోంచి రక్తనాళాలు సాలీడు ఆకృతిలో బయటకు కనిపించవచ్చు. అంతేకాదు... ఆకలి లేకపోవడం, నీరసం, నిస్సత్తువ, పొట్టలో నీరు చేరడం, కళ్లు పసుపురంగులో ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇలాంటప్పుడు తప్పక డాక్టర్‌ను సంప్రదించాలి.

నిర్ధారణ ఇలా....

పైన పేర్కొన్న లక్షణాలు కనిపిస్తుంటే డాక్టర్‌లు లివర్ ఫంక్షన్ టెస్ట్ వంటి కొన్ని పరీక్షలు చేసి కాలేయం పనితీరు తెలుసుకుంటారు. కాలేయం పనితీరు బాగుంటే ఆందోళన అక్కర్లేదు. ఫ్యాటీలివర్ ప్రాథమిక దశలో ఉన్నా అంతగా ప్రమాదం ఉండదు. ఇలా పొట్ట ముందుకు వస్తున్నవారు స్థూలకాయాన్ని, బరువు పెరగడాన్ని నియంత్రించుకోవాలి. మద్యం పూర్తిగా మానేయాలి. అన్ని రకాల పోషకాలు అందేలా... ముఖ్యంగా విటమిన్ బి లాంటి పోషకాలు అందేలా మంచి ఆహార నియమాలు పాటించాలి. రోజూ కొద్దిగా వ్యాయామం చేయాలి. ఇలా ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరిస్తూ ఉంటే కొద్దిపాటి మందులతోనే కాలేయం ఆరోగ్యం మెరుగవుతుంది.

సాధారణంగా కాలేయం తనలో దెబ్బతిన్న భాగాన్ని తానే బాగుచేసుకుంటుంది. అలా ఒకసారి అది తనను రిపేర్ చేసుకోలేనంతగా దెబ్బతింటే మాత్రం కాలేయ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అందుకే మధ్యవయసు వాళ్లు కాలేయంపై శ్రద్ధ చూపడం అవసరం.



డా॥ చలపతి రావు ఆచంట,
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్
విశాఖపట్నం

శ్రీకాంత్ ఎట్టకేలకు ఫైనల్‌కు...



కౌలాలంపూర్: భారత సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ నాలుగేళ్ల తర్వాత టైటిల్ పోరుకు అర్హత సంపాదించాడు. మలేసియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో శ్రీకాంత్ 21-18, 24-22తో ప్రపంచ 23వ ర్యాంకర్ యుషి తనాకా (జపాన్)పై తుదికంటా పోరాడి గెలిచాడు. ప్రతీ గేమ్‌లోనూ జపనీస్ ప్రత్యర్థి నుంచి కఠినమైన సవాళ్లు ఎదురైనా... ఏ దశలోనూ పట్టుసడలించని భారత స్టార్ వరుస గేముల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. 'చాలా ఆనందంగా ఉంది. గతేడాది ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదు. ఈ ఫలితం కోసం ఎంతగానో శ్రమించాను' అని శ్రీకాంత్ అన్నాడు. 32 ఏళ్ల ఈ షట్లర్ చివరిసారిగా 2021లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరి రజతంతో సరిపెట్టుకున్నాడు. అయితే బీడబ్ల్యూఎఫ్ టూర్ టోర్నీల విషయానికొస్తే అతను ఆరేళ్ల తర్వాత టైటిల్ పోరుకు అర్హత సాధించినట్లయింది. 2019లో జరిగిన ఇండియా ఓపెన్‌లో ఆంధ్రప్రదేశ్ వెటరన్ స్టార్ రన్నరప్‌గా నిలిచాడు. నేడు జరిగే ఫైనల్లో ప్రపంచ 65వ ర్యాంకర్ శ్రీకాంత్ చైనాకు చెందిన రెండో సీడ్ లీ షి ఫెంగ్‌తో తలపడతాడు.

విజయంతో ముగించిన ఢిల్లీ

- పంజాబ్‌పై 6 వికెట్లతో జయభేరి
- మెరిపించిన కరుణ్
- గెలిపించిన రిజ్వీ


రిజ్వీ

జైపూర్: ఈ ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ చేరిన జట్లను ఇంటిక్లే జట్లు గట్టి దెబ్బే కొడుతున్నాయి. తాజాగా పట్టికలో 'టాప్'పై గురిపెట్టిన పంజాబ్ కింగ్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్లతో గెలిచి షాకిచ్చింది. తద్వారా ఢిల్లీ ఘన విజయంతో ఈ సీజన్‌ను ముగించింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 206 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (34 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. ఆరంభంలో ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆఖర్లో స్టొయినిస్ (16 బంతుల్లో 44 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచేశారు. అనంతరం ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 208 పరుగులు చేసి గెలిచింది. కరుణ్ నాయర్ (27 బంతుల్లో 44; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మెరిపిస్తే... సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 58 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) గెలిచేదాకా నిలిచాడు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్య (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6; ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రాజ్ 28; ఇన్‌గ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రాజ్ 32; శ్రేయస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53; నేహల్ (సి) డుప్లెసిస్ (బి) ముకేశ్ 16; శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11; స్టొయినిస్ నాటౌట్ 44; అజ్మతుల్లా (సి) సమీర్ (బి) కుల్దీప్ 1; యాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0; హర్‌ప్రీత్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197. **బౌలింగ్:** ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రాజ్ నిగమ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) శశాంక్ (బి) యాన్సెన్ 35; డుప్లెసిస్ (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23; కరుణ్ (బి) హర్‌ప్రీత్ 44; సాదికుల్లా (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ 22; రిజ్వీ నాటౌట్ 58; స్టబ్స్ నాటౌట్ 18; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.3 ఓవర్లలో 4 వికెట్లకు) 208. వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ 4-0-41-2, యాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ X చెన్నై
వేదిక: అహ్మదాబాద్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

కోల్‌కతా X హైదరాబాద్
వేదిక: ఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.262
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లక్నో	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.745
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

'శుబ్' సమయం మొదలు

భారత టెస్టు జట్టు కొత్త సారథిగా శుబ్‌మన్ గిల్



భారత టెస్టు క్రికెట్‌కు కొత్త నాయకుడు వచ్చాడు...నాలుగున్నరేళ్ల కెరీర్ అనుభవం ఉన్న శుబ్‌మన్ గిల్ టీమిండియా టెస్టు సారథిగా ఎంపికయ్యాడు... 93 ఏళ్ల భారత టెస్టు చరిత్రలో 37వ సారథిగా గిల్ బాధ్యతలు చేపడుతున్నాడు...గత కొంత కాలంగా చర్చ సాగినట్లుగా ఎలాంటి అనూహ్య నిర్ణయాలు లేకుండా సెలక్టర్లు 25 ఏళ్ల గిల్‌కే మద్దతు పలికారు... ఇంగ్లండ్ పర్యటనలో అతను తొలిసారి టెస్టు జట్టును నడిపించనున్నాడు. టెస్టు జట్టులో సాయి సుదర్శన్, అర్ష్‌దీప్‌లకు తొలి అవకాశం లభించగా...ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ నాయర్ మళ్లీ టీమ్‌లోకి రావడం విశేషం.

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- ఇంగ్లండ్ టూర్‌కు 18 మందితో జట్టు
- కరుణ్ నాయర్, సుదర్శన్‌లకు చోటు

ముంబై: ఇంగ్లండ్‌తో గడ్డపై జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం బీసీసీఐ సెలక్షన్ కమిటీ భారత జట్టును ఎంపిక చేసింది. 18 మంది సభ్యుల ఈ బృందానికి శుబ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు వైస్ కెప్టెన్సీ దక్కింది. ఆసీస్‌తో సిరీస్‌లో బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించినా...అతని ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని కెప్టెన్సీ కోసం బుమ్రా పేరును పరిశీలించలేదు. కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల శకం ముగిసిన తర్వాత భవిష్యత్తు కోసం టీమ్‌ను సిద్ధం చేసే కోణంలో జట్టు ఎంపిక జరిగింది. 2025-27 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత్ పాల్గొనే తొలి సిరీస్ ఇదే కానుంది. భారత జట్టు చివరిసారిగా ఆస్ట్రేలియాలో ఆడిన టెస్టు సిరీస్‌తో పోలిస్తే జట్టులో ఐదు మార్పులు జరిగాయి. కోహ్లి, రోహిత్, అశ్విన్ రిటైర్ కాగా...రెండు టెస్టులు ఆడిన పేసర్ హర్షిత్ రాణా, ఒక్క మ్యాచ్ కూడా ఆడని బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తమ స్థానం కోల్పోయారు. వీరి స్థానాల్లో కరుణ్ నాయర్, సాయిసుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్, శార్దుల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్ జట్టులోకి వచ్చారు.

ఎనిమిదేళ్ల తర్వాత...

33 ఏళ్ల కరుణ్ నాయర్ తన కెరీర్‌లో 6 టెస్టులు ఆడాడు. తన మూడో టెస్టులో ఇంగ్లండ్‌పై 303 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అతను...సెహ్వాగ్ తర్వాత ట్రిపుల్ సెంచరీ చేసిన రెండో భారత ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అయితే ఆ తర్వాత మరో 3 టెస్టులు మాత్రమే ఆడి జట్టులో 2017లో జట్టులో స్థానం కోల్పోయాడు. ఈ సీజన్ రంజీ ట్రోఫీలో 9 మ్యాచ్‌లలో 863 పరుగులు సాధించి రేసులోకి వచ్చాడు. కోహ్లి రిటైర్మెంట్‌తో మిడిలార్డర్‌లో ఖాళీ ఏర్పడి మరో అవకాశం లభించింది. దేశవాళీ క్రికెట్‌లో, భారత్ 'ఎ' తరఫున టన్నుల కొద్దీ పరుగులు చేసి అభిమన్యు ఈశ్వరన్‌కు మరోసారి పిలుపు లభించింది. ఇక ఇప్పటికే వన్డేలు, టి20లు ఆడిన పేసర్ అర్ష్‌దీప్ సింగ్, సాయి సుదర్శన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం.

షమీ అవుట్...

సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీకి ఊహించినట్లుగానే చోటు దక్కలేదు. గాయం నుంచి కోలుకున్న తర్వాత వన్డేలు, టి20లు ఆడినా...టెస్టు మ్యాచ్‌లకు తగిన స్థాయిలో అతని ఫిట్‌నెస్ లేదని సెలక్టర్లు తేల్చారు. కివీస్‌తో సిరీస్‌లో చివరి రెండు టెస్టుల్లో విఫలమై మళ్లీ మ్యాచ్ అవకాశం దక్కని సర్ఫరాజ్ ఖాన్‌ను కూడా పక్కన పెట్టారు. ఆసీస్ గడ్డపై రెండు టెస్టులు ఆడిన హర్షిత్ రాణాను కూడా ఎంపిక చేయలేదు. 'కోహ్లి, రోహిత్, అశ్విన్‌లాంటి ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేయడం కష్టం. అయితే కొత్తగా జట్టులోకి వచ్చే వారికి తమ సత్తా చాటేందుకు ఇది మంచి అవకాశం. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా బుమ్రా అన్నీ టెస్టులూ ఆడతాడనే నమ్మకం లేదు. అందుకే కెప్టెన్సీ భారం లేకుండా అతను బౌలర్‌గా మాకు అందుబాటులో ఉంటే చాలు. ఈ విషయాన్ని బుమ్రా కూడా అర్థం చేసుకున్నాడు. గిల్‌లో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్న విషయాన్ని గమనించాం. చాలా మంది అభిప్రాయాలు కూడా విన్నాం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనే కెప్టెన్, జట్టును ఎంపిక చేశాం. ప్రస్తుత స్థితిలో సర్ఫరాజ్‌తో పోలిస్తే అనుభవజ్ఞుడైన కరుణ్ సరైనవాడు అనిపించింది' అని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వ్యాఖ్యానించారు.


అర్ష్‌దీప్


సుదర్శన్


కరుణ్ నాయర్

భారత జట్టు వివరాలు

గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్), జైస్వాల్, రాహుల్, జురేల్, జడేజా, కుల్దీప్, బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిధ్, సుదర్శన్, ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, సుందర్, శార్దుల్, అర్ష్‌దీప్

భారత జట్టు విజేతగా నిలిచిన 2020-21 బోర్డర్ గావస్కర్ ట్రోఫీతో శుబ్‌మన్ గిల్ టెస్టుల్లోకి అడుగు పెట్టాడు. 91 పరుగులతో చారిత్రాత్మక గాబా టెస్టు విజయంలో అతను కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత టెస్టు టీమ్‌లో గిల్ రెగ్యులర్ సభ్యుడిగా మారాడు. భారత జట్టు ఆడిన రెండు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌లలో గిల్ ఆడాడు. 32 టెస్టుల కెరీర్‌లో గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలు ఉన్నాయి. స్వదేశంలో ప్రదర్శనతో పోలిస్తే విదేశీ గడ్డపై అతని రికార్డు పేలవంగా ఉన్నా...మంచి ప్రతిభావంతుడైన బ్యాటర్‌గా మున్ముందు సత్తా చాటగలడని సెలక్టర్లు నమ్ముతున్నారు. భారత అండర్-19 జట్టు తరఫున ఆడినా అతను కెప్టెన్‌గా ఎప్పుడు వ్యవహరించలేదు. రంజీ ట్రోఫీలో కూడా పంజాబ్‌కు ఒకే ఒక మ్యాచ్‌లో సారథ్యం వహించాడు. అయితే భారత్‌కు 5 టి20 మ్యాచ్‌లలో కెప్టెన్‌గా పని చేసిన అనుభవం గిల్‌కు ఉంది. రెండు సీజన్లుగా ఐపీఎల్‌లో గుజరాత్ జట్టును నడిపిస్తున్నాడు.

సాక్షి సినిమా

మా ముగ్గురి పాత్రలు ఫ్రెష్‌గా అనిపిస్తాయి



- బెల్లంకొండ సాయి శ్రీనివాస్

"నేను, మనోజ్, రోహిత్‌గార్లు సినిమాలకి కొంతకాలం బ్రేక్ ఇచ్చాం. తెలుగులో నా సినిమా వచ్చి దాదాపు నాలుగేళ్లవుతోంది. 'భైరవం' చిత్రంలో మా పాత్రలు చూస్తున్నప్పుడు అందరూ ఫ్రెష్‌గా ఫీల్ అవుతారు" అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రం 'భైరవం'. సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా అదితీ శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్లుగా నటించారు. డా. జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో సాయి శ్రీనివాస్ విలేకరులతో పంచుకున్న విశేషాలు...

- తమిళ హిట్ మూవీ 'గరుడన్'ని తెలుగులో 'భైరవం'గా రీమేక్ చేశాం. అయితే రీమేక్‌లా కాకుండా స్ట్రైట్ తెలుగు చిత్రంలా మన ప్రేక్షకులకు తగ్గట్టు మార్పులు చేసి, అద్భుతంగా తీర్చిదిద్దారు విజయ్. ఈ కథ, పాత్ర నచ్చడంతో రోహిత్‌గారు వెంటనే అంగీకరించారు. 'మిరాయ్' సినిమా పోస్టర్లో మనోజ్‌గారిని చూసి, 'భైరవం' పాత్రకి సంప్రదించగా, కథ నచ్చడంతో ఒప్పుకున్నారు.
- నన్ను ఇష్టపడిన ప్రతి ప్రేక్షకుడి కోసం 'భైరవం' చేశాను. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుంది. శ్రీ చరణ్ పాకాల అద్భుతమైన సంగీతం, నేపథ్య సంగీతం ఇచ్చారు. హరి కె. వేదాంతంగారి విజువల్స్ కొత్త అనుభూతిని ఇస్తాయి. ఈ సినిమా కోసం అద్భుతమైన ఆలయ సెట్ వేసిన ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలిగారికి థ్యాంక్స్. ఈ సినిమా ట్రైలర్లో పూనకం షాట్ ఉంటుంది. అందరూ చూసే ఉంటారు. 'భైరవం'లో నాకు బాగా నచ్చిన పార్ట్ అది. ఆ పార్ట్‌ని ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు. ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది.
- రాధామోహన్‌గారు నాకిష్టమైన నిర్మాత. ఆయనతో రెండు మూడు ప్రాజెక్టులు అనుకున్నా కుదరలేదు. 'భైరవం'తో సెట్ అయింది. చాలా ప్యాషన్‌తో సినిమా నిర్మిస్తారాయన.
- పూరి జగన్నాథ్‌గారిని ఒకటి రెండు సార్లు కలిశాను. మా కాంబోలో కచ్చితంగా సినిమా ప్లాన్ చేస్తాం. నా ప్రతి సినిమాలో కొత్తదనం ఇవ్వడానికే ప్రయత్నిస్తాను. విడుదలవుతున్న 'భైరవం', ప్రస్తుతం చేస్తున్న 'టైసన్ నాయుడు, హైందవ, కిష్కిందపురి' చిత్రాలు వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి.

మన ఊరి కథ అనేలా...


మహేశ్, శంకర్, ప్రియదర్శి, విద్యాసాగర్

మహేశ్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, ఇ.రామ శంకర్ నిర్మించారు. జూన్ 6న ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ సంస్థ విడుదల చేస్తోంది. తేజ కూనూరు సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'జిందగీ బిలాలే...' అంటూ సాగే ప్రమోషనల్ సాంగ్‌ని నటుడు ప్రియదర్శి రిలీజ్ చేసి, మాట్లాడుతూ–''బద్మాషులు' టీజర్ వినోదాత్మకంగా ఉంది. 'జిందగీ బిలాలే...' పాటని చరణ్ అర్జున్, విహ చక్కగా పాడారు. ఈ సినిమా చక్కని విజయం సాధించాలి'' అన్నారు. ''ఇది మన ఊరి కథ అనేలా ఈ సినిమాలోని పాత్రలు సహజంగా ఉంటాయి. ప్రేక్షకులను ఫుల్లుగా నవ్వించాలనే ఉద్దేశంతో శంకర్ చేగూరి ఈ సినిమాని తెరకెక్కించారు'' అని యూనిట్ పేర్కొంది.

ఆలియా అరంగేట్రం అదిరిందయ్యా


ఆలియా భట్

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిశారు హీరోయిన్ ఆలియా భట్. నిజానికి ఈ చిత్రోత్సవాల తొలి రోజు (మే 13)నే ఆలియా ఈ వేడుకలకు హాజరు కావాల్సింది. అయితే వెళ్లలేదు. దీంతో పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇండియా - పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆలియా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరు కాలేదనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ సంజయ్ లీలా భన్సాలీ డైరెక్షన్‌లోని 'లవ్ అండ్ వార్' (రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు) సినిమా చిత్రీకరణతో బిజీగా ఉండటం వల్లే ఆలియా ఈ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి రోజున వెళ్లలేదట. ఫైనల్‌గా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ చివర్లో ఆమె రెడ్ కార్పెట్‌పై మెరిశారు. అయితే ఆలియా భట్ ధరించిన కాస్ట్యూమ్స్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 2017లో 70వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నటి మల్లికా షెరావత్ ధరించిన కాస్ట్యూమ్ డిజైన్‌నే ఆలియా అనుకరించారని కొందరు నెటిజన్లు, ఫ్యాషన్ లవర్స్ పోలికలు పెట్టారు. అయితే ఆలియా ఎంట్రీ అదిరిందని, చాలా క్యూట్‌గా కనిపించారనే ప్రశంసలూ ఆమెకు దక్కాయి. ఇక కెల్లీ రిచర్డ్స్ డైరెక్షన్‌లోని 'ది మాస్టర్ మైండ్' సినిమాను ప్రదర్శించగా, ఐదు నిమిషాలకు పైగా స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. ఈ సంగతి ఇలా ఉంచితే... ఫ్రాన్స్‌లో పవర్ కట్స్ కారణంగా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ చివరి రోజు వేడుకల నిర్వహణకు ఇబ్బందులు ఎదరయ్యాయని, అయినా నిర్వాహకులు అనుకున్న ప్లాన్ పరంగానే ఉత్సవాలు పూర్తయ్యేలా సన్నాహాలు చేశారనే వార్తలు వస్తున్నాయి.

ఇది సినిమా కాదు... ఒక జీవితం

- అడివి శేష్


సుమంత్, కాజల్ చౌదరి, అడివి శేష్

''అనగనగా' చిత్రంలో వ్యాస్ పాత్రను సుమంత్ గారు అంత బాగా చేయడానికి కారణం ఆయన నిజ జీవితంలోనూ అలానే ఉంటారు. సన్నీ ఈ కథను అద్భుతంగా తెరకెక్కించారు. ఓటీటీలో ఈ సినిమా చూస్తున్నంత సేపూ థియేటర్లో చూడాల్సిన సినిమా కదా అనిపించింది'' అన్నారు అడివి శేష్. సుమంత్ కుమార్, కాజల్ చౌదరి జంటగా సన్నీ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అనగనగా'. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈటీవీ విన్ ఓటీటీలో ఈ నెల 15న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌కి అతిథిగా హాజరైన అడివి శేష్ మాట్లాడుతూ–''ఈ చిత్రంలో రామ్ పాత్ర కంటతడి పెట్టించింది. విద్యా వ్యవస్థ మారాలని కోరుకునేలా చేయించింది. ఇది సినిమా కాదు..ఒక జీవితం'' అన్నారు. సుమంత్ కుమార్ మాట్లాడుతూ– ''మేము అనుకున్న దానికంటే అద్భుతమైన ఆదరణ అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మా సినిమాకి వస్తున్న స్పందన చూసి ఇప్పుడు థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''సినీ ప్రపంచానికి నన్ను, మా టీమ్‌ను పరిచయం చేసిన చిత్రం ఇది'' అన్నారు సన్నీ సంజయ్. ''ఇంత పెద్ద సక్సెస్ సుమంత్‌గారి వల్లే సాధ్యమైంది'' అని రాకేశ్ రెడ్డి గడ్డం తెలిపారు. ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి మాట్లాడారు.

భలే చాన్స్

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా ('అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్) దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాలో ప్రభాస్‌కి జోడీగా నటించే భలే చాన్స్ అందుకున్నారు త్రిప్తీ డిమ్రీ. ఈ విషయాన్ని శనివారం ప్రకటించింది యూనిట్. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్, మురాద్ ఖేతానీ నిర్మిస్తున్నారు.


త్రిప్తీ డిమ్రీ

''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'స్పిరిట్'. 'యానిమల్'లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న త్రిప్తి డిమ్రీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రభాస్, సందీప్ రెడ్డి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రం భారత సినిమా చరిత్రలోనే ఓ గొప్ప ప్రాజెక్టుగా నిలవనుంది. తొమ్మిది భాషల్లో ఈ సినిమాని రిలీజ్ చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ''ప్రభాస్‌గారితో వెండితెరని పంచుకోవడం, సందీప్‌గారితో మళ్లీ సినిమా చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు త్రిప్తీ డిమ్రీ.

నటుడు ముకుల్ దేవ్ కన్నుమూత



తెలుగు, హిందీ, పంజాబీ, కన్నడ చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న ముకుల్ దేవ్ (54) కన్నుమూశారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీరియల్ నటుడిగా కెరీర్‌ను ఆరంభించిన ముకుల్ దేవ్ 'దస్తక్' చిత్రంతో హిందీ పరిశ్రమకి పరిచయమయ్యారు. రవితేజ హీరోగా వీవీ వినాయక్ దర్శకత్వం వహించిన 'కృష్ణ' (2008) సినిమాతో విలన్‌గా తెలుగు పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చారు ముకుల్. ఆ తర్వాత 'ఏక్ నిరంజన్, సిద్ధం, కేడీ, అదుర్స్, నిప్పు, మనీ మనీ మోర్ మనీ, నిప్పు' వంటి చిత్రాల్లో నటించారు. 2022లో విడుదలైన 'అంత్ ది ఎండ్' తర్వాత ముకుల్ సినిమాల్లో నటించలేదు. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

ముకుల్ మృతి బాధాకరం: ఎన్టీఆర్


''ముకుల్ దేవ్ మృతి చెందడం బాధాకరం. ఆయన చనిపోయారనే వార్త దిగ్భ్రాంతికి గురి చేసింది. 'అదుర్స్'లో పని చేసినప్పుడు ఆయన నిబద్ధత తెలిసింది. ముకుల్‌గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి'' అని హీరో ఎన్టీఆర్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

అనంతపురంలో హారర్ కామెడీ


వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'వీటీ 15' (వర్కింగ్ టైటిల్). మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథా నాయికగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ సినిమా తాజా షెడ్యూల్ అనంతపురంలో ముగిసినట్లు మేకర్స్ ప్రకటించారు. ''ఇండో-కొరియన్ హారర్ కామెడీగా రూపొందుతోన్న చిత్రం 'వీటీ 15'. అనంతపురంలో థ్రిల్లింగ్ సన్నివేశాలతో పాటు పంచ్ హ్యూమర్‌తో కూడిన సీన్స్ షూట్ చేశాం. వరుణ్ తేజ్, రితికా నాయక్‌పై పల్లెటూరి నేపథ్యంలో చిత్రీకరించిన సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయి. మా చిత్రం తర్వాతి షెడ్యూల్ కొరియాలో ప్రారంభం అవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

అందమైన ప్రేమకథ


కల్యాణ్ నాయక్, సౌమిత్ రావు, సాయి వెన్నం

సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన చిత్రం 'నిలవే'. సౌమిత్ రావు, సాయి వెన్నం దర్శకత్వం వహించారు. పీటీవీ ఆర్ట్స్ వ్యా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తాహెర్ సినీ టెక్ సౌజన్యంతో సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాటి నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ చిత్రంలోని పాత్రల్ని పరిచయం చేశారు. సాయి వెన్నం మాట్లాడుతూ– ''ఇదొక అందమైన ప్రేమకథ. ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే 'నిలవే'. మా సినిమా టీజర్ చూశాక... ఎక్స్‌పోజింగ్ లేదని, డైలాగుల్లో బూతులు లేవని, వైరల్ అవ్వదని చాలామంది చెప్పారు. కానీ, మా కంటెంట్ మాత్రమే చెప్పాలని టీజర్ కట్ చేశాం'' అన్నారు. ''నిలవే' మంచి మ్యూజికల్ లవ్ డ్రామా. మేం నిజాయితీతో ఈ చిత్రం చేశాం. నిజాయితీకి అర్థం ఉంటే అది మా సినిమా'' అని సౌమిత్ రావు చెప్పారు. ''ఈ చిత్రానికి కొత్త సంగీతం ఇచ్చాను'' అని పేర్కొన్నారు కల్యాణ్ నాయక్. ఇంకా కెమేరామేన్ దిలీప్ కె. కుమార్, పాటల రచయితలు ఎమ్‌మీఎస్ భరద్వాజ్, కోటి మాట్లాడారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: వెంకట్ కొణకండ్ల, సంజనా కృష్ణ, తాహెర్ సినీ టెక్, కెమేరా: దిలీప్ కె. కుమార్, లైన్ ప్రొడ్యూసర్స్: సునందా ఐథాని, సుప్రీత్ దేవి.

సాక్షి పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కగార్ హత్యలను ఖండిద్దాం

ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక

సాక్షి, హైదరాబాద్ : ఆపరేషన్ కగార్ ద్వారా జరుగుతున్న హత్యలను ఖండించాలని ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ప్రజలను కోరింది. దీనిపై సుప్రీంకోర్టు స్వతంత్ర న్యాయ కమిషన్ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మందిని ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ హత్యలపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేయడం శోచనీయమని ప్రజా సంఘాలు ధ్వజమెత్తాయి. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్లోళ్ల నాగిరెడ్డి, వెల్తురు సదానందం, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, అంజయ్య, పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాయిసిడం బాబురావు, అల్లూరి విజయ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏపూరి మల్సూర్, రమేశ్ పోతుల, పీఓడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ అరుణ ఈ ప్రకటన విడుదల చేశారు.

ఇంత చేస్తే మీ 'రిటర్న్ గిఫ్ట్' ఇదా?

- మేమూ తగిన విధంగానే స్వీకరిస్తాం
- సినీ పరిశ్రమకు ఏపీ డిప్యూటీ సీఎం పరోక్ష హెచ్చరిక
- ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న తెలుగు ఫిలిం ఛాంబర్ సభ్యులు

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల బంద్‌పై వచ్చిన వార్తల నేపథ్యంలో శనివారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 'తెలుగు చిత్రసీమ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌కు ఉప ముఖ్యమంత్రి కృతజ్ఞతలు' అంటూ పవన్‌కళ్యాణ్ కార్యాలయం మీడియాకు ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటన సినీ పరిశ్రమకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తీవ్ర హెచ్చరికల సందేశాలను పంపింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా సినిమా సంఘాల ప్రతినిధులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారా? అంటూ ఈ లేఖ ప్రశ్నించింది. ఇకపై ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలంటూ స్పష్టం చేసింది. పవన్ కళ్యాణ్ నటించిన హరి హర వీరమల్లు సినిమా జూన్ 12వ తేదీన విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో తాజా పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. 'థియేటర్ల బంద్' వార్తల నేపథ్యమే పవన్‌కళ్యాణ్ లేఖకు కారణమని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే థియేటర్ల బంద్‌పై వస్తున్న వార్తలపై తెలుగు ఫిలిం ఛాంబర్ కూడా శనివారమే ఒక స్పష్టత ఇవ్వడం గమనార్హం. హైదరాబాద్‌లో జరిగిన కీలక సమావేశం అనంతరం ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, జూన్ 1 తేదీ నుంచి థియేటర్లు మూత పడతాయనే వార్తలు పూర్తిగా ఊహాజనితం అని పేర్కొనడం గమనార్హం. పవన్ కార్యాలయం ప్రకటనలో ముఖ్యాంశాలు పరిశీలిస్తే, 'సినిమా రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చేందుకు ఆలోచనలు చేస్తున్న తనకు తెలుగు సినిమాకి చెందిన కొందరు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌ను కూడా తగిన విధంగానే స్వీకరించాలని నిర్ణయించడం జరిగింది. ఈ రిటర్న్ గిఫ్ట్‌కు కృతజ్ఞతలు. ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తారు. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తారు. రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే.. తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు''

ఫిలిం ఛాంబర్ ఏమి చెప్పిందంటే..

తెలుగు రాష్ట్రాల ప్రముఖ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హాజరయిన కీలక ఫిలిం ఛాంబర్ సమావేశం అనంతరం కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, ఈ నెల 30న ఈసీ మీటింగ్ జరుగుతుందని, ఆ రోజు 3 సెక్టార్ల నుంచి ఒక కమిటీని ఏర్పాటుచేసి, నిర్ణీత సమయంలోపు సమస్య పరిష్కారానికి కృషి జరుగుతుందని తెలిపారు.

జూన్ 2 నుంచి రాష్ట్రమంతా స్లాట్ బుకింగ్

- అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- నిషేధిత భూముల వివరాలకు ప్రత్యేక పోర్టల్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. స్లాట్‌బుకింగ్ విధానంపై శనివారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రయోగాత్మకంగా 47 కార్యాలయా ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తుండగా, జూన్ 2 నుంచి అన్నిచోట్లా అమల్లోకి తెస్తున్నామని మంత్రి తెలిపారు. స్లాట్‌బుకింగ్ ద్వారా ఇప్పటివరకు 36 వేలకు పైగా లావాదేవీలు జరిగాయని, ఈ విధానంపై 94% మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని వెల్లడించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల మధ్య, తిరి గి మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల మధ్య స్లాట్ బుకింగ్‌కు అవకాశముంటుందని తెలి పారు. స్లాట్‌బుకింగ్ విధానం అమలవుతున్న దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పు నర్వ్యవస్థీకరణ జరుగుతోందని చెప్పారు. పని భారం ఎక్కువగా ఉండే పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, ఇబ్రహీంపట్నం, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల కార్యాలయాల్లో అదనపు సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు సిబ్బందిని నియమిస్తామని ప్రకటించారు. భూ భా రతి తరహాలోనే ప్రత్యేకంగా ఒక పోర్టల్ తయారు చేసి అందులో నిషేధిత భూములు, ఆస్తుల వివరాలను పొందుపరుస్తామని వెల్లడించారు. ఎక్కడ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగినా క్షణాల్లో ప్రధాన కా ర్యాలయానికి తెలిసేలా ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఇలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే అధికారులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు జీపీఓ పరీక్ష : గ్రామ పాలనాధికారి (జీపీఓ) నియామకాలకు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష నిర్వహిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. దాదాపు 5 వేల మంది ఈ పరీక్షకు హాజరవుతారని, జేఎన్టీయూ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన వారిలో ఆసక్తి ఉన్నవారిని వీలైనంత త్వరగా ఈ పోస్టుల్లో నియమిస్తామని వెల్లడించారు.

అట్టహాసంగా తానాకాన్- 2025

ప్రారంభమైన వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సు

కరీంనగర్ టౌన్: తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్ (తానా) ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిమ హోటల్‌లో శనివారం 'తానాకాన్-2025'రాష్ట్రస్థాయి వైద్యుల సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. మొదటి రోజు కాన్ఫరెన్స్‌ను హాజరైన సీనియర్ వైద్యులు, నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు.. తమ విభాగానికి సంబంధించిన తాజా అంశాలను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. పాండిచ్చేరి కారికల్ మెడికల్ కాలేజీ నుంచి హాజరైన డాక్టర్ విజయ్‌కుమార్ నాయర్.. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ గురించి వివరించారు. వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి 900 మంది వైద్యులు సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, తానా రాష్ట్ర ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ కటారి పాల్గొన్నారు.

700 శ్లోకాల 'విజయ'లక్ష్ములు!

- భగవద్గీత పారాయణంలో ప్రతిభ
- ఏడాది శ్రమతో బంగారు పతకం సాధించిన తోటికోడళ్లు



భగవద్గీత శ్లోకాలు కంఠస్థం చేసిన తోటి కోడళ్లు లక్ష్మి, విజయలక్ష్మి

ముస్తాబాద్ (సిరిసిల్ల): మామ ఆలపించే భక్తిగీతాలు వారికి ప్రేరణనిచ్చాయి. భజనలు వారిలో స్ఫూర్తినింపాయి. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఏడాదిలోనే భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో 700 శ్లోకాలను కంఠస్థం చేయడమే కాకుండా మైసూరులోని శ్రీదత్త పీఠం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత పారాయణ పోటీల్లో ఏకంగా 20 వేల మందితో పోటీపడి బంగారు పతకాలు సాధించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన తోటికోడళ్లు కట్కం లక్ష్మి, కట్కం విజయలక్ష్మిల స్ఫూర్తిదాయక ఆధ్యాత్మిక ప్రయాణం ఇది.

భజన మండలి, మామయ్య స్ఫూర్తి

కట్కం లక్ష్మి, కట్కం విజయలక్ష్మి 30 మంది స్నేహితులతో కలిసి 20 ఏళ్ల క్రితం శ్రీ వేంకటేశ్వర భజన మండలిని ఏర్పాటు చేసుకున్నారు. ఆవునూర్ గ్రామంలోని రామాలయంతోపాటు ఇళ్లలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భజనలు చేసేవారు. లక్ష్మి, విజయలక్ష్మిల మామయ్య కట్కం రాజేశం నిత్యం భక్తిగీతాలు ఆలపించేవారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన కొత్త అనురాధతో ఏర్పడిన పరిచయం ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకొనేలా చేసింది. ఇటీవల మైసూరులోని శ్రీదత్తపీఠం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా 20 వేల మందితో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పారాయణం పోటీల్లో పాల్గొన్న లక్ష్మి, విజయలక్ష్మి తమ ప్రతిభను చాటి ఫైనల్‌కు చేరుకున్నారు. ఈ నెల 19న 2 వేల మందికి జరిగిన ఆన్‌లైన్ ఫైనల్ పోటీల్లో విజేతలుగా ఎంపికైన 500 మందిలో వారిద్దరూ నిలిచారు. దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా లక్ష్మి, విజయలక్ష్మి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

శ్లోకాలకు తాత్పర్యం చెబుతాం

భగవద్గీత పారాయణాన్ని జీవిత లక్ష్యంగా పెట్టుకున్నా. భర్త, పిల్లల సహకారంతో ఏడాదిపాటు సాధన చేశా. అనురాధ మేడం మమ్మల్ని గుర్తించి మా బృందంలోని 10 మందికి శిక్షణ ఇచ్చారు. భవిష్యత్‌లో శ్లోకాలకు అర్థాలు చెప్పి, భగవద్గీత మహత్యాన్ని పంచుతాం.

– కట్కం లక్ష్మి

భజన మండలితో అంకురార్పణ

మా భజన మండలి సభ్యులు, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చిన అనురాధ మేడం ప్రోత్సాహంతోనే పతకాలు సాధించాం. భవిష్యత్‌లో మరింత మందికి శ్లోకాలను నేర్పి భగవద్గీత గొప్పదనాన్ని పంచుతాం.

– కట్కం విజయలక్ష్మి

కోవిడ్‌పై ఆందోళన వద్దు

- వానాకాలం సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్షలో మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ భరోసా ఇచ్చారు. కోవిడ్ కేసులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ శాఖ సర్వసన్నద్ధంగా ఉందన్నారు. అయితే ఇప్పుడు దేశంలో నమోదవుతున్న కేసులు సాధారణమైనవేనని చెప్పారు. రాష్ట్రంలో కోవిడ్ వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై మంత్రి దామోదర ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్, సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జలుబు, దగ్గు లాగే కోవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం.. మాస్కు ధరించడం వంటి చర్యల ద్వారా వైరస్‌ల వ్యాప్తిని నిరోధించొచ్చని చెప్పారు. ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అన్ని ఆస్పత్రుల్లో సరిపడా మందులు, రీఏజెంట్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కోవిడ్, డెంగీ పేరిట ప్రైవేటు ఆస్పత్రులు ప్రజల్ని దోచుకొనే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దామోదర స్పష్టం చేశారు.

జేఎన్-1 వేరియంట్‌తో ఆందోళన అక్కర్లేదు

దేశంలో కోవిడ్ జేఎన్-1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యాయని.. ఈ వేరియంట్ 2023 నుంచే దేశంలో వ్యాప్తిలో ఉందని అధికారులు మంత్రి దామోదరకు వివరించారు. ఈ వేరియంట్ వల్ల ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన పరిస్థితులేమీ లేవన్నారు. ఇతర దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి తప్పితే ఇతరులెవరికీ ఆస్పత్రుల్లో చేరాల్సిన అవసరం పడటం లేదన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడా నమోదయ్యే కోవిడ్ కేసులను ఎదుర్కొనేందుకు టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ సహా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.


క్లుప్తంగా...

ఇకపై మధ్యాహ్నం కూడా స్పర్శదర్శనం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో స్పర్శ దర్శనం మధ్యాహ్నం స్లాట్‌ను ఆలయాధికారులు పునః ప్రారంభించారు. శని, ఆది, సోమవారాల్లో మధ్యాహ్నం మల్లన్న స్పర్శదర్శనం చేసుకునే వారికి ఆన్‌లైన్‌లో 350 టికెట్లు, కరెంట్ బుకింగ్‌లో 200 టికెట్లు అందుబాటులో ఉంచారు. మధ్యాహ్నం స్పర్శదర్శనం కల్పించేందుకు ఆలయ ఈవో శ్రీనివాసరావు ఇటీవల ఆలయాధికారులు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వైదిక కమిటీ, వసతి విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ స్లాట్ పునరుద్ధరణకు వైదిక కమిటీ, అధికారులు సుముఖత వ్యక్తం చేయడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం శని, ఆది, సోమవారాల్లో ఉదయం, రాత్రి మాత్రమే మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. దీనికి టికెట్లను ఆన్‌లైన్‌లోనే ఉంచుతున్నారు. ఇప్పుడు తీసుకున్న నిర్ణయంతో ఇకపై శని, ఆది, సోమవారాల్లో మధ్యాహ్నం కూడా భక్తులు స్పర్శదర్శనం చేసుకోవచ్చు.

తిరుమలలో పారదర్శకంగా సాంకేతిక సేవలు: ఈవో



తిరుమల: టీటీడీలో సాంకేతిక సేవలు మరింత పారదర్శకంగా అమలు చేయనున్నట్లు ఈవో జె.శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఇందులో టీటీడీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈవో వివరించారు. వేసవి నేపథ్యంలో తిరుమల మాడ వీధుల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేసి, కూల్ పెయింట్ వేసి నిరంతరాయంగా నీటిని పిచికారీ చేస్తున్నామన్నారు. ఎన్‌ఆర్‌ఐ సేవకులు శ్రీవారి సేవ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీటితో పాటు గోమాతలకు సేవ చేసేందుకు 'గోసేవ'ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. భక్తులకు మరింత నాణ్యంగా, రుచికరంగా ఆహార పదార్థాలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

బెంగళూరు విమానం అత్యవసర ల్యాండింగ్

ప్రయాణికుడికి అస్వస్థత..

శంషాబాద్ (హైదరాబాద్): జైపూర్ నుంచి బెంగళూరు బయలుదేరిన విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. వివరాలివి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 2729 విమానం శనివారం మధ్యాహ్నం జైపూర్ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. విమానంలో ఒక ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో.. పైలట్ శంషాబాద్ ఏటీసీకి సమాచారం అందించాడు. దీంతో విమానాన్ని మెడికల్ ఎమర్జెన్సీ కింద శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించి ల్యాండ్ చేశారు. ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం విమానం ఇక్కడి నుంచి బెంగళూరుకు బయలుదేరింది.

'పది' ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయభేరి

అమరావతి: పదో తరగతి రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ ఫలితాల్లో ఇద్దరు శ్రీచైతన్య విద్యార్థులు 599 మార్కులు సాధించారని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 598 మార్కులు ఏడుగురికి, 597 మార్కులు 42 మందికి, 596 మార్కులు 109 మందికి, 595 మార్కులు 201 మందికి, 590కి పైగా మార్కులు 1,184 మందికి వచ్చాయని పేర్కొన్నారు. తమ విద్యార్థులైన 24,261 మంది 528 మార్కులకు పైగా సాధించారని పేర్కొన్నారు. ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2% రాగా, 80 శాతం బ్రాంచ్‌లు 100 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1వ ర్యాంకు, 19 మంది శ్రీ చైతన్య విద్యార్థులకు 100 లోపు ర్యాంకులు వచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి విద్యాసంస్థల డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

రేపు ఢిల్లీలో బీసీల సాధికారతపై చర్చ

- బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లకు అధిష్టానం పిలుపు
- హాజరు కానున్న ఖర్గే, రాహుల్

సాక్షి, హైదరాబాద్: బీసీల సాధికారతపై సోమవారం న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగే చర్చా కార్యక్రమానికి తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు హాజరు కానున్నారు. కార్యక్రమానికి హాజరు కావాలంటూ తెలంగాణలోని బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లకు కాంగ్రెస్ అధిష్టానం సమాచారమిచ్చింది. సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలు కూడా హాజరు కానున్నారు.



మిస్ న్యూజిలాండ్

ర్యాంప్‌పై అందాల భామల క్యాట్‌వాక్..







మిస్ ఇండియా

10 మందికి బెర్తులు ఖరారు

మిస్ వరల్డ్ ప్రధాన పోటీల్లో నిలిచే టాప్-40 స్థానాల్లో చోటు

భారత సుందరి నందినిని ఎట్టకేలకు నాలుగో చాలెంజ్‌లో వరించిన అదృష్టం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీల్లో కిరీటం కోసం పోటీపడే టాప్-40 మందిలో 10 మంది చోటు దక్కించుకున్నారు. వారు ఒక్కో ఖండం నుంచి ఎంపికయ్యే టాప్-10లో భాగం కానున్నారు. శనివారం నాటికి మొత్తం నాలుగు రకాల చాలెంజ్ రౌండ్లు పూర్తయ్యాయి. గ్రాండ్ ఫినాలే ముందు మరో రౌండ్ మాత్రమే మిగిలి ఉంది. ఒక్కో ఖండం నుంచి ఎంపికయ్యే మొదటి 10 మందిలో ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో స్థానం సంపాదించిన ఈ 10 మందిలో భారత సుందరి నందినీ గుప్తా కూడా ఉండటం విశేషం. మొదటి మూడు చాలెంజ్ రౌండ్లలో ఆమెకు నిరాశ ఎదురవగా శనివారం జరిగిన కీలక టాప్ మోడల్ చాలెంజ్‌లో ఆమె ఆసియా-ఓషియానియా నుంచి విజేతగా నిలిచి టాప్-10 గ్రూపులో చేరింది. ఇక చివరగా ఈ నెల 26న హైటెక్స్‌లో బ్యూటీ విత్ పర్పస్ కార్యక్రమం జరగనుంది. అందులో పోటీదారులు వారి సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించాల్సి ఉంటుంది. వాటిల్లో ఉత్తమంగా రాణించినవారు టాప్-40 (ఖండానికి 10 మంది చొప్పున)లో మిగతా బెర్తులు సాధిస్తారు. వారిలోంచి టాప్-20 (ఖండానికి ఐదుగురు చొప్పున), ఆ తర్వాత టాప్-8 (ఖండానికి ఇద్దరేసి) ఎంపిక చేస్తారు. ఈ ఎనిమిది మంది ఈ నెల 31న హైటెక్స్‌లో జరిగే గ్రాండ్ ఫినాలేలో భాగమవుతారు. వారి నుంచి విజేత, మొదటి రన్నరప్, రెండో రన్నరప్ ఎంపికవుతారు.

టాప్ మోడల్ చాలెంజ్: విజేతలు: మిస్ ఇండియా, మిస్ నమీబియా, మిస్ మార్టినిక్, మిస్ ఐర్లాండ్

శనివారం జరిగిన టాప్ మోడల్ చాలెంజ్ ఆసాంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో తొలుత నాలుగు ఖండాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం ఎనిమిది మందితో షార్ట్ లిస్ట్ తయారు చేశారు. అందులోంచి న్యాయ నిర్ణేతలు ఖండానికి ఒకరు చొప్పున నలుగురిని విజేతలుగా ప్రకటించారు. ఇందులో ఆసియా-ఓషియానియా నుంచి మిస్ ఇండియా నందినీ గుప్తా న్యూజిలాండ్ భామ నుంచి గట్టి పోటీ ఎదుర్కొని విజేతగా నిలిచింది. ఆఫ్రికా నుంచి నమీబియా సుందరి సెల్మా కమన్య, అమెరికా-కరీబియన్ నుంచి మిస్ మార్టినిక్ అరేలీ జోచిమ్, యూరప్ నుంచి ఐర్లాండ్ సుందరి జాస్మిన్ గెర్హాడ్‌లు విజయం సాధించారు. ఇలా ఇప్పటివరకు 10 మంది భామలు ఖండానికి 10 మంది చొప్పున మొత్తం 40 మంది ఉండే బృందంలో బెర్తు దక్కించుకున్నారు. గ్రాండ్ ఫినాలే నాటికి పోటీల్లో ఉండేందుకు చోటు దక్కించుకున్న 10 మందిలో ముగ్గురు ఆసియా ఖండానికి చెందిన వారున్నారు. మిగిలిన వారిలో యూరప్ నుంచి ముగ్గురు, ఆఫ్రికా నుంచి ఇద్దరు, అమెరికా-కరీబియన్ నుంచి ఇద్దరు ఉన్నారు.

ఆసియా ఖండం నుంచి ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో టాలెంట్ చాలెంజ్‌లో ఇండోనేసియా సుందరి, హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో తుర్కియే ముద్దుగుమ్మ , శనివారం నందినీ గుప్తా చోటు దక్కించుకున్నారు. ఇంకా ఏడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

ఇప్పటివరకు వివిధ చాలెంజ్‌లలో విజేతలుగా టాప్-40లో చోటుదక్కించుకున్న వారి వివరాలు ఇలా..

స్పోర్ట్స్ చాలెంజ్: విజేత మిస్ ఎస్తోనియా ఎలిస్ రాండ్‌మా

→ ఈ నెల 17న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగింది. 109 మంది పోటీదారులు ఫిట్‌నెస్‌లో తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. అందులో 32 మందిని షార్ట్‌లిస్ట్ చేయగా అందులోంచి మొదటి నాలుగు స్థానాలకు నలుగురిని ఎంపిక చేశారు. వారిలో ఎస్తోనియాకు చెందిన ఎలిస్ రాండ్‌మా విజేతగా నిలిచింది. ఖండానికి 10 మంది చొప్పున 40 మందితో కూడిన ప్రధాన పోటీదారుల జాబితాలో ఆమె తొలి స్థానాన్ని దక్కించుకుంది.

టాలెంట్ చాలెంజ్: విజేత మిస్ ఇండోనేసియా మొనికా కెజియా

→ ఈ నెల 22న శిల్పకళావేదికలో ఈ పోటీలు సాగాయి. పోటీదారులు ఆటాపాట, సంగీతంతో ఉర్రూతలూగించారు. అందులో మొత్తం 24 మందిని ఉత్తమ ప్రతిభావంతులుగా షార్ట్‌లిస్ట్ చేశారు. వారిలో నందినీ గుప్తా కూడా ఉన్నారు. ఆ తర్వాత టాప్-3లో ఇండోనేసియా, కామెరూన్, ఇటలీ పోటీదారులు నిలవగా చివరకు విజేతగా ఇండోనేసియా భామను ప్రకటించారు.

హెడ్ టు హెడ్ చాలెంజ్: విజేతలు మిస్ వేల్స్, మిస్ తుర్కియే, మిస్ ట్రినిడాడ్-టొబాగో, మిస్ జాంబియా

→ ఈ నెల 20, 21 తేదీల్లో టీ-హబ్‌లో జరిగింది. ఫైనల్ పోటీ శుక్రవారం హోటల్ ట్రైడెంట్‌లో నిర్వహించారు. కాంటినెంటల్ క్వాలిఫైర్స్, టాప్-8 మందిని ఎంపిక చేసి అందులోంచి శుక్రవారం విజేతలను ప్రకటించారు. అందులో ఆసియా నుంచి తుర్కియే భామ ఇదిల్ బిల్గెన్, ఆఫ్రికా నుంచి ఫెయిత్ బ్వాల్యా, అమెరికా-కరీబియన్ దీవుల నుంచి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన అన్నా లిసే నాన్టన్, యూరప్ నుంచి వేల్స్ ముద్దుగుమ్మ మిల్లీ మీ ఆడమ్స్ ఎంపికయ్యారు. తొలుత టాప్-20, ఆ తర్వాత టాప్-8 భామలను ఎంపిక చేసి చివరకు విజేతలను ప్రకటించారు.

టాప్ మోడల్ చాలెంజ్ విజేత మిస్ ఇండియా

పటోలా లెహంగాలో ర్యాంప్‌పై నందినీ గుప్తా మెరుపులు

ఆసియా-ఓషియానియా గ్రూప్ నుంచి విజేతగా ఎంపిక

గొల్లభామ చీరలు, పోచంపల్లి వస్త్రాలతో క్యాట్‌వాక్ చేసి అదరగొట్టిన అందాల భామలు

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే ముందు ఒకే ఒక్క చాలెంజ్ రౌండ్ ఉండగా మిస్ ఇండియా నందినీ గుప్తా టాప్-40 జాబితాలో చోటు దక్కించుకుంది. గ్రాండ్ ఫినాలే నాటికి పోటీలో ఉండాలంటే కచ్చితంగా ఖండానికి 10 మంది చొప్పున ఉండే ఈ టాప్-40లో చోటు దక్కించుకోవాల్సిందే. ఫాస్ట్‌ట్రాక్ పోటీ రౌండ్లలో విజయం సాధించడం ద్వారా నేరుగా అందులో చేరే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన మూడు రౌండ్లలో ఆమె విజయం సాధించలేకపోవడంతో మిస్ వరల్డ్ పోటీలను అనుసరిస్తున్న భారత అభిమానుల్లో నిరాశే మిగిలింది. శనివారం హైటెక్స్‌లో జరిగిన టాప్ మోడల్ ఫ్యాషన్ షోలో నందినీ గుప్తా.. పటోలా లెహంగా వస్త్రధారణతో ర్యాంప్‌పై క్యాట్ వాక్‌తో న్యాయనిర్ణేతల దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ఆధునిక వస్త్రధారణలోనూ తళుక్కున మెరిసింది. వెరసి ఈ రౌండ్‌లో ఆసియా-ఓషియానియా గ్రూప్ నుంచి ఆమె న్యూజిలాండ్ సుందరితో కలిసి టాప్-8లో నిలిచింది. చివరకు న్యూజిలాండ్ భామను వెనక్కు నెట్టి విజేతగా ఎంపికైంది.

పోచంపల్లి, గద్వాల, గొల్లభామ చీరలు...



మిస్ వరల్డ్ పోటీలు ఆసాంతం తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తూ ముందుకు సాగుతుండగా దాన్ని మరింత విస్తరిస్తూ శనివారం టాప్ మోడల్ పోటీలు సాగాయి. ప్రపంచ ప్రఖ్యాత పోచంపల్లి వస్త్రాలు, సిద్దిపేట గొల్లభామ, గద్వాల చీరలతోపాటు లెహంగా, గాగ్రా చోలీ తదితర భారతీయ వస్త్రాలు ధరించిన అందాల భామలు.. ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. తొలుత తెలంగాణ టాప్ డిజైనర్లు రూపొందించిన తెలంగాణ-భారతీయ సంప్రదాయ వస్త్రాలతో క్యాట్ వాక్ చేశారు. అనంతరం టాప్ డిజైనర్లు రూపొందించిన ఆధునిక వస్త్రాలతో రెండోసారి ర్యాంప్‌పై నడిచారు. ఈ రెండు రౌండ్లకు కలిపి న్యాయనిర్ణేతలు మార్కులు వేశారు. హైహీల్స్, పొడవాటి వస్త్రాలు ధరించిన జపాన్ సుందరి క్యాట్‌వాక్ రౌండ్ చివర్లో అదుపుతప్పి ర్యాంప్‌పై పడిపోయింది. ఆ వెంటనే లేచి తేరుకుని వాక్ పూర్తి చేసింది.

తెలంగాణ డిజైన్లకు న్యాయ నిర్ణేతల ప్రశంసలు..

ఫ్యాషన్ ఫినాలేకు హాజరైన న్యాయ నిర్ణేతలు, ఆహూతులు.. తెలంగాణ సంప్రదాయ డిజైన్లను చూసి ప్రశంసలు కురిపించారు. పోటీదారులంతా స్థానిక చేనేతలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడం ఆ డిజైన్లకు, తయారీదారులకు గుర్తింపును, మార్కెటింగ్ అవకాశాలను అందిస్తుందన్నారు. తెలంగాణ చేనేత వస్త్రాలతో డిజైన్లు చేయడం ఆనందంగా, గర్వంగా ఉందని డిజైనర్ అర్చనా కొచ్చార్ అన్నారు. దీని ద్వారా చేనేత చీరలకు ప్రపంచ ఖ్యాతి దక్కుతుందని అభిప్రాయపడ్డారు.

డిజైనర్ డ్రెస్ విజేతలు వీరే..

ఈ పోటీల్లో బెస్ట్ డిజైనర్ డ్రెస్ విజేతలుగా ఒక్కో ఖండం నుంచి ఒకరు చొప్పున నిలిచారు. ఆసియా-ఓషియానియా గ్రూప్ నుంచి న్యూజిలాండ్ సుందరి సమంతా పూల్, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా ముద్దుగుమ్మ జోలైస్ జాన్సెన్ వాన్ రెన్స్‌బర్గ్, అమెరికా-కరీబియన్ బృందం నుంచి ప్యూర్టోరికో భామ వలేరియా పెరేజ్, యూరప్ నుంచి ఉక్రెయిన్ సుందరీమణి మారియా మెల్నిచెంకో విజేతలుగా నిలిచారు. అయితే వారు టాప్-40 పరిధిలోకి రారు.

బ్యూటీ విత్ పర్పస్ అనేది డొల్ల

యువతకు స్ఫూర్తిగా నిలవాలనుకున్నా..

పరిస్థితులు అలా లేవు... అందుకే వైదొలిగా

స్పాన్సర్ల పక్కన ఆటాడే కోతుల్లా కూర్చోబెట్టారు

మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ సంచలన ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం తొలిసారి ఆతిథ్యం ఇస్తున్న మిస్ వరల్డ్-2025 అందాల పోటీల చుట్టూ తీవ్ర వివాదం ముసురుకుంది! వ్యక్తిగత కారణాలతో పోటీల నుంచి వైదొలగుతున్నట్లు చెప్పి స్వదేశం వెళ్లిపోయిన మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ తాజాగా 'ద సన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పోటీల తీరుపై సంచలన ఆరోపణలు గుప్పించారు. తాను వేశ్యననే భావన కలిగేలా నిర్వాహకులు పరిస్థితులను కల్పించారంటూ బాంబు పేల్చారు. నిర్వాహకులు పేర్కొన్నట్లు ఈ పోటీలు బ్యూటీ విత్ పర్పస్‌కు అనుగుణంగా లేవని.. అదంతా డొల్లేనని దుయ్యబట్టారు. పోటీదారులంతా ఎల్లవేళలా మేకప్ వేసుకోవాలని ఆదేశించారని.. అల్పాహారం సమయంలోనూ బాల్ గౌన్లు ధరించాల్సిందేనని హుకుం జారీ చేశారని విమర్శించారు. 'పోటీకి ఆర్థిక సహకారం అందిస్తున్న స్పాన్సర్లకు కృతజ్ఞతాపూర్వకంగా ఆరుగురు అతిథులు కూర్చున్న ఒక్కో టేబుల్ వద్ద ఇద్దరేసి పోటీదారులను కూర్చోబెట్టారు. సాయంత్రం మొత్తం వారితో కూర్చొని కృతజ్ఞతలు తెలుపుతూ మేం వినోదం అందించాలని నిర్వాహకులు ఆశించారు. ఓ సమయంలో పోటీల ఉద్దేశం గురించి అతిథులకు వివరించే ప్రయత్నం చేశా. కానీ ఈ విషయాన్ని వారెవరూ పట్టించుకోలేదు. అది నాకు భరించలేనట్లుగా అనిపించింది. ఇతరుల వినోదం కోసం నేను ఇక్కడికి రాలేదు కదా అనుకున్నా. సంపన్న పురుష స్పాన్సర్ల ముందు కవాతు చేశాక వేశ్యలా భావించా'అని మిల్లా మాగీ చెప్పుకొచ్చింది.

మారాలనుకున్నా... నా వల్ల కాలేదు..

సమాజంలో మార్పు తీసుకురావడానికి, యువతలో స్ఫూర్తినింపి వారి భవితకు దోహదపడాలనే ఉద్దేశంతోనే పోటీలో పాల్గొన్నానని మిల్లా మాగీ



పేర్కొంది. కానీ అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితుల్లో ఉంటానని ఏమాత్రం ఊహించలేకపోయానని చెప్పుకొచ్చింది. అతిథులను సంతోషపెట్టేందుకు ఆటాడే కోతుల్లా అక్కడ కూర్చోవాల్సి వచ్చిందని.. దీన్ని ఏమాత్రం తట్టుకోలేకపోయానని వాపోయింది. 'నేను నిర్వాహకుల నిబంధనలకు అనుగుణంగా మారాలనే ప్రయత్నంలో ఒత్తిడిని అనుభవించా. అలా చేయకపోతే గెలవలేననే విషయం నాకు అర్థమైంది. మిస్ వరల్డ్ పోటీలంటే మనం ఎలా ఉన్నామో అలా కనిపించడం. కానీ 1970ల నుంచి ఆ పోటీల తీరు మారలేదు. అందుకే మేకప్ లేకుండానే బయటకు వెళ్లడం ప్రారంభించా. అల్పాహారం తీసుకోవడానికి నాకు నప్పేవి, తగిన దుస్తులను ధరించడం ప్రారంభించా'అని మిల్లా మాగీ చెప్పింది.

ఆరోపణలన్నీ నిరాధారం: మిస్ వరల్డ్ సీఈఓ

మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ఆరోపణలను మిస్ వరల్డ్-2025 సీఈఓ జూలియా మోర్లే ఓ ప్రకటనలో ఖండించారు. ఆమె ఆరోపణలను నిరాధార, కల్పితమైనవిగా అభివర్ణించారు. తల్లి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నందున పోటీల నుంచి వైదొలగుతానని మిల్లా మాగీ చెప్పడంతో ఆమె స్వదేశం చేరుకొనేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మాగీ స్థానంలో మిస్ ఇంగ్లాండ్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన చార్లెట్ గ్రాంట్ పోటీలో పాల్గొనేందుకు హైదరాబాద్ చేరుకుందని.. ఈ పోటీలో ఇంగ్లండ్ ప్రాతినిధ్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. మిల్లా మాగీ ఆరోపణల నేపథ్యంలో పోటీలో పాల్గొన్న సందర్భంగా ఆమె నిర్వాహకులను ప్రశంసిస్తూ మాట్లాడిన మాటలు, అనుభూతులను పంచుకున్న వైనాన్ని వీడియోలను విడుదల చేయనున్నట్లు జూలియా మోర్లే వివరించారు. మిస్ వరల్డ్ సంస్థ అంకిత భావంతో ఉందని.. బ్యూటీ విత్ పర్పస్ అనే పంథాకు కట్టుబడి పని చేస్తోందని స్పష్టం చేశారు.

విజయవాడ, విశాఖలో బాంబు బెదిరింపులు

బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో జల్లెడ పట్టిన పోలీసులు

బాంబు జాడలు కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు, ప్రజలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ)/తాటిచెట్ల పాలెం (విశాఖ): వరుస బాంబు బెదిరింపు కాల్స్‌తో విజయవాడ, విశాఖ ఒక్కసారిగా నగరాలు ఉలిక్కిపడ్డాయి. పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టామని ఆగంతకుల నుంచి ఫోన్లు రావడంతో బాంబు స్క్వాడ్, పోలీసులు పరుగులు తీశారు. ఆయా ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు చేయగా.. ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శనివారం తెల్లవారుజామున విజయవాడలోని బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టామని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, ఆ తరువాత రైల్వేస్టేషన్‌కు బెదిరింపు కాల్స్ వచ్చాయి. బీసెంట్ రోడ్డులో పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో తనిఖీ చేపట్టారు. దాదాపు నాలుగు గంటల తనిఖీల అనంతరం బాంబు లేదని, ఎటువంటి భయం లేకుండా అందరూ వ్యాపారాలు చేసుకోవచ్చని పోలీసులు తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లోనూ బాంబు పెట్టినట్టు బెదిరింపు కాల్ రావడంతో జిల్లా పోలీసులు, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది బాంబ్ స్క్వాడ్, పోలీసు జాగిలాలతో స్టేషన్‌లో అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. చివరకు గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. ముంబై నుంచి విజయవాడ మీదుగా విశాఖ వచ్చే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉన్నట్లు ఆగంతకుడి నుంచి ఫోన్ కాల్ రాగా.. ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ చివరి స్టాప్ విశాఖ రైల్వే స్టేషన్ కావడంతో విశాఖ పోలీసులు అప్రమత్తమయ్యారు. రైలు విశాఖ స్టేషన్‌కు చేరుకోగానే క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 25-5-2025

సిస్టర్ స్ట్రోక్‌తో కేటీఆర్‌కు చిన్నమెదడు చితికింది

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత కేటీ రామారావుకు సిస్టర్ స్ట్రోక్ తగిలిందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. ఆమె శనివారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సిస్టర్ స్ట్రోక్‌తో కేటీఆర్ చిన్నమెదడు చితికిపోయిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో కమీషన్ తీసుకున్నప్పుడు లేని భయం.. విచారణ కమిషన్ ముందుకు రావడానికి ఎందుకని ఆమె ప్రశ్నించారు. గోబెల్స్ ప్రచారంలో కేటీఆర్‌ను మించిన వారు లేరని, ఆయనకు గోబెల్స్ అవార్డు ఇవ్వాలని వ్యాఖ్యానించారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ నడుస్తోందన్నారు. ఎమ్మెల్సీ కవిత చెప్పిన దయ్యం కేటీఆరే కావొచ్చని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదని సీతక్క స్పష్టం చేశారు. మోదీ ప్రశంసల కోసమే.. ఈడీ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఈ కేసు నమోదు చేశారని, యుద్ధంలో ట్రంప్ నీతిని మోదీ అమలు చేస్తున్నారన్నారు. అబద్ధాన్ని నిజం చేయడం కోసం కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను కేటీఆర్ మర్చిపోయారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై తప్పుడు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. కేటీఆర్‌కు నీతి, నిజాయితీ ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు 'కూలేశ్వరం' ఎలా అయిందో చెప్పాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పత్రికకు సహాయం చేస్తే తప్పా? అని ప్రశ్నించారు. గులాబీ కూలీల రూపంలో దోచుకున్న డబ్బు ఎక్కడిదో సమాధానం చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు.





మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా శనివారం ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేస్తున్న సుందరీమణులు





పెంపుడు కుక్కలతో ఆడుకుంటున్న దీపిక



కుక్కలకు స్నాక్స్ అందిస్తున్న దీపిక తల్లి ప్రసన్నలక్ష్మి

ఊరకుక్కలకో ఊరడింపు



కుటుంబమంతా శునకాల ప్రేమికులే..

- 13 ఏళ్లుగా పెంపకం
- 3 వేలపైగా కుక్కల దత్తత
- ఎక్కడైనా వీధి కుక్కలకు ప్రమాదం జరిగితే సొంత ఖర్చులతో వైద్యం

మహబూబాబాద్ అర్బన్: ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిరుచి ఉంటుంది. కొందరికి మొక్కలు పెంచడం, ఇంకొందరికి జంతువులు, పక్షులను సాకడం ఇష్టం. కాగా పింగిలి శ్రీనివాస్, ఆయన కూతురు దీపిక మాత్రం శునకాలను పెంచడం ఇష్టంగా మార్చుకున్నారు. వారి కుటుంబ సభ్యులందరూ శునకాల ప్రేమికులే కావడం విశేషం.

ఖమ్మం నుంచి తీసుకొచ్చి..

మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లికి చెందిన పింగిలి శ్రీనివాస్–ప్రసన్నలక్ష్మి దంపతులకు కూతురు దీపిక, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ ప్రభుత్వ డ్రాయింగ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తించి రిటైరయ్యారు. ఆయన ఒకరోజు ఖమ్మంలోని తన బంధువుల ఇంట్లో కార్యక్రమానికి వెళ్లారు. అక్కడ ఇంద్రనగర్ కాలనీలో సైడ్ డ్రెయినేజీ వద్ద చిన్న కుక్కపిల్ల శ్రీనివాస్ కంటపడగా.. దానిని ఇంటికి తీసుకొచ్చారు. ఆయన కూతురు దీపిక.. ఆ కుక్క పిల్లను ప్రేమగా దగ్గరికి తీసుకొని.. స్నానం చేయించి పాలు, బిస్కెట్లు అందించింది. కుక్కపిల్ల నోటినుంచి నురగ కారడంతో పాటు కురుపులు కావడంతో వెంటనే పశువైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు ఖమ్మంలో పశువైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించి శునకానికి క్యాన్సర్ ఉందని తేల్చారు. దీంతో హైదరాబాద్, ముంబై వైద్యులు చికిత్స చేయగా కోలుకుంది. కాగా దానికి దీపిక ముద్దుగా టాఫీ అని నామకరణం చేసి పెంచుకుంది. ఇలా వారి కుటుంబానికి కుక్కల పెంపకంపై మక్కువ పెరిగింది. వీధికుక్కలు, అనారోగ్యానికి గురైన వాటిని చేరదీసి వాటి ఆలనాపాలన చూస్తున్నారు.

అనాథ శునకాలకు ఆలంబన

మానుకోట జిల్లా కేంద్రంలో లక్ష్మి థియేటర్ వద్ద గర్భం దాల్చిన వీధి కుక్క కనిపించింది. తండ్రి శ్రీనివాస్, కూతురు దీపిక దాన్ని ఇంటికి తీసుకెళ్లి వైద్యం అందించారు. నెహ్రూసెంటర్‌లో మరో కుక్క పిల్ల కనిపించగా.. దాన్ని కూడా తీసుకెళ్లి పెంచుతున్న క్రమంలో ఒకరోజు కిందపడిపోయింది. దానిని పశువైద్యశాలకు తీసుకెళ్లగా శునకానికి మూర్ఛరోగం ఉందని తెలిపారు. ఆ కుక్కను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి రూ.25 వేల వరకు వెచ్చించి చికిత్స అందించారు. ఆ తర్వాత గర్భం దాల్చిన వీధి కుక్క 7 పిల్లలకు జన్మనిచ్చింది. అనంతరం వాటిని ఇంటికి తీసుకురాగా.. సందడి నెలకొంది. కుటుంబ సభ్యులందరూ సంతోషంగా వాటి మధ్యలో ఆడుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. ఇలా ఎక్కడ వీధి కుక్కలు అనారోగ్యంతో కనిపించినా.. వాటిని ఇంటికి తీసుకొచ్చి స్నానం చేయించి, సొంత డబ్బులతో మంచి వైద్యం అందించి ఆరోగ్యంగా తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 3వేల కుక్కలను దత్తత ఇచ్చారు. వారి కుటుంబం ప్రస్తుతం సుమారు 40 కుక్కలను పెంచుతోంది.

దంపతులిద్దరూ శునకాల సేవలో..

పింగిలి దీపిక 13 ఏళ్లుగా శునకాలను పెంచుతోంది. కాగా ఆమెకు 2020లో మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన ఇమామ్ పాషాతో వివాహం జరిగింది. అప్పటి నుంచి ఇమామ్‌పాషా కూడా ఆమెకు సహకరిస్తున్నారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయత్రం తానే దగ్గరుండి చూసుకుంటూ.. భోజనంతో పాటు మందులు వేస్తున్నారు.

కుక్కల కోసం యూట్యూబ్ చానల్



నాకు కుక్కలు, వాటి పిల్లలు అంటే చాలా ప్రేమ. మొదట మా నాన్న కుక్క పిల్లను తీసుకువచ్చాడు. దాంతో నాకు కుక్కలంటే ప్రేమ పెరిగింది. నేను మొదట మ్యారేజ్ ఈవెంట్స్ చేసేదాన్ని, అలా వచ్చిన డబ్బులతో కుక్కలకు వైద్యం, స్నాక్స్ భోజనం అందించేదాన్ని. ప్రస్తుతం చాలా కుక్కలు ఇంట్లో ఉండడంతో.. నాన్న పెన్షన్ డబ్బులతో వాటికి అన్ని రకాల భోజనం అందిస్తున్నాను. నేను పెంచుతున్న వీధి కుక్కలకు ఏదో ఒక రోగం ఉంటోంది. గుండె, లివర్, క్యాన్సర్, పిడుసు లాంటి రోగాల బారిన పడి ఉన్నాయి. వాటిని హైదరాబాద్‌లో బంజారాహిల్స్ ఆస్పత్రికి కారులో తీసుకెళ్లి.. మంచి వైద్యం అందిస్తాను. ఎవరికి కుక్కలు కావాలన్నా ఈదులపూసపల్లికి వచ్చి దత్తత తీసుకుంటారు. ప్రత్యేకంగా కుక్కల కోసం నా పేరుతోనే సొంతంగా యూట్యూబ్ చానల్ ప్రారంభించాను.

– పింగిలి దీపిక, శునకాల సంరక్షకురాలు

మా బిడ్డకు ఇష్టమని..



నేను మొదటిసారిగా చిన్న కుక్క పిల్లను ఇంటికి తీసుకువస్తే.. మా అమ్మాయి దీపిక దానిపై ఎనలేని ప్రేమ పెంచుకుంది. అప్పటి నుంచి నేను ఎక్కడికి వెళ్లినా.. అనారోగ్యంతో వీధి కుక్కలు కనిపిస్తే ఇంటికి తీసుకెళ్తాను. వాటికి చికిత్స అందించి ఆరోగ్యవంతంగా మారిన తర్వాత.. తిరిగి బయటకు పంపించడం లేదా ఇంట్లోనే పెంచుతాను. నా పెన్షన్ డబ్బులతో వాటికి మంచి పౌష్టికాహారం అందిస్తాను. అవి ఇంట్లో సందడి చేస్తాయి.

– పింగిలి శ్రీనివాస్, ఈదులపూసపల్లి

మా పిల్లలుగా భావిస్తాం



దీపికకు నాకు వివాహమై ఐదు సంవత్సరాలు అవుతోంది. నాకు కూడా జంతువులంటే ప్రేమ. మా ఇద్దరినీ.. జంతువులపై ఉన్న ప్రేమే కలిపింది. రోజూ ఉదయం 9 గంటలకు కుక్కలకు స్నానం తర్వాత టానిక్, మందులు వేస్తాను. 10 గంటలకు ఎగ్, చికెన్ బిర్యానీ, కూరగాయలతోనే చక్కటి భోజనం పెడతాను. మధ్యాహ్నం స్నాక్స్, బిస్కెట్లు, ఇంట్లో తయారు చేసిన మురుకులు, అప్పాలు పెడతాను. సాయంత్రం 5గంటలకు భోజనం, రాత్రి 8 గంటలకు మందులు, పాలు అందిస్తాం. వీధి కుక్కలను ప్రేమ చూసుకుంటాను.

– ఎండీ ఇమామ్‌పాషా, మానుకోట



పెంపుడు కుక్కలతో ఆడుకుంటున్న పింగిలి శ్రీనివాస్



కుక్క పిల్లకు కట్టు కడుతున్న ఇమామ్‌పాషా

మస్తుమజా 'మష్‌రూమ్స్'

అడవి పుట్టగొడుగుల్లో మెండైన పోషక విలువలు

- వర్షాకాలం ప్రారంభంలో సహజంగా లభిస్తాయి
- ఆదివాసీల ఆహారంలో ప్రత్యేకం

కొత్తగూడ: అడవిని నమ్ముకుని జీవించే ఆదివాసీలు తినే ఆహారంలో ప్రతీ ఒక్కటి.. ఏదో ఒక ప్రత్యేకత, ఔషధ విలువలు కలిగి ఉంటాయి. అందుకే ఆదివాసీల్లో రోగనిరోధక శక్తి అధికం. వారు తీసుకునే అటవీ ఉత్పత్తుల్లో.. వర్షాకాలం ప్రారంభంలో మాత్రమే లభించే పుట్ట గొడుగులు (మష్‌రూమ్స్) ప్రత్యేకం. ఇవి ఎక్కువగా పుట్టపైనే పుడతాయి. విప్పుకున్న తర్వాత గొడుగు ఆకారంలో ఉండటంతో.. వాటికి పుట్టగొడుగు అని పేరు వచ్చింది. వీటిని ఆదివాసీలు ఎంతో ఇష్టపడి తింటారు. శుభ్రం చేసిన పుట్టగొడుగులను నేరుగా లేదా కూర వండుకుని తినడం వీరి ఆనవాయితీ. వీటిలోని పోషకాలను గుర్తించిన నాగరికులు కృత్రిమంగా ఇంట్లో పెంచే విధానంతో లక్షలు సంపాదిస్తున్నారు. మార్కెట్‌లో కిలోకు రూ.350 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు.





ఆదివాసీలు సేకరించిన పుట్ట గొడుగులు

పోషక విలువలు అధికం..

కప్పు పుట్టగొడుగుల్లో 15 కేలరీల శక్తి, 2.2 గ్రాముల ప్రొటీన్, 2.3 గ్రాముల కార్బొహైడ్రేట్లు, 0.7 గ్రాముల ఫైబర్, విటమిన్ బి, బి2, బి9, బి3లు, పొటాషియం, రైబోఫ్లావిన్, నియాసిన్‌లతో పాటు విటమిన్ ఈ, ఇర్గొథియోనైన్, సెలీనియంలు పుష్కలంగా ఉంటాయి. ఇతర ఆహార పదార్థాల్లో లభించని విటమిన్ డి పుట్టగొడుగుల్లో ఉండటం ప్రత్యేకం.

కేన్సర్, మధుమేహానికి చెక్..

పుట్టగొడుగుల్లో ఎన్నో ఔషధ విలువలు ఉన్నాయి. ఇవి తినడం వల్ల కేన్సర్, మధుమేహం, ఊబకాయం, గుండె సంబంధ వ్యాధులు రాకుండా కట్టడి చేయవచ్చు. ఉన్నవారు త్వరగా కోలుకోవడానికి ఉపయోగపడతాయి. రక్తపోటు (బీపీ)ను అద్భుతంగా నియంత్రిస్తుంది. పుట్టగొడుగుల్లోని కాపర్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి, వాటి సామర్థ్యం పెంచి మెదడు, ఇతర కండరాలకు ఆక్సిజన్ అందించడానికి దోహదపడతాయి.

అన్నీ తినేవి కావు..

ఫంగి జాతికి చెందిన మొక్కల్నే పుట్టగొడుగులుగా పిలుస్తారు. ఇందులో చాలా రకాలు ఉన్నాయి. అన్ని రకాల పుట్టగొడుగులు తినడానికి ఉపయోగపడవు. కొన్ని రకాలు విషపూరితంగా ఉంటాయి. వీటి గురించి తెలిసిన వారు మాత్రమే అడవుల నుంచి సేకరించాల్సి ఉంటుంది. ఆదివాసీలకు మాత్రం ఏవి తినాలో, ఏవి తినకూడదో తెలుసు.



అడవిలో మొలిచిన పుట్ట గొడుగులు

ఇష్టంగా తింటాం



ఆదివాసీలకు.. అడవికి ఉన్న సంబంధానికి ప్రతీకలు పుట్టగొడుగులు. వాటిని ఎంతో ఇష్టంగా తింటాం. ఆదివాసీల ఆహార నియమాలపై జరిగిన పరిశోధనలో.. పుట్టగొడుగుల ప్రాధాన్యం తెలుసుకుని ఆధునిక ప్రజలు ఆహారంలో ఉపయోగిస్తున్నారు. పంటగా సాగు చేసి పండిస్తున్నారు.

– పుల్సం సాంబయ్య,

విలువైన ప్రొటీన్లు పుష్కలం



పుట్టగొడుగుల్లో ఎంతో విలువైన ప్రొటీన్లు, విటమిన్లు ఉన్నాయని పరిశోధనల్లో తేలింది. అనుదినం ఆహారంలో పుట్టగొడుగులను చేర్చుకోవడం ఎంతో మంచిది. గర్భిణులకు చాలా ఉపయోగం. జనప్రేమి వనప్రేమి అవార్డు గ్రహీత, ఉపాధ్యాయుడు.

– డాక్టర్ రవీందర్‌నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహబూబాబాద్ మెడికల్ కళాశాల

కేన్‌తో సుందరాకృతులు



కేన్ తీగతో చేసిన ఈ వస్తువులు చూసేవారిని ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. విజయవాడ గొల్లపూడి రోడ్డులో కొందరు ఈ వస్తువులను తయారుచేసి అమ్మి పొట్టపోసుకుంటున్నారు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కొంగల కోలాహలం



వరద నీటితో సుంకేసుల డ్యామ్ నిండిపోవడంతో గేట్లెత్తి నీటిని కిందికి వదులుతున్నారు. వరద నీటిలో వచ్చే చేపలను వేటాడేందుకు కొంగలు, నీటిబాతులు ఇలా గుంపులు గుంపులుగా చేరుకున్నాయి. డ్యామ్ సందర్శనకు వచ్చినవారిని ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

యోగ సాధనలో విశాఖ



అంతర్జాతీయ యోగ దినోత్సవ సన్నాహకంలో భాగంగా విశాఖలో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఆర్.కె బీచ్ వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నగరవాసులు పాల్గొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మద్యం మత్తులో దాడి.. యువకుడికి తీవ్ర గాయాలు

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలంలోని రెడ్డివారిపల్లిలో మద్యం దుకాణం వద్ద మద్యం తాగుతూ అరవింద్, రవితేజ అనే యువకుల మధ్య శనివారం మాటామాటా పెరిగింది. మద్యం మత్తులో ఉన్న రవితేజ అరవింద్‌పై బాటిల్ పగులగొట్టి దాడి చేశాడు. ఈ దాడిలో అరవింద్‌కు గొంతు వద్ద తీవ్ర గాయమైంది. దీంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు.

అక్రమ సిగరెట్స్ స్వాధీనం

సాక్షి, అమరావతి: నకిలీ ఇన్వాయిస్‌లతో అక్రమంగా తరలిస్తున్న సిగరెట్లు, డిష్ వాష్ సోప్‌లను విజయనగరం జిల్లా రామభద్రపురంలో వాణిజ్యపన్నుల శాఖ స్వాధీనం చేసుకుంది. గుంటూరు ఎంబీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట నకిలీ ఇన్వాయిస్ సృష్టించి బిహార్ నుంచి సరుకు రవాణా అవుతున్నట్టు విచారణలో తేలిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చీఫ్ టాక్స్ కమిషనర్ ఏ బాబు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 96 లక్షలు, రూ. 2.53 లక్షల డిష్ వాష్ లను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

ఎక్కడ కలవాలి.. వినతి ఎవరికివ్వాలి ..?

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్‌కు శనివారం వింత పరిస్థితి ఎదురైంది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేయడానికి మున్సిపల్ కార్మికులు కాకినాడ నుంచి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ కల్యాణ్ తాత్కాలిక నివాసానికి పాదయాత్రగా బయల్దేరారు. పిఠాపురం వచ్చేసరికి చేబ్రోలులోని ఇంటిని పవన్ ఖాళీ చేసేశారని తెలిసింది. దీంతో, ఎవరిని, ఎక్కడ కలవాలంటూ వారు తర్జనభర్జన పడ్డారు. పిఠాపురంలో కూడా పవన్ కల్యాణ్‌కు అధికారిక కార్యాలయం లేదని తెలియడంతో అవాక్కయ్యారు. అంత కష్టపడి వచ్చి, కనీసం జనసేన ఇన్‌చార్జికైనా వినతిపత్రం ఇద్దామనుకుంటే ఆయన కూడా అందుబాటులో లేరని తెలిసి తలలు పట్టుకున్నారు. దీంతో పిఠాపురంలోని జనసేన పార్టీ పట్టణ కార్యాలయంలో స్థానిక నాయకుడికి వినతిపత్రం ఇచ్చి వెనుదిరిగారు.

వన్నూరప్ప అని పిలిస్తే ఆ గ్రామంలో వంద మంది పలుకుతారు. వన్నూరప్ప, వన్నూరమ్మ, వన్నూర్‌రెడ్డి, వన్నూరక్క ఇలా.. హజరత్ వన్నూరు వలి సాహెబ్‌ను కొలిచే వారందరూ ఆయన పేరే పెట్టుకున్నారు. 30 ఏళ్లు పైబడిన సుమారు 100 మంది దాకా స్వామి పేరునే పెట్టుకున్నారంటే ఆయన మహిమ ఎలాంటిదో అర్థమవుతుంది.



ప్రత్యేక పూజలు అందుకుంటున్న వన్నూరుస్వామి



మరవపల్లి గ్రామం వ్యూ

ఊరంతా వన్నూరప్ప, వన్నూరమ్మలే..

మరవపల్లిలో వంద మందికి పైగా ఆ పేర్లతోనే.. / గ్రామమంతా వన్నూరుస్వామిని కొలుస్తున్న వైనం / ఏ శుభ కార్యమైనా ఆలయం వద్ద చక్కెర చదివింపులు

తాడిమర్రి: సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని మరవపల్లిలో వెలసిన హజరత్ వన్నూరు వలి సాహెబ్ (వన్నూరు స్వామి) కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఆపదలు, జబ్బులు రాకుండా కాపాడుతున్నాడు. దీంతో గ్రామంలో ఎక్కువ మంది స్వామి పేరు కలసి వచ్చేలా పేర్లను పెట్టుకుంటున్నారు.

200 ఏళ్ల క్రితం వెలసిన వన్నూరు స్వామి

ఇప్పుడున్న మరవపల్లి గ్రామంలో 200 ఏళ్ల క్రితం రెండు, మూడు గుడిసెలు ఉండేవట. ఆ కాలంలో ఇప్పుడున్న ఎం.అగ్రహారం గ్రామం చెరువు పనులు జరుగుతుండగా కడప జిల్లా లింగాల మండలం అంకేన్‌పల్లికి చెందిన కొందరు ఇక్కడ చెరువు పనులు చేస్తూ గుడిసెల్లో ఉండేవారని పెద్దలు చెబుతున్నారు. ఆ సమయంలోనే కణేకల్లు సమీపంలోని వన్నూరు గ్రామానికి చెందిన వన్నూరుస్వామి గుర్రంపై తూర్పు ప్రాంతానికి యుద్ధానికి వెళ్లారట. తిరుగు ప్రయాణంలో గుడిసెల వద్ద ఆగి వేపపుల్లతో పళ్లు తోముకుని పళ్లు తోముకున్న పుల్లను ఓ చోట భూమిపై గుచ్చారని అంటున్నారు. దీంతో అక్కడ వేప మాను మహావృక్షమైందని అంటున్నారు. ఆ మహనీయుడు అక్కడే ఉన్న బావిలో ముఖం కడుక్కొని ఆయన అక్కడే పాదరక్షలు వదిలి వెళ్లిపోయారట. గుడిసెల్లో ఉన్నవారు ఆ వృక్షం వద్ద పూజలు చేస్తూ వచ్చారని, దీంతో గ్రామస్తులకు ఎలాంటి ఆపదలు రాకుండా వన్నూరుస్వామి కాపాడుతూ వచ్చారని భక్తుల నమ్మకం.



మహిమగల బావి ఇదే



మరవపల్లిలో వెలసిన వన్నూరుస్వామి ఆలయం

స్వామి మహిమలు ఇలా..

సుమారు 60 ఏళ్ల క్రితం గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎం.అగ్రహారంలో కలరా వచ్చిందని గ్రామ పెద్దలు చెబుతున్నారు. కలరాతో పదుల సంఖ్యలో గ్రామస్తులు మృతి చెందారట. అలాంటి విపత్కర సమయంలో కూడా మరవపల్లిలో ఒక్కరికీ కూడా కలరా సోకలేదని అంటున్నారు. ఆలయం పక్కన ఉన్న బావిలో వన్నూరుస్వామి ముఖం కడుక్కోవడంతో ఆ బావిలో మహిమలు ఉన్నాయని గ్రామస్తులు నమ్ముతారు. పదేళ్ల క్రితం గ్రామానికి చెందిన అంధురాలు లింగమ్మ జీవితంపై విరక్తితో చనిపోవాలని బావిలోకి దూకిందట. దేవుని మహిమతో ఆమె ఎలాంటి ప్రమాదం జరగకుండా క్షేమంగా బయటపడిందని చెబుతున్నారు. అలాగే బావి ఒడ్డున ఉన్న అరుగుపై పలువురు పిల్లలు ఆడుకుంటూ బావిలో పడిని చిన్నపాటి గాయం కూడా కాలేదంటున్నారు. దీంతో బావి రోడ్డు పక్కన ఉన్నప్పటికీ పూడ్చకుండా అలాగే ఉంచారు. నార్పలకు చెందిన శంకరయ్య అనే వ్యక్తి గత కొన్నేళ్ల క్రితం తన భార్యకు ఆరోగ్యం బాగాలేక లక్షలు ఖర్చుచేసి ఎన్నో ఆస్పత్రుల్లో చూపించారు. అయినా జబ్బు నయం కాలేదు. చివరకు గ్రామస్తుల ద్వారా స్వామి మహిమ గురించి తెలుసుకుని భార్యాభర్తలు కొన్నాళ్లపాటు ఆలయానికి వచ్చి పూజలు చేసి, అక్కడే నిద్రించారు. దీంతో ఆమె ఆరోగ్యం కుదుట పడింది. దీంతో ఆయన అప్పటి నుంచి ప్రతి గురువారం గ్రామానికి వచ్చి 10, 20 కిలోలు చక్కెర తీసుకొచ్చి స్వామికి చదివించి వెళుతున్నారు.

ప్రతి గురువారం ప్రత్యేక పూజలు

వన్నూరుస్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రతి గురువారం ప్రత్యేక పూజలు చేస్తారు. గతంలో గ్రామస్తులే పూజలు చేసేవారు. కొంత కాలంగా మరవపల్లికి చెందిన ముస్లిం కుటుంబానికి చెందిన వ్యక్తిని పూజారిగా నియమించారు. ఆయన ప్రతి గురువారం స్వామికి దీపాలను వెలిగించి చక్కెర చదివించి భక్తులకు పంచిపెడతారు. అలాగే కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి పొట్టేళ్లను కొట్టి గ్రామస్తులకు పంచుతారు. కందూరి చేసినప్పుడు స్వామి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి ఉత్సవ పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగిస్తారు. అలాగే వ్యవసాయ పనులు ప్రారంభం, శుభకార్యాలు జరినప్పుడు గ్రామస్తులు ముందుగా ఆలయంలో చక్కెర చదివించి ప్రారంభిస్తారు. దీంతో ఎలాంటి ఆటంకం లేకుండా పనులు, శుభ కార్యాలు నిర్విఘ్నంగా జరుగుతాయని గ్రామస్తుల విశ్వాసం.

కోరిన కోర్కెలు తీర్చే దేవుడు



గ్రామంలో వెలసిన వన్నూరు స్వామి కోరిన కోర్కెలు తీర్చే దేవుడు. గ్రామంలో ఎవరు, ఎలాంటి శుభకార్యక్రమాలు చేపట్టిన ముందుగా ఆలయంలో దీపాలు వెలిగించి, చక్కెర చదివింపులు చేస్తాం. ఇలా చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా పనులన్నీ సాఫీగా జరిగిపోతాయి.

– సాకే వన్నూరప్ప, మరవపల్లి, తాడిమర్రి

రోగాలైనా నయం అవుతాయి




వన్నూరుస్వామి ఆలయంలో నిద్రచేస్తే ఎలాంటి రోగాలు అయినా నయం అవుతాయి. ప్రపంచాన్ని గడగడ లాండించిన కరోనా కాలంలో ప్రజలు ఎంతో భయభ్రాంతులకు గురయ్యారు. చుట్టుపక్కల గ్రామాలు కరోనాతో విలవిలలాడాయి. అలాంటి విపత్కర పరిస్థితిలో కూడా మా గ్రామంలో ఎక్కరికి కూడా కరోనా సోకుండా స్వామి కాపాడారు.

– గాండ్లపర్తి కుళ్లాయరెడ్డి, మరవపల్లి, తాడిమర్రి

ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి తియ్యని మాటలకు ప్రే'మాయ'లో పడిపోయి ఒకరు.. వివాహేతర సంబంధంతో పిల్లలను తీసుకొని మరొకరు.. తల్లిదండ్రులు మందలించారని ఇంకొకరు.. ఇలా విశాఖలో వరుసగా మహిళల అదృశ్య సంఘటనలు కలవరం రేపుతున్నాయి.దాదాపుగా ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట మహిళలు మాయమవుతూనే ఉన్నారు. బాలికలనుంచి వివాహితుల వరకు వయోభేదాలు లేకుండా కనిపించకుండా పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు.. తిరిగి ఇంటికి చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వీరి కోసం కుటుంబ సభ్యులు.. సమీప బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మిస్సింగ్ కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కేవలం నాలుగు నెలల్లోనే 175 మంది మహిళలు అదృశ్యమైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.





- విశాఖలో పెరుగుతున్న మహిళల అదృశ్యం కేసులు
- 4 నెలల్లో 175 మంది మాయం
- ఇప్పటి వరకు 133 మంది ఆచూకీ లభ్యం
- మిస్టరీగానే 42 మంది మహిళల అదృశ్యం
- ప్రేమ, వివాహేతర సంబంధాలు, కుటుంబకలహాలే కారణం

విశాఖ సిటీ: విశాఖ నగరంలో మహిళల అదృశ్యాలకు ప్రధానంగా ప్రేమ వ్యవహారాలు, వివాహేతర సంబంధాలే కారణమని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కనిపించకుండా పోయిన యువతుల్లో ఎక్కువ మంది ప్రేమించుకోవడం, ప్రేమికుడిని దక్కించుకోవడం కోసమే ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. అలాగే మధ్య వయస్కులైన మహిళలు కూడా వివాహేతర సంబంధాల కారణంగా కుటుంబాన్ని వదిలి వెళ్తున్నారు. మిస్సింగ్ కేసుల్లో సుమారు 75 శాతం వరకు ఈ రెండు కారణాలే ఉన్నాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇది నగరంలో పెరుగుతున్న ఆందోళనకరమైన ధోరణిగా మారింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిస్సింగ్ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. గత ఐదేళ్లలో ప్రతి ఏటా 50 నుంచి 186 కేసులు వరకు రాగా.. ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 175 కేసులు నమోదవడం విశాఖ పరిస్థితికి అద్దం పడుతోంది. జనవరిలో 37, ఫిబ్రవరిలో 49, మార్చిలో 43, ఏప్రిల్‌లో 46 మంది అదృశ్యమయ్యారు. వీరిలో 133 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంకా 42 మంది ఆచూకీ తెలియరాలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వీరు ప్రేమ, ఇతర కారణాలతో కావాలనే వెళ్లిపోయారా? లేదా ఏదైనా దురదృష్ట సంఘటన జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. మిస్సింగ్ కేసుల పరిష్కారం కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

పోలీసులకు సవాల్

వీరిని పట్టుకోవడం పోలీసులకు సైతం సవాలుగా మారుతోంది. కొంతమంది ఆచూకీ తెలుసుకున్నప్పటికీ.. మేజర్లు, చట్టాలు, హక్కులు పేరుతో పోలీసులకు కూడా చుక్కలు చూపించిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి కేసుల్లో అదృశ్యమైన వారి ఆచూకీని పోలీసులు గుర్తించడం మినహా వారిని కుటుంబ సభ్యులకు అప్పగించడం కూడా ఒక పెద్ద సమస్యగా మారుతోంది.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయండి

ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కేంద్రం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డిసెంబర్‌కు ముందు పనిచేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షనే వర్తిస్తుందని, అవే ఉత్తర్వులు రాష్ట్రంలోని ఉద్యోగులకు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు శనివారం డిమాండ్ చేశారు. కేంద్ర ఆదేశాలను దేశంలోని కొన్ని రాష్ట్ర ప్రభుతాలు అమలుచేసి ఉద్యోగులకు న్యాయం చేశాయని, ఏపీలో సామాన్య ఉద్యోగులకు కూడా ఈ నిబంధనను వర్తింపజేయాలని కోరారు.

కమిషనర్ స్పష్టత ఇవ్వాలి: ఏపీ టీచర్స్ గిల్డ్

ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రస్తుత కౌన్సెలింగ్‌లో సర్వీస్ పాయింట్లు, స్టేషన్ పాయింట్లపై విద్యాశాఖ కమిషనర్ స్పష్టతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ విజ్ఞప్తి చేసింది. జీవో నం.50 ప్రకారం ఎయిడెడ్ పాఠశాలల సిబ్బంది ప్రభుత్వంలో విలీనమయ్యారని, వారికి తగిన న్యాయం చేయాలని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

వారికి న్యాయం చేయండి: ఏపీటీఎఫ్ అమరావతి

రాష్ట్రంలో తొలిసారి ఉపాధ్యాయ బదిలీ చట్టం -2025 ప్రకారం జరుగుతున్న బదిలీల్లో సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లకు సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని విద్యాశాఖ పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మొదటి దశలో సర్‌ప్లస్ పీఎస్ హెచ్‌ఎంతో పోస్టులు భర్తీచేసి, రెండో దశలో సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లతో పీఎస్ హెచ్‌ఎం పోస్టులు నింపాలని డిమాండ్ చేశారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,374 మంది స్వామివారిని దర్శించుకోగా 37,477 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కిటకిటలాడిన శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండన శాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి.



ఇండస్ట్రీలో కొత్త కాంబినేషన్‌లు, హిట్ కాంబినేషన్‌లు రిపీట్ కావడం కొత్తేం కాదు. ఇప్పటికే కొన్ని సీక్వెల్స్, ఫ్రాంచైజీల కోసం హీరో-దర్శకుల కాంబో రిపీట్ అవుతోంది. సీక్వెల్, ఫ్రాంచైజీలకు అదే కాంబినేషన్ కుదరడం కామన్‌గా జరుగుతుంటుంది. వీటిని పక్కన పెడితే... ఆల్రెడీ ఒక సినిమాకి కలిసి... ఇప్పుడు మరో సినిమాకి కలిసిన హీరో-డైరెక్టర్ కాంబినేషన్ 'వన్స్ మోర్' అంటూ రిపీట్ అవుతోంది. తమకు హిట్ ఇచ్చిన దర్శకులతో రెండో సారి సినిమా చేస్తున్న కొందరు హీరోలపై మీరూ ఓ లుక్ వేయండి.


● చిరంజీవి


● బాలకృష్ణ

బర్త్ డేకి అనౌన్స్‌మెంట్?

హీరో బాలకృష్ణ-దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'వీరసింహారెడ్డి'. 2023 సంక్రాంతికి విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించింది. దీంతో బాలకృష్ణతో మరో యాక్షన్ మూవీని ప్లాన్ చేశారట గోపీచంద్. ఇటీవల బాలకృష్ణకు గోపీచంద్ ఓ కథ చెప్పగా, ఈ సినిమా చేసేందుకు ఓకే చెప్పారట. జూన్ 10న బాలకృష్ణ బర్త్ డే. ఈ సందర్భంగా బాలకృష్ణ-గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లోని సినిమా అనౌన్స్‌మెంట్ రానుందని సమాచారం. ప్రస్తుతం దర్శకుడు బోయపాటి శ్రీనుతో 'అఖండ 2' సినిమా చేస్తున్నారు బాలకృష్ణ. ఈ ఏడాది సెప్టెంబరు 25న ఈ సినిమా రిలీజ్ కానుంది. దీంతో 'అఖండ 2' సినిమా చిత్రీకరణ పూర్తయిన తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లోని సినిమా చిత్రీకరణ ప్రారంభం కావొచ్చని ఊహించవచ్చు. ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ లేదా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలు నిర్మించనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.


● గోపీచంద్ మలినేని

వాల్తేరు వీరయ్య కాంబో?

హిట్ ఫిల్మ్ 'వాల్తేరు వీరయ్య' (2023) తర్వాత హీరో చిరంజీవి, దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ)ల కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుందనే టాక్ వినిపిస్తోంది. చిరంజీవి-బాబీ కాంబినేషన్ మూవీ దాదాపు ఖరారైనట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రముఖ రచయిత కోన వెంకట్ చెప్పకనే చెప్పారు. చిరంజీవి అభిమానులను అలరించే మంచి కమర్షియల్ అంశాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని పరోక్షంగా చెప్పారు. సో... చిరంజీవి-బాబీ కాంబినేషన్ రిపీట్ ఫిక్స్ అని ఊహించవచ్చు. ప్రస్తుతం దర్శకుడు అనిల్ రావిపూడి సినిమాతో బిజీగా ఉన్నారు చిరంజీవి. ఈ సినిమా చిత్రీకరణ శుక్రవారం మొదలైంది. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ తర్వాత బాబీతో సినిమాను చిరంజీవి సెట్స్‌కు తీసుకెళ్తారనే టాక్ వినిపిస్తోంది. అయితే నాని నిర్మాణంలో చిరంజీవి హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ సినిమా రానుంది. ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభం అవుతుందని ఇటీవల ఓ సందర్భంలో నాని పేర్కొన్నారు. మరి... అనిల్ రావిపూడి సినిమా తర్వాత చిరంజీవి తదుపరి చిత్రం దర్శకుడు బాబీ కాంబోలో ఉంటుందా? లేక శ్రీకాంత్ ఓదెలతో ఉంటుందా? లేక ఈ రెండు సినిమాలను సమాంతరంగా చిరంజీవి సెట్స్‌కు తీసుకువెళ్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాను కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.


● బాబీ


● పవన్ కల్యాణ్

పన్నెండేళ్ల తర్వాత...


● హరీష్ శంకర్

పన్నెండేళ్ల క్రితం హీరో పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'గబ్బర్ సింగ్' సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఉస్తాద్ భగత్ సింగ్' అనే సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చింది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రకటన రెండు సంవత్సరాల క్రితమే వచ్చినప్పటికీ పవన్ రాజకీయాలతో బిజీగా ఉండటం, ముందే అంగీకరించిన సినిమాలను పూర్తి చేయాల్సి రావడం వంటి కారణాల చేత పూర్తి స్థాయి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కాలేదు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో తిరిగి ఫుల్ ప్లెడ్జ్‌గా ప్రారంభం కానున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే... 'గబ్బర్‌సింగ్' సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా నటించిన పవన్ కల్యాణ్, 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలోనూ పోలీసాఫీసర్‌గా నటిస్తుండటం విశేషం. తమిళ హిట్ మూవీ విజయ్ 'తేరీ'కి తెలుగు రీమేక్‌గా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా రూపొందుతుందనే టాక్ వినిపించింది. కానీ 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కోసం పవన్ కల్యాణ్ ఓ కొత్త కథను సిద్ధం చేయమని దర్శకుడు హరీష్ శంకర్‌కు చెప్పారని, ఆయన ఈ స్క్రిప్ట్‌ను మరింత మెరుగులు దిద్దే పనిలో ఉన్నారని టాక్. ప్రస్తుతం సుజిత్ 'ఓజీ' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్నారు పవన్ కల్యాణ్. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది సెప్టెంబరులో రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది.


● రామ్‌చరణ్

వన్స్ మోర్...

హిట్ ఇచ్చిన దర్శకులతో రెండో సినిమా చేస్తున్న తెలుగు అగ్ర హీరోలు

ప్యారడైజ్ ప్రపంచం


● శ్రీకాంత్ ఓదెల

నానీలోని మాస్ యాక్షన్ యాక్టింగ్‌ను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల స్క్రీన్‌పై చక్కగా చూపించారు. 2023 మార్చి 30న విడుదలైన ఈ 'దసరా' చిత్రం రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. దర్శకుడిగా ఈ 'దసరా'యే శ్రీకాంత్ ఓదెలకు తొలి సినిమా. అయితే తన రెండో సినిమా 'ప్యారడైజ్'ని కూడా నానీతో చేస్తున్నారు శ్రీకాంత్ ఓదెల. 'దసరా' సినిమాను నిర్మించిన సుధాకర్ చెరుకూరియే ఈ 'ప్యారడైజ్' సినిమాను నిర్మిస్తున్నారు. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో నాని సికింద్రాబాద్ కుర్రాడిగా కనిపిస్తారని, స్క్రీన్‌పై ఆడియన్స్ ఓ కొత్త ప్రపంచాన్ని చూసేలా శ్రీకాంత్ ఓదెల స్క్రీన్‌ప్లే డిజైన్ చేశారని సమాచారం. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఓ సరికొత్త పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్‌లో నాని కనిపించనున్నారు. ఇక ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు మేకర్స్ జాన్వీ కపూర్, కయాదు లోహర్ వంటి వారి పేర్లను పరిశీలిస్తున్నారని, త్వరలోనే ఈ విషయంపై ఓ క్లారిటీ రానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాని ఇంగ్లిష్, స్పానిష్‌లతో సహా ఎనిమిది భాషల్లో రిలీజ్ చేయనున్నామని మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు. 'ది ప్యారడైజ్' సినిమా వచ్చే ఏడాది మార్చి 26న విడుదల కానుంది. 'దసరా' సినిమా మార్చి 30న విడుదలై, హిట్‌గా నిలిచింది. సో... ఆ సెంటిమెంట్ ప్రకారం మార్చి చివరి వారంలోనే 'ది ప్యారడైజ్' సినిమా రిలీజ్‌ను మేకర్స్ షెడ్యూల్ చేసినట్లుగా తెలుస్తోంది.

వీళ్లే కాదు... ఇంకా మరికొందరు హీరో-దర్శకుల హిట్ కాంబో రిపీట్ కానుందని సమాచారం.

– మునిమి శివాంజనేయులు


● నాని

మళ్లీ విలేజ్‌లో?

రామ్‌చరణ్ కెరీర్‌లో 'రంగస్థలం' బ్లాక్‌బస్టర్ మూవీ. ఈ సినిమా దర్శకుడు సుకుమార్‌తో రామ్‌చరణ్ మరో మూవీ చేయనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. అయితే ఈ సినిమా అధికారిక ప్రకటన వచ్చి ఏడాదిన్నరపైనే అవుతున్నా చిత్రీకరణ ఇంకా మొదలు కాలేదు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనుల్లో తలమునకలై ఉన్నారు దర్శకుడు సుకుమార్. ఇటీవల విదేశాలకు వెళ్లి ఈ సినిమా స్క్రిప్ట్‌పై హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్‌లు చర్చలు కూడా జరిపారు. అయితే ఈ సినిమా 'రంగస్థలం' సినిమా స్టైల్లోనే విలేజ్ నేపథ్యంలో ఉంటుందా? లేక సరికొత్తగా మోడ్రన్ స్టైల్లో ఉంటుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు రష్మికా మందన్నా, సమంత, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాతో బిజీగా ఉన్నారు. దర్శకుడు సుకుమార్ శిష్యుడు, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు ఈ సినిమాకు దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా మార్చి 27న విడుదల కానుంది.


● సుకుమార్


● నితిన్


● విజయ్ దేవరకొండ

19వ శతాబ్దం నేపథ్యంలో...

విజయ్ దేవరకొండ హీరోగా చేసిన 'ట్యాక్సీవాలా' సినిమా 2018లో విడుదలై, ఆడియన్స్‌ను మెప్పించింది. ఈ సినిమాకు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్. ఈ హిట్ ఫిల్మ్ తర్వాత విజయ్ దేవరకొండ-దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ మళ్లీ ఓ సినిమా చేస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ మూవీ విజయ్ దేవరకొండ కెరీర్‌లో 14వ చిత్రం. 19వ శతాబ్దం నేపథ్యంలో బ్రిటిష్ పరిపాలన కాలంలో ఈ మూవీ కథనం ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. అతి త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. 1854-1878 మధ్య జరిగిన చారిత్రక సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. అలాగే ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా దాదాపు ఖరారయ్యారనే టాక్ వినిపిస్తోంది. ఇక గతంలో విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నాల కాంబినేషన్‌లో వచ్చిన 'గీత గోవిందం, డియర్ కామ్రేడ్' సినిమాలు విజయాలు సాధించిన నేపథ్యంలో, మళ్లీ విజయ్-రష్మికల కాంబోపై ఇండస్ట్రీలో అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్, విజయ్-రష్మికల కాంబోపై అతి త్వరలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం.


● రాహుల్ సంకృత్యాన్


● విక్రమ్ కే కుమార్

స్పోర్ట్స్ డ్రామా!

నితిన్ కెరీర్‌లో 'ఇష్క్' (2012) సూపర్ హిట్ ఫిల్మ్. ఈ సినిమాకు విక్రమ్ కే కుమార్ దర్శకుడు. అయితే 'ఇష్క్' (2012) చిత్రం తర్వాత పన్నెండేళ్లకు మళ్లీ హీరో నితిన్, దర్శకుడు విక్రమ్ కే కుమార్‌ల కాంబినేషన్ కుదిరింది. కొంత గ్యాప్ తర్వాత దర్శకుడు విక్రమ్ కె. కుమార్‌తో మళ్లీ తాను ఓ సినిమా చేస్తున్నానని, ఇది స్పోర్ట్స్ డ్రామా మూవీ అని, లార్జ్ స్కేల్‌లో ఉండబోతుందని, తెలుగు ఆడియన్స్ ఓ కొత్త సినిమాను చూసిన అనుభూతిని పొందుతారని ఇటీవల నితిన్ ఓ ఇంటర్వ్యూ వేదికగా చెప్పారు.

సాక్షి సినిమా

సెట్స్‌లో సూపర్‌స్టార్


● పి.మహేశ్ బాబు, ఉపేంద్ర

సూపర్ స్టార్ సూర్యకుమార్ సెట్స్‌కు వచ్చారు. రామ్ హీరోగా పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలో సినీ సూపర్‌స్టార్ సూర్యకుమార్ పాత్రలో ఉపేంద్ర నటిస్తున్నారు. ఈ సూర్యకుమార్ అభిమానిగా హీరోగా రామ్ నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అయ్యారు ఉపేంద్ర. ఈ షెడ్యూల్లో కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ జరగనుందని సమాచారం. హీరో, ఆ హీరో అభిమానికి మధ్య జరిగే కొన్ని ఆసక్తికరమైన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాకు సంగీతం: వివేక్-మెర్విన్.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


● 'కలలన్నీ...' పాటలో ఓ దృశ్యం

'బొమ్మరిల్లు' ఫేమ్ సిద్ధార్థ్ హీరోగా తెలుగు- తమిళ భాషల్లో రూపొందిన చిత్రం '3 బీహెచ్‌కే'. శ్రీ గణేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్, చైత్ర కీలక పాత్రలు పోషించారు. 'మావీరన్' వంటి బ్లాక్ బస్టర్ మూవీ నిర్మించిన నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై '3 బీహెచ్‌కే' నిర్మించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం జూలై 4న రిలీజ్ కానుంది. అమృత్ రామ్‌నాథ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'కలలన్నీ...' అంటూ సాగే పాటని రిలీజ్ చేసి, మ్యూజిక్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేశారు మేకర్స్. రాకేందు మౌళి సాహిత్యం అందించిన ఈ మెలోడీ పాటని హేమచంద్ర వేదాల, గోపికా పూర్ణిమ, సాహితీ చాగంటి, వీవీఎస్ఎస్ రోహిత్ పాడారు. సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని క్యారెక్టర్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఈ సాంగ్‌లో ప్రత్యేకంగా నిలిచాయి. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. సీబీ మారప్పన్, కెమేరా: దినేష్ కృష్ణన్ బి- జితిన్ స్టానిస్లాస్.


కాన్స్‌కి వెళ్లకుండానే...


● వీర్ దాస్

ఇక ఈ ఏడాది కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'నో న్యూడిటీ' అంటూ స్ట్రిక్ట్ డ్రెస్‌కోడ్ రూల్స్‌ను పెట్టిన సంగతి తెలిసిందే. ఒకరిద్దరు నటీనటులు ఈ రూల్స్‌ను బ్రేక్ చేశారు కూడా. అయితే ఈ నిబంధనల పట్ల ఇండియన్ నటుడు వీర్ దాస్ కూడా అభ్యంతరం తెలిపారు. కాన్స్ డ్రెస్‌కోడ్ నియమాల వల్ల తాను ఫెస్టివల్‌కు హాజరు కాకూడదని అనుకుంటున్నట్లు వీర్ పేర్కొన్నారు. కానీ తన ఇన్‌స్టా అకౌంట్లో తాను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైనట్లుగా ఓ ఏఐ (కృత్రిమ మేధ) ఫొటోను షేర్ చేశాడు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వెండితెరపై ఆపరేషన్ ఖుక్రీ

మేజర్ జనరల్ రాజ్‌పాల్ పునియా జీవితం వెండితెరపైకి రానుంది. బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా ప్రధాన పాత్రధారిగా హిందీలో 'ఆపరేషన్ ఖుక్రీ' అనే సినిమా రానుంది. ఈ మిలటరీ వార్ డ్రామా సినిమాను అధికారికంగా ప్రకటించారు. 'ఆపరేషన్ ఖుక్రీ: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ది ఇండియన్ ఆర్మీస్ బ్రేవెస్ట్ పీస్‌కీపింగ్ మిషన్ అబ్రాడ్' అనే పుస్తకం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ పుస్తకం హక్కులను రాహుల్ మిత్రా ఫిల్మ్స్, రణ్‌దీప్ హుడా ఫిల్మ్స్ సంస్థలు సొంతం చేసుకున్నాయి. 2000లో వెస్ట్ ఆఫ్రికాలోని సియోర్రా లియోన్‌లో జరిగిన ఆపరేషన్ ఖుక్రీ వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది. యునైటెడ్ పీస్‌కీపింగ్ మిషన్‌లో భాగంగా వెస్ట్ ఆఫ్రికాకి వెళ్లిన 233 మంది భారతీయ సైనికులు, అక్కడి రెబల్ ఫోర్స్ ట్రాప్‌లో చిక్కుకుని, 75 రోజులు ఎన్నో ఇబ్బందులు అనుభవించారు. ఈ సైనికుల రక్షణ రెస్క్యూ ఆపరేషన్‌ను రాజ్‌పాల్ పునియా లీడ్ చేశారు. ఈ రాజ్‌పాల్ పునియాగానే రణ్‌దీప్ హుడా నటించనున్నారు. మరోవైపు హిందీలో 'బదాయి హో, మైదాన్' వంటి సినిమాలను తీసిన దర్శకుడు అమిత్ శర్మ కూడా 'ఆపరేషన్ ఖుక్రీ' ఘటనల నేపథ్యంలో ఓ సినిమా తీయాలని స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.


● రణ్‌దీప్ హుడా

బిజినెస్ రీల్

ఎల్ఐసీ గిన్నిస్ బుక్ రికార్డు

24 గంటల్లో 5.8 లక్షల పాలసీలు విక్రయం



న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) అరుదైన ఘనత సాధించింది. 24 గంటల వ్యవధిలో అత్యధిక సంఖ్యలో జీవిత బీమా పాలసీలను విక్రయించినందుకు గిన్నిస్ ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ''ఈ ఏడాది జనవరి 20న మొత్తం 4,52,839 మంది ఏజెంట్లు 5,88,107 జీవిత బీమా పాలసీలను జారీ చేశారు. తద్వారా గిన్నిస్ రికార్డు సొంతమైంది. ఇది చరిత్రాత్మక విజయం. అంకితభావం గల ఏజెన్సీ నెట్‌వర్క్ అసాధారణ పనితీరును గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించింది'' అని వివరించింది. జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే' సందర్భంగా ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్క పాలసీ అయినా జారీ చేయాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకే గిన్నిస్‌ఫీట్‌ను ఎల్ఐసీ సొంతం చేసుకుంది. అరుదైన మైలురాయిని సాధించడం పట్ల కస్టమర్లు, ఏజెంట్లు, ఉద్యోగులకు మొహంతి కృతజ్ఞతలు తెలిపారు.

కొటక్811తో బ్యాంకింగ్ సులభతరం



న్యూఢిల్లీ: నవతరం ఆర్థిక సేవల అవసరాలను తీర్చే విధంగా రూపొందించిన డిజిటల్ ప్లాట్‌ఫాం కొటక్811తో బ్యాంకింగ్ మరింత సులభతరంగా మారిందని కొటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. ఇన్‌స్టంట్ బోర్డింగ్, యూపీఐ చెల్లింపులు, స్మార్ట్ పెట్టుబడి సాధనాలు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు మొదలైన ప్రత్యేకతలు దీనిలో ఉన్నట్లు తెలిపింది. ఈ ఫీచర్లపై మరింత అవగాహన పెంచేందుకు తమ బ్రాండ్ అంబాసిడర్ రణ్‌వీర్ సింగ్‌తో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించినట్లు కొటక్811 కో–హెడ్ జయ్ కోటక్ తెలిపారు.

యూబీఎల్ ఉత్పత్తి సామర్థ్యం పెంపు



న్యూఢిల్లీ: కింగ్‌ఫిషర్ బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ (యూబీఎల్) ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకుంటున్నట్లు తెలిపింది. శ్రీకాకుళంలోని రణస్థలంలో కంపెనీకి ప్రస్తుతం సొంత ప్లాంటు ఉండగా, ఇలియోస్ బ్రూవరీస్ నుంచి మరో ప్లాంటును లీజుకు తీసుకుంటున్నట్లు వివరించింది. కీలక సీజన్‌లో డిమాండ్‌కి తగ్గ స్థాయిలో సరఫరా చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. దీర్ఘకాలికంగా రాష్ట్రంలో కార్యకలాపాలను మెరుగుపర్చుకునేందుకు ఉత్పత్తి పెంపు దోహదపడుతుందని సంస్థ సీఎఫ్‌వో జోర్న్ కెర్‌స్టెన్ తెలిపారు.

ఓ100 ప్లాట్‌ఫాంపై ఒబెన్ ఎలక్ట్రిక్ కసరత్తు



బెంగళూరు: ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ కొత్తగా ఓ100 (ఓ హండ్రెడ్) పేరిట రెండో ప్లాట్‌ఫాంపై కసరత్తు చేస్తోంది. రూ. 1 లక్ష లోపు ధర ఉండే మోటర్ సైకిల్స్ తయారీ కోసం దీన్ని ఉపయోగించనున్నట్లు కంపెనీ ఫౌండర్ మధుమిత అగర్వాల్ తెలిపారు. ఈ ప్లాట్‌ఫాంపై రూపొందించిన వాహనాలను ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఆవిష్కరించనున్నట్లు వివరించారు. దేశీ టూ–వీలర్ల మార్కెట్లో దాదాపు 30 శాతం వాటా ఉంటున్న 100 సీసీ వాహనాలకు సరిసమాన సామర్థ్యం ఉండే ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడనున్నట్లు పేర్కొన్నారు.

యూఏఈ మార్కెట్లోకి యూనిక్‌హైర్



దుబాయ్: ఐటీ, కన్సల్టింగ్ సర్వీసుల సంస్థ యూనిక్‌హైర్ అంతర్జాతీయంగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మార్కెట్లో ప్రవేశించింది. ఇందుకోసం టీకన్సల్ట్‌తో జట్టు కట్టింది. యూనిక్ హైర్ యూఏఈ లోగోను ఎమిరాటీ వ్యాపార దిగ్గజం బ్యూ అబ్దుల్లా ఆవిష్కరించారు. 10,000 మంది అంతర్జాతీయ అభ్యర్థులకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మధ్యప్రాచ్యం, ఆసియా వ్యాప్తంగా పలు వర్సిటీలతో జట్టు కట్టనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు ఎం బాలా, వంశీకృష్ణ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-5-2025

విశాఖ	513-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60



హెచ్ఎంఎస్ఐ నుంచి రెండు కొత్త బైకులు

- సీబీ750 హార్నెట్ ధర రూ.8,59,500
- సీబీ1000 హార్నెట్ ఎస్పీ ధర రూ.12,35,900

గురుగ్రాం: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన ప్రీమియం పోర్ట్‌ఫోలియోలో సీబీ750 హార్నెట్, సీబీ1000 హార్నెట్ ఎస్పీ పేర్లతో రెండు మోటార్‌సైకిళ్లను విడుదల చేసింది. వీటి ఎక్స్ షోరూం ధరలు రూ.8,59,500లు, రూ.12,35,900గా ఉన్నాయి. ఈ రెండు మోడళ్లకు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. హోండా సీబీ750 హార్నెట్755సీసీ, సీబీ1000 హార్నెట్ ఎస్పీ 999సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్లు కలిగి ఉన్నాయి. ఈ బైకుల్లో 6–స్పీడ్ గేర్‌బాక్స్, అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్ ఉన్నాయి. డ్యూయల్ చానల్ ఏబీఎస్ ఫీచర్ ఉంది. అయిదు అంగుళాల కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఉంది. బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్ –బై –టర్న్ నావిగేషన్, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ (హోండా రోడ్‌సింక్), యూఎస్‌బీ చార్జింగ్ పోర్ట్ ఉన్నాయి. రెండు బైకుల్లో స్పోర్ట్, స్టాండర్డ్, రెయిన్, యూజర్ అనే నాలుగు రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. హోండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్‌తో 3 స్థాయిల ట్రాక్షన్ కంట్రోల్ కూడా ఉంటుంది. సీబీ750 హార్నెట్ బిగ్‌వింగ్ టాప్‌లైన్, బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌లో అందుబాటులో ఉంచగా, సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ మాత్రం ప్రత్యేకంగా బిగ్‌వింగ్ టాప్‌లైన్ డీలర్‌షిప్‌ల ద్వారా మాత్రమే విక్రయిస్తుంది.



రోడ్‌స్టర్ ఎక్స్ డెలివరీలు ప్రారంభం



ముంబై: తొలి 5,000 మంది కస్టమర్లకు రూ.10,000 ఆఫర్‌తో రోడ్‌స్టర్ ఎక్స్ పోర్ట్‌ఫోలియో మోటార్ సైకిళ్ల డెలివరీలను ప్రారంభించినట్లు ఓలా ఎలక్ట్రిక్ శుక్రవారం వెల్లడించింది. ''మోటార్ సైకిల్ విభాగంలోకి ప్రవేశించే క్రమంలో 'రోడ్‌స్టర్ ఎక్స్' అనేది ఒక సాహసోపేతమైన ముందడుగు. ఈ డెలివరీతో ద్విచక్రవాహన కేటగిరిలో ఈవీ సామర్థ్యం అన్‌లాక్ అవుతుంది. ఈవీల వినియోగం, మరింత పుంజుకుంటుంది'' అని ఓలా ఎలక్ట్రిక్ చైర్మన్ ఎండీ భవీష్ అగర్వాల్ తెలిపారు. ఓలా కంపెనీ రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్‌లో మోటార్‌సైకిల్స్‌ను 2.5కేడబ్ల్యూహెచ్, 3.5కేడబ్ల్యూహెచ్, 4.5కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ వేరియంట్‌లలో అందిస్తోంది. వీటి ధరలు వరుసగా రూ.99,999, రూ.1,09,999, రూ.1,24,999గా ఉన్నాయి. రోడ్‌స్టర్ ఎక్స్ ప్లస్‌లో సిరీస్‌లో 4.5కేడబ్ల్యూహెచ్ వేరియంట్ ధర రూ.1,29,999, మరో వేరియంట్ 9.1కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ మోటార్ సైకిల్ ధర రూ.1,99,999గా ఉన్నాయి.

బ్యాంకింగ్‌కు క్వాంటమ్ కంప్యూటింగ్ కష్టాలు

- వచ్చే మూడేళ్లలో ముప్పులు గణనీయంగా పెరిగే అవకాశం
- ఫిషింగ్, డీడీవోఎస్, సోషల్ ఇంజినీరింగ్ రిస్కులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్వాంటమ్ కంప్యూటింగ్‌తో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగానికి గణనీయంగా ముప్పు పొంచి ఉందని ఐఎస్‌బీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్ (ఐఐడీఎస్) ఒక నివేదికలో హెచ్చరించింది. ఈ రిస్కులను ఎదుర్కొనడానికి ఆయా రంగ సంస్థలు సన్నద్ధంగా ఉండాలని సూచించింది. సంప్రదాయ కంప్యూటర్ల పరిధికి మించిన సవాళ్లను పరిష్కరించేందుకు క్వాంటమ్ మెకానిక్స్ సూత్రాలపై పని చేసే విప్లవాత్మకమైన కంప్యూటింగ్ విధానమే క్వాంటమ్ కంప్యూటింగ్. సంప్రదాయ కంప్యూటర్లు, బిట్స్ (0 లేదా 1)ను ఉపయోగించి సమాచారాన్ని ప్రాసెస్ చేస్తాయి. సంక్లిష్టమైన విషయాలను ప్రాసెస్ చేయడంలో వాటి సామర్థ్యాలు పరిమితంగా ఉంటాయి. మరోవైపు క్వాంటమ్ కంప్యూటర్స్ అనేవి సమస్యలను పరిష్కరించేందుకు సూపర్‌పొజిషన్, టనెలింగ్, ఇంటర్‌ఫియరెన్స్‌లాంటి క్వాంటమ్ ఫిజిక్స్ సూత్రాలను కూడా ఉపయోగిస్తాయి. ఈ విభాగంలో పలు కొత్త ఆవిష్కరణలు వస్తున్నప్పటికీ, ఎర్రర్ రేట్‌లను తగ్గించడం, పెద్ద స్థాయిలో విస్తరించడం వంటి అంశాల్లో సవాళ్లు ఉంటున్నాయి. క్వాంటమ్ కంప్యూటర్లు స్వభావరీత్యా సున్నితమైనవిగా ఉంటాయి. దీంతో చుట్టుపక్కల ఏ కాస్త గందరగోళ పరిస్థితి ఉన్నా, అవి ప్రభావితమై తప్పులు చేసే అవకాశాలు ఉంటాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ సామర్థ్యాలు పెరిగే కొద్దీ హ్యాకర్లు ఎలాంటి సంక్లిష్టమైన ఎన్‌క్రిప్షన్‌నైనా ఛేదించగలిగే పరిస్థితి ఏర్పడుతుంది. ఆ విధంగా బీఎఫ్ఎస్ఐ సంస్థలకు ముప్పులు పొంచి ఉన్నాయి. దేశీయంగా బీఎఫ్ఎస్ఐ రంగానికి క్వాంటమ్ కంప్యూటింగ్ వల్ల పొంచి ఉన్న ప్రత్యేకమైన సవాళ్లను అర్థం చేసుకునేందుకు, వాటిని అధిగమించేందుకు తీసుకోతగిన చర్యల గురించి ఈ నివేదిక కీలకంగా ఉంటుందని ఐఎస్‌బీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మనీష్ గంగ్వార్ తెలిపారు.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ అధ్యయనానికి సంబంధించిన సర్వేలో పాల్గొన్న వారిలో 57.5 శాతం మంది వచ్చే మూడేళ్లలో క్వాంటమ్ కంప్యూటింగ్ గణనీయమైన ముప్పుగా పరిణమించవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. అత్యంత సాధారణంగా ఎదురయ్యే ముప్పుల్లో ఫిషింగ్ దాడులు (65 శాతం), డీడీవోఎస్ దాడులు (47.5 శాతం), సోషల్ ఇంజినీరింగ్ (40 శాతం) ఉండొచ్చని వారు పేర్కొన్నారు.
- బీఎఫ్ఎస్ఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్లు, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్లలో క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి అవగాహన ఒక మోస్తరుగానే ఉంది. క్వాంటమ్ కంప్యూటర్ల ముప్పులను కూడా అధిగమించగలిగే క్రిప్టోగ్రఫీని (పీక్యూసీ) అమలు చేసే సన్నద్ధత అంతంతమాత్రంగానే .. 5 పాయింట్లకు గాను సగటున 2.4 శాతం స్థాయిలో ఉంది. ఫైర్‌వాల్స్‌లాంటి సర్వసాధారణంగా ఉండే భద్రతా చర్యలను విస్తృతంగా అమలు చేస్తున్నప్పటికీ చొరబాట్లను గుర్తించే అధునాతన సిస్టంలు, బలహీనతలను సమర్థవంతంగా అధిగమించగలిగే సాధనాలను వినియోగం తక్కువగానే ఉంటోంది.
- టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్‌లో పురోగతి సాధించడంతో సైబర్‌సెక్యూరిటీ రిస్కుల తీరుతెన్నులు మారాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో వ్యాపార వృద్ధి అవకాశాలు పెరిగినా, ప్రస్తుత పబ్లిక్ కీ క్రిప్టోగ్రఫీ (పీకేసీ) అల్గోరిథంలకు గణనీయంగా ముప్పు పొంచి ఉంది. ఈ నేపథ్యంలో సవాళ్లను అధిగమించేందుకు పీక్యూసీ వినియోగాన్ని వేగవంతం చేయడం, ప్రభుత్వం స్పష్టమైన ప్రమాణాలు .. మార్గదర్శకాలకు ప్రాధాన్యమివ్వడం, సైబర్‌సెక్యూరిటీపై అవగాహన పెంచడం, క్వాంటమ్‌ను నిలువరించే టెక్నాలజీలపై పరిశోధనలకు నిధులు సమకూర్చడం, పరిశ్రమవర్గాల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించడం తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

ఐపీవోకు కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్

రూ.745 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యం



ముంబై: మాగ్నెట్ వైండింగ్ వైర్స్ తయారీ సంస్థ కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా రూ.745 కోట్ల సమీకరణకు సిద్ధమైంది. ఇందుకు అనుమతులు కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. కంపెనీ ఆఫర్‌లో భాగంగా రూ.420 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేయనుంది. ప్రమోటర్లు రూ.325 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.226 కోట్లు రుణ చెల్లింపులకు, కొత్త యంత్రాల కొనుగోలుకు రూ.90.06 కోట్లు, రూఫ్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.10.41 కోట్లు, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఇష్యూకు నువామా వెల్త్ మేనేజ్‌మెంట్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ బుక్ రన్నింగ్ మేనేజర్లుగా, ఎంయూఎఫ్‌జీ ఇన్‌టైం ఇండియా సంస్థ రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నాయి.

మే 27న నికితా పేపర్స్ ఐపీఓ.. ధరల శ్రేణి రూ.95–104

క్రాఫ్ట్ పేపర్ తయారీ సంస్థ నికితా పేపర్స్ ప్రతిపాదిత ఐపీఓ మే 27న ప్రారంభమై 29న ముగియనుంది. షేరు ధరల శ్రేణిని రూ.95–104గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధర (రూ.104) వద్ద రూ.67.5 కోట్లు సమీకరణ లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓలో భాగంగా 64.94 లక్షల కొత్త షేర్లను జారీ చేయనుంది. పబ్లిక్ ఇష్యూ పూర్తయిన తర్వాత కంపెనీ షేర్లు 'ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ఎమర్జ్'లో లిస్ట్ కానున్నాయి. ఐపీవో ద్వారా వచ్చే మొత్తాన్ని కొత్త ప్లాంట్ నిర్మాణానికి, కంపెనీ ఇతర కార్యకలాపాల కోసం వినియోగించనుంది. ఫాస్ట్ ట్రాక్ ఫిన్‌సెక్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా, స్కైలైన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ రిజిస్ట్రార్‌గా వ్యవహరించున్నాయి.

ప్రీమియం బాటలో చిన్న కార్లు..

- అధిక ఫీచర్ల వైపు కొనుగోలుదారుల చూపు
- ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌ల వాటా 32 శాతం
- ఏటా 3.5 లక్షల వరకు వాహనాల విక్రయం
- ఎంట్రీ స్థాయి చిన్న కార్ల వాటా 10 శాతం లోపే




న్యూఢిల్లీ: కొన్నాళ్లుగా తగ్గుతున్న చిన్న కార్ల అమ్మకాలను మళ్లీ పెంచుకునేందుకు వాహనాల కంపెనీలు కొత్త వ్యూహాలను ఎంచుకుంటున్నాయి. ప్రీమియం ఫీచర్లను పొందుపరుస్తూ కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మొదటిసారిగా కారు కొనుగోలు చేస్తున్న వారు బేసిక్ వేరియంట్ కన్నా కాస్తంత ఎక్కువ ఫీచర్లుండే వాహనాలను ఎంచుకుంటున్న నేపథ్యంలో కొత్త మోడల్స్‌ను ప్రవేశపెడుతూ మార్కెట్ వాటాను పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. పదేళ్ల క్రితం మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో చిన్న కార్ల వాటా దాదాపు 50 శాతం వరకు ఉండేది. కానీ గత ఆర్థిక సంవత్సరంలో ఇది 22 శాతానికి పడిపోయింది. ఈ సెగ్మెంట్లో అంతర్గతంగా చూస్తే ఎంట్రీ స్థాయి హ్యాచ్‌బ్యాక్‌లపై ప్రతికూల ప్రభావం అత్యధికంగా ఉంది. నియంత్రణలపరంగా వివిధ నిబంధనలను అమలు చేయాల్సి వస్తుండటంతో వీటి ధరలు భారీగా పెరిగిపోవడమే ఇందుకు కొంత కారణంగా నిలుస్తోంది. కఠినతరమైన ఉద్గారాల నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించాల్సి రావడంతో గత కొన్నేళ్లలో చిన్న కార్ల ధరలు దాదాపు రూ. 90,000 వరకు పెరిగాయి. ఇక, కాస్తంత ఎక్కువ వెచ్చించగలిగే స్తోమత ఉన్న వాళ్లు మరింత ప్రీమియంగా అనిపించే, మరిన్ని ఫీచర్లు ఉండే కార్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో రూ. 4.5 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు ఖరీదు చేసే ఎంట్రీ స్థాయి హ్యాచ్‌బ్యాక్‌ల అమ్మకాల వాటా 10 శాతం లోపునకు క్షీణించగా ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌ల వాటా 32 శాతానికి పెరిగినట్లు పరిశ్రమ వర్గాల తెలిపాయి. రూ. 7.5 లక్షల నుంచి రూ. 13.5 లక్షల వరకు ఖరీదు చేసే ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లు దేశీయంగా ఏటా 3,00,000–3,50,000 వరకు అమ్ముడవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో చిన్న కార్ల వాటా 20–22 శాతం నుంచి పెద్దగా పెరగకపోయినా .. ప్రీమియం మోడల్స్‌కి డిమాండ్ నెలకొనడంతో మార్కెట్ పరిధి పెరిగి, వాల్యూమ్స్ సైతం పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కొత్త ఉత్పత్తుల రాకతో ఈసారి ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌ల అమ్మకాలు మరికాస్త మెరుగుపడొచ్చని వివరించాయి.

అఫోర్డబిలిటీ సమస్య..

కార్ల ధరలు విపరీతంగా పెరిగిపోవడమనేది చిన్న కార్ల అమ్మకాలకు సవాలుగా మారుతోందంటూ మారుతీ సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇది మొత్తం ఆటో మార్కెట్‌పై ప్రభావం చూపుతోందని చెప్పారు. 'రూ. 10 లక్షల కారు కొనాలంటే కుటుంబ వార్షికాదాయం రూ. 12 లక్షల పైగా ఉంటే తప్ప కొనే పరిస్థితి లేదు. దేశంలో ఆ స్థాయి ఆదాయాలు ఉండే వాళ్లు సుమారు 12 శాతం ఉండొచ్చు. మిగతా 88 శాతం మంది వార్షికాదాయం చాలా తక్కువే ఉంటోంది. ఇలాంటప్పుడు కార్ల మార్కెట్ అధిక వృద్ధి సాధించడం సవాలుగా ఉంటోంది' అని ఆయన పేర్కొన్నారు. అఫోర్డబిలిటీ సమస్య కారణంగా 66 శాతం మంది వినియోగదారులకు కార్ల కొనుగోళ్లకు దూరంగా ఉంటున్నారని వివరించారు. చిన్న కార్లు పుంజుకుంటే తప్ప దేశీ పరిశ్రమ వృద్ధి ఒక మోస్తరు వృద్ధితోనే సరిపెట్టుకోవాల్సి ఉంటుందని భార్గవ తెలిపారు. దేశీయంగా 20 కోట్లకు పైగా కుటుంబాల వార్షికాదాయం రూ. 5,00,000 లోపే ఉంటోందంటూ ఇటీవల ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైన అంశాలు భార్గవ అభిప్రాయానికి ఊతమిస్తున్నాయి.


వడ్డీ రేట్ల కోతలతో దన్ను ..



ఆదాయ పన్ను శ్లాబ్‌లలో మార్పులు, వడ్డీ రేట్ల తగ్గింపు తదితర పరిణామాలనేవి ప్రజలు వినియోగంపై మరికాస్త ఎక్కువ వెచ్చించేందుకు దోహదపడే అవకాశం ఉంది. అయితే, వారు దేనిపై వెచ్చిస్తారనే విషయంలో సందిగ్ధత నెలకొంది. కోవిడ్ మహమ్మారి సమయంలోనూ, ఆ తర్వాత రోజుల్లోనూ ఒక్కసారిగా వ్యక్తిగత వాహనాలకు డిమాండ్ పెరిగింది. అది ప్రస్తుతం కాస్త తగ్గింది. ఇప్పుడు కుటుంబాలతో కలిసి విహార యాత్రలకు వెళ్లడంలాంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా తదితర దిగ్గజాలు అంచనా వేస్తున్నట్లుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీ మార్కెట్ వృద్ధి 1–2 శాతానికే పరిమితం కాకుండా 5 శాతం మేర నమోదయ్యే అవకాశం ఉందని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు చేయడమనేది పొదుపునకు కాస్త దారి తీసినా .. ప్రస్తుతం రేట్లు బాగా పెరిగిపోవడం వల్ల చిన్న కార్ల అమ్మకాలకు పెద్దగా తోడ్పడకపోవచ్చని భార్గవ చెప్పారు.

ఎన్‌టీపీసీ నికరలాభం రూ.7,897 కోట్లు

షేరుకి రూ.3.35 డివిడెండ్



ముంబై: నిర్వహణ ఆదాయం పెరగడంతో ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ గత ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చి త్రైమాసికంలో రూ.7,897 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు 2023–24 ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఆర్జించిన రూ.6,490 కోట్లతో పోలిస్తే ఇది 22% అధికంగా ఉంది. నిర్వహణ ఆదాయం రూ.47,628 కోట్ల నుంచి రూ.49,834 కోట్లకు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికరలాభం 12% వృద్ధి చెంది రూ.23,953 కోట్లకు చేరింది. అలాగే 2024–25 గానూ కంపెనీ బోర్డు ప్రతి షేరుకు రూ.3.35 తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది.


యాక్సిస్ ఎస్‌సీఏఐఎఫ్ ఫండ్ రూ. 740 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ప్రత్యామ్నాయ పెట్టుబడుల నిధి యాక్సిస్ స్ట్రక్చర్డ్ క్రెడిట్ ఏఐఎఫ్ టూ దాదాపు రూ. 740 కోట్లు సమీకరించినట్లు యాక్సిస్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ వెల్లడించింది. బీమా కంపెనీలు, కార్పొరేట్లు, ఫ్యామిలీ ఆఫీసుల నుంచి దీనికి మంచి స్పందన వచ్చినట్లు సంస్థ ఎండీ బి. గోప్‌కుమార్ తెలిపారు. ఈ ఫండ్ వివిధ అసెట్స్‌లో అయిదేళ్ల వ్యవధికి ఇన్వెస్ట్ చేస్తుందని వివరించారు. ఒక డీల్‌పై మొత్తం నిధిలో పది శాతానికి మించకుండా పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. ఒక్కో డీల్ సుమారు రూ. 50–65 కోట్ల శ్రేణిలో ఉంటుందని గోప్‌కుమార్ వివరించారు.

ఏఎస్‌కే సీఎల్ఏఎఫ్ వన్ రూ. 500 కోట్లు..

అటు ఏఎస్‌కే క్యూరేటెడ్ లగ్జరీ అసెట్స్ ఫండ్ వన్ (సీఎల్ఏఎఫ్) సైతం రూ. 500 కోట్లు సమీకరించింది. ఈఫండ్ ప్రకటించిన 3 నెలల వ్యవధిలోనే భారీ మొత్తం సమకూరినట్లు ఏఎస్‌కే ప్రాపర్టీ ఫండ్ సహ వ్యవస్థాపకుడు అమిత్ భగత్ తెలిపారు. పెట్టుబడి మొత్తానికి కనీసం రెండు రెట్లు పైగా రాబడి అందించడంపై ఫోకస్ ఉంటుందని వివరించారు.



సీకే నాయుడు నుంచి శుబ్‌మన్ గిల్ వరకు...

అంచనాలకు అనుగుణంగానే యువ ఆటగాడు శుబ్‌మన్‌గిల్ భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. వచ్చే నెలలో జరగనున్న ఇంగ్లండ్ పర్యటన కోసం బీసీసీఐ సెలెక్షన్ కమిటీ శనివారం... గిల్ సారథ్యంలో 18 మందితో కూడిన జట్టును ప్రకటించింది. రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడంతో... భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 25 ఏళ్ల గిల్‌ను ఎంపిక చేసింది. సీకే నాయుడు భారత తొలి టెస్టు కెప్టెన్‌గా వ్యవహరించగా... ఇప్పుడు గిల్ 37వ కెప్టెన్ కానున్నాడు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు భారత టెస్టు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహించిన ప్లేయర్ల జాబితా...

భారత టెస్టు కెప్టెన్ల జాబితా (మ్యాచ్‌ల సంఖ్య)

1. సీకే నాయుడు	4
2. మహరాజా ఆఫ్ విజయనగరం	3
3. ఇఫ్తికార్‌అలీఖాన్ పటౌడీ	4
4. లాలా అమర్‌నాథ్	15
5. విజయ్ హజారే	14
6. వినూ మన్కడ్	6
7. గులాం అహ్మద్	3
8. పాలీ ఉమ్రిగర్	8
9. హేమూ అధికారి	1
10. దత్తా గైక్వాడ్	4
11. పంకజ్‌రాయ్	1
12. రాంచంద్	5
13. నారీ కాంట్రాక్టర్	12
14. మన్సూర్ అలీఖాన్ పటౌడీ	40
15. చందూ బోర్డే	1
16. అజిత్ వాడేకర్	16
17. వెంకట్రాఘవన్	5
18. గావస్కర్	47
19. బిషన్‌సింగ్ బేడీ	22
20. గుండప్ప విశ్వనాథ్	2
21. కపిల్‌దేవ్	34
22. వెంగ్సర్కార్	10
23. రవిశాస్త్రి	1
24. శ్రీకాంత్	4
25. అజహర్	47
26. సచిన్	25
27. గంగూలీ	49
28. ద్రవిడ్	25
29. సెహ్వాగ్	4
30. కుంబ్లే	14
31. ధోని	60
32. కోహ్లి	68
33. రహానే	6
34. కేఎల్ రాహుల్	3
35. రోహిత్ శర్మ	24
36. బుమ్రా	3
37. శుబ్‌మన్ గిల్	



జొకోవిచ్ 100 నాటౌట్

- వందో సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న టెన్నిస్ స్టార్
- జెనీవా ఓపెన్ కైవసం

జెనీవా: టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) వందో సింగిల్స్ టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. జెనీవా ఓపెన్‌లో చాంపియన్‌గా నిలవడం ద్వారా జొకో ఈ ఘనత సాధించాడు. తద్వారా ఓపెన్ ఎరాలో 100 సింగిల్స్ టైటిల్స్ సాధించిన మూడో ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డుల్లోకి ఎక్కాడు. జిమ్మి కానర్స్ (109; అమెరికా), రోజర్ ఫెదరర్ (103; స్విట్జర్లాండ్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ జొకోవిచ్ 5–7, 7–6 (7/2), 7–6 (7/2)తో హుబర్ట్ హుర్కాజ్ (పోలాండ్)పై విజయం సాధించాడు. తొలి సెట్‌లో పరాజయం పాలైన జొకో... హోరాహోరీగా సాగిన మిగిలిన రెండు సెట్‌లను టై బ్రేకర్ ద్వారా గెలుచుకున్నాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో హుర్కాజ్ 19 ఏస్‌లు సంధించగా... జొకోవిచ్ 6 ఏస్‌లకే పరిమితమైనా కీలక సమయాల్లో పాయింట్లు కొల్లగొట్టాడు. హుర్కాజ్ 112 పాయింట్లు నెగ్గగా... జొకో 121 పాయింట్లు సాధించాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 99వ టైటిల్ ఖాతాలో వేసుకున్న జొకోవిచ్... ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందు 'సెంచరీ' పూర్తి చేసుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన అనంతరం జొకో... షాంఘై మాస్టర్స్, మియామి మాస్టర్స్ టోర్నమెంట్ ఫైనల్స్‌కు చేరినా టైటిల్ గెలవలేకపోయాడు. 'వందో టైటిల్ నెగ్గడం చాలా ఆనందంగా ఉంది. ఈ క్షణం కోసం ఎతో కష్టపడ్డా. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నా. హుబర్ట్ సర్వీస్‌ను బ్రేక్ చేయడం చాలా కష్టంగా అనిపించింది. అయినా ప్రయత్నించి సఫలమయ్యా' అని జొకో అన్నాడు. 2006లో తొలి టైటిల్ నెగ్గిన జొకోవిచ్... 19 ఏళ్ల కెరీర్‌లో మూడంకెల సంఖ్యకు చేరుకున్నాడు. ఈ క్రమంలో ఓపెన్ ఎరాలో 20 వేర్వేరు సీజన్లలో టైటిల్స్ నెగ్గిన తొలి ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ ఖాతాలో వేసుకున్న జొకోవిచ్... నేటి నుంచి ప్రారంభం కానున్న ఫ్రెంచ్ ఓపెన్‌లో మరోసారి విజేతగా నిలిచేందుకు కసరత్తు చేస్తున్నాడు. మట్టి కోర్టులో జరగనున్న ఈ టోర్నీ తొలి రౌండ్‌లో సోమవారం మెకెంజీ మెక్‌డొనాల్డ్ (అమెరికా)తో జొకోవిచ్ తలపడనున్నాడు.

ప్లేయర్	టైటిల్స్
జిమ్మీ కానర్స్	109
రోజర్ ఫెదరర్	103
నొవాక్ జొకోవిచ్	100
ఇవాన్ లెండిల్	94
రాఫెల్ నాదల్	92



మరో టైటిల్ వేటలో... అల్‌కరాజ్



నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్

- బరిలో సినెర్, జొకోవిచ్
- నాదల్ శకం తర్వాత 'క్లే'పై తొలి గ్రాండ్‌స్లామ్



పారిస్: సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్‌కు నేడు తెర లేవనుంది. గతేడాది ఒలింపిక్స్‌లో తలపడిన టెన్నిస్ సూపర్ స్టార్లందరూ మళ్లీ పారిస్‌లో పోరాడేందుకు వచ్చేశారు. క్లే కోర్టులో సత్తా చాటేందుకు సై అంటున్నారు. డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) ట్రోఫీని నిలబెట్టుకునే పనిలో ఉంటే... ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) టైటిల్ సాధించేందుకు వచ్చాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌తో సత్తా చాటుకున్న సినెర్ డోపింగ్ మరకను దాటేశాడు. ఇప్పుడిక్కడ ఫ్రెంచ్ ముచ్చట తీర్చుకోవాలని అనుకుంటున్నాడు. వీరిద్దరితో పాటు టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ కూడా 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం కాచుకున్నాడు. దీనికోసం రెండేళ్లుగా పెద్ద పోరాటమే చేస్తున్నాడు. ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీస్ చేరిన నొవాక్ రోలండ్ గారోస్‌లో చివరిసారిగా 2023లో టైటిల్ గెలిచాడు. ఆ ఏడాది వింబుల్డన్ (రన్నరప్) తప్ప మూడు టైటిళ్లను కైవసం చేసుకున్న జొకోవిచ్‌కు గత సీజన్ తీవ్ర నిరాశను మిగిల్చింది. ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయాడు. దీంతో 'గ్రాండ్‌స్లామ్ రజతోత్సవం' కోసం ఈ ఫ్రెంచ్ ఓపెన్‌లో సెర్బియన్ స్టార్ గంపెడాశలతో బరిలోకి దిగుతున్నాడు. సరిగ్గా తొమ్మిది నెలల క్రితం ఇక్కడే ఒలింపిక్స్‌లో చాంపియన్‌గా నిలిచిన జొకోకు మళ్లీ కాలం కలిసొస్తే 'గ్రాండ్–25' సాకారం అవుతుంది. తొలి రౌండ్లలో నిరుటి విజేత అల్‌కరాజ్... క్వాలిఫయర్ గులియో జెప్పియెరి (ఇటలీ)తో, సినెర్... రిండెర్క్‌నెచ్ (ఫ్రాన్స్)తో, ఆరో సీడ్ జొకోవిచ్... షెవ్‌చెంకో (కజకిస్తాన్)తో ఫ్రెంచ్ సమరాన్ని ప్రారంభించనున్నారు. దాదాపు 2 దశాబ్దాల తర్వాత నాదల్ లేని క్లేకోర్ట్ ఈవెంట్ జరగబోతోంది. 2005 నుంచి 2024 వరకు పోటీపడిన స్పెయిన్ దిగ్గజం 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లలో 14 ఫ్రెంచ్ ఓపెన్‌లోనే సాధించడం విశేషం.

సబలెంక, స్వియాటెక్‌లే ఫేవరెట్లు

మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ అరియాన సబలెంక (బెలారస్), స్వియాటెక్ (పోలండ్)లు టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. గతేడాది ఆస్ట్రేలియన్, యూఎస్ ఓపెన్‌లు గెలిచిన సబలెంకకు ఈ ఏడాది ఆరంభ గ్రాండ్‌స్లామ్‌లో టైటిల్ పోరులో చుక్కెదురైంది. ఇప్పుడు టైటిల్ గెలిచేదాకా నిలకడైన ఆటతీరును కనబరచాలనే లక్ష్యంతో ప్రపంచ నంబర్‌వన్ సబలెంక బరిలోకి దిగుతోంది. మరోవైపు 'క్లేకోర్టు రాణి'గా ఎదిగిన స్వియాటెక్ రోలండ్ గారోస్‌లో ఐదో టైటిల్‌పై కన్నేసింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆమె హ్యాట్రిక్ సహా నాలుగు (2020, 2022, 2023, 2024) ట్రోఫీలు సాధించింది. తొలి రౌండ్ పోటీల్లో రష్యన్ అన్‌సీడెడ్ రకిమొవాతో సబలెంక... రెబెక్కా స్రాంకొవా (స్లొవేకియా)తో స్వియాటెక్ పోటీపడనున్నారు. గత యూఎస్ ఓపెన్ రన్నరప్, మూడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా)... రొమేనియన్ ప్లేయర్ అన్క టొడోనితో, ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా) క్వాలిఫయర్ డెరియా సవిల్లే (ఆస్ట్రేలియా)తో... రెండో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) అన్‌సీడెడ్ ఒలీవియా గడెకి (ఆస్ట్రేలియా)తో తలపడతారు.



బషీర్‌కు స్టోక్స్ అభినందన

ఇంగ్లండ్ ఘన విజయం

- ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో జింబాబ్వే పరాజయం
- 6 వికెట్లు తీసిన షోయబ్ బషీర్

నాటింగ్‌హామ్: టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు సొంతగడ్డపై ఇంగ్లండ్ క్రికెట్ జట్టు అదరగొట్టింది. జింబాబ్వేతో 22 ఏళ్ల తర్వాత ఆడిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఇన్నింగ్స్, 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు రోజుల్లోనే ముగిసిన ఈ నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో ఇంగ్లండ్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చగా... జింబాబ్వే ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఓవర్‌నైట్ స్కోరు 30/2తో శనివారం మూడో రోజు ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే చివరకు 59 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. సీన్ విలియమ్స్ (82 బంతుల్లో 88; 16 ఫోర్లు), సికందర్ రజా (68 బంతుల్లో 60; 10 ఫోర్లు) అర్ధ శతకాలతో పోరాడారు. ఈ జంట బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మెరుగ్గా కనిపించిన జింబాబ్వే... ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకునేలా అనిపించినా... ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ ఈ ఇద్దరినీ పెవిలియన్‌కు పంపి జింబాబ్వే ఆశలపై నీళ్లు చల్లాడు. ఈ జంట మూడో వికెట్‌కు 122 పరుగులు జోడించింది. బెన్ కరన్ (37), వెస్లీ మధెవెరె (31) పర్వాలేదనిపించగా... కెప్టెన్ ఇర్విన్ (2), బెనెట్ (1), తఫద్జా (4), బ్లెస్సింగ్ ముజరబానీ (4) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో బషీర్ 6 వికెట్లతో సత్తా చాటాడు. అంతకు ముందు ఇంగ్లండ్ 565/6 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన బషీర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.


ముకేశ్‌కు కాంస్య పతకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి కాంస్య పతకంతో మెరిశాడు. శనివారం జరిగిన పురుషుల 25 మీటర్ల పిస్టల్ ర్యాపిడ్ ఫైర్‌లో ముకేశ్ మూడో స్థానంలో నిలిచాడు. మరోవైపు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో భారత షూటర్లకు స్వర్ణ, రజతాలు దక్కించుకోగా... పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో మరో కాంస్య పతకం లభించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో 16 ఏళ్ల శాంభవి, ఓజస్వి ఠాకూర్ 253.0 పాయింట్లతో పసిడి పతకం గెలుచుకోగా... 251.8 పాయింట్లతో ఓజస్వి రజతం దక్కించుకుంది. కార్లోటా సలాఫియా (230.5 పాయింట్లు; ఇటలీ) కాంస్యం దక్కించుకుంది. దీంతో భారత జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఈ టోర్నీలో మొత్తంగా ఇప్పటి వరకు భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్య పతకాలు ఖాతాలో వేసుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ప్రణవ్ కాంస్య పతకంతో మెరిశాడు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో విజేతగా నిలిచిన ప్రణవ్... ఫైనల్లో 227.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. హువాంగ్ లివాన్‌లిన్ (250.3 పాయింట్లు; చైనా), బ్రాడెన్ ఫైసెర్ (250.0 పాయింట్లు; అమెరికా) వరసగా స్వర్ణ, రజతాలు గెలుచుకున్నారు. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో ప్రణవ్ 632.1 పాయింట్లు సాధించి అగ్రస్థానంతో ఫైనల్లో అడుగుపెట్టాడు.

నోరిస్‌కు పోల్ పొజిషన్

మొనాకో గ్రాండ్ ప్రి



మొనాకో: ఫార్ములా వన్ సీజన్ తొమ్మిదో రేసు మొనాకో గ్రాండ్ ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ పోల్ పొజిషన్ సాధించాడు. ఈ క్రమంలో నోరిస్ ట్రాక్ రికార్డును తిరగరాశాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో నోరిస్ 1 నిమిషం 9.954 సెకన్లలో ల్యాప్‌ను పూర్తిచేసి అగ్రస్థానంలో నిలిచాడు. 2019లో లూయిస్ హామిల్టన్ టైమింగ్‌ను తాజాగా నోరిస్ అధిగమించాడు. ఈ సీజన్ ఆరంభ ఆస్ట్రేలియా గ్రాండ్ ప్రి తర్వాత నోరిస్‌కు ఇదే తొలి పోల్ పొజిషన్. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును అతడు తొలి స్థానం నుంచి ప్రారంభించనున్నాడు. గతేడాది ఈ రేసులో విజేతగా నిలిచిన స్థానిక డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ (1 నిమిషం 10.063 సెకన్లు; ఫెరారీ) రెండో స్థానం దక్కించుకోగా... మెక్‌లారెన్ జట్టుకే చెందిన ఆస్కార్ పియాస్ట్రి (1 నిమిషం 10.063 సెకన్లు) మూడో స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది అంతగా ఆకట్టుకోలేకపోయిన ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 10.382 సెకన్లు) నాలుగో స్థానంలో నిలవగా... డిఫెండింగ్ చాంపియన్, రెడ్‌బుల్ రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 నిమిషం 10.669 సెకన్లు) ఐదో ప్లేస్ దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ల జోరు సాగుతుండగా... ఎనిమిది రేసులు ముగిసేసరికి డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో పియాస్ట్రి 146 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. లాండోనోరిస్ 133 పాయింట్లతో రెండో ప్లేస్‌లో కొనసాగుతుండగా... నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ (124 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నాడు.

కమిన్స్‌కు జరిమానా

లక్నో: సన్‌రైజర్స్ హైదరాబాద్ సారథి కమిన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్‌పాటీదార్‌లపై జరిమానా పడింది. శుక్రవారం రెండు జట్ల మధ్య లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో 'స్లో ఓవర్ రేట్'కు పాల్పడినందుకు ఇరు జట్ల కెప్టెన్‌లపై జరిమానా విధించారు. హైదరాబాద్ జట్టుకు ఈ సీజన్‌లో ఇదే తొలి తప్పిదం కావడంతో కమిన్స్‌కు రూ. 12 లక్షల జరిమానా పడింది. నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడం బెంగళూరుకు ఈ సీజన్‌లో రెండో సారి కావడంతో... రజత్ పాటీదార్‌కు రూ. 24 లక్షల జరిమానా పడింది. 'ఆర్‌సీబీ రెండోసారి స్లో ఓవర్ రేట్‌కు పాలుపడటంతో పాటీదార్‌కు 24 లక్షల జరిమానా వేశాం. జట్టులోని ఇతర ఆటగాళ్లపై రూ. 6 లక్షల జరిమానా విధించాం' అని ఐపీఎల్ పాలక మండలి శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మ్యాచ్‌లో ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న బెంగళూరు జట్టుపై హైదరాబాద్ 42 పరుగుల తేడాతో గెలుపొందింది.





రష్యా దాడులతో ఉక్రెయిన్‌లోని ఖార్కీవ్ ప్రాంతంలో చెలరేగిన మంటలు (ఫైల్)



ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో నేలమట్టమైన భవనం వద్ద దిగాలుగా పాలస్తీనియన్లు (ఫైల్)

సగం విశ్వమానవాళికి సంక్షోభాల సెగ

జనాభాను కష్టాల కడలిలోకి నెట్టేస్తున్న పోరాటాలు, యుద్ధాలు

వాషింగ్టన్: రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలు హమాస్, ఇజ్రాయెల్ పోరు, ఎర్రసముద్రంలో హౌతీల క్షిపణి దాడులదాకా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న పోరాటాలు, యుద్ధాలు, ఉద్యమాలు, సైనిక చర్యలతో ప్రపంచ జనాభాలో సగం మంది సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నారని అంతర్జాతీయ నివేదిక ఒకటి వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాక్‌ల కారణంగా దక్షిణాసియాలోనూ ఉద్రిక్త వాతావరణం నెలకొందని ''సాయుధ సంక్షోభాలు, ప్రాంతాలు, సంఘటనలు(ఏసీఎల్ఈడీ)''సంస్థ తెలిపింది. స్వతంత్ర్యంగా పనిచేసే లాభాపేక్షలేని ఏసీఎల్ఈడీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, సంక్షోభాల వివరాలతో ఒక నివేదికను రూపొందించింది. చాలా సంవత్సరాలుగా ఊహించనంతగా చాలా దేశాల్లో సంక్షోభాలు ఉన్నప్పటికీ కేవలం గత 12 నెలల్లో పరిణామాలను గమనిస్తేనే 50 దేశాల్లో 423 కోట్ల మంది ప్రజలు పలు రకాల సంక్షోభాలకు బాధితులుగా మిగిలిపోయారని గణాంకాలు ఘోషించాయి. 2024 డిసెంబర్‌నాటి 'సంక్షోభ సూచీ'గణాంకాల ప్రకారం 10 దేశాలు అత్యంత సంక్షుభిత దేశాలుగా, 20 దేశాలు అతి, మధ్యస్థ స్థాయి సంఘర్షణలకు కేంద్ర స్థానాలుగా తయారయ్యాయి. పాలస్తీనా 2024 ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత దయనీయమైన ప్రాంతంగా మారింది. మయన్మార్‌లో ఏకంగా 170 సాయుధ గ్రూప్‌లు క్రియాశీలకంగా ఉన్నాయి. ఉక్రెయిన్ సైతం దారుణమైన యుద్ధసంక్షోభాన్ని చవిచూస్తోంది.

ఎందుకీ సంక్షోభాలు?

పలు దేశాల్లో బలహీనమైన నాయకత్వం, మిత్రదేశం కోసం అప్పటికే జరుగుతున్న యుద్ధంలో కలగజేసుకోవడం, దేశాల మధ్య చెడిన సఖ్యత,మారిన ప్రభుత్వాల అంతర్జాతీయ విధానాలు, పొరుగు దేశాల పట్ల శత్రుభావన స్థాయిలో మార్పులు, దేశంలో చెలరేగిన విద్వేషాలను పొరుగుదేశాలు సొమ్ముచేసుకోవడం, ఉద్దేశపూర్వకంగా వైషమ్యాలను రెచ్చగొట్టి ఉద్యమాలకు తెరతీయడం వంటి పలు రకాల ఉదంతాలతో ఆయా దేశాల్లో ప్రజాజీవనం అస్తవ్యస్తమవుతోంది. నిత్యావసరాలూ మృగ్యమయ్యాయి.

సహస్రాబ్దివేళ కాస్తంత శాంతించి..

1960 దశకంలో కలహాలతో సమస్యల వలయంలో చిక్కుకున్న దేశాల సంఖ్య 15గా ఉండేది. 1991 ఏడాదికి వచ్చేసరికి ఈ సంఖ్య ఏకంగా 53 దేశాలకు పాకింది. తర్వాత 2000 సంవత్సరానికి వైషమ్యాలు బాగా సమసిపోయాయి. ఆ తర్వాత మళ్లీ పుంజుకుని 2010 ఏడాదికల్లా 31 దేశాల్లో ఘర్షణలు, యుద్ధమేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. ఇక 2023 ఏడాదికల్లా సమరంలో కత్తులు దూసుకుంటున్న దేశాల సంఖ్య రికార్డ్‌స్థాయిలో 59కి పెరిగింది. మరణాల సంఖ్య సైతం ఇదే పంథాలో కొనసాగింది. 1960 ఏడాదిలో యుద్ధాలు, పోరాటాలు, ఉద్యమాల్లో 64,873 మంది ప్రాణాలు కోల్పోయారు. 1990 ఏడాదిలో ఏకంగా 80,297 మంది అమాయకులు చనిపోయారు. 2005 ఏడాదికి వచ్చేసరికి ఈ జగడాల్లో మరణాల సంఖ్య 12,150కి దిగివచ్చింది. ఇక ఉక్రెయిన్, రష్యా యుద్ధంసహా ప్రపంచవ్యాప్తంగా వైషమ్యాలు, దేశాల మధ్య కలహాలు కట్టుతప్పడంతో 2022 ఏడాదిలో మరణాలు రికార్డ్ స్థాయిలో 2.77 లక్షలను దాటేశాయి.

ప్రచ్ఛన్న యుద్ధం తర్వాత ఇప్పుడే అత్యధికం

''ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాతి నుంచి చూస్తే విశ్వావ్యాప్తంగా దేశాల మధ్య రణాల గొణ ఇప్పుడే ఎక్కువగా ఉంది. దేశాల మధ్య గొడవలకు తోడు దేశీయంగానూ ఉద్యమాలు, అల్లర్లు, హింస కారణంగా మృత్యువు ఒడిలోకి చేరుతున్న అమాయక ప్రజల సంఖ్య ఏటికేడు పెరిగిపోతోంది''అని ఓస్లోలోని పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ ప్రొఫెసర్ సిరి అసద్ రుస్తాద్ ఆందోళన వ్యక్తంచేశారు. ''ఇప్పటికే సగం ప్రపంచ జనాభాకు సమరాల సెగ తగులుతోంది. ఈ విద్వేషాగ్ని ఇప్పట్లో చల్లారేలా లేదు. దాదాపు ఏడాదిన్నర యుద్ధం తర్వాత కూడా ఇజ్రాయెల్ ఆదివారం గాయాల గాజాపై మరింతగా క్షిపణులను ఎక్కుపెట్టడమే ఈ దారుణపర్వానికి ప్రబల తార్కాణం''అని రుస్తాద్ వ్యాఖ్యానించారు. ఓవైపు చర్చలు జరుపుతూనే ఉక్రెయిన్‌పై మరోమారు భీకర స్థాయిలో డ్రోన్లతో విరుచుకుపడి రష్యా తన ఆక్రమణ జెండాను దించేదిలేదని తెగేసి చెప్పిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

అసూర్యంపశ్య

చిన్ననాటినుంచే ఎండకు దూరం ● డి విటమిన్ లోపంతో పెళుసుబారిన ఎముకలు
మంచంపై అలా కదలగానే విరిగిన వైనం ● చైనాలో 48 ఏళ్ల మహిళ వింతగాథ

అసూర్యంపశ్య. అంటే ఎండ కన్నెరగని స్త్రీ. చైనాలో ఓ 48 ఏళ్ల మహిళ ఉదంతమిది. సిచువాన్ ప్రావిన్సులో చెంగ్డూ నగరానికి చెందిన ఆమె తన ఒంటిని ఒక్క సూర్యకిరణం కూడా తాకనిచ్చేది లేదని భీషణప్రతిజ్ఞ చేసింది. ఆరుబయటకు వెళ్లినా ఒళ్లంతా కప్పేలా వస్త్రాలు ధరించేది. ముఖం, చేతులు బయటకు కనిపించక తప్పని పరిస్థితుల్లో నిండుగా సన్‌స్క్రీమ్ లోషన్ పట్టించి మరీ వెళ్లేది. ఈమెకు ఉన్న ఈ అలవాటు ఇప్పటిది కాదు. చిన్ననాటి నుంచే ఇదే తంతు. ఎండ తగిలితే కందిపోవడమే గాక నల్లబడతానన్న భయమే ఇందుకు కారణం. అందుకే నిత్యం పొడవాటి టాప్స్ ధరించేది. చలువ కళ్లద్దాలు, సాక్స్, షూ, పొడవాటి చొక్కా.. ఇలా ఏ రకంగానూ సూర్యకాంతి సోకకుండా బహుజాగ్రత్తలు తీసుకుంది. షార్ట్స్, స్లీవ్స్ పొరపాటున కూడా వేసుకునేది కాదు!

అయితే ఏమైంది?

ఒంటికి ఎండ తాకక అత్యావశ్యకమైన 'డి'విటమిన్ లోపించింది. ఎంతగా అంటే, ఇటీవల ఆమె పడక మంచంపై కాస్త అటూ ఇటూ కదలగానే ఏకంగా ఓ ఎముక విరిగిపోయింది. డి విటమిన్ లోపంతో ఎముకలు గట్టిదనం తగ్గి పెళుసుబారడమే అందుకు కారణం. ఎముక విరగడంతో నరకయాతన నడుమ ఆస్పత్రిలో చేరింది. మెత్తని బెడ్ మీద ఎముక ఎలా విరిగిందని వైద్యులే విస్తుపోయారు. పరీక్షలన్నీ చేసి, డి విటమిన్ లోపమని తేల్చడమే గాక ఆమెను మందలించారు. బోలు ఎముక వ్యాధిగా పేర్కొనే ఆస్టియోపోరోసిస్ బారినపడ్డట్టు చెప్పారు. లాంగ్ షువాంగ్ అనే సంప్రదాయ వైద్యున్ని ఉటంకిస్తూ సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్ వార్తా సంస్థ తాజాగా ఈ వింతగాథను బయటపెట్టింది. ఇదిప్పుడు అంతటా పెద్ద చర్చనీయంగా మారడమే గాక సోషల్ మీడియాలోనూ తెగ వైరలైంది.

కీలకమైన విటమిన్

విటమిన్ డి ప్రకృతిలో సహజంగా లభించదు. శరీరమే దాన్ని తయారు చేసుకుంటుంది. అందుకు సూర్యకాంతి అవసరం. ఉదయపు లేత కిరణాల వేడికి చర్మం కింది పొరలోని రసాయనాలు వేడెక్కి డి విటమిన్‌ను తయారు చేసుకుంటాయి. అది ఉంటేనే మన శరీరం అత్యధికంగా కాల్షియంను సంగ్రహించుకోగలదు. కాల్షియం సమపాళ్లలో ఉన్నప్పుడే ఎముకలకు గట్టిదనం వస్తుంది. అవి గట్టిగా ఉంటేనే అన్ని పనులు చక్కగా చేసుకోగలం. కాల్షియం లోపిస్తే ఎముకలు గుల్లబారతాయి. ఎముక ఆరోగ్యంగా, అస్థిపంజరం పటిష్టంగా ఉండాలంటే ఉదయపు ఎండ తగలాల్సిందే.

– సాక్షి, నేషనల్ డెస్క్

చైనాలో విపరీత పోకడ

చైనాలో ఇలా ఎండకు ముఖం చాటేస్తున్న మహిళల సంఖ్య బాగా పెరుగుతోంది. ఆరుబయటకు వెళ్లినా పెద్ద గొడుగు, చేతులన్నీ కప్పేసేలా దుస్తులు, పెద్ద కళ్లద్దాలు, గ్లౌజ్‌లు, ఫేస్ మాస్కులు, కాళ్లకు షూ, అతినీలలోహిత కిరణాలను ఆపే హూడీలు... ఇవే ఇప్పుడు చైనాలో ట్రెండ్! ఇలా చేస్తే కాల్షియం సంబంధ వ్యాధులతో ఆస్పత్రిపాలవడం ఖాయమని వైద్య నిపుణులు మొత్తుకుంటున్నారు. ఒంట్లో పదేళ్లకోసారి ఎముకలన్నీ కొత్త శక్తితో పునరుజ్జీవం పొందుతాయి. 40 ఏళ్లు దాటాక మాత్రం ఎముకల సాంద్రత తగ్గడం మొదలవుతుంది. ఆ తర్వాత అవి పెళుసుబారతాయి. చక్కటి వ్యాయామం, ఆహారశైలే దానికి విరుగుడని గ్వాంగ్జూ వైద్య విశ్వవిద్యాలయంలో ఆర్థోపెడిక్ వెన్నెముక శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ జియాంగ్ గ్జియోబింగ్ చెప్పుకొచ్చారు.



శనివారం పూంచ్‌లో విహాన్ భార్గవ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాహుల్ గాంధీ

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

పాకిస్తాన్ దాడుల బాధిత కుటుంబాలకు రాహుల్ గాంధీ భరోసా
జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ పట్టణంలో పర్యటన

పూంచ్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ పట్టణంలో పర్యటించారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ దాకా పాకిస్తాన్ సైన్యం దాడుల్లో మృతిచెందినవారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంఘీభావం ప్రకటించారు. గంటకుపైగా బాధితులతో మాట్లాడారు. వారి ఆవేదన విని చలించిపోయారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధితుల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్తామని, అందరికీ తెలియజేస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రకటించారు. నియంత్రణ రేఖకు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పూంచ్ టౌన్‌లో క్రైస్ట్ స్కూల్‌ను రాహుల్ సందర్శించారు. మే 7న ఉదయం పాక్ సైన్యం దాడుల్లో ఈ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు చనిపోయారు. అయాన్, అరూబా అనే 13 ఏళ్ల ఇద్దరు కవలలు, రమీజ్ ఖాన్ అనే మరో విద్యార్థి మరణించాడు. తమ మిత్రులు దూరం కావడాన్ని ఈ స్కూల్ విద్యార్థులు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. రాహుల్ వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. అంతా త్వరలోనే సర్దుకుంటుందని అన్నారు. ''మీకు ఎదురైన సమస్యలకు ప్రతిస్పందనగా చదువులపై దృష్టి పెట్టండి''అని సూచించారు. చక్కగా చదువుకోవాలని, చక్కగా ఆడుకోవాలని, ఎంతోమంది స్నేహితులను సంపాదించుకోవాలి అంటూ విద్యార్థులను ఓదార్చారు. పూంచ్ నుంచి ఓ కుటుంబం కారులో సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోతుండగా పాకిస్తాన్ క్షిపణితో దాడి చేసింది. ఈ దాడిలో కారులో ఉన్న 13 ఏళ్ల బాలుడు విహాన్ భార్గవ్ ప్రాణాలు కోల్పోయాడు. విహాన్ భార్గవ్ కుటుంబాన్ని కూడా రాహుల్ పరామర్శించారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై చెత్తపోసి చంపేశారు

యూపీలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్వాకం

లక్నో: చెట్టు కింద నిద్రిస్తున్న ఓ వ్యక్తి పైకి మున్సిపల్ సిబ్బంది ట్రక్కుతో తెచ్చిన చెత్తను కుమ్మరించడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ దారుణం యూపీలోని బరేలీలో చోటుచేసుకుంది. నగరంలోని బారాదరీ ప్రాంతానికి చెందిన సునీల్ కుమార్ ప్రజాపతి(45) కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం ఆయన శ్మశానం పక్కన ఉన్న చెట్టు కింద నిద్రిస్తుండగా మున్సిపల్ సిబ్బంది కావాలనే ఆయనపై ట్రాలీతో తెచ్చిన చెత్తను కుమ్మరించారు. కాంట్రాక్టర్ నాయిమ్ శాస్త్రిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

షెంజెన్ వీసా దరఖాస్తుల తిరస్కరణ

2024లో భారతీయులకు రూ.136 కోట్లు నష్టం

న్యూఢిల్లీ: యూరోపియన్ దేశాల్లో 3 నుంచి ఆర్నెల్ల పాటు ఉండేందుకు వీలు కల్పించే షెంజెన్ వీసాలు భారతీయులకు నానాటికీ తగ్గుతున్నాయి. 2024లో 1.65 లక్షల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఈ జాబితాలో అల్జీరియా, టర్కీ తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. దరఖాస్తు రుసుం రూపేణా మనవాళ్లు రూ.136.6 కోట్లు కోల్పోయారు. ఇండియా నుంచి 11.08 లక్షల మంది దరఖాస్తు చేయగా, ఇందులో 5.91 లక్షల దరఖాస్తులు ఆమోదం పొందాయి. 1.65 లక్షల దరఖాస్తులను తిరస్కరించారు. మిగతా దరఖాస్తులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. షెంజెన్ వీసాతో యూరప్‌లోని 26 దేశాల్లో పర్యటించవచ్చు.

ఉక్రెయిన్–రష్యా మధ్య 390 మంది యుద్ధ ఖైదీల మార్పిడి

కీవ్: తుర్కియే చర్చల సమయంలో కుదిరిన అంగీకారం మేరకు ఉక్రెయిన్, రష్యా యుద్ధ ఖైదీల మార్పిడి ప్రక్రియ మొదలైంది. ఉక్రెయిన్–బెలారస్ సరిహద్దుల్లో శుక్రవారం చెరో 390 మంది యుద్ధ ఖైదీలను పరస్పరం అప్పగించుకున్నాయి. 2022లో రష్యా దురాక్రమణ మొదలయ్యాక ఈ స్థాయిలో యుద్ధ ఖైదీల మార్పిడి జరగడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్ అప్పగించిన తమ 390 మంది సైనికులు, పౌరులను వెంటనే బెలారస్‌కు వైద్య పరీక్షల నిమిత్తం పంపించినట్లు రష్యా అధికారులు వెల్లడించారు. రష్యా సైతం తమ 390 మంది సైనికులను అప్పగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. మొత్తం వెయ్యి మంది యుద్ధ ఖైదీలను పరస్పరం మార్చుకునేందుకు 16న తుర్కియేలో ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందులో మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, ఈ వారాంతంలో మరికొందరిని ఇచ్చిపుచ్చుకునే అవకాశాలున్నాయని జెలెన్‌స్కీ వివరించారు. కాగా, తదుపరి చర్చల విషయంలో ఎలాంటి అంగీకారం కుదరలేదని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ పేర్కొంది. ఖైదీల మార్పిడి పూర్తయ్యాక దీర్ఘకాల, సమగ్ర శాంతి ఒప్పందం కోసం రూపొందించిన షరతుల ముసాయిదాను ఉక్రెయిన్‌కు అందజేస్తామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ చెప్పారు.

కీవ్‌పై విరుచుకుపడ్డ రష్యా

యుద్ధ ఖైదీల మార్పిడి ప్రక్రియ ఒక వైపు కొనసాగుతుండగానే రష్యా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై శుక్రవారం రాత్రి పెద్దసంఖ్యలో క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. సైరన్ మోతలు, పేలుళ్ల శబ్దాలతో కీవ్ వాసులు బాంబు షెల్టర్లలో రాత్రంతా గడిపారు. రష్యా ప్రయోగించిన 14 క్షిపణులు, 250 షహీద్ డ్రోన్లనకు గాను 6 క్షిపణులను, 245 డ్రోన్లను కూల్చామని కీవ్ యంత్రాంగం తెలిపింది. రాజధాని ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో ఇందుకు సంబంధించిన ఘటనల్లో 15 మంది వరకు గాయపడ్డారని పేర్కొంది. రాజధానిపై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని వెల్లడించింది. పలు నివాస భవనాలు, అపార్టుమెంట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మంటలు చెలరేగాయని వివరించింది. మే 20–23వ తేదీల మధ్య ఉక్రెయిన్ తమ దేశంపైకి ప్రయోగించిన 788 డ్రోన్లను కూల్చి వేసినట్లు రష్యా తెలపగా, గురువారం రాత్రి సైతం రష్యా తమపైకి 175 షహీద్ డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ ఆరోపించింది.

భర్తల ప్రాణాల కోసం వేడుకోకుండా... ఉగ్రవాదులపై తిరగబడాల్సింది

పహల్గాం ఘటనపై బీజేపీ ఎంపీ వాచాలత

భివానీ: పహల్గాం ఉగ్ర దాడిపై బీజేపీ నేతల నోటిదురుసు తగ్గడం లేదు. మంత్రుల స్థాయి నేతలే మతిలేని వ్యాఖ్యలు చేసి కోర్టులతో మొట్టికాయలు తింటున్నా కనువిప్పు కలగడం లేదు. పహల్గాం దాడిలో మహిళల కళ్లముందే వారి భర్తలను ముష్కరులు కర్కశంగా కాల్చి చంపడం తెలిసిందే. అలా సర్వం కోల్పోయి వితంతువులుగా మిగదిలిన వారినుద్దేశించి హరియాణాకు చెందిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు రాంచందర్ జంగ్రా శనివారం దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. ''భర్తలను చంపొద్దని ఉగ్రవాదులను వేడుకునే బదులు వారిపై తిరగబడాల్సింది. కానీ వారిలో యోధుల స్ఫూర్తి లోపించింది. ఉగ్రవాదులకు చేతులు జోడించారు. పర్యాటకులంతా అగ్నివీర్‌ల వారిని ప్రతిఘటిస్తే ప్రాణనష్టం బాగా తగ్గేది'' అన్నారు. రాణీ అహల్యాబాయి మాదిరిగా మన సోదరీమణుల్లో సాహస స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరముందంటూ హితోక్తులు పలికారు. జంగ్రా వాచాలతపై రాజకీయ దుమారం రేగుతోంది. ఆయన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమంటూ కాంగ్రెస్ నేతలు దీపీందర్‌సింగ్ హుడా, సుప్రియా శ్రీనేత్, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు మండిపడ్డారు.

మైసూర్ పాక్ అనే పిలవండి!

ఆవిష్కర్త మునిమనవడి వినతి

మైసూరు: ప్రముఖ భారతీయ వంటకం 'మైసూర్ పాక్'పేరును మార్చడాన్ని ఆ వంటకం మొట్టమొదటి ఆవిష్కర్త మునిమనవడు నటరాజ్ వ్యతిరేకిస్తున్నారు. ఆ స్వీటుకు అదే సరైన పేరు అంటూ ఆయన నొక్కిచెబుతున్నారు. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ దేశం ఆనవాళ్లను తుడిచేసే క్రమంలో మైసూర్ పాక్‌కు మైసూరు శ్రీ, గోండ్ పాక్‌కు గోండ్ శ్రీ, ఆమ్ పాక్‌కు ఆమ్ శ్రీ అని అని పేర్లు పెడుతూ జైపూర్ స్వీట్‌షాపుల యజమానులు తీసుకున్న నిర్ణయంపై కాకసుర మాదప్ప మునిమనవడు ఎస్.నటరాజ్ స్పందించారు. మాదప్ప మైసూరు రాజవంశీకుల వద్ద వంటవాడిగా పనిచేశారు. మైసూర్ పాక్‌ను తయారు చేసిన ఘనతను ఈయన సొంతం చేసుకున్నారు. 'మైసూర్ పాక్ అనే పిలవండి..ఇదే సంప్రదాయబద్ధమైన సరైన పేరు, మరో పేరు లేదు'అని నటరాజ్ అన్నారు. 'పాక్ అనే మాట కన్నడంలోని పాక(పాకం) నుంచి వచ్చింది. దీనర్థం చక్కెర ద్రావకం, చక్కెర ద్రావకంతో తయారైంది కాబట్టే ఇది మైసూర్ పాక్ అయ్యింది. దీన్ని వేరే పేరుతో పిలవాల్సిన అవసరమే లేదు'అంటూ ఆయన వివరించారు.

రష్యా, జపాన్‌లో ముగిసిన దౌత్య బృందాల పర్యటన

మాస్కో/టోక్యో: పాకిస్తాన్ దాష్టీకాలు, ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న తీరుతో పాటు ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటాన్ని విదేశీ నేతలకు వివరించేందుకు ఏర్పాటైన అఖిలపక్ష బృందాలు రష్యా, జపాన్‌లో తమ పర్యటన పూర్తిచేసుకున్నాయి. శనివారం తిరుగుపయనమయ్యాయి. ఈ బృందాలు ఆయా దేశాల్లో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించాయి. రాజకీయ నేతలు, మీడియా ప్రతినిధులు, సీనియర్ అధికారులు, దౌత్య నిపుణులతో భేటీ అయ్యాయి. పాకిస్తాన్‌పై దౌత్య యుద్ధాన్ని ముందుకు తీసుకెళ్లాయి. ఉగ్రవాదంలో పోరాటంలో భారత్‌కు అండగా ఉంటామని రష్యా, జపాన్ హామీ ఇచ్చాయి. ఇదిలా ఉండగా, భారత్ నుంచి మూడో బృందం బహ్రెయిన్‌కు చేరుకుంది. మొత్తం 33 దేశాలకు అఖిలపక్ష బృందాలను పంపించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

పాక్‌కు రహస్య సమాచారాన్ని చేరవేస్తున్న వ్యక్తి అరెస్ట్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని మిలటరీ సంస్థల కీలక సమాచారాన్ని పాకిస్తాన్ గూఢచార విభాగాలకు చేరవేస్తున్న సరిహద్దుల్లోని కచ్ జిల్లా వాసిని పోలీసులు అరెస్ట్ చేశారు. లఖ్‌పత్ ప్రాంతానికి చెందిన సహదేవసిన్హ్ గోహిల్(28) కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్నాడు. 2023లో ఇతడికి అదితి భరద్వాజ్ పేరుతో పాకిస్తాన్ ఏజెంట్ వాట్సాప్ ద్వారా పరిచయమైంది. తరచూ చాటింగ్ చేస్తూ అతడిని బుట్టలో వేసుకుంది. గోహిల్ తన ఆధార్ కార్డుతో తీసుకున్న రెండు సిమ్‌ల ఓటీపీలను ఆమెకు పంపాడు. దీంతో, ఆమె పాకిస్తాన్ నుంచి ఆ నంబర్లతో వాట్సాప్ చాటింగ్ సాగిస్తోంది. ఆమె కోరిన విధంగా, తనుండే ప్రాంతంలోని బీఎస్ఎఫ్, నేవీల మౌలిక వసతులతోపాటు నిర్మాణంలో ఉన్న వాటికి సంబంధించిన కీలక సమాచారాన్ని, ఫొటోలను పంపాడు. బదులుగా గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇతడికి రూ.40 వేల నగదు అందింది. విషయం పసిగట్టిన గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) ఇటీవల గోహిల్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అదితి భరద్వాజ్ పాకిస్తాన్ గూఢచారి అనే విషయం గోహిల్‌కు తెలుసునని ఏటీఎస్ శనివారం వెల్లడించింది. ఇతడితోపాటు పాక్ ఏజెంట్ అదితి భరద్వాజ్‌పైనా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని తెలిపింది.

సరిహద్దులో పాక్ చొరబాటుదారు కాల్చివేత

గాంధీనగర్: సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించేందుకు యత్నించిన పాకిస్తాన్ వాసిని భద్రతా బలగాలు కాల్చి చంపాయి. శుక్రవారం రాత్రి గుజరాత్‌లోని భారత్–పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లో ఘటన చోటుచేసుకుంది. బనస్కాంత జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దులు దాటి బోర్డర్ ఫెన్సింగ్ వైపుగా వస్తున్న వ్యక్తిని గుర్తించిన బలగాలు ముందుగా హెచ్చరించాయి. లక్ష్యపెట్టక అతడు ముందుకు వస్తుండటంతో కాల్పులు జరిపాయి. అతడు అక్కడికక్కడే చనిపోయినట్లు బీఎస్ఎఫ్ శనివారం వెల్లడించింది.

19 వేల మంది చిన్నారుల్ని చంపేశారు మీరు!

గాజాలో దాడులపై ఇజ్రాయెల్ ఎంపీ వ్యాఖ్యలు

టెల్అవీవ్: గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న దమనకాండను ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా ముస్లిం ఎంపీ ఐమాన్ ఒడెహ్ బహిరంగంగా ఖండించారు. దీంతో, ఆయన్ను పార్లమెంట్‌లోని వేదికపై నుంచి బలవంతంగా దించి బయటకు పంపించారు. 'గాజాపై ఏడాదిన్నరగా మీరు సాగిస్తున్న దాడుల్లో 19 వేల మంది చిన్నారులు, 53 మంది నివాసితులు ప్రాణాలు కోల్పోయారు. వర్సిటీలు, ఆస్పత్రులు నాశనమయ్యాయి. రాజకీయంగా గెలుపు సాధించలేమని భావించి పిచ్చిపట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు'అంటూ నెతన్యాహూ ప్రభుత్వం తీరును ఆయన తీవ్రంగా నిరసించారు. దీంతో, పార్లమెంట్‌లో కలకలం రేగింది. ఆయన ప్రసంగానికి అడ్డు తగిలారు. వేదికపై నుంచి దించేసి బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. అయినప్పటికీ ఆయన మాట్లాడుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి తాజాగా బయటకు వచ్చింది. అరబ్ ఇజ్రాయెలీ లాయర్ అయిన ఐమాన్ ఒడెహ్ హడాష్ రాజకీయ పార్టీ తరఫున ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌కు ఎన్నికయ్యారు.

ఈడీ, మోదీలకు బెదరం: ఉదయనిధి స్టాలిన్

పుదుక్కొట్టై: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలను చూసి డీఎంకే భయపడదని ఆ పార్టీకి చెందిన తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించారు. తమపై పెట్టే కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటామని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రజల హక్కుల కోసం డీఎంకే పోరాటం కొనసాగిస్తుందని, ఎలాంటి బెదిరింపులకయినా భయపడబోదని చెప్పారు. తాత, మాజీ సీఎం కరుణానిధి పెంచి పోషించిన డీఎంకే, హేతువాది పెరియార్ బోధించిన ఆత్మ గౌరవ నినాదానికి కట్టుబడిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. టాస్మాక్‌పై ఈడీ దాడుల నేపథ్యంలో ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లేందుకు సీఎం స్టాలిన్ తొందరపడుతున్నారంటూ ప్రతిపక్ష ఏఐఏడీఎంకే చేసిన వ్యాఖ్యలపై పైవిధంగా స్పందించారు.

సైనిక వితంతువుల సంక్షేమ నిధికి ప్రీతి జింటా రూ.1.10 కోట్ల విరాళం

జైపూర్: క్రికెట్ జట్టు పంజాబ్ కింగ్స్ సహ యజమాని, సినీ నటి ప్రీతీ జింటా సైనిక వితంతువుల సంక్షేమ నిధి(ఏడబ్ల్యూడబ్ల్యూఏ)కి రూ.1.10 కోట్ల విరాళం ప్రకటించారు. పంజాబ్ కింగ్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)నిధిలోని జింటా వాటా నుంచి ఈ విరాళాన్ని ఆమె ప్రకటించారు. ఈ మొత్తాన్ని సౌత్ వెస్టర్న్ కమాండ్ ఆర్మీ విభాగంలోని వీర నారీమణుల సాధికారితకు, వారి పిల్లల చదువుల కోసం వెచ్చించనున్నారు. శనివారం జైపూర్‌లో జరిగిన ఏడబ్ల్యూడబ్ల్యూఏ సమావేశంలో ప్రీతీ జింటా ఈ విరాళాన్ని ప్రకటించారు. 'సాయుధ బలగాల కుటుంబాలకు సాయంగా నిలవడం మన బాధ్యత. మన సైనికులు చేసిన త్యాగాలకు తగు మూల్యం ఎప్పటికీ తిరిగి చెల్లించలేం. కానీ, మనం వారి కుటుంబాలకు అండగా ఉండి ముందుకు సాగడానికి మద్దతునిద్దాం'అని ఆమె పేర్కొన్నారు.

వైద్యురాలి 9 మంది సంతానం సహా ఇజ్రాయెల్ దాడుల్లో 79 మృతి

కైరో: ఇజ్రాయెల్ ఆర్మీ కొనసాగిస్తున్న వైమానిక దాడుల్లో 24 గంటల వ్యవధిలో దక్షిణ గాజాలో 79 మంది చనిపోయారు. మృతుల్లో నాస్సెర్ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్య నిపుణుడు అలా నజ్జార్ 10 సంతానంలోని 9 మంది ఉన్నారు. ఆ సమయంలో ఆమె విధుల్లో ఉన్నారని పేర్కొంది. కంగారు పడుతూ అక్కడికి పరుగెత్తగా అప్పటికే ఆమె నివాసం మంటల్లో చిక్కుకుందని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. నజ్జార్ భర్త తీవ్రంగా గాయపడగా, ప్రాణాలతో బయటపడిన 11 ఏళ్ల కుమారుడి పరిస్థితి విషమంగా ఉందని వివరించింది. మృత్యువాతపడిన ఆమె సంతానంలో ఏడు నెలల నుంచి 12 ఏళ్ల వయస్సు వరకు ఉన్నారని తెలిపింది. శిథిలాల్లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారుల మృతదేహాలను వెలికితీయడం వీలు కావడం లేదని ఆరోగ్య శాఖ తెలిపింది. ఉత్తర గాజాను ఇజ్రాయెల్ ఆర్మీ పూర్తిగా దిగ్బంధించడంతో అక్కడి పరిస్థితులేవీ బయటకు తెలీడం లేదని వివరించాయి.

'గాథాసప్తశతి' గ్రంథ రచయిత ఎవరు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

శాతవాహన యుగం

1. కొంతమంది చరిత్రకారులు శాతవాహనుల తొలి రాజధాని 'ధాన్యకటకం' కాదని తేల్చారు. అయితే వారి తొలి రాజధాని ఏది?
   1) కొండాపురం 2) రాచకొండ
   3) ఏలేశ్వరం 4) కోటిలింగాల
2. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) డాక్టర్ సుక్తాంకర్
   4) డాక్టర్ కె.గోపాలాచారి
3. శాతవాహనులు విదర్భ ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) కె.పి.జయస్వాల్ 4) డాక్టర్ సుక్తాంకర్
4. శాతవాహనుల తొలి ప్రాంతం మహారాష్ట్ర అని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) సుక్తాంకర్
   3) పి.టి.శ్రీనివాస్ 4) కె.పి.జయస్వాల్
5. శాతవాహనుల మూలస్థానం పైఠాన్ ప్రాంత మని పేర్కొన్నవారు?
   1) డాక్టర్ కె.గోపాలాచారి
   2) కె.వి.జయస్వాల్
   3) వి.వి.మిరాసి 4) డాక్టర్ సుక్తాంకర్
6. కరీంనగర్ జిల్లాలో మహానగర శిథిలాలు బయల్పడిన ప్రాంతం ఏది?
   1) కోటిలింగాల 2) కదంబపూర్
   3) తొగర్రాయి 4) పెద్దబంకూర్
7. నాణేలపై కనిపిస్తున్న తొలి శాతవాహన రాజు ఎవరు?
   1) శ్రీముఖుడు 2) నారన
   3) గోబద 4) సమగోపుడు
8. శాతవాహన వంశ స్థాపకుడు, మొదటి పాలకుడు ఎవరు?
   1) మొదటి శాతకర్ణి 2) కన్హుడు
   3) రెండో శాతకర్ణి 4) శ్రీముఖుడు
9. శ్రీముఖుడి పాలనా కాలం?
   1) క్రీ.పూ. 231-200
   2) క్రీ.పూ. 231-208
   3) క్రీ.పూ. 231-205
   4) క్రీ.పూ. 225-200
10. శ్రీముఖుడు మొదట అవలంబించిన మతం?
    1) జైనం 2) వైదికం
    3) బౌద్ధం 4) శైవం
11. పుష్యమిత్ర శుంగుడు ఉత్తర భారతదేశంలో మౌర్యవంశాన్ని నిర్మూలించి మగధలో క్రీ.పూ. 187లో శుంగవంశాన్ని స్థాపించే సమయంలో పాలన కొనసాగిస్తున్న శాతవాహన రాజు?
    1) శ్రీముఖుడు 2) కన్హుడు
    3) మొదటి శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
12. రాప్సన్, బారువా అనే చరిత్రకారులు ఏ నదిని 'కణ్ణబెణ్ణా'గా పేర్కొన్నారు?
    1) గంగా 2) గోదావరి
    3) కృష్ణా 4) వైన్ గంగా
13. శ్రీముఖుడి తర్వాత రాజ్యాధికారానికి వచ్చిన పాలకుడు?
    1) కన్హుడు 2) పులోమావి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) మొదటి శాతకర్ణి
14. నానాఘాట్ శాసనాన్ని వేయించిందెవరు?
    1) దేవీ నాగానిక 2) గౌతమీ బాలాశ్రీ
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) రెండో శాతకర్ణి
15. రెండో శాతకర్ణి మగధ, కళింగ ప్రాంతాలను కూడా ఆక్రమించి పాలన సాగించాడని ఏ పురాణంలో పేర్కొన్నారు?
    1) మత్స్య 2) గరుడ
    3) వరాహ 4) యుగ పురాణం
16. ఏ పాలకుడి కాలంలో శక, యవన, కళింగ, పహ్లవాదులు శాతవాహనుల రాజ్య భాగాలను ఆక్రమించారు?
    1) స్వాతికర్ణ 2) లంబోదరుడు
    3) అపీలకుడు 4) మేఘస్వాతి
17. 'బృహత్కథ', 'వాత్స్యాయన కామసూత్ర', 'కావ్య మీమాంస'లో ఏ పాలకుడికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది?
    1) శ్రీముఖుడు 2) మొదటి శాతకర్ణి
    3) కుంతల శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
18. శర్వవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) కుంతల శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) హాలుడు
    4) మొదటి పులోమావి
19. శాతవాహనుల్లో 15వ రాజు?
    1) హాలుడు
    2) మొదటి పులోమావి
    3) గౌరకృష్ణ 4) రెండో శాతకర్ణి
20. 'గాథాసప్తశతి' గ్రంథ రచయిత ఎవరు?
    1) హాలుడు 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) మొదటి పులోమావి
    4) గౌతమీపుత్ర శాతకర్ణి
21. 'త్రి సముద్ర తోయ పీతవాహన' అనేది ఎవరి బిరుదు?
    1) మొదటి పులోమావి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) యజ్ఞశ్రీ శాతకర్ణి 4) మొదటి శాతకర్ణి
22. ఏ పాలకుడి కాలంలో తెలుగు ప్రాంతమంతా శాతవాహనుల ఆధీనంలోకి వచ్చింది?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) మొదటి పులోమావి 4) హాలుడు
23. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలన్నింటినీ కలిపి పాలించిన చివరి శాతవాహన చక్రవర్తి ఎవరు?
    1) రెండో శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) శివశ్రీ 4) రెండో పులోమావి
24. శాతవాహన వంశానికి చెందిన చివరి పాలకులు రాజ్యాన్ని పంచుకొని పాలించారని కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతం ఎవరి పాలనలో ఉందని వారు పేర్కొన్నారు?
    1) కౌశికీ పుత్ర శాతకర్ణి
    2) నాలుగో పులోమావి
    3) విజయశ్రీ 4) చంద్రశ్రీ
25. 'ధాన్యకటకం'ను రాజధానిగా చేసుకొని పాలించిన రాజు?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) నాలుగో పులోమావి 4) హాలుడు
26. శాతవాహనుల్లో చివరి పాలకుడెవరు?
    1) విజయశ్రీ 2) చంద్రశ్రీ
    3) శివశ్రీ 4) నాలుగో పులోమావి
27. నాలుగో పులోమావిని ఓడించే నాటికి శ్రీశాంతమూలుడు ఎక్కడ బలవంతమైన నాయకుడిగా ఉన్నాడు?
    1) విదర్భ 2) విజయపురి
    3) మహారాష్ట్ర 4) కళింగ
28. శాతవాహన పాలకుల వరసక్రమం?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి, రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి, హాలుడు, యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
    4) హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
29. శాతవాహనుల కాలంలో ద్రవ్యపరమైన ఆదాయాన్ని భద్రపరిచే వ్యక్తిని ఏమని పిలిచేవారు?
    1) మహామాత్రులు 2) హిరణ్యకుడు
    3) మహాసేనాపతి 4) నిబంధకారుడు
30. శాతవాహనుల కాలంలో రాజాజ్ఞలు, రాజ్య వ్యవహారాలను పత్రాల్లో రాసి భద్రపరిచే వ్యక్తి?
    1) నిబంధకారుడు 2) లేఖకుడు
    3) హిరణ్యకుడు 4) అమాత్యుడు
31. నిబంధకారులకు మరో పేరు?
    1) అమాత్యులు 2) మహామాత్రులు
    3) అక్షపటకులు 4) భాండాగారికులు
32. కరీంనగర్ జిల్లాలోని మునులగుట్ట అనేది?
    1) వైదిక స్థావరం 2) విద్యా కేంద్రం
    3) బౌద్ధ స్థావరం 4) జైన స్థావరం
33. శాతవాహన కాలంలో 'కులపెద్దలను' ఏ పేరుతో పిలిచేవారు?
    1) గ్రామణి 2) నిబంధకారులు
    3) అక్షపటకులు 4) గహపతులు
34. శాతవాహనుల కాలంలో పంటలో ఎన్నో వంతును భూమిశిస్తుగా వసూలు చేసేవారు?
    1) 6 2) 5 3) 4 4) 3
35. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'స్కంధావారం' అనే పదానికి అర్థం?
    1) మిలటరీ క్యాంప్ 2) కంటోన్మెంట్
    3) రక్షణదుర్గం 4) రాజకోట
36. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'కటకం' అనే పదానికి అర్థం?
    1) సైనిక శిబిరం 2) రక్షణ దుర్గం
    3) రాజకోట 4) సైన్యాగారం
37. ఖారవేలుడు ఏ నగరాన్ని గాడిదలతో తొక్కించి నేలమట్టం చేశాడు?
    1) వినుకొండ 2) పిథుండ
    3) హన్మకొండ 4) ఓరుగల్లు
38. శాతవాహన కాలంనాటి చేతివృత్తిదారులైన 'సాలెవారు' అంటే?
    1) వధకులు 2) కాసకారులు
    3) కోలికులు 4) తిలపిష్టకులు
39. శాతవాహనుల కాలంలో 'గధికులు' అనే చేతివృత్తి వారు చేసే పని?
    1) మెరుగు పెట్టడం
    2) కుండల తయారీ
    3) కంచు పని
    4) సుగంధ ద్రవ్యాల తయారీ
40. శాతవాహనుల కాలంలో వృత్తిపనివారు చెల్లించే పన్ను పేరేమిటి?
    1) కరుకర 2) శ్రేణి
    3) శ్రేష్ఠి 4) కాలిక
41. శాతవాహనుల కాలంలో 'సేలవధకులు'గా ఎవరిని పేర్కొనేవారు?
    1) కవులు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
42. శాతవాహనుల కాలంలో 'పసకరులు' అంటే ఎవరు?
    1) కంచు పనివారు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
43. కులాలు వేటి నుంచి ఆవిర్భవించాయి?
    1) వృత్తి సంఘాలు 2) ధర్మాలు
    3) స్మృతులు 4) వర్తక సంఘాలు
44. శాతవాహనుల కాలం నాటి ప్రజల ప్రధాన ప్రయాణ సాధనం?
    1) గుర్రం బండి 2) ఎడ్ల బండి
    3) కుక్కల బండి 4) ఒంటె బండి
45. శాతవాహనుల కాలంలో విదేశాలతో వర్తకం చేసేవారిని ఏమని పిలిచేవారు?
    1) శ్రేణులు 2) నిగమాలు
    3) సార్థవాహులు 4) బిడారులు
46. శాతవాహనుల 'నాణేల'పై ప్రధానంగా కనిపించేది?
    1) ఓడముద్ర 2) చాపముద్ర
    3) వృషభం 4) సింహం
47. శాతవాహనుల 'టంకసాల' నగరం ఏది?
    1) కొండాపురం 2) పెదబంకూరు
    3) ధూళికట్ట 4) హన్మకొండ
48. శాతవాహనులతో ఎక్కువగా వర్తక వ్యాపారం నిర్వహించిన విదేశీయులు?
    1) అరేబియన్లు 2) పర్షియన్లు
    3) గ్రీకులు 4) రోమన్లు
49. శాతవాహనులు సముద్ర తీరంతోపాటు ఏ నదుల ద్వారా కూడా విదేశీ వ్యాపారం నిర్వహించేవారు?
    1) కృష్ణా, గోదావరి 2) మూసీ, గోదావరి
    3) మూసీ, కృష్ణా 4) గంగా-గోదావరి
50. 'గౌతమీ బాలశ్రీ' ఎవరి తల్లి?
    1) మొదటి శాతకర్ణి 2) రెండో శాతకర్ణి
    3) శ్రీముఖుడు 4) గౌతమీపుత్ర శాతకర్ణి
51. శాతవాహనుల కాలంలో అధికంగా చెలామణిలో ఉన్న లోహం ఏది?
    1) వెండి 2) బంగారం
    3) రాగి 4) కంచు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 3; 5) 1; 6) 2; 7) 3; 8) 4; 9) 2; 10) 1; 11) 3; 12) 4; 13) 1; 14) 1; 15) 4; 16) 2; 17) 3; 18) 1; 19) 4; 20) 1; 21) 2; 22) 1; 23) 2; 24) 1; 25) 2; 26) 4; 27) 2; 28) 4; 29) 2; 30) 1; 31) 3; 32) 4; 33) 4; 34) 1; 35) 1; 36) 4; 37) 2; 38) 3; 39) 4; 40) 1; 41) 3; 42) 4; 43) 1; 44) 2; 45) 3; 46) 1; 47) 1; 48) 4; 49) 2; 50) 4; 51) 1.

భూకంపాల రాకను మొదటగా గుర్తించే జీవి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

ధ్వని

ప్రకంపన స్థితిలో ఉన్న వస్తువు నుంచి వెలువడే శబ్దాన్ని 'ధ్వని' అంటారు. ధ్వని గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'అకౌస్టిక్స్' అంటారు.

ధ్వని ప్రసారానికి..

1) కంపించే గుణం ఉన్న కణాలు
2) స్థితిస్థాపకత, జడత్వ స్వభావం ఉన్న యానకం అవసరం.

ధ్వని ప్రసారం జరిగే పదార్థాలు: ఇనుము, రాగి, అల్యూమినియం, ఉక్కు మొదలైనవి.

ధ్వని ప్రసారం జరగని పదార్థాలు: రబ్బర్, పాట్టు, దూది, దుస్తులు మొదలైనవి.

యానకం: శక్తి స్వరూపం ప్రయాణించడానికి వీలైన భౌతిక అంశాన్ని యానకం అంటారు.

- రాబర్ట్ బాయిల్ శూన్యంలో ధ్వని ప్రయాణించదని గంటజాడీ ప్రయోగం ద్వారా వివరించాడు. ఇతడిని రసాయన శాస్త్ర పితామహుడిగా పేర్కొంటారు.
- చంద్రుడిపై వాతావరణం లేనందువల్ల అక్కడ ధ్వని వేగం శూన్యం.
- చంద్రుడి శాస్త్రీయనామం సెలిని. చంద్రుడి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని సెలినాలజీ అంటారు.

పౌనఃపున్యం: ఒక సెకన్ కాలంలో చేసే కంపనాల సంఖ్యను 'పౌనఃపున్యం' అంటారు.

పౌనఃపున్యం = [illegible]

ప్రమాణాలు: sec^{-1}, cycle/sec, Hz.

- పౌనఃపున్యం ఆధారంగా ధ్వనులు 3 రకాలు. **అవి:** 1) పరశ్రావ్యాలు, 2) శ్రవ్య అవధి ధ్వనులు, 3) అతిధ్వనులు

పరశ్రావ్యాలు: 20 Hz కంటే తక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వనులను పరశ్రావ్యాలు అంటారు. ఈ ధ్వనులను వినగలిగే జీవులు పాము, తిమింగలం.

- ఖడ్గమృగాలు 5 Hz పౌనఃపున్యం ఉన్న ధ్వనులను విడుదల చేస్తూ భావ వ్యక్తీకరణ చేసుకుంటాయి.
- భూకంపాల రాకను మొదటగా పసిగట్టే జీవి పాము.
- భూకంపాలను అంచనా వేసే పరికరాలు - భూకంపలేఖిని, భూకంపదర్శిని.
- భూకంపలేఖినిని ఉపయోగించి సెస్మిక్ తరంగాలను కొలుస్తారు.

సెస్మిక్ తరంగాలు: భూ అంతర్భాగంలోని కదలికలు భూ ఉపరితలంపై తరంగాలను విడుదల చేస్తాయి. వీటినే సెస్మిక్ తరంగాలు అంటారు.

- భూకంప తీవ్రతను కొలిచే పరికరాలు - రిక్టర్ స్కేలు, భ్రామక పరిమాణ స్కేలు.
- భూకంపాలు సంభవించే ప్రాంతాల్లో మట్టి, కలప వినియోగించి నిర్మాణాలు చేయాలి.
- తెలంగాణ రాష్ట్రంలో భూకంపం సంభవించే ప్రమాదం ఉన్న ప్రాంతం - హైదరాబాద్.

శ్రవ్య అవధి: 20 Hz - 20,000 Hz (20 KHz) పౌనఃపున్యం ఉన్న ధ్వనులను శ్రవ్య అవధి (లేదా) శ్రావ్యాలు అంటారు. మానవుడు వినగలిగే ధ్వనులు ఇవే.

- చిన్నపిల్లలు వినగలిగే శ్రవ్య అవధి - 30,000 Hz.
- వృద్ధులు వినగలిగే ధ్వని అవధి 10 KHz - 12 KHz.
- చెవి వెలుపలి భాగమైన 'పిన్నా' ధ్వని కంపనాలను గ్రహిస్తుంది. ఈ కంపనాలు చెవిలోపలి కర్ణభేరికి తాకి కంపింపజేసినప్పుడు మనం ధ్వనిని వినగలుగుతాం.
- మానవ శరీరంలో అతిచిన్న ఎముక 'స్టెపిస్', అతిపెద్ద ఎముక ఫీమర్ (తొడ ఎముక).

అతిధ్వనులు: 20,000 Hz కంటే ఎక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వనులను 'అతిధ్వనులు' అంటారు. ఈ ధ్వనులను వినగలిగే జీవులు - కుక్క, గబ్బిలం, ఏనుగు.

- కుక్క వినగలిగే ధ్వని పౌనఃపున్య అవధి - 50,000 Hz (50 KHz).
- గబ్బిలం వినగలిగే ధ్వని పౌనఃపున్య అవధి 1,00,000 Hz.

అతిధ్వనుల అనువర్తనాలు:

1. పాలు, నీటిలోని బ్యాక్టీరియాను నశింపజేయడానికి ఉపయోగిస్తారు. పాలను 62°C నుంచి 67°C వరకు వేడిచేసి బ్యాక్టీరియాను నశింపజేస్తారు.
   → పాల స్వచ్ఛతను కొలవడానికి ఉపయోగించే పరికరం 'లాక్టోమీటర్'.
   → పాలలో రైబోఫ్లోవిన్ ఉండటం వల్ల పసుపు వర్ణంలో కనిపిస్తాయి.
2. సముద్రాల లోతును కొలవడానికి ఉపయోగించే సోనార్ పరికరం అతిధ్వనుల ఆధారంగా పనిచేస్తుంది. సోనార్‌ను కనుగొన్న శాస్త్రవేత్త - నిక్సన్.
   SONAR → Sound Navigation and Ranging
3. సోల్డరింగ్ (Pb + Sn), వెల్డింగ్‌లలో; చేపలను ఆకర్షించడానికి, దోమలను పారదోలడానికి అతిధ్వనులను వాడతారు.
4. స్కానింగ్ ప్రక్రియలోనూ అతిధ్వనులను ఉపయోగిస్తారు. శరీర భాగాలను స్కానింగ్ చేయడాన్ని 'సోనోగ్రఫీ' అంటారు.
5. విరిగిన దంతాలను తొలగించడం, కీళ్ల నొప్పుల నివారణ, కిడ్నీలోని రాళ్లను కరిగించడంలోనూ వీటిని వినియోగిస్తారు.
   కిడ్నీలోని రాళ్ల రసాయన నామాలు..
   1. కాల్షియం ఆగ్జలేట్ స్ఫటికాలు
   2. కాల్షియం ఫాస్ఫేట్ స్ఫటికాలు
6. వస్తువులను కావాల్సిన ఆకారాల్లో కోయడం, రంధ్రాలు చేయడంలో అతిధ్వనులు ఉపయోగిస్తారు.
7. వస్తువులను శుభ్రపరచడానికి, కంటిలోని శుక్లాలను తొలగించడానికి వీటిని వినియోగిస్తారు.

తరంగాలు-రకాలు

ప్రసార స్వభావం ఆధారంగా తరంగాలు రెండు రకాలు.

1. **యాంత్రిక తరంగాలు:** యానక ప్రమేయం ఆధారంగా ప్రయాణించే తరంగాలను 'యాంత్రిక తరంగాలు' అంటారు.
   ఉదా: ధ్వని తరంగాలు.
2. **విద్యుత్ అయస్కాంత తరంగాలు:** యానక ప్రమేయం లేకుండానే ప్రయాణించే తరంగాలను 'విద్యుత్ అయస్కాంత తరంగాలు' అంటారు.
   ఉదా: కాంతి తరంగాలు, రేడియో తరంగాలు, మైక్రో తరంగాలు.

యాంత్రిక తరంగాలు ప్రధానంగా రెండు రకాలు.

1. **పురోగామి తరంగాలు:** అలజడి ప్రారంభమైన బిందువు నుంచి తరంగాలు ముందు దిశల్లో చలిస్తూ మళ్లీ వెనక్కి రాని తరంగాలను 'పురోగామి తరంగాలు' అంటారు.
   ఉదా: ఒక తాడు చివరను పట్టుకొని లాగి వదిలినప్పుడు ఏర్పడే తరంగాలు, నిశ్చల స్థితిలో ఉన్న నీటిలో రాయిని వేసినప్పుడు ప్రయాణించే తరంగాలు.

పురోగామి తరంగాలు రెండు రకాలు. **అవి:**

ఎ) **అనుదైర్ఘ్య తరంగాలు:** యానకంలోని కణాలు తరంగ ప్రసార దిశకు సమాంతరంగా కంపిస్తూ ఉంటే వాటిని 'అనుదైర్ఘ్య తరంగాలు' అంటారు.
ఉదా: వాయు పదార్థాల్లో ధ్వని తరంగాలు, స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు.
వీటిలో i) సంపీడనం,
ii) విరళీకరణం ఉంటాయి.

- కణాల సాంద్రత గరిష్ఠంగా ఉండే బిందువును 'సంపీడనం' అంటారు. రెండు వరుస సంపీడనాల మధ్య దూరం λ.
- కణాల సాంద్రత కనిష్ఠంగా ఉండే బిందువును 'విరళీకరణం' అంటారు. రెండు వరుస విరళీకరణాల మధ్య దూరం λ.

బి) **తిర్యక్ తరంగాలు:** యానకంలోని కణాలు తరంగ ప్రసార దిశకు లంబంగా కంపిస్తూ ఉంటే వాటిని 'తిర్యక్ తరంగాలు' అంటారు.
ఉదా: కాంతి తరంగాలు, ద్రవ పదార్థాల్లో ఏర్పడే తరంగాలు.
తిర్యక్ తరంగాల్లో శృంగాలు, ద్రోణులు ఏర్పడతాయి.

- తరంగ ప్రసార దిశకు పైభాగాన ఏర్పడే బిందువును 'శృంగం' అంటారు. రెండు వరుస శృంగాల మధ్యదూరం λ.
- తరంగ ప్రసార దిశకు దిగువన ఏర్పడే బిందువును 'ద్రోణి' అంటారు. రెండు వరుస ద్రోణుల మధ్యదూరం λ.

2. **స్థిర తరంగాలు:** రెండు స్థిర బిందువుల మధ్య బంధించిన తరంగాలను స్థిరతరంగాలు అంటారు.

ఉదా: మూసి ఉన్న గొట్టాల్లో ఏర్పడే తరంగాలు.

స్థిర తరంగాల లక్షణాలు:

i) ఒకే కంపన పరిమితి,
ii) ఒకే తరంగదైర్ఘ్యం,
iii) ఒకే పౌనఃపున్యం కలిగి ఉంటాయి.

- స్థిర తరంగాల్లో అస్పందన, ప్రస్పందన స్థానాలు ఉంటాయి.
- అత్యల్ప స్థానభ్రంశం ఉన్న బిందువును 'అస్పందన స్థానం', గరిష్ఠ స్థానభ్రంశం ఉన్న బిందువును 'ప్రస్పందన స్థానం' అంటారు.
- రెండు వరస అస్పందన లేదా ప్రస్పందన బిందువుల మధ్య దూరం = $\frac{\lambda}{2}$.
- అస్పందన, ప్రస్పందన బిందువుల మధ్య దూరం = $\frac{\lambda}{4}$.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అకౌస్టిక్స్ అనేది దేనికి సంబంధించిన అధ్యయనం?
   ఎ) ఉష్ణం
   బి) అంతరిక్ష ప్రయాణం
   సి) ధ్వని డి) కాంతి
2. కిందివాటిలో ధ్వని అతి నెమ్మదిగా దేనిలో ప్రయాణిస్తుంది?
   ఎ) గాలి బి) గాజు
   సి) నీరు డి) చెక్క
3. రెండు క్రమానుసార బిందువుల మధ్య దూరం ఒకే దిశలో ఉంటే అది దేన్ని సూచిస్తుంది?
   ఎ) తరంగదైర్ఘ్యం బి) కంపన పరిమితి
   సి) కాంతి తీవ్రత డి) పౌనఃపున్యం
4. ధ్వని దేని ద్వారా ప్రయాణించదు?
   ఎ) శూన్యం బి) ఉదజని
   సి) నీరు డి) ఉక్కు
5. సముద్రం లోతును కొలిచే పరికరం ఏది?
   ఎ) రాడార్ బి) సోనార్
   సి) లేజర్ డి) పైవేవీకావు
6. మహాసముద్రాల లోతులు కొలవడానికి వేటిని ఉపయోగిస్తారు?
   ఎ) ఆల్ట్రాసోనిక్ కిరణాలు
   బి) పరశ్రావ్యాలు
   సి) ఆల్ట్రాసోనిక్ ధ్వనులు
   డి) హైడ్రో కెమెరా
7. కిందివాటిలో దేనిలో ధ్వని వేగంగా ప్రయాణిస్తుంది?
   ఎ) గాలి బి) నీరు
   సి) ఉక్కు డి) శూన్యం
8. చంద్రునిపై ధ్వని లేకపోవడానికి కారణం?
   ఎ) వాతావరణం లేకపోవడం
   బి) కాంతి లేకపోవడం
   సి) స్వయం ప్రకాశం కానందువల్ల
   డి) పైవన్నీ
9. నీటి ఉపరితలంపై ఏర్పడే అలలు ఏ రకమైనవి?
   ఎ) తిర్యక్ తరంగాలు
   బి) దైర్ఘ్య తరంగాలు
   సి) స్థిర తరంగాలు
   డి) పురోగామి తరంగాలు
10. గబ్బిలాలు రాత్రివేళలో వేటి సహాయంతో సంచరిస్తాయి?
    ఎ) పరారుణ కిరణాలు
    బి) అతిధ్వని తరంగాలు
    సి) అతినీలలోహిత కిరణాలు
    డి) పైవేవీకావు
11. భూకంప తీవ్రతను కొలిచే సాధనాన్ని ఏమంటారు?
    ఎ) టోక్యోమీటరు
    బి) స్టీరియోస్కోప్
    సి) ఎపిటియోస్కోప్
    డి) సిస్మోగ్రాఫ్
12. ధ్వని కిరణాలు వేటికి ఉదాహరణ?
    ఎ) అనుదైర్ఘ్య తరంగాలు
    బి) తిర్యక్ తరంగాలు
    సి) విద్యుత్ తరంగాలు
    డి) స్థిర తరంగాలు
13. ధ్వనివేగం ఏ పదార్థాల్లో అధికం?
    ఎ) ద్రవ బి) ఘన
    సి) వాయు డి) పైవన్నీ

సమాధానాలు

1) సి; 2) డి; 3) ఎ; 4) ఎ; 5) బి; 6) సి; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) బి; 11) డి; 12) ఎ; 13) బి.

విద్య, ఉద్యోగ సమాచారం

సీబీఐలో లా ఇంటర్న్‌షిప్

ఘజియాబాద్‌లోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) లా ఇంటర్న్‌షిప్ స్కీమ్-2025 కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతోంది. ఎంపికైన వారికి ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, లక్నోల్లో అవకాశం కల్పిస్తారు.

» **మొత్తం ఖాళీలు:** 30
» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు చివరి సెమిస్టర్ రాస్తున్న వారు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సులో చివరి సెమిస్టర్ విద్యార్థులు అర్హులు.
» **ఇంటర్న్‌షిప్ వ్యవధి:** 3 నుంచి ఆరు నెలలు
» **స్టైఫండ్:** సీబీఐ ఎలాంటి స్టైఫండ్ చెల్లించదు. అభ్యర్థే వసతి, ప్రయాణ ఖర్చులను భరించాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో చేసుకోవాలి
» **దరఖాస్తు చివరి తేది:** 30.05.2025
» **వెబ్‌సైట్:** https://cbi.gov.in/vacancies

బెల్, పుణెలో మెడికల్ ఆఫీసర్ పోస్టులు

పుణెలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.05.2025నాటికి 30ఏళ్లు ఉండాలి
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 1,40,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.06.2025
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ఇర్కాన్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.05.2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 1,40,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జేజీఎం, హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ-110 017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 24.05.2025.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.06.2025.
» **వెబ్‌సైట్:** https://ircon.org

సాక్షి ప్లస్
ఆదివారం | 25-5-2025

‘వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా’ ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ వైవిధ్యం

భూమిపై ఉన్న విభిన్న జీవ జాతుల సముదాయాన్నే ‘జీవ వైవిధ్యం’గా పేర్కొనవచ్చు. ఇది మానవుడికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ భూమిపై మనుగడ సాగించడానికి తోడ్పడుతోంది. ఆహార, శక్తి వనరులు, ఔషధాలు, కలప, నార, పీచు రూపంలో మొక్కలు మానవుడికి ఉపయోగపడుతున్నాయి. జంతువులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయి.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న జీవ వైవిధ్యానికి ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న చర్యల వల్ల నష్టం వాటిల్లుతోంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా దీనికి తీవ్ర స్థాయిలో ముప్పు పొంచి ఉన్నట్లు యూఎన్‌ఈపీ (United Nations Environment Programme) ఇటీవల ప్రకటించింది. గత శతాబ్దకాలంలో అనేక వన్య జీవులు కనుమరుగైన నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో పర్యావరణ అంశాల ప్రాధాన్యం పెంచారు. అందువల్ల అభ్యర్థులు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలి.

జీవ వైవిధ్యం - నేపథ్యం

జీవ సంబంధ వైవిధ్యం (Biological Diversity) అనే పదాన్ని మొదట రేమండ్ ఎఫ్. డాస్‌మన్ అనే పరిరక్షణవేత్త 1968లో "A Different Kind of Country" పుస్తకంలో ఉపయోగించాడు. 1985లో వాల్టర్ జి. రోజెన్ అనే శాస్త్రవేత్త ‘జీవ వైవిధ్యం’(Bio diversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించాడు.

జీవులతో ముడిపడి ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను జీవ సంబంధ వైవిధ్యంగా పేర్కొంటారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ (IUCN) ప్రకారం .. ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జన్యువులు, జాతులు, జీవావరణ వ్యవస్థల సముదాయమే జీవ వైవిధ్యం. ప్రకృతిలో ఇది సహజంగా ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణ భావన 1980 నుంచి బలపడింది. అడవులను సంరక్షించడంలో భాగంగా.. అక్కడ ఉండే అన్ని రకాల జీవులు, వాటి తెగలు, వాటిలోని విభిన్న జన్యువులు, జీవులు మధ్య ఉన్న సంబంధాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచించారు.

జీవ వైవిధ్యం - వివిధ స్థాయిలు

1. జన్యు వైవిధ్యం (Genetic Diversity): ఒక జాతి జీవుల్లో ఉండే విభిన్న జన్యువుల సముదాయమే జన్యు వైవిధ్యం.
   ఉదా: మనుషుల్లో వివిధ తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, నిగ్రాయిడ్); మానవుడిలో విభిన్న రక్త గ్రూపులు.



2. జాతి వైవిధ్యం (Species Diversity): ఒక నిర్దిష్ట ప్రాంతంలోని విభిన్న జాతులకు చెందిన జీవుల సముదాయాన్ని ‘జాతి వైవిధ్యం’గా పేర్కొంటారు. దీని ఆధారంగా ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న 17 మెగా బయోడైవర్సిటీ దేశాలను గుర్తించారు. ఈ రకమైన వైవిధ్యం జీవుల వర్గీకరణలో ఉపయోగపడుతుంది.
3. ఆవరణ వ్యవస్థ వైవిధ్యం (Ecosystem Diversity): విభిన్న రకాల భూచర, జలచర ఆవరణ వ్యవస్థల సముదాయాన్ని ‘ఆవరణ వ్యవస్థ వైవిధ్యం’ అంటారు.

పైన పేర్కొన్నవాటితో పాటు మైక్రోబియల్ డైవర్సిటీ, అగ్రి బయోడైవర్సిటీ లాంటి విభిన్న స్థాయి జీవ వైవిధ్యం కూడా ఉంటుంది. రాబర్ట్ విట్టేకర్ అనే శాస్త్రవేత్త జీవ వైవిధ్యాన్ని 3 రకాలుగా విభజించాడు.

1. α - జీవ వైవిధ్యం: దీన్ని Species Richness అంటారు. ఒక ఆవరణ వ్యవస్థలోని జాతి వైవిధ్యాన్ని ఇది తెలుపుతుంది.
2. β - వైవిధ్యం: రెండు భిన్న ఆవరణ వ్యవస్థల్లో జాతి వైవిధ్యంలోని భేదాన్ని ఇది తులనాత్మకంగా తెలుపుతుంది.
3. γ - వైవిధ్యం: ఒక విశాల భౌగోళిక ప్రాంతంలోని విభిన్న జీవ సమాజాల్లో మొత్తం వైవిధ్యాన్ని ‘గామా వైవిధ్యం’గా పేర్కొంటారు.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

మెక్సికో 2002లో ప్రపంచవ్యాప్తంగా అధిక జీవ వైవిధ్యం, సంప్రదాయ విజ్ఞానానికి నిలయంగా ఉన్న దేశాలను (Like-minded Mega Diverse Countries) గుర్తించింది. Conservation International గుర్తించిన 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితా..

1. ఆస్ట్రేలియా 2. బ్రెజిల్
3. చైనా 4. కొలంబియా
5. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో
6. ఇక్వెడార్ 7. ఇండియా
8. ఇండోనేషియా 9. మడగాస్కర్
10. మలేషియా 11. మెక్సికో
12. పపువ న్యూగినియా
13. పెరూ 14. ఫిలిప్పీన్స్
15. దక్షిణాఫ్రికా
16. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
17. వెనిజులా

ఈ జాబితాలో పేర్కొన్న మొదటి దేశంలో అత్యధిక జీవ వైవిధ్యం, చివరి దేశంలో తక్కువ జీవ వైవిధ్యం ఉంటుంది.

జీవ వైవిధ్య హాట్ స్పాట్స్

అధిక జీవ వైవిధ్యానికి నిలయంగా ఉండి ముప్పు పొంచి ఉన్న జీవ భౌగోళిక ప్రాంతాలను ‘బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్’గా పేర్కొంటారు. నార్మన్ మేయర్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త ఈ భావనను మొదటిసారిగా ప్రతిపాదించాడు. 1985-90లో ఈయన ప్రచురించిన "The Environment" అనే ఆర్టికల్‌లో దీని గురించి ప్రస్తావించాడు. 1996లో Conservation International ఈ భావనపై పరిశోధన చేసి మేయర్స్‌తో ఏకీభవించింది.

ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతాన్ని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా గుర్తించడంలో రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

1. కనీసం 1500 జాతుల నాళిక కణజాలయుత మొక్కలు (Vascular Plants) ఎండమిక్ (స్థానిక) జాతులుగా ఆ ప్రాంతానికే పరిమితమై ఉండాలి.
2. కనీసం 70 శాతం తమ సహజ ఆవాసాన్ని లేదా వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి.

1999లో ఇలాంటి 25 ప్రాంతాలను గుర్తించారు. ఆ తర్వాత మరో 10 ప్రదేశాలను గుర్తించారు. నార్మన్ మెయిర్స్ 1999లో "Hotspots: Earth's Biologically Richest and Most Endangered Terrestrial Eco-region" పుస్తకాన్ని ప్రచురించారు. 2000లో దీన్ని ‘నేచర్’ అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురించారు. 2007లో రస్సెల్ మిట్టర్ మియర్ అనే శాస్త్రవేత్త "Hotspots Revisited" అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రపంచంలో ప్రస్తుతం 35 బయోడైవర్సిటీ హాట్‌స్పాట్లు ఉన్నాయి. అవి:

ఉత్తర, మధ్య అమెరికా

1. కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2. మ్యాడ్రియన్ పైన్ ఓక్ ఉడ్‌లాండ్స్
3. మిసో అమెరికా 4. కరేబియన్ దీవులు

దక్షిణ అమెరికా

1. టంబెస్ చోకో మ్యాగ్డెలిన
2. ట్రాపికల్ ఆండీస్
3. చిలీయన్ వింటర్ రెయిన్‌ఫాల్ వాల్డివియన్ ఫారెస్ట్
4. బ్రెజిల్ సిర్రాడో
5. బ్రెజిల్ అట్లాంటిక్ ఫారెస్ట్

యూరప్, మధ్య ఆసియా

1. కాకాసస్
2. మధ్య ఆసియా అడవులు
3. మధ్యధరా ప్రాంతం
4. ఇరాన్ అనతోలియన్

ఆఫ్రికా

1. పశ్చిమ ఆఫ్రికా - గినియా అడవులు
2. సక్యులెంట్ కరూ
3. కేప్ ఫ్లోరోస్టిక్ ప్రాంతం
4. మపుటలాండ్ - పాండో లాండ్ ఆల్బని
5. తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6. ఈస్ట్రన్ అఫ్రోమోంటేన్
7. హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8. మడగాస్కర్- హిందూ మహాసముద్ర దీవులు

ఆసియా పసిఫిక్

1. పశ్చిమ కనుమలు - శ్రీలంక
2. హిమాలయాలు 3. ఇండో బర్మా
4. నైరుతి చైనా 5. ఫిలిప్పీన్స్
6. సుందా లాండ్ 7. వాలేసియా
8. న్యూ కాలిడోనియా
9. ఈస్ట్ మెలనేసియా అడవులు
10. పాలినేసియా మైక్రోనేసియా
11. న్యూజిలాండ్ 12. జపాన్
13. నైరుతి ఆస్ట్రేలియా 14. తూర్పు ఆస్ట్రేలియా

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్యసమితి ‘జీవ వైవిధ్య దశాబ్దం’గా దేన్ని ప్రకటించింది?
   ఎ) 2001-10 బి) 2011- 20
   సి) 2021-30 డి) 1991-2000
2. ‘అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం’ ఏ రోజు నిర్వహిస్తారు?
   ఎ) ఏప్రిల్ 22 బి) మే 22
   సి) జూన్ 20 డి) డిసెంబర్ 21
3. "Convention on Biological Diversity" అంతర్జాతీయ ఒప్పందాన్ని రూపొందించింది?
   ఎ) యునెస్కో బి) యూఎన్‌ఈపీ
   సి) ఎ, బి డి) ఏదీకాదు
4. భారత్‌లోని ఏ ప్రాంతంలో ‘లయన్ టెయిల్డ్ మకాక్’ అనే కోతి కనిపిస్తుంది?
   ఎ) పశ్చిమ కనుమలు
   బి) ఈశాన్య హిమాలయాలు
   సి) తూర్పు కనుమలు
   డి) అండమాన్ నికోబార్ దీవులు
5. "Conservation International" అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ ఎక్కడ ఉంది?
   ఎ) మెక్సికో బి) నైరోబి
   సి) లండన్ డి) వాషింగ్టన్
6. ప్రపంచంలోని 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో లేనిది?
   ఎ) శ్రీలంక బి) వెనిజులా
   సి) కొలంబియా డి) ఇండోనేసియా
7. ప్రపంచంలోని మెగా బయోడైవర్సిటీ కేంద్రాల్లో భారత్ స్థానం?
   ఎ) 3 బి) 5 సి) 7 డి) 9
8. జీవవైవిధ్య సంరక్షణ కోసం కుదుర్చుకున్న "Convention on Biological Diversity" (BD) అంతర్జాతీయ ఒప్పందం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   ఎ) 1993 బి) 1994
   సి) 1995 డి) 1996
9. ‘నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ’ ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై బి) బెంగళూరు
   సి) తిరువనంతపురం డి) గాంగ్‌టక్
10. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    ఎ) జెనీవా బి) న్యూఢిల్లీ
    సి) వాషింగ్టన్ డి) నైరోబి
11. ‘వరల్డ్ ఎర్త్ డే’ను ఎప్పుడు నిర్వహిస్తారు?
    ఎ) మార్చి 22 బి) ఏప్రిల్ 22
    సి) సెప్టెంబర్ 16 డి) అక్టోబర్ 12
12. భారత్‌లో ఉభయచర వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతం ఏది?
    ఎ) వింధ్య పర్వతాలు
    బి) పశ్చిమ కనుమలు
    సి) పశ్చిమ హిమాలయాలు
    డి) తూర్పు కనుమలు
13. బట్టమేక పక్షులు (Great Indian Bustard) ఎక్కువగా ఏ రాష్ట్రంలో కనిపిస్తాయి?
    ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
    సి) మధ్యప్రదేశ్ డి) రాజస్థాన్
14. కర్ణాటకలో ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
    ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
15. ఏ జీవి నుంచి లభించే ప్రత్యేక నూనెను ఔషధాలు, పర్‌ఫ్యూమ్‌ల తయారీలో ఉపయోగిస్తారు?
    ఎ) చింకారా బి) కృష్ణజింక
    సి) కస్తూరి జింక డి) సాంబారు దుప్పి
16. ‘వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్’ చిహ్నం ఏది?
    ఎ) ధ్రువ ఎలుగుబంటి
    బి) పాండా సి) నీలి తిమింగలం
    డి) ఏదీకాదు
17. ‘వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా’ ఎక్కడ ఉంది?
    ఎ) బెంగళూరు బి) గౌహతి
    సి) డెహ్రాడూన్ డి) తిరువనంతపురం
18. దేశంలో ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?
    ఎ) గిర్ అడవులు
    బి) వేనాడ్ అభయారణ్యం
    సి) పెంచ్ జాతీయ పార్కు
    డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) బి; 3) బి; 4) ఎ; 5) డి; 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి; 11) బి; 12) బి; 13) డి; 14) సి; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ.

A European visitor to the..

BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3) / is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
   1) Much books 2) few books
   3) some books 4) more books
   5) No correction required
7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
   1) Himself to 2) his self to
   3) himself for 4) his self from
   5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
   1) from previous three years
   2) during the previous three years
   3) three years previous
   4) during the three previous years
   5) No correction required
9. She always <u>manage</u> to hurt her mother's feelings.
   1) do manage
   2) does manage
   3) did manages
   4) do managed
   5) No correction required
10. It is the people <u>who matters</u> in a democracy.
    1) whom matters
    2) whose matters
    3) whose matter
    4) who matter
    5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
    1) dissent 2) decent
    3) descent 4) dissuade
    5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
    1) Fight, draw
    2) Position, aspect
    3) Plight, drain
    4) Struggle, issue
    5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
    1) proper, for
    2) correct, along
    3) suitable, among
    4) valid, from
    5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
    1) ways, deep
    2) methods, destroyed
    3) paths, shortened
    4) means, annihilated
    5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
    1) apposite, position
    2) opposite, fact
    3) relevance, media
    4) significance, party
    5) applaudable, generation



Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1)A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the ______ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelslam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought 2) thinking 3) think 4) thinned 5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense 2) suspect 3) suspected 4) suspecting 5) suspects
29. 1) convicted 2) allowed 3) acquitted 4) arrested 5) prosecuted
30. 1) are to 2) will be 3) will been 4) have been 5) were

KEY

1) 3; 2) 2; 3) 4; 4) 5; 5) 4; 6) 3; 7) 1; 8) 2; 9) 2; 10) 4; 11) 3; 12) 3; 13) 4; 14) 4; 15) 1; 16) 4; 17) 1; 18) 5; 19) 1; 20) 3; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఆర్‌ఎస్‌సీలో 31 సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» పోస్టుల వివరాలు: సైంటిస్ట్/ ఇంజనీర్
» మొత్తం పోస్టుల సంఖ్య: 31
» విభాగాలు: ఫారెస్ట్రీ అండ్ ఎకాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, అర్బన్ స్టడీస్, వాటర్ రిసోర్సెస్.
» అర్హతలు: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఈ/ బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీఆర్క్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
» వయసు: 30.05.2025 నాటికి 18-30ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.05.2025
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nrsc.gov.in

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో 400 ఆఫీసర్ పోస్టులు

ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్.. 400 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా తమిళనాడు, ఒడిసా, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌ల్లో ఖాళీలను భర్తీ చేయనుంది. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకునే రాష్ట్రానికి సంబంధించిన అధికారిక భాషపై పట్టుండటం తప్పనిసరి.

» పోస్టుల వివరాలు: లోకల్ బ్యాంక్ ఆఫీసర్
» మొత్తం పోస్టుల సంఖ్య: 400
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
» వయసు: 01.05.2025 నాటికి 20-30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, స్థానిక భాష పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:31.05.2025
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.iob.in